సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 234

శుక్రవారం 15-11-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

SPACE MADE SPECTACULAR

VAISHNAOI Southwoods Art of Opulence

4 & 5 BHK ULTRA-LUXURIOUS VILLAS AT MAMIDIPALLY, SHAMSHABAD

www.vaishnaoigroup.com

TS RERA No.P02400008419

LAUNCHING

VAISHNAOI GROUP
BUILDING A NEW FUTURE

VAISHNAOI
Southwoods
Art of Opulence

4 & 5 BHK ULTRA-LUXURIOUS VILLAS AT MAMIDIPALLY, SHAMSHABAD

SPACETACULAR.

In today's ever-evolving realty landscape, the concept of space has transcended physical dimensions to convey the profound essence of freedom, comfort, and personal expression.

A glimpse of it all and beyond is our vision of 'spacetacular' living. One that promises a seamless blend of spacious living and spectacular surroundings.

Because we believe that space isn't just square footage; it's the canvas upon which unforgettable moments are painted, and extraordinary lives are lived.

- 260 Ultra-luxurious Villas
- 300 to 550 sq.yd.
- 43.29 Acre Elite Community
- 40,000 sq.ft. Clubhouse



80 ft. Grand Entrance | Expansive Golf Turf | Home Theatre in Every Mansion | 40 ft. Wide Internal Roads | 50+ World Class Amenities | 6 Acre Green Space | Sky Bridge | Central Park

SCAN FOR MORE INFORMATION

VAISHNAOI GROUP
BUILDING A NEW FUTURE
REALTY | CONSTRUCTION | AUTOMOBILE
MANUFACTURING | TEXTILE PARK

BOOK NOW

99599 95940

Follow us on:

సాక్షి ఫ్యామిలీ II

హైదరాబాద్
శుక్రవారం ॥ 15-11-2024



● స్ఫూర్తి



ఆరోగ్య సమస్యలు ఉన్నా సరే...

ఏదైనా సాధించాలంటే మన విలువ మనం ముందుగా గుర్తించాలి. నిత్య వ్యాయామంతోనే ఆరోగ్యం సాధ్యం అవుతుంది. నాకు ఆరోగ్య సమస్యలున్నాయి. హైపో థైరాయిడ్, స్పాండిలైటిస్ నన్ను ఇబ్బంది పెట్టినా వాటిని అధిగమించి ముందుకు వెళ్తున్నాను. రోజూ యోగ, జిమ్, మెడిటేషన్, గార్డెనింగ్ చేస్తాను.

– పేరూరి జ్యోతి

పవర్ ఫుల్

● రెస్ట్ తర్వాత బెస్ట్

విరామం అంటే వెనక్కి తగ్గడం కాదు, పరాజయం అంతకంటే కాదు. విత్తనం నాటిన రోజు నుంచి అది పచ్చగా మొలకెత్తడానికి మధ్య కూడా విరామం ఉంటుంది. ఒకప్పుడు హ్యాండ్‌బాల్ గేమ్ నేషనల్ ప్లేయర్ అయిన జ్యోతి పెళ్లి తరువాత కుటుంబ బాధ్యతల వల్ల ఆటలకు విరామం ఇవ్వాల్సి వచ్చింది. విరామం తర్వాత మళ్లీ ఆటల ప్రపంచంలోకి అడుగు పెట్టిన పేరూరి జ్యోతి పవర్ లిఫ్టింగ్‌లో తక్కువ సమయంలోనే సాధన చేసి గోవాలో జరిగిన బెంచ్‌ప్రెస్ నేషనల్ చాంపియన్‌షిప్‌లో 45 కిలోల బరువు ఎత్తి కాంస్యం సాధించింది. నిజానికి అది పతకం కాదు... అపూర్వమైన ఆత్మవిశ్వాసం...

జ్యోతి స్వస్థలం మహారాష్ట్రలోని నాగ్‌పూర్. పెళ్లికిముందు హ్యాండ్‌బాల్ గేమ్‌లో నేషనల్ ప్లేయర్. 1994లో 'విజ్ఞాన్ యూనివర్శిటీ'లో ప్రొఫెసర్‌గా చేస్తున్న డాక్టర్ పిఎల్ఎన్ వర్మతో వివాహం జరగడంతో గుంటూరుకు వచ్చింది. కుటుంబ బాధ్యతల వల్ల ఆటలకు దూరంగా ఉండక తప్పలేదు. అయితే వ్యాయామాలకు, యోగ సాధనకు విరామం ఇవ్వలేదు. కుట్లు, అల్లికలు, ఎంబ్రాయిడరీ, మగ్గం పని... వంటి అభిరుచుల పట్ల మక్కువను విడవలేదు.



● గోవాలో మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్‌లో కాంస్య పతకం గెలుపొందిన జ్యోతి వర్మ

మనం అడుగుపెట్టే స్థలాలు కూడా భవిష్యత్‌ను నిర్ణయిస్తాయి అంటారు.

జ్యోతి విషయంలో అలాగే జరిగింది.

ఏడాది క్రితం స్థానిక 'ఇన్ఫినిటీ జిమ్'లో చేరి రకరకాల వ్యాయామాలు చేసేది. ఆమె ఉత్సాహం, పట్టుదల చూసి కోచ్ రమేష్ శర్మ 'మీరు పవర్ లిఫ్టింగ్‌లో అద్భుతాలు సాధించగలరు' అన్నారు.

ఆమె నవ్వుతూ ఊరుకుంటే ఆ కథ అక్కడితో ముగిసేది.

కోచ్ మాటలను ఆమె సీరియస్‌గా తీసుకుంది.

'ఒకసారి ఎందుకు ప్రయత్నించకూడదు' అనుకున్నది.

అలా అనుకోవడంలో పతకాలు సాధించాలనే ఆశయం కంటే... ఆటల పట్ల చిన్నప్పటి నుంచి ఉన్న ఇష్టమే కారణం.

ఆరు నెలల క్రితం పవర్ లిఫ్టింగ్‌లో సాధన మొదలుపెట్టింది. ఇది చాలామందికి ఆశ్చర్యంగా అనిపించింది.

'ఇంకా నువ్వు కాలేజీ స్టూడెంట్ అని అనుకుంటున్నావా' లాంటి వెటకారాలు వినిపించాయి. అయితే ఈ వెటకారాలు, మిరియాలు ఆమె సాధన ముందు నిలవలేకపోయాయి.

మరింత దీక్షతో సాధన చేసింది.

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగిన మాస్టర్స్ నేషనల్స్‌లో కొద్దితేడాతో పతకం మిస్ అయింది.

'పతకంతో తిరిగి వస్తావనుకున్నాం' అన్నారు మిత్రులు.

'వంద పతకాలతో తిరిగి వస్తాను' అన్నది జ్యోతి నవ్వుతూ.

ఆమె చెప్పిన వంద పతకాలు... ఆత్మవిశ్వాసం. ఆ ఆత్మవిశ్వాసంతోనే గోవాలో జరిగిన బెంచ్‌ప్రెస్ నేషనల్స్ చాంపియన్‌షిప్‌లో రికార్డు స్థాయిలో 45 కేజీలు బరువు ఎత్తి కాంస్య పతకాన్ని గెలుచుకుంది.

నిజానికి ఇది ప్రారంభం మాత్రమే.

ఆమె ఉత్సాహం, పట్టుదల చూస్తుంటే మరిన్ని విజయాలు ఆమె ఖాతాలో పడతాయని నిశ్చయంగా చెప్పవచ్చు.


– దాళా రమేష్‌బాబు, సాక్షి, గుంటూరు
ఫొటోలు: మురమళ్ల శ్రీనివాసరావు

కలర్ ఫుల్

సరస్సులో నుంచి తీసుకొచ్చిన తెల్లటి కలువను చూసుకుంటున్న యువతులు, ప్రకృతిలో పూసిన పూలన్నింటినీ తనలో ఇముడ్చుకున్న ఫ్లవర్‌పాట్, కొండల బారుల మధ్య వంపులు తిరుగుతూ ప్రవహిస్తున్న నది, విశాలమైన సరస్సుకు ఈ ఒడ్డున రంగురంగుల పూలరెమ్మలతోపాటు ఆవలి ఒడ్డున సుదూరంగా కనిపించీ కనిపించకుండా ఉన్న కొబ్బరిచెట్లు, పార్కులో చక్కగా వరుసగా విరగబూసిన చెట్లు, కొండలమీద నుంచి నేలకు దూకుతూ కింద ఉన్న శివలింగానికి అభిషేకం చేస్తున్న తెల్లటి జలధారలు, కలర్ పాలెట్‌లోని రంగులన్నింటినీ వంతుల వారీగా అద్దుకున్న చెట్లు... ఏ బొమ్మ చూసినా ప్రకృతికి ప్రతిబింబంగానే కనిపిస్తుంది. హేమనళిని చిత్రాలను చూస్తే ప్రకృతిని ఆవిష్కరించడానికే ఆమె కుంచె పట్టుకుందా అనిపిస్తుంది.









● హేమనళినీ చిత్రాలు

హైదరాబాద్‌కు చెందిన హేమనళినీ రెడ్డి ఇలస్ట్రేటర్, ఫొటోగ్రాఫర్, రైటర్ కూడా. ఆర్టిస్టుగా బిజీగా ఉన్న హేమనళిని సైన్స్ స్టూడెంట్. ఐఐటీ బాంబేలో కోర్సు పూర్తయిన తరవాత మైక్రో బయాలజీ లెక్చరర్‌గా కెరీర్ మొదలు పెట్టారామె. భర్త ఉద్యోగరీత్యా యూఎస్‌లో అడుగుపెట్టిన హేమ కెరీర్‌లో ఓ విరామం. ఆ విరామం ఆమెను ప్రకృతి ప్రేమికురాలిని చేసింది. అత్యంత చల్లని వాతావరణంలో చెట్ల ఆకులు కూడా పూలలాగ గులాబీరంగును సంతరించుకోవడం వంటి ఆశ్చర్యకరమైన మార్పులు ఆమెను మళ్లీ కుంచె పట్టుకునేలా చేశాయి.

కుంచె కవనం

ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా, చింతలపూడి సమీపంలోని పోతునూరు మాది. గోదావరి జిల్లాల్లో నేను చూసిన ప్రకృతి సౌందర్యం ఒక పార్శ్వం అయితే యూఎస్‌లో చూసిన వైవిధ్యత మరో పార్శ్వం. నాకు ఫొటోలు తీయడం కూడా హాబీ. నా మనసుకు నచ్చిన ఒక్కో ప్రకృతి దృశ్యాన్ని ఫొటో తీసుకోవడం, ఆ చిత్రాన్ని రంగుల్లో ఆవిష్కరించడమే నా లైఫ్‌గా మారింది. సైన్స్ స్టూడెంట్‌గా జీవం–జీవితం నాకిష్టమైన అంశాలు. దాంతో నా చిత్రాలు ప్రకృతి–జీవితం ఇతివృత్తాలుగానే సాగుతున్నాయి. నా చిన్నప్పుడు ఎస్సే రైటింగ్‌తోపాటు రంగోలీలో బహుమతులందుకున్నాను. బొమ్మలు వేయడంలో పెద్ద ప్రావీణ్యం లేదు కానీ వేసేదాన్ని. పై చదువుల బిజీలో పడి వదిలేసిన కుంచెను అమెరికాలో పట్టుకున్నాను. పచ్చదనానికి చిరునామా అయిన మనదేశంలో చెట్లు అన్ని షేడ్‌లలో ఉండవు. అక్కడి ప్రకృతి వైవిధ్యం నన్ను ముగ్ధురాలిని చేసింది. వాతావరణ మార్పులకు అనుగుణంగా చెట్లు కొత్త రంగులను సంతరించుకోవడం, మనదేశంలో చూడని అనేక షేడ్‌లను అక్కడి చెట్లలో చూశాను. విదేశాల్లో ఉన్న ఐదేళ్లలో అనేక ఎగ్జిబిషన్‌లలో పాల్గొన్నాను. యూఎస్‌లో షికాగో, మాసాచుసెట్స్, మిషిగన్‌తోపాటు సింగపూర్, అబుదాబి, దుబాయ్‌లలో చిత్రాలను ప్రదర్శించే అవకాశం వచ్చింది. ఇండియాకి వచ్చిన తర్వాత కూడా కుంచెను వదల్లేదు.

చిత్రం... అందమైన మాధ్యమం

సామాజికాంశాలను సామాన్యులకు అర్థమయ్యే రీతిలో కళ్లకు కట్టడానికి చిత్రం గొప్ప మాధ్యమం. సమాజాన్ని చైతన్యవంతం చేయగల శక్తి ఆర్టిస్ట్‌కి ఉంటుంది. చిత్రాలతో చారిటీ షోలు నిర్వహించి పేదపిల్లలకు సహాయం చేయవచ్చు. ఆర్టిస్టులు టెక్నాలజీతోపాటు ఎదుగుతూ కళకు సొబగులద్దాలి. తమ కళను విశ్వవ్యాప్తం చేసుకోవాలి. ఈ తరంలో సోషల్‌మీడియా అందుకు సరైన వేదిక. ఆన్‌లైన్ వేదికగా నిర్వహించిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ పోటీలో వారిచ్చిన సమయంలోనే బొమ్మ పూర్తి చేసి అవార్డు అందుకోగలిగాను. బాంబే ఆర్ట్ సొసైటీ నిర్వహించిన 'కలర్స్ ఆఫ్ ఇండిపెండెన్స్, 75 ఇయర్స్ ఆఫ్ ఆర్ట్' ఆన్‌లైన్ ఎగ్జిబిషన్ ద్వారా నా చిత్రాలకు దేశవ్యాప్తంగా గుర్తింపు వచ్చింది. ఇక సాహిత్యం పట్ల ఆసక్తి కొద్దీ బాలాంత్రపు వెంకటరమణ గారి రచనలకు వేసిన చిత్రాలు ఆర్టిస్ట్‌గా నాకు పరిపూర్ణతను తెచ్చాయనిపించింది. ఇంటర్నేషనల్ 'కళారత్నం' మహిళా ప్రతిభా పురస్కారం, విశిష్ట కళారత్న వంటి గుర్తింపులనెన్నింటినో అందుకున్నాను. అన్నింటినీ మించిన ఆనందం... వడ్డాది పాపయ్య, బాపు వంటి మహోన్నత చిత్రకారుల గురించి వెలువరించిన 'ఆర్ట్ ఆఫ్ ఏపీ' పుస్తకంలో నాకు చోటు దక్కడం'' అని సంతోషాన్ని వ్యక్తం చేశారు ఆర్టిస్ట్ హేమ నళిని.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

వార్డ్ రోబ్ ఫ్యాషన్

'డ్రెస్‌ని ఖరీదుతో చూడకూడదు. ఆ డ్రెస్ కలర్, ఫిటింగ్ మనకు ఎంత బాగా నప్పాయి... అనేవి చెక్ చేసుకొని తీసుకోవాలి' అంటున్నారు హైదరాబాద్‌లోని భరత్‌నగర్ వాసి రాధ పర్వతరెడ్డి. తక్కువ బడ్జెట్‌లో డ్రెస్ డిజైనింగ్‌ని స్పెషల్‌గా, కంఫర్ట్‌గా, క్రియేటివ్‌గా ఎలా ప్లాన్ చేసుకుంటున్నారో వివరిస్తున్నారు.

సింపుల్ & గ్రేస్‌ఫుల్



''ఎంత సింపుల్‌గా రెడీ అయితే అంత గ్రేస్‌ఫుల్‌గా కనిపిస్తాం. అందుకే నా వార్డ్ రోబ్‌లో ప్లెయిన్ శారీస్‌కు ఎక్కువ చోటు ఉంటుంది. ప్లెయిన్ సిల్క్ శారీస్ జాబితా ఎక్కువే ఉంటుంది. వాటిలోనూ లైట్ కలర్స్‌నే తీసుకుంటాను. వీటికి కాంట్రాస్ట్ కలర్‌లో ఉన్న కాటన్ ప్రింటెడ్ బ్లౌజ్‌తో మ్యాచ్ చేస్తాను. పొడవుగా ఉన్నవారికి ఈ కాంబినేషన్ చీరలు బాగుంటాయి. గెట్ టు గెదర్ పార్టీలకు ఈ స్టైల్ బాగా నప్పుతుంది. బడ్జెట్ ఫ్రెండ్లీగా ప్లాన్ చేసుకునే సదుపాయం ఉంది. యూ ట్యూబర్‌ని కాబట్టి స్పెషల్ లుక్స్ కోసం ట్రై చేస్తుంటాను. ఈ కాంబినేషన్‌కి హెయిర్ పట్ల శ్రద్ధ తీసుకోవాలి. నా జుట్టు పొడవుగా ఉంటుంది. శారీ కట్టుకుంటే మాత్రం జుట్టుకి ఒక చిన్న క్లిప్ పెట్టుకొని, మిగతా హెయిర్ అంతా లీవ్ చేస్తుంటాను. జుట్టు బాగుంటే డ్రెస్సింగ్ కూడా బాగుంటుంది కాబట్టి, హెయిర్ కేర్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటాను.

చందేరీ స్పెషల్

దుపట్టా పెద్దగా ఉండే చుడీదార్స్ అంటే ఇష్టం. వీటిలోనూ లైట్ కలర్స్‌కే ప్రాధాన్యత. రెడీ టు వేర్ ఉండే డ్రెస్సులు ఈ జాబితాలో ఉంటాయి. పండగల సమయాల్లో అయితే చందేరీ శారీస్ ఎంచుకుంటాను. చందేరీ చీరల రంగులు బాగుంటాయి. చూడటానికి ప్రత్యేకంగానూ ఉంటాయి. ఏ సంప్రదాయ వేడుకల్లోనైనా ఈ చీరలు బాగుంటాయి. బ్లౌజ్‌కి కొంచెం డిజైన్ ఉన్నా ఆకర్షణీయంగా కనిపిస్తుంది. నేను వీటికి కూడా ప్రింటెడ్ బ్లౌజ్‌లనే మ్యాచ్ చేసుకుంటాను. చందేరీ చీరల్లో బ్రైట్ రెడ్, గ్రీన్ కలర్స్ ఎంచుకుంటాను. పెళ్లి వేడుకల్లో పట్టు చీరలు, లెహంగాలు ఎంచుకుంటాను. లెహంగాకు మ్యాచ్ చేయడానికి కొంచెం స్టైల్స్‌లో మార్పుకు క్రాప్‌టాప్స్, మ్యాచింగ్ దుపట్టాలు సెలెక్ట్ చేసుకుంటాను.

ప్రింటెడ్ బ్లౌజులు

బ్లౌజ్ డిజైన్స్ కోసం ఎక్కువ ఖర్చు పెట్టడం అనే విషయానికి చాలా దూరంగా ఉంటాను. ప్రింటెడ్ కాటన్ మెటీరియల్స్ చాలా రకాల డిజైన్లలో మార్కెట్లో లభిస్తున్నాయి. వీటితో శారీ లుక్ స్పెషల్ అనిపించేలా డిజైన్ చేయిస్తాను. షార్ట్ స్లీవ్స్, స్ట్రాప్స్ .. యంగ్ లుక్‌ని మరింత ఎలివేట్ చేస్తాయి.

సౌకర్యమే ఫస్ట్... టూర్స్‌కి వెళ్లినప్పుడు సౌకర్యానికే ప్రాధాన్యత. గంటల సమయాన్ని ప్రయాణంలోనే గడపాలి. అందుకని జీన్స్‌కు బదులు జెగ్గింగ్స్, టీ షర్ట్స్, నైట్ డ్రెస్‌లకే ఓటు వేస్తాను. ఎక్కువ లైట్ కలర్స్‌కి ప్రాముఖ్యం ఇచ్చినా నాకు ఇష్టమైన కలర్ మాత్రం బ్లాక్. లైట్–బ్లాక్ కలర్ కాంబినేషన్ డ్రెస్సులు నా వద్ద చాలానే ఉన్నాయి'' అంటూ తన డ్రెస్ సెలక్షన్, కలెక్షన్ గురించి వివరించారు రాధ.

అందర్నీ సంతోషంగా ఉంచాలంటే...

నేను వెళ్లి ఐస్ క్రీమ్ అమ్ముకోవాలి!



● కుమారుడు అగస్త్యతో నటాషా

నటాషా స్టాంకోవిక్, హార్దిక్ పాండ్యా ఈ ఏడాది జూలై 18న విడిపోయారు. అప్పట్నుంచి నటాషాకు ప్రశ్నలు మొదలయ్యాయి.

''ఏమ్మాయ్, ముచ్చటైన జంట కదా మీది? ఎందుకు విడిపోయారు?''

''భర్త ఏమైనా అంటే సర్దుకుపోవాలి కానీ, పెట్టే బేడా సర్దుకుని బయటికి వచ్చేయటమేనా?''

''ఇప్పుడేమిటి? మీ దేశం వెళ్లిపోతావా? ఇక్కడే ఉండిపోతావా?''

''కొడుకు పెద్దవాడౌతున్నాడు. వాడి భవిష్యత్తు ఆలోచించకుండా విడాకులకు నువ్వు కూడా ఎందుకు తొందరపడ్డావ్?''

''అతనే విడాకులు కావాలని అడిగినా కూడా, కాళ్లా వేళ్లా పడి అతడితోనే ఉండిపోవాలి కానీ, పంతానికి పోతే ఇలా?''

ఇవీ ఆ ప్రశ్నలు!

హార్దిక్‌కి మాత్రం సహజంగానే ఎలాంటి ప్రశ్నలూ లేవు. ఎప్పటిలాగే అతడు మిడిల్–ఆర్డర్‌లో రైట్ హ్యాండ్‌తో బ్యాటింగ్, ఫాస్ట్–మీడియంలో రైట్ ఆర్మ్‌తో బౌలింగ్ చేసుకుంటూ, తన ఆట తను ఆడుకుంటున్నాడు.

నాలుగేళ్ల క్రితం 2020 మే 31న నటాషా, హార్దిక్‌ల పెళ్లి జరిగింది. అదే ఏడాది జూలై 30న వాళ్లకు కొడుకు (అగస్త్య) పుట్టాడు. అప్పటికి ఎంతకాలంగా వాళ్లు డేటింగ్‌లో ఉన్నారో ఎవరికీ తెలియదు. అసలు వాళ్ల లవ్ స్టోరీనే పెద్ద రహస్యం.

పెళ్లి కాగానే నటాషా కెరీర్‌కు బ్రేక్ పడింది. నటాషా చక్కటి డాన్సర్, మంచి నటి, పాపులర్ మోడల్. నటనలో తన కెరీర్‌ను మలుచుకోవటం కోసం 2012లో ఇరవై ఏళ్ల వయసులో సెర్బియా నుండి ఇండియా వచ్చారావిడ. 'సత్యాగ్రహ' ఆమె తొలి సినిమా. ఫిలిప్స్, క్యాడ్‌బరీ, టెట్లీ, జాన్సన్ అండ్ జాన్సన్ ఉత్పత్తులకు మోడలింగ్ కూడా చేశారు. అయితే పెళ్లి తర్వాత ఆమె డాన్స్, యాక్టింగ్, మోడలింగ్ అన్నీ మూలన పడ్డాయి. తిరిగి నాలుగేళ్ల తర్వాత మాత్రమే గత నెలలో 'తేరే కర్కే' అనే మ్యూజిక్ వీడియో విడుదలతో ఆమె తన కెరీర్‌ను ప్రారంభించగలిగారు.

ఈ పునరాగమనం సందర్భంగా 'బాంబే టైమ్స్'కి ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో (ఆ ఇంటర్వ్యూ ఎక్కువగా ఆమె విడాకుల మీదే సాగింది) ఆమె ఎంతో దృఢంగా మాట్లాడారు. తను తిరిగి సెర్బియా వెళ్లేది లేదని, ముంబైలోనే ఉండిపోతానని, విడాకులు తీసుకున్నప్పటికీ అగస్త్య కోసం హార్దిక్, తను తరచు కలుసుకుంటూనే ఉంటామని చెప్పారు. చివరిగా ఒక ప్రశ్న దగ్గర ఆమె కొన్ని క్షణాలు మౌనం వహించారు. ''మీరు విడాకులు తీసుకున్నందుకు మీ వైపు గానీ, హార్దిక్ వైపు గానీ ఎవరూ సంతోషంగా లేరనే మాట వినిపిస్తోంది?'' అని అడిగినప్పుడు.. ఆ కొన్ని క్షణాల మౌనం తర్వాత ఆమె నవ్వుతూ ... ''అందర్నీ సంతోషంగా ఉంచాలంటే నేను వెళ్లి ఐస్ క్రీమ్ బండిని నడుపుకోవాలి..'' అన్నారు.

ఆమె నవ్వుతూనే ఆ మాట అన్నా, 'విడిపోవటం ఎవరికి మాత్రం సంతోషకరమైన విషయం..' అని తన మనసులో అనుకునే ఉంటారు.

టేస్ట్... రిచెస్ట్



మనదేశంలో రిచెస్ట్ ఫిమేల్ యూ ట్యూబర్ ఎవరో తెలుసా? ఆమె పేరు నిషా మధులిక. వయసు 65. ఆమెను విజేతను చేసిన కారణం ఏమిటో తెలుసా? ఆశ్చర్యానికే ఆశ్చర్యం... ఒంటరితనం. అవును, ఒంటరితనం ఆమెను పీడించింది. ఒంటరితనానికి దూరం కావడం కోసం ఆమె 52 ఏళ్ల వయసులో ఓ యూ ట్యూబ్ చానెల్‌ను ప్రారంభించింది. సబ్‌స్క్రైబర్ల రూపంలో లక్షలాది మంది స్నేహితులకు దగ్గరైంది. ఇప్పుడామె మన దేశంలో ఫిమేల్ యూ ట్యూబర్‌లలో అత్యంత సంపన్నురాలు. ఇంతకీ ఆమె యూ ట్యూబ్ ద్వారా ఏం చేసిందంటే తన వంట గదిలోనే చక్కగా వంటలు చేసి వీక్షకులకు కను 'విందు' చేస్తోంది.

వంటల పాఠాలు... ఉత్తర్ ప్రదేశ్‌కి చెందిన నిషా మధులిక కొంతకాలం టీచర్‌గా ఉద్యోగం చేసింది. ఆమె భర్త టెక్ ఎంటర్‌ప్రెన్యూర్. పెళ్లి తర్వాత ఢిల్లీ, నొయిడాకి మారింది. స్కూల్‌లో రోజంతా పిల్లల మధ్య గడిపిన జీవితం ఆమెది. ఇంట్లో ఖాళీగా ఉండలేక పోయింది. భర్తకు సహాయం చేయడం, తన పిల్లలను పెంచడంలో కొంత కాలం గడిచింది. పిల్లలిద్దరూ పెద్దయిన తర్వాత ఎంప్టీనెస్ట్ సిండ్రోమ్ బారిన పడిందామె. ఒంటరితనం ఎంత భయంకరమైనదో అర్థమైంది. ఒంటరితనాన్ని జయించడానికి చేసిన ప్రయత్నాల్లో బ్లాగ్‌లో తనకు తోచినవి రాసుకుంటూ గడిపింది. వంటలకు ఎక్కువ రెస్పాన్స్ వచ్చింది. అంతే... 2011లో యూ ట్యూబ్ చానెల్ పెట్టింది. వంటగదిలో కెమెరా రెడీ చేసుకుని తనకు వచ్చిన వంటలను వండుతూ ఎలా వండాలో హిందీలో వివరిస్తుంది నిషా మేడమ్. పాఠాలు చెప్పిన అనుభవం కావచ్చు వంటను అరటిపండు ఒలిచిపెట్టినంత చక్కగా వివరిస్తుందామె. ఆమె చానెల్‌కి సబ్‌స్క్రైబర్ల సంఖ్య అమాంతం 14.5 లక్షలకు పెరిగిపోయింది. యూ ట్యూబ్ ఆదాయం 43 కోట్ల రూపాయలకు చేరింది. ఆమె యూ ట్యూబర్‌గా విజయవంతం కావడంతోపాటుగా సమాజానికి తన వంతుగా సర్వీస్ అందించడంలోనూ ముందుంది. టాటా సంస్థ నిర్వహిస్తున్న ధృవ్ ప్రాజెక్టు ద్వారా గ్రామీణ భారతానికి డిజిటల్ సర్వీస్ అందిస్తోంది నిషా మధులిక.

హెల్దీ డైట్



డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

బీట్‌రూట్ ఓట్స్ వఫెల్స్



కావలసినవి: ఓట్స్ –100 గ్రాములు; శనగపిండి లేదా ఉప్మారవ్వ– 25 గ్రాములు; బీట్‌రూట్– చిన్న దుంప; పచ్చిమిర్చి –2; అల్లం– అంగుళం ముక్క; ఉప్పు – పావు టీ స్పూన్ లేదా రుచిని బట్టి; ఆమ్‌చూర్ పౌడర్– అర టీ స్పూన్ ; జీలకర్ర పొడి– అర టీ స్పూన్; నెయ్యి– టీ స్పూన్.

తయారీ: ● ఓట్స్‌ను మెత్తగా పొడి అయ్యే వరకు మిక్సీలో గ్రైండ్ చేయాలి. పొడి అయిన తర్వాత అందులో శనగపిండి లేదా రవ్వ వేసి గ్రైండ్ చేయాలి. అందులోనే ఆమ్‌చూర్ పౌడర్, జీలకర్ర పొడి, ఉప్పు వేసి కలిసే వరకు ఒకసారి తిప్పి ఒక పాత్రలో వేసి పక్కన ఉంచాలి ● మిక్సీ జార్‌లో బీట్‌రూట్, పచ్చిమిర్చి, అల్లం వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ఓట్స్– శనగపిండి మిశ్రమంలో పోసి కలపాలి. మరీ గట్టిగా అనిపిస్తే తగినంత నీటిని చేర్చి ఉండలు లేకుండా కలపాలి ● వఫెల్స్ చేసే ఇనుప పాత్రకు నెయ్యి రాసి వేడి చేసి అందులో పైన కలుపుకున్న ఓట్స్– బీట్‌రూమ్ మిశ్రమాన్ని పోసి సమంగా సర్ది మూత పెట్టి మీడియం మంట మీద కాలనివ్వాలి. మూత తీసి చూసుకుని పిండి చక్కగా కాలిన తర్వాత దించేయాలి. ఈ వఫెల్స్‌కి పుదీన చట్నీ లేదా సూప్, చీజ్ మంచి కాంబినేషన్.

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 234

శుక్రవారం 15-11-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'నా అక్కలూ..చెల్లెళ్లు... తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'



సెమీస్‌లో భారత్

ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నీలో థాయ్‌లాండ్‌పై 13–0తో గెలుపు -15లో



బంగారు కొండ దిగుతోంది!

జీవితకాల గరిష్ట స్థాయి నుంచి రూ.4,650 డౌన్ -15లో



నిఘా డైరెక్టర్‌గా తులసీ గబార్డ్

అమెరికా నిఘా డైరెక్టర్‌గా తులసీ గబార్డ్‌ను ట్రంప్ ఎంపిక చేశారు. దీనికి ఎంపికైన తొలి హిందూ అమెరికన్ మహిళగా ఆమె నిలిచారు.

వివరాలు 6లో ▸



పేదలను లూటీ చేసిన కాంగ్రెస్

గరీబీ హటావో నినాదం ఇచ్చిన కాంగ్రెస్.. పేదరికాన్ని నిర్మూలించే బదులు పేదలను లూటీ చేసిందని ప్రధాని మోదీ మండిపడ్డారు.

వివరాలు 6లో ▸



దిగువసభ పైనా పట్టు

అమెరికా పార్లమెంట్ ఎన్నికల ఫలితాల లెక్కింపు తాజా గణాంకాల ప్రకారం దిగువ సభపై రిపబ్లికన్ పార్టీ పట్టు సాధించింది.

వివరాలు 6లో ▸



దక్షిణాఫ్రికా గనిలో హాహాకారాలు

మూసేసిన బంగారు గనిలో అక్రమంగా పనికి వెళ్లిన 4 వేల మంది అరెస్ట్‌కు వీలుగా పోలీసులు నీరు, ఆహార సరఫరాను అడ్డుకున్నారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన



ప్రజాపాలన పేరుతో రాష్ట్రంలో ఇందిరమ్మ నాటి ఎమర్జెన్సీ పాలన కొనసాగుతోందని మాజీమంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఎమ్మెల్యేలు పల్లా, బండారి లక్ష్మారెడ్డిలతో కలిసి పట్నం నరేందర్‌రెడ్డిని ములాఖత్ ద్వారా కలిశాక మీడియాతో మాట్లాడారు.

- వివరాలు 2లో▶

ఆ రెండు నంబర్ల కేంద్రంగానే విచారణ!



అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే లింగయ్యను పోలీసులు ప్రశ్నించారు. మునుగోడు ఉప ఎన్నిక నేపథ్యంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌కు సహకరించారా? ఆ రెండు ఫోన్ నంబర్లు ఎందుకు పంపారనే కోణంలోనే విచారించారు.

- వివరాలు 12లో▶

డిసెంబర్ 2 లేదా 3న కాంగ్రెస్ భారీ సభ



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై వచ్చే నెల 7 నాటికి సంవత్సరం పూర్తి కానున్న నేపథ్యంలో భారీ సభ నిర్వహించేందుకు టీపీసీసీ ఏర్పాట్లు చేస్తోంది. డిసెంబర్ 2 లేదా 3న హైదరాబాద్ శివారులో సభను నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించింది.

- వివరాలు 3లో▶

ఊపిరాడని రాజధాని

- వాయుకాలుష్యం, పొగమంచుతో న్యూఢిల్లీ ఉక్కిరిబిక్కిరి
- పడిపోయిన వాయునాణ్యత
- ఢిల్లీలోని జహంగీర్‌పురీలో 500 దాటిన ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్
- విమానాలు, రైళ్ల రాకపోకలపై ప్రభావం.. ఆన్‌లైన్ మోడ్‌లోకి ఢిల్లీ ప్రైమరీ స్కూల్ క్లాసులు

- వివరాలు 6లో▶

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Vencobb CHICKEN

Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

12 Eggs Retail Rate	Ex Farm Live Bird	90 kg	Dressed with Skin	162 kg
₹ 74	Retail Live Bird	112 kg	Skin Less	185 kg

Issued in the interest of consumers

ఇదండీ సంగతి



నాణ్యత లేకుంటే జైలే!

హాస్టళ్లకు సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్లకు సీఎం హెచ్చరిక



బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఎస్‌సీఈఆర్‌టీలో నిర్వహించిన అండర్-18 విద్యార్థుల మాక్ అసెంబ్లీలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

> ఓటు హక్కుకు అర్హత 21 ఏళ్లుగా ఉన్నప్పుడు ఎన్నికల్లో పోటీ చేసే హక్కు 25 ఏళ్లకు లభించేది. ఇప్పుడు ఓటుహక్కుకు అర్హత 18 ఏళ్లకు తగ్గింది కాబట్టి పోటీ చేసే వయసును కూడా 21 ఏళ్లకు తగ్గించాలి. అప్పుడే ఎక్కువ మంది యువత రాజకీయాల్లోకి వస్తారు.
>
> - మాక్ అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి

- గురుకులాల్లో నాసిరకం భోజనం వల్ల విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతింటోంది
- సివిల్ సర్వెంట్లు వారానికి రెండురోజులు పాఠశాలలకు వెళ్లాలి
- ప్రజా ప్రతినిధులు కూడా పాఠశాలలకు వెళ్లి భరోసా కల్పించాలి
- కులగణనపై తప్పుడు ప్రచారాన్ని విద్యార్థులు తిప్పికొట్టాలన్న సీఎం
- ఎల్‌బీ స్టేడియంలో ఘనంగా బాలల దినోత్సవం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ వసతి గృహాలకు నాసిరకం బియ్యం, కూరగాయలు సరఫరా చేస్తే కాంట్రాక్టర్లతో ఊచలు లెక్కబెట్టిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. కలుషిత ఆహారం సరఫరా చేసినా కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ గురుకులాల్లో నాసిరకం భోజనం వల్ల విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతింటోందని, దీన్ని దృష్టిలో ఉంచుకునే కేటాయింపులు పెంచామని తెలిపారు. విద్యార్థినులకు కాస్మెటిక్ చార్జీలు సకాలంలో చెల్లిస్తున్నామన్నారు. కాంట్రాక్టర్ల బిల్లులు ఆపి అయినా, విద్యార్థులకు ఇవ్వాల్సిన మొత్తాన్ని గ్రీన్ చానల్ ద్వారా సకాలంలో ఇవ్వాల్సిందిగా ఆదేశించామన్నారు. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, ఉన్నతాధికారులు వారానికి రెండుసార్లు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లాలని సూచించారు. ఈ ఆదేశాలను నిర్లక్ష్యం చేసే వారికి భవిష్యత్ ప్రయోజనాల్లో ప్రాధాన్యత ఇవ్వబోమని చెప్పారు. ప్రజా ప్రతినిధులు కూడా స్కూళ్లకు వెళ్లాలన్నారు. కుల గణనపై కొంతమంది కుట్ర చేస్తున్నారని, దీన్ని విద్యార్థి లోకం సమర్థవంతంగా తిప్పికొట్టాలని కోరారు. జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో గురువారం బాలల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో జిల్లాల నుంచి వచ్చిన బాలలను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడారు.

ప్రభుత్వ స్కూళ్లపై విశ్వాసం పెంచాలి

'ప్రభుత్వ స్కూళ్ల ప్రతిష్ట దెబ్బతింటోంది. గత ప్రభుత్వ హయాంలో మిగతా 3వ పేజీలో ▶

కేసీఆర్ మౌనం.. గోడకు వేలాడదీసిన తుపాకీ



ఆయన సరైన సమయంలో బయటికి వస్తారు

కేసీఆర్ నిశ్శబ్దం కాంగ్రెస్, బీజేపీలను భయపెడుతోంది

'సాక్షి' ఇంటర్వ్యూలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఇంటర్వ్యూ

- పోలీసులు రేవంత్ ప్రైవేటు ఆర్మీలా తయారయ్యారు
- మా పేరిట డీప్‌ఫేక్ ఆడియో, వీడియోలు పెట్టినా ఆశ్చర్యం లేదు
- లగచర్ల ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి.. పేదలు, గిరిజనుల కోసం వందసార్లయినా జైలుకు వెళ్తా
- కేసీఆర్‌ను ఖతం చేస్తామన్న వారెందరో అడ్రస్ లేకుండా పోయారు
- రేవంత్‌కు పాలనా అనుభవం లేక మూర్ఖపు నిర్ణయాలు
- చరిత్రలో నియంతలకు పట్టిన గతే రేవంత్‌కు ఖాయమని వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్:

బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు మౌనం కూడా కాంగ్రెస్, బీజేపీలను భయపెడుతోందని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు పేర్కొన్నారు. కేసీఆర్ నిశ్శబ్దం గోడకు వేలాడదీసిన తుపాకీ లాంటిదని.. ఆయన సరైన సమయంలో బయటికి వస్తారని చెప్పారు. రేవంత్ ఒక అజ్ఞాని, కేసీఆర్ ఒక లెజెండ్ అని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉన్నంత కాలం కేసీఆర్ పేరు ఉంటుందని.. అధికారంలోకి వచ్చిన 11 నెలల్లో కేసీఆర్ పేరును రేవంత్ ప్రతిరోజూ ప్రస్తావిస్తూనే ఉన్నారని చెప్పారు. మరో నాలుగేళ్ల తర్వాత కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ 'సాక్షి'కి ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలివీ..

సాక్షి: లగచర్ల ఘటనలో మీ పాత్ర ఉందంటూ కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలపై ఏమంటారు?

కేటీఆర్: లగచర్ల ఘటనలో ఎలాంటి కుట్ర లేదు. ఘటనపై జిల్లా కలెక్టర్, ఎస్పీ తలో మాట చెప్తున్నారు. రేవంత్ సొంత అల్లుడి ఫార్మా కంపెనీ కోసం జరుగుతున్న భూసేకరణపై రైతులు అభ్యంతరం చెప్తున్నారు. 9 నెలలుగా సీఎం, మంత్రులు, అధికారులు ఎవరూ వారితో మాట్లాడలేదు. కొందరిని దోషులుగా చూపిస్తూ గిరిజనుల భూములను లాక్కునేందుకు రేవంత్ చేస్తున్న కుట్ర ఇది. లగచర్ల ఘటనను రాజకీయ ప్రేరేపితమైనదిగా చిత్రించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ప్రభుత్వ వ్యతిరేకత పెంచడమే మీ ఉద్దేశమనే ఆరోపణలపై మీ స్పందన?

కేటీఆర్: కేవలం 11 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత, నిరసన వెల్లువెత్తుతోంది. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అల్లాటప్పా నాయకుడు కాదు. గతంలో రేవంత్‌ను ఓడించారు. మరోవైపు రైతులను తన్ని అయినా సరే భూములు తీసుకుంటామని రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డి చెప్తున్నారు. సీఎం సోదరుడు అయితే మాత్రం పేదల భూములు లాక్కుంటారా? ప్రజలు

మిగతా 2వ పేజీలో ▶



మొదటి ముద్దాయి కేటీఆర్

టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకే లగచర్ల దాడి

సాక్షి, హైదరాబాద్: వికారాబాద్ దాడిలో మొదటి ముద్దాయి కేటీఆర్ అని, ఆయన శిక్ష అనుభవించక తప్పదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. నెహ్రూ జయంతిని పురస్కరించుకుని గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ నుంచి కాల్ వెళ్లగానే పట్నం నరేందర్‌రెడ్డి తన కార్యకర్తలతో దాడి చేయించారని ఆరోపించారు. అధికారులపై దాడులు చేసినట్లు వీడియోలో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఈ-ఫార్ములా విషయంలో కేటీఆర్ రూ.55 కోట్లు నొక్కేశారని, ప్రభుత్వ డబ్బులను కాజేసినా ఊరుకోవాలా? అని ప్రశ్నించారు. మొన్నటివరకు మూసీ, హైడ్రా విషయంలో అబద్ధాలు ప్రచారం చేశారని విమర్శించారు. ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ప్రయత్నం చేస్తున్నారని, ఆ కుట్రలో భాగంగానే లగచర్లలో కలెక్టర్‌పై దాడి జరిగిందని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. రైతులు కాని వాళ్లు, భూములు లేని వాళ్లకి దాడి చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. అభివృద్ధి ఆగిపోతే తరతరాలు బాధపడాల్సి వస్తుందని చెప్పారు. ఈ నెల 16 నుంచి జిల్లాల్లో పర్యటిస్తానని, కరీంనగర్ నుంచి పర్యటన ప్రారంభిస్తానని తెలిపారు.

నాపై కేసు రాజకీయ ప్రేరేపితం: పట్నం

- కేవలం నిందితులు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా కేసు నమోదు చేసినట్లు వెల్లడి
- ట్రయల్ కోర్టు రిమాండ్ ఉత్తర్వులను కొట్టేయాలని హైకోర్టుకు విజ్ఞప్తి
- తానెలాంటి నేరాంగీకార ప్రకటన ఇవ్వలేదని కొడంగల్ కోర్టుకు అఫిడవిట్



సాక్షి, హైదరాబాద్: వికారాబాద్ జిల్లా లగచర్లలో కలెక్టర్, జిల్లా అధికారులపై దాడి ఘటనలో తన ప్రమేయం లేదని, రాజకీయ ప్రేరేపణతో తనపై కేసు నమోదు చేశారని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆధారాలు లేకుండా తనపై నమోదు చేసిన కేసును, వికారాబాద్ జిల్లా మిగతా 2వ పేజీలో ▶

అరెస్టు ప్రచారం.. అలర్ట్!

- లగచర్ల ఘటనలో కేటీఆర్‌ను అరెస్టు చేస్తారనే ప్రచారంతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో టెన్షన్
- గురువారం తెలంగాణ భవన్‌లో గడిపిన కేటీఆర్

2లో

8,084 మంది గ్రూప్-4కు ఎంపిక

తుది ఫలితాలు విడుదల చేసిన టీజీపీఎస్సీ



- 59 ఉద్యోగాల ఫలితాలు పెండింగ్
- సరైన అభ్యర్థులు లభించక మరో 37 ఉద్యోగాలు ఖాళీ
- 2022లో నోటిఫికేషన్.. రెండేళ్లు సాగిన భర్తీ ప్రక్రియ

13లో

సర్కారు ఆసుపత్రి.. ప్రైవేటు మందు!



ఇతని పేరు రవీందర్. అతని తల్లి జీర్ణ వ్యవస్థ సంబంధిత సమస్యతో బాధపడుతుండటంతో గాంధీ ఆసుపత్రిలో చూపించారు. డాక్టర్లు మందులు రాసిచ్చారు. కానీ ఆసుపత్రికి చెందిన ఫార్మసీలో ఆ మందులు లేకపోవడంతో అక్కడే ఉన్న ప్రైవేట్ మందుల షాపులో కొన్నాడు. అందుకోసం రూ.800 బిల్లు చెల్లించాడు.



ఈమె పేరు భవాని. ఈమె పదేళ్ల కుమారుడికి ఆస్తమా సమస్య కారణంగా గాంధీ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతున్నాడు. అయితే ఉచిత మందులు ఇస్తున్నా, కొన్ని లేవంటూ గాంధీ ఆసుపత్రిలోని ఉచిత ఫార్మసీ వారు చెప్పడంతో అదే ఆసుపత్రిలోని ప్రైవేట్ దుకాణంలో ఆమె మందులు కొనుగోలు చేశారు.

గాంధీ ఆస్పత్రి ఆవరణలో...



- ప్రభుత్వ ఆసుపత్రుల్లో రాజ్యమేలుతున్న ప్రైవేట్ మందుల మాఫియా
- నిలోఫర్, గాంధీ, ఉస్మానియా బోధనాసుపత్రుల్లో ప్రైవేట్ గుత్తాధిపత్యం.. ప్రైవేటు షాపుల్లో దొరికే మందులనే రాస్తున్న అనేకమంది డాక్టర్లు
- అడ్డుకునే వారే లేకపోవడంపై విమర్శల వెల్లువ

13లో



క్లుప్తంగా...

ప్రభుత్వంపై కేటీఆర్, హరీశ్ తప్పుడు ప్రచారం: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం మీద కేటీఆర్, హరీశ్‌రావు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న మంచి పనులను బీఆర్ఎస్ సోషల్ మీడియా వక్రీకరిస్తోందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి ధ్వజమెత్తారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మీద, రేవంత్‌రెడ్డి మీద బురద జల్లడమే పనిగా బీఆర్ఎస్ నేతలు పనిచేస్తున్నారని అన్నారు. రాష్ట్రానికి కంపెనీలు రాకుండా బీఆర్ఎస్ అడ్డుపడుతోందని ఆరోపించారు. తమ ప్రభుత్వం రైతుల నుంచి బలవంతంగా భూములు గుంజు కోవడం లేదని, రైతులను ఒప్పించి, నష్టపరిహారం చెల్లించి, వారి అంగీకారంతోనే భూములు తీసుకోవాలని భావిస్తోందని చెప్పారు. మల్లన్నసాగర్ భూసేకరణలో బీఆర్ఎస్ ప్రభుత్వం లాఠీ చార్జి చేసిన పరిస్థితులు ఇప్పుడు లేవన్నారు. లగచర్లలో ఎక్కడైనా రైతుల మీద దాడులు జరిగాయా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలన మధ్య తేడాను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. గత పదేండ్లు తెలంగాణ ప్రజలకు నరకం చూపించారని, రైతులకు బేడీలు వేసి, అరెస్టులు చేసి హింసించారని అన్నారు. గ్రామ సభలు పెట్టి ప్రజాభిప్రాయం సేకరించిన చరిత్ర బీఆర్ఎస్‌కు ఉందా? అని ప్రశ్నించారు.

సుద్దపూసలా మాట్లాడుతున్న కేటీఆర్

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



సాక్షి, హైదరాబాద్: అధికారంలో ఉన్నప్పుడు పాపాలు, దుర్మార్గాలు చేసి.. ఇప్పుడు కేటీఆర్ సుద్దపూసలా మాట్లాడుతున్నారని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం విమర్శించారు. సీఎల్పీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో కేటీఆర్ ఎన్నో చీకటి పాపాలు చేశారని, ఆయన పాపాలు బయటకు వస్తే తెలంగాణలో ఐదు నిమిషాలు కూడా ఉండలేడని ఆరోపించారు. లగచర్ల దాడిలో కేటీఆర్ పాత్రపై పూర్తి విచారణ జరపాలని, నరేందర్‌రెడ్డి ద్వారా కేటీఆర్‌నే కుట్ర చేశారని, ఆయన పాత్ర ఉంటే వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా డీటీసీలో 1300 మందిని కేటీఆర్, జగదీశ్‌రెడ్డి ఆదేశాలతో చిత్రహింసలకు గురిచేశారని, గతంలో ప్రభాకర్‌రావు తన టేబుల్ పైన తుపాకీ పెట్టి పార్టీ మారొద్దని నన్ను బెదిరించాడని వివరించారు. ఫోన్ ట్యాపింగ్ చేసింది, చేయించింది కేటీఆరేనని ఆరోపించారు. దొంగచాటుగా ఫోన్ సంభాషణలు విన్నది చిరుమర్తి లింగయ్య కాదని కేటీఆరేనని అన్నారు.

నాందేడ్ ఎన్నికల సభలో ఉత్తమ్



మహారాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం నాందేడ్‌లో నిర్వహించిన సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఉత్తమ్‌ను ఏఐసీసీ మరాత్వాడా ప్రాంత ఎన్నికల పరిశీలకుడిగా నియమించిన విషయం తెలిసిందే.

- సాక్షి, హైదరాబాద్

అరెస్టు ప్రచారం.. అలర్ట్!

- లగచర్ల ఘటనలో కేటీఆర్‌ను అరెస్టు చేస్తారనే ప్రచారంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో టెన్షన్
- గురువారం తెలంగాణ భవన్‌లో గడిపిన కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: లగచర్ల ఘటనకు బాధ్యుడిగా పేర్కొంటూ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను పోలీసులు అరెస్టు చేయొచ్చనే ప్రచారంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో టెన్షన్ కనిపించింది. బుధవారం రాత్రి పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నేతలు హైదరాబాద్ నందినగర్‌లోని కేటీఆర్ నివాసంలోనే బస చేశారు. గురువారం ఉదయం 11 గంటలకు కేటీఆర్ పార్టీ నేతలతో కలిసి తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. ఈ సమయంలో కేటీఆర్‌ను కలిసేందుకు పార్టీ ముఖ్య నేతలు పెద్ద సంఖ్యలో తెలంగాణ భవన్‌కు తరలి వచ్చారు. పార్టీ నేతలు, బీఆర్ఎస్ లీగల్ టీమ్ సభ్యులతో కేటీఆర్ భేటీ అయి.. అరెస్టు వార్తలు, ఇతర అంశాలపై చర్చించారు. మరోవైపు చర్లపల్లి జైలులో రిమాండ్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో ములాఖత్ అయిన మాజీ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలోని పార్టీ ఎమ్మెల్యేల బృందం.. అక్కడి విషయాలను కేటీఆర్‌కు ఫోన్‌లో వివరించింది. ఇక కేటీఆర్ మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టి నిర్వహించి సీఎం రేవంత్ తీరును ఎండగట్టారు. సాయంత్రం లగచర్ల బాధిత కుటుంబాలు తెలంగాణ భవన్‌కు వచ్చి కేటీఆర్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నాయి. అండగా ఉంటామని కేటీఆర్ వారికి భరోసా ఇచ్చారు.

రైతులపై థర్డ్ డిగ్రీ అమానుషం

భూముల కోసం పోరాటం చేస్తున్నవారిపై పాశవిక దాడి చేయడమేంటి?: కేటీఆర్

- లగచర్ల ఘటనకు రాజకీయ రంగు పులుముతున్నారని మండిపాటు
- తెలంగాణభవన్‌లో కేటీఆర్‌ను కలిసిన లగచర్ల బాధిత కుటుంబాలు
- 'భూమి ఉంటే వ్యవసాయం చేసుకుంటాం.. డబ్బుల్ని తినలేం కదా..' అంటూ ఆవేదన



గురువారం తెలంగాణ భవన్‌లో లగచర్లకు చెందిన గిరిజన మహిళను ఓదారుస్తున్న కేటీఆర్

సాక్షి, హైదరాబాద్/ పంజాగుట్ట: తమ భూములు కోల్పోతామనే ఆవేదనతో లగచర్ల రైతులు నిరసన తెలిపితే.. వారిపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించి అమానుషంగా వ్యవహరించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. భూముల కోసం పోరాటం చేస్తున్నవారిపై పాశవిక దాడి చేయడం ఏమిటని నిలదీశారు. లగచర్ల ఘటనలో అరెస్టయిన రైతుల కుటుంబాలకు చెందిన గిరిజన మహిళలు గురువారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలసి తమ గోడు చెప్పుకొన్నారు. పోలీసులు తమ ఇంట్లో మగవారి పట్ల కర్కశంగా వ్యవహరించారని చెబుతూ కంటతడి పెట్టారు. దాడితో సంబంధం లేకపోయినా కూడా తన భర్తను విపరీతంగా కొట్టి తీసుకెళ్లారని వివరిస్తూ జ్యోతి అనే గర్భిణి కన్నీళ్లు పెట్టారు. ఎట్టి పరిస్థితుల్లోనూ భూములు తీసుకుంటామని బెదిరిస్తున్నారని.. తమ ఆధారం పోతే ఎలా బతకాలని ఆందోళన వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం..

బీఆర్ఎస్ వారే లగచర్లలో దాడికి కుట్ర చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆరోపణలపై కేటీఆర్ మండిపడ్డారు. ఈ గిరిజన మహిళలను చూస్తుంటే ఎవరో చెబితే దాడి చేసే వారిలా కనిపిస్తున్నారా? అని నిలదీశారు. గిరిజన రైతుల కుటుంబాలకు అండగా ఉంటామని.. పోలీసులు అరెస్ట్ చేసిన వారిని విడిపించే వరకు బీఆర్ఎస్ తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గర్భిణి జ్యోతికి వైద్య సాయం అందిస్తామన్నారు. పోలీసుల అమానుష దాడిని జాతీయ మానవ హక్కుల కమిషన్, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సుమోటోగా స్వీకరించి విచారణ జరపాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ దుర్మార్గాలను ఎదుర్కొనేందుకు ప్రజా సంఘాలు, గిరిజన, దళిత సంఘాలు, మహిళా సంఘాలు ముందుకు రావాలని కోరారు.

కోదండరాం, హరగోపాల్.. మాట్లాడరేంటి?

లగచర్లలో దాడి చేశారనే నెపంతో జిల్లా ఎస్పీ 50 మంది రైతులను దగ్గరుండి కొట్టించారని... ఘటన సమయంలో లేని బీఆర్ఎస్ కార్యకర్తలను కూడా చితకబాదారని కేటీఆర్ ఆరోపించారు. గతంలో మానవ హక్కుల గురించి మాట్లాడిన ప్రొఫెసర్ కోదండరాం, హరగోపాల్ వంటివారు ఇప్పుడు మాట్లాడటం లేదేమని ప్రశ్నించారు. ఇక సీఎం ప్రతిపాదిస్తున్న ఫార్మా విలేజీలు, ఫోర్త్ సిటీ, ఏఐ సిటీ సాధ్యం కాదని.. ఆ పేరుతో రియల్ ఎస్టేట్ దందా కోసం ప్రయత్నిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. సీఎంకు సొంత నియోజకవర్గంపైనే పట్టులేదని.. ఢిల్లీకి మూటలు పంపించేందుకే మూసీ ప్రాజెక్టు ముందు పెట్టుకున్నారని విమర్శించారు. రేవంత్ ఇప్పుడు ఐదేళ్లు అధికారంలో.. తర్వాత 15 ఏళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉంటుందన్నారు. ఎన్నికల సంస్కరణలు వస్తే ఒక వ్యక్తి రెండు పర్యాయాల కంటే మించి సీఎం, పీఎం పదవిలో ఉండకూడదని విజ్ఞప్తి చేస్తానని చెప్పారు.

డబ్బులెందుకు?.. భూమి ఉంటే వ్యవసాయం చేసుకుంటాం

లగచర్ల, హకీంపేట, పొలపల్లి గిరిజన మహిళల స్పష్టీకరణ

''మాకు డబ్బులు ఇస్తే ఏం చేసుకుంటాం.. భూమి ఉంటే వ్యవసాయం చేసుకుని పంటలు పండించుకుని తింటాం. డబ్బులు తినలేం కదా..''అని వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల, హకీంపేట, పొలపల్లి గ్రామాలకు చెందిన గిరిజన మహిళలు స్పష్టం చేశారు. తమ ప్రాణాలు పోయినా ఫార్మా విలేజీ కోసం భూములు ఇచ్చేదే లేదని చెప్పారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడారు. ''ఆ రోజు కలెక్టర్ మా గ్రామానికి వస్తున్నాడన్న విషయం మాకు తెలియదు. అకస్మాత్తుగా రావడంతో మా భూములు లాక్కునేందుకే వచ్చారనుకుని అంతా 'కలెక్టర్ గో బ్యాక్'అంటూ నినాదాలు మాత్రమే చేశారు. దాడి చెయ్యలేదు. మా భూములపై డ్రోన్లు తిరుగుతున్నాయి. మాకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సర్వేలు చేస్తున్నారు. మీరు చచ్చినా సరే ఫార్మా వస్తుందంటూ బెదిరిస్తున్నారు. మా భూములు కాపాడుకునేందుకు మేము నిరసన తెలపడం కూడా తప్పా?''అని వారు ప్రశ్నించారు. గొడవ జరిగే సమయంలో లేని వారిని కూడా అరెస్టు చేశారని వాపోయారు.

కేసీఆర్ మౌనం.. గోడకు వేలాడదీసిన తుపాకీ

▶ మొదటి పేజీ తరువాయి

చూస్తూ ఊరుకోవాలా? రేవంత్‌కు పాలనా అనుభవం లేక మూర్ఖపు నిర్ణయాలు తీసుకుంటున్నారు.

రిమాండ్ రిపోర్టులో మీ పేరు చేర్చడంపై ఏమంటారు?

పోలీసులు రేవంత్ ప్రైవేటు ఆర్మీలా తయారై... రిమాండు రిపోర్టులో ఏది పడితే అది రాస్తున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అయిన నాకు.. పార్టీ నాయకుడు నరేందర్‌రెడ్డి ఫోన్ చేస్తే తప్పేముంది? లగచర్ల కార్యకర్త సురేశ్.. మాజీ ఎమ్మెల్యేకు ఫోన్ చేయకూడదా? మా సంభాషణను డీప్‌ఫేక్ టెక్నాలజీతో సృష్టించి వక్రీకరించే అవకాశాలు కూడా ఉన్నాయి. ఈ అంశంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించడంతోపాటు రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డిపై కూడా కేసులు పెట్టాలి. తిరుపతిరెడ్డి డీఫ్యాక్టో సీఎంగా వ్యవహరిస్తున్నారు. పరిగి జైలుకు పంపిన లగచర్ల పేదలను విడుదల చేయాలి. పేదలు, గిరిజనుల కోసం ఒక్కసారి కాదు.. వందసార్లు జైలుకు వెళ్లేందుకైనా నేను సిద్ధం.

అరెస్టు చేస్తారన్న వార్తలపై ఏమంటారు?

సీఎం రేవంత్ ఒక శాడిస్ట్. పోలీసులు ప్రైవేటు ఆర్మీ లా ఇష్టారీతిన కేసులు పెడుతున్నారు. చరిత్రలో నియంతలకు పట్టిన గతే రేవంత్‌కు పట్టడం ఖాయం. న్యాయం, ధర్మం ఎప్పటికైనా గెలుస్తాయి.

'మిమ్మల్ని అడ్డుపెట్టి కేసీఆర్‌ను ఫినిష్ చేస్తా..' అన్న సీఎం వ్యాఖ్యలపై మీ స్పందనేంటి?

కేసీఆర్‌ను ఫినిష్ చేస్తామని గత 24 ఏళ్లలో అన్నవారందరూ అడ్రస్ లేకుండా పోయారు. కేసీఆర్‌పై మాట్లాడే ముందు రేవంత్ తన స్థాయి, వయసు, గౌరవం ఏమిటో తెలుసుకోవాలి. కేసీఆర్‌ను ఉద్దేశించి రేవంత్ దుర్భాషలాడినంత కాలం మేం కూడా అదే తరహాలో సమాధానం ఇస్తాం. కాంగ్రెస్ స్కామ్స్, స్కీమ్స్ గురించి నిలదీస్తూనే ఉంటాం.

'ఈ-ఫార్ములా'ఆరోపణల సంగతేమిటి?

ఎలక్ట్రిక్ వాహన రంగానికి రాష్ట్రాన్ని హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ-ఫార్ములా రేస్ నిర్వహించాం. అందులో ఎలాంటి అవినీతి జరగలేదు. ఆ అంశంలో తీసుకున్న నిర్ణయాలకు నాదే బాధ్యత. కాంగ్రెస్ తెలంగాణకు ఏటీఎంగా మారిందని ప్రధాని మోదీ ఆరోపిస్తారు. కానీ బీజేపీ ఎంపీలు రేవంత్‌కు రక్షణ కవచంలా పనిచేస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు అయ్యారనేందుకు ఎన్నో ఉదంతాలు ఉన్నాయి. అమృత్ స్కామ్‌లో వివరాలు ఇచ్చినా కేంద్రం నుంచి స్పందన లేదు. మూసీ పునరుద్ధరణ పేరిట డీపీఆర్ లేకుండా ఇళ్లు కూల్చుతున్నా బీజేపీ నుంచి స్పందన లేదు.

ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర

లగచర్ల ఘటనలో ఎవరినీ ఉపేక్షించం

- రైతుల ముసుగులో అధికారులపై బీఆర్ఎస్ ప్రేరేపిత దాడి
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్థిరపరచాలనే కుట్ర జరుగుతోందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. అధికారం కోల్పోయిన అక్కసుతో అమాయక రైతులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకొనేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని ఆయన ధ్వజమెత్తారు. చిల్లర, అవకాశవాద, కుట్రపూరిత రాజకీయాలతో మనుగడ సాగించలేరనే విషయాన్ని బీఆర్ఎస్ గుర్తించాలని, పార్టీ ఉనికి కోసం అమాయక రైతులను బలిపెట్టొద్దని గురువారం ఒక ప్రకటనలో ఆ పార్టీ నాయకులకు విజ్ఞప్తి చేశారు. లగచర్ల ఘటనలో ఎవరినీ ఉపేక్షించబోమని, చట్టం తన పని తాను చేసుకుంటూ వెళుతుందన్నారు. జిల్లా కలెక్టర్‌తో పాటు అధికారులపై దాడికి పాల్పడడం హేయమైన చర్య అని విమర్శించారు. కలెక్టర్‌పైనే హత్యకు భారీగా కుట్ర పన్నారని, రైతుల ముసుగులో కొంతమంది గులాబీ గూండాలు శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తున్నారని, దీనివెనుక ఎవరున్నారో కూడా అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. రైతులు తమ సమస్యలు చెప్పుకోవడానికి, స్థానికుల సమస్యలను వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా, కుట్రపూరిత చర్యలకు పాల్పడడం దురదృష్టకరమన్నారు. రైతులకు నష్టం కలిగించే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని, ప్రజాస్వామ్యయుతంగా ప్రభుత్వం అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొనే ముందుకు వెళుతుందని పేర్కొన్నారు. అధికారులపై దాడి జరిగినట్టుగానే భవిష్యత్‌లో రాజకీయ నాయకులకో, ప్రజలకో జరిగితే ప్రభుత్వం ఉపేక్షించబోదని స్పష్టం చేశారు. ప్రజలను కాపాడుకున్నట్టే, అధికారులను కాపాడుకోలేకపోతే పనిచేయడానికి ఎవరు ముందుకు వస్తారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సమస్య చెప్పుకోవడానికి వచ్చిన ఖమ్మం మిర్చి రైతులకు బేడీలు వేశారని గుర్తు చేశారు. ఇసుక దందాలకు అడ్డువస్తున్నారని, సిరిసిల్ల నియోజకవర్గ పరిధిలోని నేరెళ్లలో దళితులను ట్రాక్టర్‌తో తొక్కించి పోలీస్‌స్టేషన్‌లో థర్డ్ డిగ్రీ ప్రయోగించి హింసించారని గుర్తు చేశారు. ఆనాటి ప్రభుత్వం పెట్టిన హింసను భరించలేక 2021 జూన్ నెలలో వేముల ఘాట్ రైతు తూటుకూరి మల్లారెడ్డి, కూల్చివేసిన తన ఇంటిలోని కట్టెలను పోగుచేసి, దానినే చితిగా మార్చుకొని ఆత్మార్పణ చేసుకున్నాడని పేర్కొన్నారు. ఆనాటి ప్రభుత్వం పెట్టిన బాధలను భరించలేక ఏకంగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. గడచిన 11 నెలలుగా ప్రతి విషయంలోనూ ప్రజాస్వామ్యయుతంగా ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నట్టు చెప్పారు.

మహారాష్ట్రకు పొంగులేటి



మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మహారాష్ట్ర ఎన్నికల ప్రచారానికి వెళ్లారు. గురువారం నాందేడ్ ప్రాంతంలో జరిగిన పలు సభల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సభల్లో పాల్గొనేందుకు వచ్చిన రాహుల్‌గాంధీకి నాందేడ్ విమానాశ్రయంలో మంత్రి ఉత్తమ్‌తో కలిసి స్వాగతం పలికారు.

నాందేడ్ విమానాశ్రయంలో రాహుల్‌గాంధీతో మంత్రి పొంగులేటి

నాపై కేసు రాజకీయ ప్రేరేపితం: పట్నం

▶ మొదటి పేజీ తరువాయి

కొడంగల్ కోర్టు ఇచ్చిన రిమాండ్ ఆదేశాలను కొట్టివేయాలని విజ్ఞప్తి చేశారు. 'బొమ్రాస్‌పేట్ స్టేషన్‌లో నమోదైన కేసుతో నాకు ఎలాంటి సంబంధం లేదు. కేవలం నిందితులు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగానే నన్ను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టుకు కనీసం కారణాలను వెల్లడించలేదు. న్యాయవాదితో మాట్లాడే అవకాశం కూడా ఇవ్వలేదు. పోలీసులు తూతూ మంత్రంగా దాఖలు చేసిన రిమాండ్ డైరీని ట్రయల్ కోర్టు ఆమోదించి ఉత్తర్వులు జారీ చేసింది. టీజీఐఐసీ కోసం భూమి కోల్పోయే బాధితులే అధికారులపై దాడి చేశారు. ఎలాంటి సాక్ష్యాలు లేకుండా, దురుద్దేశంతో, రాజకీయ కారణాలతో నమోదు చేసిన కేసులో విధించిన రిమాండ్‌ను రద్దు చేయాలి..'అని నరేందర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్ ఈనెల 18న విచారణకు వచ్చే అవకాశం ఉంది.

పోలీసులు కట్టుకథ అల్లారు

కలెక్టర్, జిల్లా అధికారులపై దాడి ఘటనలో తన పాత్ర ఉందంటూ పోలీసులు కట్టు కథ అల్లారని నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆదేశాలతో రైతులను దాడులకు పురిగొల్పినట్లుగా తాను నేరాంగీకార ప్రకటన ఇచ్చానని పోలీసులు చెబుతున్నట్లు తెలిసిందన్నారు. చర్లపల్లి జైల్లో ఉన్న నరేందర్‌రెడ్డి.. ఈ మేరకు గురువారం తన న్యాయవాదుల ద్వారా కొడంగల్ కోర్టుకు అఫిడవిట్ పంపించారు. బుధవారం ఉదయం హైదరాబాద్‌లో మార్నింగ్ వాక్ చేస్తున్న తనను పోలీసులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా బలవంతంగా వికారాబాద్ పోలీసు శిక్షణ కేంద్రానికి తీసుకెళ్లి నిర్బంధించినట్లు తెలిపారు. ఆ తర్వాత పరిగి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం కొన్ని కాగితాలపై సంతకాలు తీసుకుని కోర్టుకు తీసుకెళ్లారన్నారు. కోర్టులో ప్రవేశ పెట్టిన తర్వాత లగచర్ల ఘటనలో తాను ప్రథమ ముద్దాయిగా ఉన్నట్లు సమాచారం ఇచ్చినట్లు వివరించారు. తన అరెస్టు విషయంలో పోలీసులు చట్ట విరుద్ధంగా వ్యవహరించారని, అరెస్టు సమాచారాన్ని కనీసం తనకు కానీ, తన కుటుంబానికి కానీ ఇవ్వలేదని తెలిపారు. తాను అఫిడవిట్‌లో పేర్కొన్న వాస్తవాలను పరిగణనలోకి తీసుకుని సరైన ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

బెయిల్ కోసం జిల్లా కోర్టులో పిటిషన్

అనంతగిరి: తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ నరేందర్‌రెడ్డి గురువారం వికారాబాద్ జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నరేందర్ రెడ్డి తరఫున బీఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు పిటిషన్ వేశారు. దీనిపై ఈ నెల 18న విచారణ జరుగుతుందని న్యాయవాది శుభప్రద్ తెలిపారు.

సంగారెడ్డి జైలుకు లగచర్ల నిందితులు

ములాఖత్‌లు పెరిగినందుకేనని అధికారుల వెల్లడి



పరిగి: వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో కలెక్టర్‌తో పాటు పలువురు అధికారులపై జరిగిన దాడి కేసులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న 16 మందిని సంగారెడ్డి జైలుకు తరలిస్తున్నట్లు పరిగి సబ్ జైలు అధికారులు వెల్లడించారు. నిందితుల కుటుంబసభ్యులతో పాటు ఆయా పార్టీల రాజకీయ నేతలు పెద్ద సంఖ్యలో ములాఖత్‌కు వస్తుండటం, జైల్లో ఇబ్బందులు ఎదురవుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. సబ్ జైలు 50 మందికే పరిమితమైనదని, కానీ ఇప్పటికే 80 మంది ఉన్నారని చెప్పారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించగా సంగారెడ్డి జైలుకు తరలించాలని ఆదేశించినట్లు వివరించారు.

భయం గుప్పిట్లోనే లగచర్ల!

రోటిబండ, పులిచర్లకుంట తండాల్లోనూ అదే ఉత్కంఠ

బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్న గిరిజనులు	పరారీలో పలువురు అనుమానితులు.. ప్రత్యేక బృందాలతో గాలిస్తున్న పోలీసులు	వైరల్‌గా మారిన నరేందర్‌రెడ్డి వీడియో



లగచర్ల గ్రామం

వికారాబాద్/ పరిగి: లగచర్ల ఘటనతో వికారాబాద్ జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న ఉత్కంఠ అలాగే కొనసాగుతోంది. రోటిబండతండా, పులిచర్లకుంటతండా, లగచర్ల గ్రామాల గిరిజనులు భయం గుప్పిట్లో గడుపుతున్నారు. అధికారులపై దాడి ఘటన అనంతరం ఆయా గ్రామాలకు చెందిన చాలా మంది భయంతో ఊర్లు వదిలి పారిపోయారు. వారిని పట్టుకునేందుకు పోలీసు ఉన్నతాధికారులు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి.. తీవ్రంగా గాలిస్తున్నారు. ఈ ప్రాంతంలో నాలుగు రోజుల క్రితం ఆఫ్ చేసిన మొబైల్ నెట్‌వర్క్ సేవలను గురువారం పూర్తిస్థాయిలో పునరుద్ధరించారు.

తమవారు ఏమైపోయారో తెలియక..

లగచర్ల సహా ఫార్మా విలేజ్ ప్రభావిత గ్రామాల ప్రజల్లో కొందరు వారి పనులు చేసుకుంటుండగా.. పరారీలో ఉన్నవారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తమ వారు ఎక్కడున్నారో, ఎలా ఉన్నారో, పోలీసులకు దొరికిపోయారో ఏమీ తెలియక కన్నీళ్లు పెడుతున్నారు. ఇళ్లలో మగవారంతా వెళ్లిపోవడంతో.. వ్యవసాయ పనులు ఆగిపోయాయని, రెక్కాడితే కానీ పూట గడవని తమకు నిద్రాహారాలు కరువయ్యాయని వాపోతున్నారు. ఈ గ్రామాల్లో అధికారులపై దాడి ఘటన అంశంపై ఎవరిని పలకరించినా మాట్లాడేందుకు జంకుతున్నారు. మాట్లాడితే పోలీసులు, అధికారులు తమను టార్గెట్ చేస్తారేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అధికారులపై దాడిని నిరసిస్తూ ఉద్యోగ సంఘాల నిరసనలు కొనసాగుతున్నాయి. పలు ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్నవారు గురువారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మరోవైపు ఫార్మా విలేజీ భూసేకరణకు సంబంధించి ''అధికారులను తరిమికొడదాం.. నేను, బీఆర్ఎస్ పార్టీ మీ వెంటే ఉంటాం. ఏం జరిగినా చూసుకుంటాం.. కేటీఆర్ కూడా మీకు అండగా ఉంటారు. భూముల జోలికి వస్తే దాడులు చేయటానికి కూడా వెనకాడొద్దు''అంటూ కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని గతంలో మాట్లాడిన వీడియో గురువారం వైరల్‌గా మారింది.

ఘటనపై ఏడీజీ సమీక్ష

లగచర్ల ఘటన, తర్వాతి పరిణామాలపై అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఏడీజీ) మహేశ్ భగవత్ సమీక్షించారు. పరిగి పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ఆయన.. అక్కడ ఐజీ సత్యనారాయణ, ఎస్పీ నారాయణరెడ్డి, డీఎస్పీలు కరుణాసాగర్, ఇతర పోలీసు అధికారులతో..



సమీక్ష అనంతరం వెళ్తున్న అడిషనల్ డీజీ

ఘటన పూర్వాపరాలపై చర్చించినట్టు తెలిసింది. 120 మంది వరకు దాడి ఘటనలో పాల్గొన్నట్టు భావిస్తున్న పోలీసులు ఇప్పటికే 21 మందిని అరెస్టు చేశారు. మిగతా వారి కోసం జరుపుతున్న గాలింపు.. ఫార్మా విలేజీ ప్రభావిత గ్రామాల్లో సాధారణ పరిస్థితులు నెలకొనేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించినట్టు సమాచారం. భవిష్యత్‌లో ఇలాంటివి చోటు చేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేసినట్టు తెలిసింది.

రాష్ట్రంలో ఇందిరమ్మ నాటి ఎమర్జెన్సీ పాలన

మాజీ మంత్రి హరీశ్‌రావు

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి చర్లపల్లి జైలులో నరేందర్‌రెడ్డితో ములాఖత్



చర్లపల్లి జైలు వద్ద హరీశ్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి తదితరులు


కుషాయిగూడ: ప్రజాపాలన పేరుతో రాష్ట్రంలో ఇందిరమ్మ నాటి ఎమర్జెన్సీ పాలన కొనసాగుతోందని మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు. ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డిలతో కలిసి హరీశ్‌రావు గురువారం చర్లపల్లి జైలులో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని ములాఖత్ ద్వారా కలిశారు. అనంతరం జైలు ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఇదేనా మీరు చేసే పాలన..ఇదేనా ప్రజాపాలన? అక్రమంగా నరేందర్‌రెడ్డిని అరెస్టు చేసి.. కేటీఆర్ మీద కేసులు పెడతవు కావొచ్చు. నిన్ను గద్దె దించడం మాత్రం ప్రజలు మరిచిపోరు. ఫార్మాసిటీ పెట్టాలంటే 14 వేల ఎకరాల్లో పెట్టు.. కొడంగల్, జహీరాబాద్‌లలో ఫార్మాసిటీ భూముల సేకరణ నిలిపివేయాలి. దళిత, గిరిజన పేదల పక్షాన మేముంటాం.. మా పార్టీ అండగా నిలబడుతుంది. సమాధానం చెప్పలేక ప్రశ్నించే గొంతుక కేటీఆర్ మీద కుట్ర చేస్తున్నారు. రిమాండ్ రిపోర్టులో ఏముందో చదవనీయకుండానే తనతో సంతకం చేయించారంటూ నరేందర్‌రెడ్డి చెబుతున్నాడు. కేటీఆర్‌ను ఈ కేసులో ఇరికించేందుకు కుట్ర చేస్తున్నారు. ఈ కేసుతో నాకే సంబంధం లేదంటే కేటీఆర్‌ను ఇరికించే ప్రయత్నం చేశారని నరేందర్‌రెడ్డి వాపోయాడు. రిమాండ్ రిపోర్టుపై ఒత్తిడి చేసి సంతకం చేయించిన విషయాన్ని మేజిస్ట్రేట్ ముందు కూడా చెప్పానని నరేందర్‌రెడ్డి నాతో అన్నాడు. నరేందర్‌రెడ్డిని జైలులో పెట్టి రైతుల భూములు గుంజుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఓట్లు వేసి గెలిపించిన నియోజకవర్గ ప్రజలపై ఇదేనా నీ ప్రేమ'అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హరీశ్‌రావు ప్రశ్నించారు.

రేవంత్ పాలనపై ప్రజల తిరుగుబాటు ప్రారంభమైంది

'నరేందర్‌రెడ్డి ధైర్యంగా ఉన్నారు. బీఆర్ఎస్ ఆయనకు అండగా ఉంటుంది. మాకు న్యాయం, న్యాయస్థానం మీద పూర్తి నమ్మకం ఉంది, నిర్దోషిగా నరేందర్‌రెడ్డి బయటకు రావడం ఖాయం. రాష్ట్రంలో రేవంత్ పాలన మీద ప్రజల తిరుగుబాటు ప్రారంభమైంది. మా భూములు మాకు కావాలని ఆ రైతులు కొన్ని నెలలుగా పోరాటం చేస్తున్నారు. సీఎం రైతులను పిలిచి ఎందుకు మాట్లాడటం లేదు. గూండాలు, పోలీసులతో రైతులపై బెదిరింపులకు పాల్పడుతూ కట్టుబట్టలతో ఊళ్లు వదిలి పారిపోయేలా చేశాడు. ప్రతిపక్ష నాయకుడి బాధ్యత నిర్వర్తించే ప్రయత్నం చేసిన నరేందర్‌రెడ్డిపై అక్రమ కేసులు పెట్టడం అప్రజాస్వామికం. అశోక్‌నగర్‌లో విద్యార్థులు తిరగబడ్డా.. రైతులు, పోలీసులు రోడ్ల మీదకొచ్చినా, గురుకుల విద్యార్థులు నిరసన తెలిపినా బీఆర్ఎస్ కుట్రే అంటరు. మీ అణచివేతకు గురైన విద్యార్థులు, రైతులు, గిరిజనులు, పోలీసులకు అండగా ఉండటమే ప్రతిపక్షంగా మా బాధ్యత. మాకు ఉద్యమాలు కొత్తేమీ కాదు. అరెస్టులు కొత్త కాదు, నన్నో, కేటీఆర్‌నో, మా ఎమ్మెల్యేలనో అరెస్టు చేయండి అంతేకానీ గిరిజన రైతులను అరెస్టు చేయడం సరికాదు' అని హరీశ్‌రావు అన్నారు.

రాజ్యాంగ పాలనా.. రాచరికమా?

- సీఎం సోదరుడు రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్నారు
- బీఆర్ఎస్ మాజీ మంత్రుల ధ్వజం



మీడియాతో మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి. చిత్రంలో ప్రశాంత్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజ్యాంగ పాలనకు బదులుగా రాచరిక పాలన చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు మాజీ మంత్రులు విమర్శించారు. లగచర్లలో వికారాబాద్ కలెక్టర్‌పై దాడి ఘటనలో రైతులు, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని అరెస్టు చేయడాన్ని ఖండించారు. మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, వి.శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి గురువారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రజలు చేసిన తిరుగుబాటును కుట్రగా పేర్కొంటూ.. రైతులు, విపక్ష నేతలను అరెస్టు చేస్తున్నారని నిరంజన్‌రెడ్డి విమర్శించారు. ఎంపీ డీకే అరుణను లగచర్లకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు, సీఎం రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డికి మాత్రం 200 వాహనాల్లో తిరిగే స్వేచ్ఛను ఇచ్చారన్నారు. రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డి రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఫోన్‌లో మాట్లాడారనే విషయాన్ని నేరంగా చూపుతూ పట్నం నరేందర్‌రెడ్డిని అరెస్టు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దౌర్జన్యంగా భూములు లాక్కోవాలని చూస్తే ఉద్యమిస్తామన్నారు. రైతులపై కేసులను ఉపసంహరించుకోవాలని, అవసరమైతే బీఆర్ఎస్ మూకుమ్మడి జైల్ భరోకు పిలుపునిస్తుందని నిరంజన్‌రెడ్డి చెప్పారు.

అరెస్టులతో డైవర్షన్ పాలిటిక్స్

ఎన్నికల హామీలు అమలు చేయడం చేతకాని రేవంత్‌ను బీఆర్ఎస్ నిలదీస్తుండటంతో అరెస్టులతో డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. లగచర్ల ఘటనలో కట్టు కథలు చెప్తూ.. బీఆర్ఎస్‌ను బద్‌నాం చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. దాడులను ప్రోత్సహించడం బీఆర్ఎస్ విధానం కాదని, అధికారులు గ్రామాల్లో పరిస్థితులను బేరీజు వేసుకుని వెళ్లాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రేవంత్ రెడ్డిపై నమ్మకం లేనందునే కొడంగల్ ప్రజలు భూములు ఇచ్చేందుకు సిద్ధంగా లేరని ఎంపీ సురేశ్ రెడ్డి అన్నారు.

నాణ్యత లేకుంటే జైలే!

▶ మొదటి పేజీ తరువాయి

ఐదు వేల పాఠశాలలు మూతపడ్డాయి. రాష్ట్రంలో 26 లక్షల మంది ప్రభుత్వ స్కూళ్ళల్లో చదువుతుంటే, 36 లక్షల మంది ప్రైవేటు స్కూళ్ళకు వెళ్తున్నారు. అన్ని సౌకర్యాలున్నా, అర్హులైన టీచర్లు ఉన్నా ఈ పరిస్థితి ఎందుకుందో ఆత్మ విమర్శ చేసుకోవాలి. కలెక్టర్లు, ఎస్పీలు స్కూళ్లకు వెళ్లాలి. ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇతర ప్రజాప్రతినిధులు కూడా తమ పరిధిలోని ప్రభుత్వ స్కూళ్ళకు వెళ్ళాలి. విద్యార్థుల్లో విశ్వాసం కల్పించాలి. రెసిడెన్షియల్ స్కూళ్ళలో సన్న బియ్యంతో అన్నం పెట్టాలి. అందుకే రైతులకు రూ.500 బోనస్ ఇస్తున్నాం..' అని ముఖ్యమంత్రి చెప్పారు.

విద్యా రంగానికి పెద్దపీట

'విద్యా రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. 20 వేలమంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాం. 35 వేలమంది టీచర్ల బదిలీలు పూర్తి చేశాం. 11,062 టీచర్ పోస్టులు భర్తీ చేశాం. ప్రభుత్వ స్కూళ్ళకు ఉచిత విద్యుత్ ఇచ్చాం. వర్సిటీలకు వీసీలను నియమించాం. త్వరలో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేస్తాం. విద్యారంగంలో విప్లవాత్మక మార్పుల కోసం విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశాం. గత సీఎం మనవడి కుక్క చనిపోతే డాక్టర్‌ను జైల్లో పెట్టారు. విద్యార్థులు చనిపోతే కనీసం కన్నీరు కూడా పెట్టలేదు..' అని రేవంత్ అన్నారు. 'తెలంగాణకు విద్యార్థులే పునాదులని, తమ ప్రభుత్వం చేకూర్చే ప్రయోజనాలను అందరికీ తెలియజెప్పాల్సిన బాధ్యత వారిదేనని అన్నారు. భవిష్యత్‌లో ఎలాంటి వ్యసనాలకు బానిసలం కాబోమని, ఉన్నత విద్యలో రాణిస్తామని ప్రమాణం చేయాలని బాలలను కోరారు. చదువులోనే కాదు.. క్రీడల్లో రాణించినా ఉద్యోగాలు ఇస్తామని సీఎం ప్రకటించారు.



విద్యార్థులకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో భట్టి, పొన్నం, మహేశ్‌గౌడ్

కుల గణన మెగా హెల్త్ చెకప్ లాంటిది

'కులగణనను అడ్డుకునేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయి. తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. ఇది సమాజానికి మెగా ఆరోగ్య పరీక్ష వంటిది. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అందాలన్నా, సామాజిక న్యాయం జరగాలన్నా, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అన్ని వర్గాలకు పెరగాలన్నా, నిధుల కేటాయింపు జరగాలన్నా కుల గణనే కీలకం. కులగణన ఆధారంగా భవిష్యత్తులో 50 శాతానికి మించి రిజర్వేషన్లు అందుబాటులోకి తేవాలన్నదే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం. దీనిద్వారా ఎవరి ఆస్తులూ లాక్కోవడం జరగదు. సంక్షేమ పథకాలు అందకుండా పోవడం అంటూ ఉండదు. విద్యార్థులు కూడా కులగణన వివరాలు అందరికీ అర్థమయ్యేలా చెప్పాలి..' అని రేవంత్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, ప్లానింగ్ బోర్డు చైర్మన్ చిన్నారెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, పాఠశాల విద్యా డైరెక్టర్ నర్సింహారెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ పుస్తకాన్ని, తెలంగాణ విద్యా ప్రగతి సూచించే పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించారు. చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు పారితోషికం అందజేశారు.

'21 ఏళ్లకే పోటీ చేసే హక్కు' తీర్మానం చేయండి

ఎస్‌సీఈఆర్‌టీలో గురువారం జరిగిన అండర్ 18 విద్యార్థుల నమూన అసెంబ్లీ సమావేశ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఇందులో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాజకీయాల్లో పోటీ చేసే వయసును 25 ఏళ్ళ నుంచి 21 ఏళ్ళకు తగ్గించాలని, ఈ విధంగా చేసిన మాక్ అసెంబ్లీ తీర్మానాన్ని రాష్ట్రపతికి పంపాలని సూచించారు. రాష్ట్ర అసెంబ్లీలోనూ ఈ మేరకు తీర్మానం ప్రవేశపెట్టాలని సభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబుకు సూచించారు. ఓటు హక్కుకు అర్హత 21 ఏళ్ళుగా ఉన్నప్పుడు ఎన్నికల్లో పోటీ చేసే హక్కు 25 ఏళ్లకు లభించేదని, ఇప్పుడు ఓటు హక్కుకు అర్హత 18 ఏళ్ళకు తగ్గింది కాబట్టి పోటీ చేసే వయసును కూడా 21 ఏళ్ళకు తగ్గిస్తే ఎక్కువమంది యువత రాజకీయాల్లోకి వస్తారని సీఎం పేర్కొన్నారు.

- రాష్ట్రంలో పార్టీ సంస్థాగత ఎన్నికల్లో తలెత్తే వివాదాల పరిష్కారానికి ఓ అప్పీల్ కమిటీని బీజేపీ ఉపాధ్యక్షుడు, ఎన్నికల రిటర్నింగ్ అధికారి యెండల లక్ష్మీనారాయణ నియమించారు. సీనియర్ నేత చింతా సాంబమూర్తి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కమిటీలో సభ్యులుగా అమర్‌సింగ్ తిలావత్, శ్రీనివాస్‌రెడ్డి, నాగపురి రాజమౌళి నియమితులయ్యారు. జాతీయ పార్టీ సూచనల మేరకు రాష్ట్ర పార్టీ అప్పీల్ కమిటీని ఏర్పాటు చేసినట్టు ఓ ప్రకటనలో లక్ష్మీనారాయణ తెలిపారు.

AVANTHI
INSTITUTE OF PHARMACEUTICAL SCIENCES
Affiliated to JNTUH, Recg by Govt of TG/Approved by PCI
Gunthapally, Abdullapurmet, R.R Dist-501512

B.PHARMACY / PHARM.D CATEGORY - B / SPOT ADMISSIONS FOR 2024-25

COLLEGE	COURSES	CODE	Estd.
Avanthi Institute of Pharmaceutical Sciences Gunthapally, Abdullapurmet Mdl., Near Ramoji Film City, Hyderabad	B.Pharmacy Pharm.D	AVHP	2007

Last date for Submission of Filled in Applications
FOR SPOT ADMISSIONS 17-11-2024
FOR B-CATEGORY 26-11-2024

Applications can be had from Avanthi Central Office, Bus Depot Road, Barkathpura, Hyderabad and Avanthi Institute of Pharmaceutical Sciences Gunthapally, Abdullapurmet, R.R. Dist.,

Contact: 8919957827 / 9949068000 / 8328053969
Sd/- PRINCIPAL



ఆ గాత్రం మధురం!

- చూపులేని బాలుడి గాత్రానికి ఆర్టీసీ ఎండీ ఫిదా.... సినిమాల్లో పాడే అవకాశమివ్వాలని ట్వీట్
- ఇండియన్ ఐడల్‌లో ఛాన్స్ ఇస్తానని సంగీత దర్శకుడు తమన్ హామీ



సాక్షి, హైదరాబాద్: పుట్టుకతోనే చూపులేని ఓ బాలుడి పాటకు ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ మంత్రముగ్ధుడయ్యారు. ఓ బస్సులో కూర్చుని చేతులతో దరువేస్తూ ఆ బాలుడు పాడిన పాట ఇటీవల సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. దీంతో తన ట్విట్టర్ (ఎక్స్) ఖాతాలో బాలుడి పాట వీడియోను పోస్టు చేసి.. తెలుగు సినిమా పరిశ్రమలో అతడికి ఎవరైనా అవకాశం ఇవ్వాలని కోరారు. అందుకు స్పందించిన ప్రముఖ సంగీత దర్శకుడు తమన్.. ఆ బాలుడికి ఆహా ఇండియన్ ఐడల్ 4వ సీజన్‌లో అవకాశం ఇస్తానని హామీ ఇచ్చారు. బాలుడితో కలిసి తాను ప్రత్యేకంగా ప్రదర్శన ఇచ్చేలా ఏర్పాట్లు చేయాలని ఆహా టీంను ఆదేశించారు. బాలుడికి అద్భుతమైన ప్రతిభ ఉందని కితాబిచ్చారు. దేవుడు అప్పుడప్పుడూ కఠినంగా వ్యవహరించినా.. ఇలాంటి వారిని ఎంతో ప్రత్యేకంగా చూసుకునేందుకు మంచి మనుషులు ఉండనే ఉన్నారని పేర్కొన్నారు.

'సంక్షేమం' పెంచేందుకే సర్వే

ఇచ్చిన మాట ప్రకారమే బీసీ కులగణన

- ప్రభుత్వాన్ని కూల్చడంపైనే బీఆర్‌ఎస్ దృష్టి
- ప్రజలకు మంచి చేయడమే ప్రభుత్వ వైఫల్యమా?
- నెహ్రూ జయంతి వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి



గాంధీభవన్‌లో నెహ్రూ జయంతి వేడుకల్లో పాల్గొన్న భట్టి, మహేశ్‌గౌడ్, దీపా దాస్‌మున్షీ, వీహెచ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: అర్హులైన ప్రజలకు సంక్షేమ పథకాలను మరింత పెంచడానికే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఆశయాలకు అనుగుణంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతుందని చెప్పారు. రాష్ట్రంలో బీసీ కులగణన నిర్వహిస్తామని ఇచ్చిన మాటకు కట్టుబడి సర్వే నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గురువారం ఆయన గాంధీభవన్‌లో భారత తొలి ప్రధాని పండిట్ నెహ్రూ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మీడియాతో మాట్లాడుతూ కులగణన ద్వారా దేశానికి తెలంగాణ రోల్ మోడల్ కాబోతోందని అన్నారు. అన్ని అంశాలను దృష్టిలో పెట్టుకొనే కుటుంబ సర్వేకు సంబంధించి ప్రశ్నలు తయారు చేసినట్లు చెప్పారు.

ప్రభుత్వాన్ని కూల్చటమే బీఆర్‌ఎస్ లక్ష్యం

తమ ప్రభుత్వ వైఫల్యాలు ఏంటో బీఆర్‌ఎస్ నేత కేటీఆర్ చెప్పాలని భట్టి విక్రమార్క సవాల్ చేశారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడం, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటుచేయటం, రైతు రుణమాఫీ, ప్రజలకు మంచి చేయడం ప్రభుత్వ వైఫల్యాలా? అని ప్రశ్నించారు. అధికారం పోయిందన్న అక్కసుతో అమాయక ప్రజలను రెచ్చగొట్టి ఫార్మా క్లస్టర్స్ విస్తరించే పనిని వ్యతిరేకించడం బుద్ధి తక్కువ పని అని మండిపడ్డారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్ర పోషించకుండా, ప్రభుత్వాన్ని కూల్చడంపైనే బీఆర్‌ఎస్ దృష్టి పెట్టిందని ఆరోపించారు.

నెహ్రూ ఆశయాలు కొనసాగిస్తాం

నెహ్రూ ఆశయాలను కొనసాగిస్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ తెలిపారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఆమె మాట్లాడారు.

రేపట్నుంచి డెడికేటెడ్ కమిషన్ బహిరంగ విచారణ

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల నిర్ధారణపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ ఈనెల 16వ తేదీ నుంచి మూడు రోజుల పాటు వివిధ జిల్లాల్లో బహిరంగ విచారణ నిర్వహించనుంది. 16న నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లో, 17న ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో, 18న మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్‌లో కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బహిరంగ విచారణ నిర్వహించనున్నట్లు డెడికేటెడ్ కమిషన్ కార్యదర్శి బి.సైదులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్దేశించిన తేదీల్లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విచారణ జరుగుతుందని వివరించారు. ఉమ్మడి జిల్లాల కలెక్టరేట్‌ల పరిధిలో నిర్వహించే ఈ బహిరంగ విచారణలో పూర్వ జిల్లాల ఆధారంగా ప్రజల నుంచి వినతులు, సలహాలు, సూచనలు స్వీకరించనున్నట్లు స్పష్టం చేశారు.



కలెక్టర్ నిజాంను మించిపోయారు!

- భూదాన్ భూములు ఇవ్వడంపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు
- కలెక్టర్.. వారసత్వ ధ్రువీకరణ పత్రం జారీ చేయడంపై అభ్యంతరం




సాక్షి, హైదరాబాద్: భూములను కట్టబెట్టడంలో రంగారెడ్డి జిల్లా గత కలెక్టర్ నిజాం నవాబ్‌ను కూడా మించిపోయారని హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. పేదలకు పంచడం కోసం రామచంద్రారెడ్డి దాదాపు 300 ఎకరాలు ఇచ్చారని, అందినకాడికి నొక్కిన అధికారులు వాటి స్వాహాకు సహకరించారని చెప్పింది. భూదాన్ భూములంటూ అప్పిలేట్ ట్రిబ్యునల్ అథారిటీగా ధ్రువీకరించిన వ్యక్తి.. జిల్లా కలెక్టర్‌గా వారసత్వ ధ్రువీకరణ పత్రం ఎలా జారీ చేస్తారని ప్రశ్నించింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం.. ఆరోపణలున్న అధికారులు కోర్టుకు సమాధానం చెప్పాల్సిందేనని స్పష్టం చేసింది. పీవీ నరసింహారావు లాంటి ఎందరో మహానుభావులు సీలింగ్ చట్టం వచ్చినప్పుడు వందల ఎకరాలు ఇచ్చేశారంది. తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామం సర్వే నం.182లో 10.29 ఎకరాలకు ఖాదర్ ఉన్నీసాకు వారసత్వ ధ్రువీకరణ పత్రం జారీ చేయడాన్ని సవాలు చేస్తూ నవాబ్ ఫారూక్ అలీఖాన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి గురువారం విచారణ చేపట్టారు. గతంలో భూదాన్ భూములపై ఆర్డీవో ఆదేశాలివ్వగా స్పెషల్ ట్రిబ్యునల్ సమర్థించిందని పిటిషనర్ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. దీనికి విరుద్ధంగా ఖాదర్ ఉన్నీసా ఇచ్చిన దరఖాస్తును కలెక్టర్ ఆమోదించి పాస్‌బుక్ కూడా జారీ చేశారని చెప్పారు. వాదనలను విన్న న్యాయమూర్తి.. భూదాన్ భూముల రక్షణకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎందరో మహానుభావులు ఇచ్చిన వందల ఎకరాలను అమ్ముకుని తినేశారని, భూదాన్ భూముల రక్షణలో గత బోర్డుతోపాటు అధికారులూ విఫలమయ్యారని చెప్పారు. భూదాన్ భూములకు సంబంధించిన వివాదం న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉండగా పట్టా పాస్‌బుక్ జారీ చేశారన్నారు. వారసత్వ ధ్రువీకరణ పత్రం ఎలా జారీ చేశారో కౌంటరు దాఖలు చేయాలని భూదాన్ యజ్ఞబోర్డు, రెవెన్యూ ముఖ్యకార్యదర్శి, నాటి కలెక్టర్ అమోయ్‌కుమార్‌కు నోటీసులు జారీ చేశారు. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఈ భూములపై యథాతథస్థితిని కొనసాగించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

గత ప్రభుత్వ పంథాలోనే రేవంత్ సర్కార్

ఎంపీ ఈటల రాజేందర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా, భూములు లాక్కొంటూ భయానక వాతావరణం సృష్టించాలనుకోవడం సరికాదని బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు, ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. గత ప్రభుత్వం గిరిజనులు, దళితులకు చెందిన లక్షల ఎకరాలను ప్రాజెక్టుల పేరుతో గుంజుకొని వారి ఉసురుపోసుకుంటే.. ప్రస్తుత రేవంత్ సర్కార్ కూడా అదే పంథాలో కొనసాగుతోందన్నారు. తమ భూములు గుంజుకోవద్దని అడ్డుకున్న పాపానికి రైతులకు బేడీలు వేసి, కేసులు పెట్టిన పాపం రేవంత్‌రెడ్డిదేనని చెప్పారు. భూములు సేకరించాలనుకున్నప్పుడు ప్రత్యామ్నాయ మార్గం చూపించాలి కదా అని ప్రశ్నించారు. గురువారం ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడారు. రైతులపై కేసులు పెడితే సహించేది లేదని, దళిత, గిరిజనులకు అన్యాయం చేస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. సీఎం రేవంత్ తన సొంత నియోజకవర్గంలో కలెక్టర్‌ను పంపి బలవంతంగా భూసేకరణ చేసే ప్రయత్నం చేశారని ఆరోపించారు. రైతులను కలిసే ప్రయత్నం చేస్తే స్థానిక ఎంపీ డీకే అరుణను అడ్డుకున్నారన్నారు. సీఎం సోదరుడుని మాత్రం భారీ కాన్వాయ్‌తో ఎలా పంపిస్తారని ఈటల ప్రశ్నించారు.



డిసెంబర్ 2 లేదా 3న కాంగ్రెస్ భారీ సభ

- పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా నిర్వహించే యోచన
- హైదరాబాద్ శివారులోనే నిర్వహించాలని ప్రాథమిక నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై వచ్చే నెల 7 నాటికి సంవత్సరం పూర్తి కానున్న నేపథ్యంలో భారీ సభ నిర్వహించేందుకు టీపీసీసీ ఏర్పాట్లు చేస్తోంది. డిసెంబర్ 2 లేదా 3న హైదరాబాద్ శివారులో ఈ సభను నిర్వహించాలని, సభకు జాతీయ నాయకులను ఆహ్వానించాలని ప్రాథమికంగా నిర్ణయించింది. అంతకంటేముందు ప్రజా పాలన విజయోత్సవ సంబరాలను పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ యోచిస్తున్నారు. ఈనెల 14 నుంచి డిసెంబర్ 9 వరకు ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపట్టబోతోంది. వాటికి సమాంతరంగా రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించాలని యోచిస్తోంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 50 వేల ఉద్యోగాల భర్తీతోపాటు మూసీ పునరుజ్జీవం, ఫ్యూచర్ సిటీలాంటి అభివృద్ధి ప్రణాళికలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యాచరణ రూపొందిస్తోంది. గ్రామ, మండల, బ్లాక్, అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాలు, జిల్లా, రాష్ట్రస్థాయిలో పార్టీ కేడర్‌ను పూర్తిస్థాయిలో ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేసేలా ప్రణాళిక సిద్ధం చేస్తోంది. దీనికి సంబంధించిన కార్యాచరణ శుక్రవారం ఖరారయ్యే అవకాశం ఉందని, శనివారం నుంచి అన్ని స్థాయిల్లో ఏడాది పాలన విజయోత్సవాలు ప్రారంభమవుతాయని టీపీసీసీ ముఖ్య నాయకుడు ఒకరు 'సాక్షి'కి చెప్పారు.

ఓ మానవులారా! అల్లాహ్ మీకు చేసిన అనుగ్రహాలను జ్ఞాపకం చేసుకోండి! ఏమీ? భూమ్యాకాశాల నుండి మీకు జీవనోపాధి సమకూర్చే సృష్టికర్త అల్లాహ్ తప్ప మరొకడు ఉన్నాడా? అయితే మీరు ఎందుకు మోసగింప (సత్యం నుండి మరలింప) బడుతున్నారు?

– ఇస్లాం ధర్మం

ఫోకస్

సాక్షి
శుక్రవారం, 15 నవంబర్ 2024

బుల్డోజర్ సంస్కృతిపై వేటు!


'చావుకి పెడితే లంఖణానికి వస్తార'ని నానుడి. కొన్నేళ్లుగా ప్రజాస్వామ్యంలో బుల్డోజర్ స్వామ్యాన్ని జొప్పించి మురిసి ముక్కలవుతున్నవారికి సర్వోన్నత న్యాయస్థానం కీలెరిగి వాత పెట్టింది. నేరం రుజువై శిక్షపడిన లేదా నిందితులుగా ముద్రపడినవారి ఆవాసాలను కూల్చటం రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించింది. అలాంటి చేష్టలకు పాల్పడే ప్రభుత్వాధికారులు బాధితులకు పరిహారం చెల్లించటంతోపాటు వారి ఇళ్ల పునర్నిర్మాణానికయ్యే మొత్తం వ్యయాన్ని వ్యక్తిగతంగా భరించాల్సి వుంటుందని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం తేల్చిచెప్పింది. కూల్చివేతలకు ఏ నిబంధనలు పాటించాలో వివరించే మార్గదర్శకాలను విడుదల చేసింది. వీటిని ఉల్లంఘించే అధికారులపై కోర్టు ధిక్కార నేరం కింద చర్యలు తీసుకోవటంతోపాటు వ్యాజ్యాలు కూడా మొదలవుతాయని హెచ్చరించింది. 'ఇళ్లు కూల్చినప్పుడల్లా నిశిరాత్రిలో నడిరోడ్లపై చిన్నారులూ, ఆడవాళ్లూ విలపిస్తున్న దృశ్యాలు అరాచకానికి ఆనవాళ్లుగా నిలుస్తున్నాయి' అని న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. ఒకప్పుడు అక్రమ నిర్మాణాల కూల్చివేతకు కొన్ని విధివిధానాలు పాటించేవారు. నోటీసులిచ్చి సంజాయిషీలు తీసుకుని ఆ తర్వాత చర్యలు ప్రారంభించేవారు. కీడు శంకించినవారు న్యాయస్థానాలను ఆశ్రయించటం, వారికి ఊరట దొరకటం కూడా రివాజే.

తమకు నచ్చని అభిప్రాయాలున్నా, ఏదో ఉదంతంలో నిందితులుగా ముద్రపడినా వారి ఇళ్లూ, దుకాణాలూ కూల్చే పాపిష్టి సంస్కృతి ఇటీవలి కాలపు జాడ్యం. సినిమా భాషలో చెప్పాలంటే ఇది 'పాన్ ఇండియా' సంస్కృతి! దీనికి ఆద్యుడు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్. ఉత్తరప్రదేశ్‌లో నేర సంస్కృతిని అరికట్టడంలో, సంక్షేమ పథకాలు అర్హులకు అందించటంలో ఆయన విజయం సాధించారని బీజేపీ చెబుతుంటుంది. కానీ అంతకన్నా 'బుల్డోజర్ బాబా'గా పిలిపించుకోవటం యోగికి, అక్కడి బీజేపీకి ఇష్టం. చూస్తుండగానే ఇది అంటువ్యాధిలా పరిణమించింది. మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తరాఖండ్, జార్ఖండ్, కర్ణాటకల్లో బీజేపీ ప్రభుత్వాలు బుల్డోజర్లతో విధ్వంసానికి దిగాయి. మొన్నటి ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో దొడ్డిదారిన అధికారం చేజిక్కించుకున్నాక బాబు ఆధ్వర్యంలోని ఎన్డీయే ప్రభుత్వం విపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ కార్యాలయాలను బుల్డోజర్లతో కూల్చాలని చూసింది. ఒకటి రెండుచోట్ల ఆ పనిచేసింది కూడా. ఇక తమకు వ్యతిరేకంగా పనిచేశారన్న కక్షతో దిక్కూ మొక్కూలేని పేదల ఇళ్లు సైతం ఇదే రీతిలో ధ్వంసం చేసింది. రాజస్థాన్‌లో 2022లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండగా బీజేపీ ఏలుబడిలో ఉన్న రాజ్‌గఢ్ మున్సిపాలిటీ పరిధిలో ఈ దుశ్చర్య చోటుచేసుకుంది. మహారాష్ట్రలో శివసేన–కాంగ్రెస్–ఎన్సీపీ కూటమి సర్కారు హయాంలో నిందితుల ఇళ్లనూ, దుకాణాలనూ కూల్చారు. కేంద్రం మాటే చెల్లుబాటయ్యే ఢిల్లీలో జహంగీర్‌పురా ప్రాంతంలో మతఘర్షణలు జరిగినప్పుడు అనేక ఇళ్లూ, దుకాణాలూ నేలమట్టం చేశారు. బాధితులు సుప్రీంకోర్టు ఉత్తర్వులు పొందేలోగానే విధ్వంసకాండ పూర్తయింది. 2020 నుంచి ముమ్మరమైన ఈ విష సంస్కృతిపై సర్వోన్నత న్యాయస్థానం హెచ్చరిస్తూనే వచ్చింది. 'నిందితులు మాత్రమే కాదు, శిక్ష పడినవారి ఇళ్లను సైతం కూల్చడానికి లేదు. ఈ విషయంలో చట్టనిబంధనలు పాటించి తీరాలి' అని స్పష్టం చేసింది. కానీ ఆ చేష్టలు తగ్గిన దాఖలా లేదు. చుట్టూ మూగేవారు 'ఆహా ఓహో' అనొచ్చు. అవతలి మతంవారి ఇళ్లు, దుకాణాలు కూలుతున్నాయంటే తన్మయత్వంలో మునిగేవారుండొచ్చు. ఆఖరికి ఇళ్లు కూల్చిన ఉదంతాల్లో పాలుపంచుకున్న అధికారులు విందులు చేసుకున్న ఉదంతాలు కూడా వెల్లడయ్యాయి. కానీ సమాజంలో అరాచకం ప్రబలకూడదన్న ఉద్దేశంతో రాజ్యవ్యవస్థ ఏర్పడినప్పుడూ... రాజ్యాంగమూ, చట్టాలూ ఉన్నప్పుడూ... రాజ్యవ్యవస్థే తోడేలుగా మారితే దిక్కెవరు? సుప్రీంకోర్టు వద్దుగాక వద్దని చెప్పాక కూడా ఈ పోకడ ఆగలేదంటే ఏమనుకోవాలి? ఒక వ్యక్తి నిజంగా తప్పు చేశాడనుకున్నా అతని కుటుంబమంతా అందుకు శిక్ష అనుభవించి తీరాలన్న పట్టుదల నియంతృత్వ పోకడ కాదా?

సుప్రీంకోర్టు 95 పేజీల్లో ఇచ్చిన తీర్పు ఎన్నో విధాల ప్రామాణికమైనదీ, చిరస్మరణీయమైనదీ. 'ఇల్లంటే కేవలం ఒక ఆస్తి కాదు... అది కొందరు వ్యక్తుల, కుటుంబాల సమష్టి ఆకాంక్షల వ్యక్తీకరణ. అది వారి భవిష్యత్తు. వారికి స్థిరత్వాన్నీ, భద్రతనూ చేకూరుస్తూ, సమాజంలో గౌరవం తీసుకొచ్చేది. ఇలాంటి ఇంటిని బలవంతంగా తీసుకోవాలంటే ముందుగా ఇతర ప్రత్యామ్నాయాలేవీ లేవని అధికారులు విశ్వసించాలి' అని న్యాయమూర్తులు వ్యాఖ్యానించిన తీరు అమానవీయత నిండిన పాలకులకు ఏమేరకు అర్థమైందో సంశయమే. ఆ మాటెలా వున్నా కఠిన చర్యలుంటాయన్న హెచ్చరిక వారిని నిలువరించే అవకాశం ఉంది. దేశంలో దిక్కూ మొక్కూలేని కోట్లాదిమంది సామాన్యులకు ఊరటనిచ్చే ఈ తీర్పులో హిందీ భాషా కవి ప్రదీప్ లిఖించిన కవితకు కూడా చోటు దక్కింది. దాని సారాంశం – 'ఇల్లు, పెరడు ప్రతి ఒక్కరి స్వప్నం. ఆ కలను కోల్పోవడానికి సిద్ధపడతారా ఎవరైనా?' బ్రిటన్ న్యాయకోవిదుడు లార్డ్ డెన్నింగ్ చేసిన వ్యాఖ్యలను కూడా తీర్పులో ఉటంకించారు. 'రాజ్యాధికారాన్ని ధిక్కరించి అతి సామాన్యుడు వేసుకున్న గుడిసె చిరుగాలికే వణికేంత బలహీనమైనది కావొచ్చు. ఈదురుగాలికి ఇట్టే ఎగిరిపోవచ్చు. దాన్ని వర్షం ముంచెత్తవచ్చు. కానీ చట్టనిబంధన అనుమతిస్తే తప్ప ఆ శిథిల నిర్మాణం వాకిలిని అతిక్రమించటానికి ఇంగ్లండ్ రాజుకు సైతం అధికారం లేదు' అని లార్డ్ డెన్నింగ్ అన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు చూశాకైనా తమపై ఏ స్థాయిలో విశ్వాసరాహిత్యం ఏర్పడిందో ప్రభుత్వాలు గ్రహించాలి. నీతిగా, నిజాయితీగా, రాజ్యాంగానికి అనుగుణంగా పాలించటం నేర్చుకోవాలి.

కులరహిత వ్యవస్థకు తొలి అడుగు

విశ్లేషణ



జస్టిస్ వి.ఈశ్వరయ్య

కులగణనపై అనేక మంది అనేక వ్యాఖ్యలు చేస్తూ తమ అసలు రూపం ప్రకటిస్తున్నారు. కులగణన చాలామందికి గొంతు దిగని పచ్చివెలక్కాయలా మారిందనిపిస్తుంది. తెలంగాణలో కులగణన, సమగ్ర కుటుంబ సర్వే ప్రశ్నాపత్రంపై కొందరు అభ్యంతరాలు చెబుతున్నారు. కనీస సదుపాయాల లభ్యత పరంగా వివిధ సముదాయాలు ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నాయో తెలియాలంటే సమగ్ర కుటుంబ సర్వే అవసరం. అసెంబ్లీ, పార్లమెంటులు కాదు, కనీసం స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఎన్నడూ ప్రాతినిధ్యం లభించని కొన్ని సముదాయాలున్నాయి. రాజకీయ ప్రాతినిధ్యం ఏ వర్గానికి, ఏ సముదాయానికి ఎంత ఉందో తెలుసుకోకుండా రిజర్వేషన్లు ఇవ్వడం సాధ్యం కాదు. కాబట్టి రాజకీయ అనే పదం గురించిన అభ్యంతరాలు అర్థం లేనివి.

కుటుంబ సర్వేలో ఆస్తుల వివరాలు ఎందుకు ఇవ్వాలని కొందరు అడుగుతున్నారు. ఇదేదో వ్యక్తిగత హక్కులకు భంగమైనట్లు వాదిస్తున్నారు. సంపాదన వివరాలు తెలియజేసి ఆదాయపన్ను చెల్లించడం పౌరుల బాధ్యత కాదా? వివిధ సముదాయాల ఆర్థిక స్థితి గతులు తెలుసుకోవడం కూడా సర్వే ముఖ్యమైన లక్ష్యం. కాబట్టి పక్కా ఇంట్లో ఉంటున్నారా? పూరిగుడిసెలో ఉంటున్నారా అనే ప్రశ్నలు అడగవలసినవే. ఆస్తులేమున్నాయి? అసలున్నాయా? ఇల్లు ఉందా లేదా? ఎక్కడ తలదాచుకుంటున్నారు? ఈ ప్రశ్నలన్నీ అవసరమైనవే. ఈ ప్రశ్నలకు జవాబుల్లోనే ఏ సముదాయం ప్రజలకు ఆదాయవనరులు అందుబాటులో లేవు, ఎవరికి విద్యావసతి అందుబాటులో లేదు వంటి వివరాలు తెలుస్తాయి. రాజ్యాంగం ప్రకారం పౌరులందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం లభించాలి. అవసరమైన గణాంకాలు లేకుండా సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని ఎలా సాధించగలం?

ఉండవలసిన ప్రశ్నలు

ఇది ప్రాచీన దేశం. వృత్తుల ఆధారంగా అనేక కులాలు ఉనికిలోకి వచ్చాయి. విభిన్న సముదాయాల స్థితిగతుల్లో చాలా తేడా కనిపిస్తుంది. అర్ధసంచార జాతులు, సంచార జాతులు, డీనోటిఫైడ్ ట్రైబ్స్ అనేకం ఉన్నాయి. వారికి సంబంధించిన గణాంకాలు లేకపోతే, ప్రభుత్వం ప్రణాళికా రచన ఎలా చేయగలదు? అందువల్లనే రాహుల్ గాంధీ తన న్యాయ్ యాత్రలో ఈ విషయాన్ని కచ్చితంగా చెప్పారు. డాటా లేకపోతే వెనుకబాటును నిర్ధారించి రిజర్వేషన్లు కల్పించడం ఎలా సాధ్యం? వెనుకబడిన వర్గాలన్నీ పేదవర్గాలు కాకపోవచ్చు. వారందరికీ రిజర్వేషన్లు అవసరం లేకపోవచ్చు. ఎవరు ఏ స్థితిలో ఉన్నారో గుర్తించాలంటే డాటా కావాలి.

క్లాస్ 1, క్లాస్ 2, క్లాస్ 3, క్లాస్ 4 ఉద్యోగాల్లో ఏ సముదాయం ఎంత శాతం కలిగి ఉంది? రాజ్యాంగంలోని అధికరణ 16 ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాల్లో తగిన ప్రాతినిధ్యం అందరికీ ఉండాలి. రాజకీయ రిజర్వేషన్లు ఇవ్వడం కాని, సామాజిక, ఆర్థిక సంక్షేమ చర్యలు చేపట్టడం కాని ఏది చేయాలన్నా డాటా అవసరం. రాజ్యాంగంలోని అధికరణ 17 ప్రకారం అంటరానితనం నేరం. సమాజంలో ఏదో ఒక రూపంలో అంటరానితనం ఉంది కాబట్టి ఈ సర్వేలో దానికి సంబంధించి ఒక ప్రశ్న ఉండవలసింది.

విద్యాహక్కు అందరికీ ఉంది. కానీ ఎంతమందికి విద్య అందుబాటులో లేదు? అధికరణ 23 హ్యూమన్ ట్రాఫికింగ్‌ను నిషేధిస్తుంది. వెట్టిచాకిరిని నిషేధిస్తుంది. సర్వే జరగకపోతే ఎంత మంది వెట్టిచాకిరిలో ఉన్నారు? అనే వివరాలు ఎలా తెలుస్తాయి. దురదృష్టవశాత్తు ఈ ప్రశ్న కూడా ప్రస్తుత సర్వేలో లేదు. మహానగరాల రెడ్ లైట్ ఏరియాల్లో, ముంబయి, ఢిల్లీ, హైదరాబాద్ వంటి నగరాల్లో ఎంతమంది మగ్గిపోతున్నారు? వెట్టిచాకిరి, హ్యూమన్ ట్రాఫికింగ్,



బాలకార్మికులు వంటి సమస్యలు పరిష్కరించాలంటే డాటా కావాలి.

సంపద కొందరి చేతుల్లోనే పోగుపడరాదు. ఆర్థిక వ్యవస్థ పుంజుకోవాలంటే, సంపదకు సంబంధించిన డాటా ఉండాలి. ఎవరు ఎంత భూమి కలిగి ఉన్నారు? ఎలాంటి వ్యాపారాలు చేస్తున్నారు? ఏ కులం పరిస్థితి ఎలా ఉంది? ఎవరి బ్యాంకు ఎక్కౌంట్లు ఎలా ఉన్నాయి? వంటి ప్రశ్నలకు సమాధానాలు వస్తేనే ఎవరు సంపన్నులు, ఎవరు బాగా బతుకుతున్నారు? ఎవరు ఇతరుల వాటాను కబళిస్తున్నారు? వంటి ప్రశ్నలకు జవాబులు దొరుకుతాయి. అందుకే దోపిడీ శక్తులు కులగణనను వ్యతిరేకిస్తున్నాయి. వ్యతిరేకిస్తున్న వారంతా అగ్రవర్ణాలకు చెందినవారే అన్నది గమనించాలి. దురదృష్టవశాత్తు కొందరు అభివృద్ధి చెందిన వెనుకబడిన కులాలవారు, అభివృద్ధి సాధించిన షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వారు కూడా వ్యతిరేకిస్తున్నారు. ఇది దురదృష్టకరం. ఇది రాజ్యాంగ వ్యతిరేకం, చట్ట విరుద్ధం, సుప్రీం కోర్టు తీర్పులకు విరుద్ధం కూడాను.

ఎందుకు అవసరం?

ఇందిరా సాహ్నీ కేసుతో సహా అనేక కేసుల్లో సుప్రీంకోర్టు ఈ విషయమై స్పష్టమైన నిర్దేశాలు ఇచ్చింది. 1966లో అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రతిపాదించినప్పుడు కోర్టులు ఈ ప్రతిపాదనను డాటా లేనందువల్ల కొట్టేశాయి. సర్వేలు ఏవీ జరగలేదు. మురళీధర్ కమిషన్ విషయంలోనూ ఇదే జరిగింది. మురళీధర్ కమిషన్ ఈ సర్వే నిర్వహించలేదు. డాటా లేదన్న కారణంతో కోర్టులు కమిషన్ సిఫారసులను కొట్టేశాయి. భారతదేశంలో ఇప్పుడు లభిస్తున్న రిజర్వేషన్లకు కారణం బ్రిటిష వారి కాలంలో, 1931లో చేసిన కులగణన. దీని ఆధారంగానే మండల్ కమిషన్ రిపోర్టు ఇవ్వడం జరిగింది. మండల్ కమిషన్ రిపోర్టులో బీసీ జనాభా 52 శాతంగా నిర్ధారించింది. తర్వాత రాష్ట్ర ప్రభుత్వాలు కానీ, కేంద్ర ప్రభుత్వాలు కానీ కులగణన చేయించలేదు. కులగణన అనేది రాజ్యాంగబద్ధమైన అవసరం.

అధికరణ 38 ప్రకారం ప్రభుత్వం సోషల్ ఆర్డర్‌ను కాపాడటం ద్వారా ప్రజాసంక్షేమం కోసం పనిచేయాలి. సామాజిక న్యాయం, ఆర్థిక, రాజకీయ న్యాయాలు సాధించాలి. ఇందులో రాజకీయ న్యాయాన్ని కూడా మరిచిపోరాదు. పురుషులు, మహిళలకు సమానంగా తగిన జీవనోపాధి హక్కు, భౌతిక వనరుల యాజమాన్యం, ఆర్థిక వ్యవస్థ నిర్వహణ ఉత్పత్తి సాధనాల కేంద్రీకరణకు దారి తీయకుండా చూడటం, సమాన పనికి సమాన వేతనం గురించి ప్రభుత్వాలకు నిర్దేశాలున్నాయి.

గణాంకాలతోనే సామాజిక న్యాయం

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల కోసం రాజ్యాంగాన్ని సవరించడం జరిగింది. అదే అధికరణ 243 డి 6. ఈ అధికరణ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించింది. 1992లో ఈ అధికరణను రాజ్యాంగంలో చేర్చారు. దీని ప్రకారం ఎస్సీలు, ఎస్టీలు పంచాయితీల్లో, చైర్‌పర్సన్ల ఎన్నికల్లో తమ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పొందే హక్కు ఉంది. అయితే వెనుకబడిన వర్గాలు రాష్ట్రప్రభుత్వాలు ఇచ్చిన రిజర్వేషన్లు పొందగలరు. అందువల్లనే అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో పంచాయత్ రాజ్ చట్టం 1994 తీసుకువచ్చారు. ఆ విధంగా స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్లు ఇచ్చారు. ఈ రిజర్వేషన్లు 1994 నుంచి గత ఎన్నికలకు ముందు వరకు లభిస్తూ వచ్చాయి. ఆ తర్వాత కేసీఆర్ ప్రభుత్వం ఒక ఆర్డినెన్స్ తీసుకువచ్చింది. సుప్రీంకోర్టు క్యాప్ 50 శాతం ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాత మిగిలిన స్థానాల లభ్యతను బట్టి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించారు. ఇదంతా ఎందుకు జరిగిందంటే కుల సముదాయాల డాటా అందుబాటులో లేకపోవడం వల్లనే. అందువల్లనే కులగణన అవసరం.

సమగ్ర కుటుంబసర్వేలో కానీ, కులగణనలో కానీ ఉన్న ప్రశ్నలు పాతవే. 2011లో జరిగిన సర్వేలో ఉన్న ప్రశ్నలే ఇప్పుడూ అడుగుతున్నారు. అప్పుడు ఎవ్వరు అభ్యంతరాలు చెప్పలేదు. నిజానికి, గణాంకాల చట్టం ఉంది. అధికరణ 342 ఏ (3) ప్రకారం ప్రభుత్వానికి పూర్తి అధికారం ఉంది. శ్రీశ్రీశ్రీ రవిశంకర్ దేశంలో కులగణన జరిగితే తిరుగుబాట్లు జరుగుతాయని మాట్లాడారు. కులగణన జరగకపోతేనే అణగారిన వర్గాలు తిరగబడి అంతర్గత సంఘర్షణ మొదలవుతుంది. కులరహిత వ్యవస్థ ఏర్పడాలంటే కులగణన తప్పనిసరి అవసరం. బడుగు బలహీనవర్గాలు సామాజికంగా కాస్త పైస్థాయికి చేరుకున్నప్పుడే కులాంతర వివాహాలు జరుగుతాయి. ఆ విధంగా కులనిర్మూలన జరుగుతుంది. అందువల్ల అందరూ కులగణనకు సహకరించాలని కోరుతున్నాను. కులగణన సమగ్ర ప్రగతి వికాసాలకు తోడ్పడే మొదటి అడుగు.

వ్యాసకర్త జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

చాచాజీ వేడుక



1963 నవంబర్ 14. ఢిల్లీలోని తాల్ కటోరా గార్డెన్‌లో పది రోజుల పాటు జరిగిన యువజనోత్సవంలో పాల్గొన్న అన్ని విద్యార్థి సంఘాలను నెహ్రూజీ జన్మదిన వేడుకల్లో పాల్గొనేందుకు తీన్ మూర్తి భవన్‌కు ఆహ్వానించారు. మెటల్ డిటెక్టర్ల తనిఖీ లేదు, తడిమి చూడటం లేదు. మేము నేరుగా లోపలికి వెళ్లి ఆయనతో కరచాలనం చేశాం. అది వేరు కాలం. ఇప్పుడు ప్రపంచం మొత్తం అనురక్షితంగా మారిపోయింది. విచారకరం!

– జావేద్ అఖ్తర్, కవి

మరింత ఎత్తుగడ



మణిపుర్‌ది రాజకీయ సమస్య. దీన్ని రాజకీయంగా అత్యున్నత స్థాయిలో పరిష్కరించాలి. మరింత మంది భద్రతా సిబ్బందిని అక్కడికి పంపడం అనేది రాజకీయ బాధ్యత నుండి, రాజకీయ జవాబుదారీతనం నుండి తప్పించుకోవడానికి కేంద్రం వేసిన ఎత్తుగడ మాత్రమే.

– సుశాంత్ సింగ్, కాలమిస్ట్

నాయకులు సిద్ధం



కొత్త తరం: వివేక్ రామస్వామికి 39 ఏళ్లు. ఎలిస్ స్టెఫానిక్ 40. జేడీ వాన్స్ 40. మ్యాట్ గేట్జ్ 42. తులసి గబ్బార్డ్ 43. (అమెరికా) అధ్యక్షుడు ట్రంప్ ఎంపిక ల్లోని అత్యుత్తమ విషయాల్లో ఇదీ ఒకటి. ఆయన అధికార జ్యోతిని యువతరానికి అందజేసేలా చూస్తున్నారు.

– కోర్టీ హోలండ్, ఇంటర్నెట్ పర్సనాలిటీ

భద్రమైన చేతులు



దక్షిణాఫ్రికా కఠినమైన బ్యాటింగ్ పరిస్థితుల్లోనూ తిలక్ వర్మ, అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ పరుగులు సాధించడం విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మకు ఆనందం కలిగిస్తూ ఉండాలి. టీ20 విషయానికి వస్తే, వారు భారత క్రికెట్‌ను సురక్షితమైన చేతుల్లో వదిలేశారు.

– మహమ్మద్ కైఫ్, మాజీ క్రికెటర్

మీరెవరు?



కథకుడి పాఠాలు: మీరు మీ కథను రాస్తున్నప్పుడు కథలో మీరు ఏ పాత్ర అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోవడం మరిచిపోవద్దు.


– శేఖర్ కపూర్, దర్శకుడు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

ఇన్ బాక్స్

ఆదివాసీ పోరాట వీరుడు

గత రెండేళ్ల క్రితం నుంచి నవంబర్ 15 నాడు బిర్సా ముండా జయంతిని 'జన్ జాతీయ గౌరవ్ దివస్'గా పాటిస్తున్నాం. ఇన్నేళ్లకైనా విస్మృత పోరాట యోధుణ్ణి స్మరించుకోవడం ఆనందదాయకం. ఆదివాసీల్లో పోరాట భావాలను రగిలించిన తొలి వీరుడు బిర్సా ముండా. నాటి బెంగాల్ ప్రావిన్స్‌లోని బిహార్ (నేటి జార్ఖండ్)లో ఆదివాసీల రాజ్యాన్ని తేవటానికి సమరశంఖం పూరించాడు. ఆయన తన ఆదివాసీ ప్రజలకు 'రాణి రాజ్యానికి అంతం పలుకుదాం–మన రాజ్యాన్ని స్థాపిద్దాం' అనే నినాదం ఇచ్చాడు. ఈ నినాదం ప్రజలను తిరుగుబాటు వైపుకు నడిపించింది.



బిర్సాముండా

ముండా తెగకు చెందిన సుగుణ, కార్మిహాలు దంపతులకు 1875 నవంబర్ 15న ఛోటానాగపూర్ సమీప చెల్కాడ ప్రాంతంలోని బాబా గ్రామంలో ఆయన జన్మించాడు. ప్రాథమిక విద్యను కొద్ది కాలం అభ్యసించిన తర్వాత ఒక జర్మన్ మిషనరీ స్కూల్లో చేరాడు. ఆ పాఠశాలలో చేరాలంటే క్రైస్తవుడై ఉండాలన్న నిబంధన ఉండడం వల్ల ఆయన మత మార్పిడి చేసుకున్నాడు. అయితే కొన్నేళ్లలోనే స్కూల్ నుంచి బయటికి వచ్చి క్రైస్తవాన్ని త్యజించి తన సొంత ఆదివాసీ ఆచారాలనే ఆచరించడం ప్రారంభించాడు. ఆదివాసీలందరినీ స్థానిక విశ్వాసాలనే అనుసరించమని బోధించాడు. తాను తన జాతీయులను ఉద్ధరించడానికి అవతరించినట్లు ప్రకటించాడు. ఆయన బోధనలు ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ముండా ప్రజలు ఆయన్ని దేవునిగా భావించి 'భగవాన్' అని పిలవడం ప్రారంభించారు. అయితే బిర్సా ముండాను అనుసరించనివారు ఊచకోతకు గురవుతారనే గాలివార్త ప్రచారంలోకి రావడంతో ఆయన్ని బ్రిటిష్‌వాళ్లు ఛోటానాగపూర్ ప్రాంతంలో 1895 ఆగస్టులో అరెస్ట్ చేసి రెండేళ్లకు పైగా జైల్లో ఉంచారు. దీంతో ఆయన విడుదల కోరుతూ జాతీయోద్యమకారులు పెద్దఎత్తున బ్రిటిషర్లపై ఒత్తిడి తెచ్చారు. ప్రభుత్వం ఎట్టకేలకు 1897 నవంబర్‌లో బిర్సాని విడుదల చేసింది.

ఆ రోజుల్లో బ్రిటిష్‌వాళ్లు, వాళ్ల తాబేదార్లు ఆదివాసీల సాగు భూములపై పన్నులు విధిస్తూ... వాటిని కట్టకపోతే ఆ భూములను జమీందారీ భూములుగా మార్చేవారు. దీంతో చాలా మంది ప్రజలు అస్సాంలోని తేయాకు తోటల్లో కూలి పనుల కోసం వలస వెళ్లేవారు. దీన్ని గమనించిన బిర్సా... వన జీవులందరినీ సమావేశపరిచి, బ్రిటిష్‌వాళ్లకు కప్పాలు కట్టవద్దనీ, వాళ్లను తరిమి కొట్టాలనీ పిలుపునిచ్చాడు. అనుచరులతో కలిసి బాణాలు ధరించి 1899 డిసెంబర్‌లో భారీ 'ఉల్‌గులాన్' (తిరుగుబాటు ర్యాలీ) నిర్వహించాడు. ఈ చర్యలను గమనించిన బ్రిటిష్ ప్రభుత్వం కుట్రపన్ని 1900 ఫిబ్రవరి 3న బంధించి రాంచీ జైలుకు తరలించింది. కేసు విచారణలో ఉన్న కాలంలో జూన్ 9న జైల్లోనే ఆయన తుది శ్వాస విడిచాడు. చివరికి 1908లో బిటిష్ ప్రభుత్వం ఆదివాసీల భూములను ఆదివాసీలు కానివారికి బదిలీ చేయడాన్ని నిషేధిస్తూ 'ది ఛోటానాగపూర్ టెనెన్సీ యాక్ట్'ను తీసుకువచ్చింది. అనంతర కాలంలో బిర్సా స్ఫూర్తితో ముండా, ఒరియాన్, సంతాల్ తెగలు తమ హక్కులను సాధించుకున్నాయి.

– గుమ్మడి లక్ష్మీనారాయణ, ఆదివాసీ రచయితల వేదిక వ్యవస్థాపక కార్యదర్శి, తెలంగాణ
(నేడు బిర్సాముండా 150వ జయంతి ప్రారంభం)

ఉద్యోగ కల్పనకు నిర్దిష్ట విధానాలేవీ?

దేశంలోని నిరుద్యోగుల్లో 83 శాతం యువతే ఉన్నారని ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ డెవలప్మెంట్‌లు తాజాగా విడుదల చేసిన 'భారతీయ ఉపాధి నివేదిక–2024' నిగ్గు తేల్చింది. ఉన్నత చదువులు చదివినా తెలంగాణకు చెందిన యువత ఎక్కువగా నిరుద్యోగులుగా ఉంటున్నారని నివేదిక వెల్లడించింది. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ నిరుద్యోగిత నివురుగప్పిన నిప్పులా ఉంటున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాని పరిష్కారంపై దృష్టి సారించకపోవడం సమస్య పరిష్కారంలో అవి చూపుతున్న నిర్లక్ష్యానికి నిదర్శనం.



దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటినా నిరుద్యోగం విలయతాండవం చేస్తోంది. చదువు, ఉపాధి, కుటుంబాల స్థితిగతులను ఉద్యోగిత ప్రభావితం చేస్తోంది. చైనా, జపాన్, ఇజ్రాయెల్, మలేసియా వంటి దేశాలు విద్యావ్యవస్థను ఉపాధికి అనుసంధానం చేసి నిరుద్యోగాన్ని నియంత్రిస్తుండగా... భారత్‌లో భిన్నవైఖరి కనిపిస్తోంది. దేశంలో చదువు ముగిసిన వెంటనే ఉద్యోగాల కల్పన గగనంగా మారింది. ప్రైవేటు సంస్థలు మినహాయిస్తే ప్రభుత్వపరంగా ఆసరా లేకుండాపోతోంది. విశ్వవిద్యాలయాల్లో చదువుకున్న యువతకు మాత్రమే క్యాంపస్ రిక్రూట్మెంట్ లభిస్తోంది. అది కేవలం 0.03 శాతం మాత్రమే. మరోవైపు ఉపాధి రంగాన్ని దేశంలో పట్టించుకోవడం లేదు. స్వయం ఉపాధికి కానీ, ప్రైవేటు రంగంలో ఉపాధికి కానీ ప్రభుత్వాలు దారి చూపడం లేదు. నిరుద్యోగ యువతకు బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి ముందుకు రాకపోవడంతో స్వయం ఉపాధికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు సంస్థల్లో ఉపాధి అవకాశాలున్నా... అవి అరకొర వేతనాలకే పరిమితమవుతున్నాయి. దేశంలో ప్రభుత్వరంగంలో 56 లక్షలకు పైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ఇందులో 20 లక్షలు కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లోనివే. కేంద్రం కానీ, రాష్ట్ర ప్రభుత్వాలు కానీ పదవీ విరమణలు, ఇతర కారణాల వల్ల ఖాళీ అయిన ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయడం లేదు. మరోవైపు శాశ్వత నియామకాలకు బదులు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానాలను దేశంలో అమలు చేస్తున్నారు. వారికి సరైన వేతనాలు ఇవ్వడం లేదు.

దేశంలోని యువతకు ఉద్యోగాలు, ఉపాధి మార్గాలపై కేంద్ర ప్రభుత్వానికి గానీ, రాష్ట్రాలకు గానీ నిర్దిష్ట విధానాలే లేవు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగాల భర్తీకి ప్రత్యేక శాఖలుండాలి. చదువుకున్న వెంటనే ఉద్యోగాల కల్పనకు విధానాలను రూపొందించాలి. బ్రిటిష్ కాలం నాటి విద్యావిధానాన్ని ఇప్పటికీ కొనసాగించడం వల్ల చదువుకున్న వారంతా నిరుద్యోగులుగా మిగులుతున్నారు. తెలంగాణలో 90 శాతం యువత ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌ను ఉపయోగించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వలేకపోతున్నారు. 50 శాతం మంది అటాచ్మెంట్‌తో కూడిన ఈమెయిల్‌ను పంపించలేక పోతున్నారు. ఈ లోపాలను అధిగమించేలా వారికి శిక్షణ ఇవ్వాలి.


చైనా, జపాన్, మలేసియాల మాదిరి చదువుకునే సమయంలోనే అప్రెంటిస్‌షిప్, వృత్తి శిక్షణ ఉండాలి. ఐటీ, ఇతర వృత్తి విద్యాకోర్సులతో పాటు సాధారణ కోర్సులను సైతం ఫలవంతంగా మార్చాలి. సింగపూర్‌లోని ఐటీఐలు ఉపాధి కేంద్రాలుగా ఉన్నాయి. దేశంలోని ఐటీఐలను అలా మార్చాలి. ఉద్యోగాలంటే వైట్ కాలర్‌వి మాత్రమే కాదు. వ్యవసాయం దాని అనుబంధ రంగాల ద్వారా భారీ ఎత్తున ఉపాధి అవకాశాలున్నాయి. దీనికి అవసరమైన మార్గాలను కల్పించాలి. వైద్యరంగంలో విస్తృత అవకాశాలున్నాయి. వాటిని సద్వినియోగం చేసుకోవాలి. సేవారంగం పరిధి విస్తరిస్తోంది. దీనిలోనూ యువతకు పెద్దపీట వేయాలి.

తెలంగాణ ఐటీ, ఔషధ, వైద్యం, పారిశ్రామిక రంగాల్లో పురోగమిస్తోంది. వాటిల్లో పూర్తిస్థాయి ఉద్యోగావకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి. మిగిలిన రంగాల్లోనూ ఉద్యోగాలను భర్తీ చేయాలి. మొక్కుబడిగా కాకుండా తెలంగాణ యువతను ప్రపంచస్థాయిలో తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి.

– డాక్టర్ బి.ఎస్. రావు
బి.ఎస్. రావు ఫౌండేషన్ అధ్యక్షులు । 98668 34717

పుణ్య మాసం

ప్రకృతి తీరుతెన్నులను చురుకుగా పరిశీలించే స్వభావం కలవారికి ఎవరికయినా, కలువపూలు వెన్నెలలో వికసిస్తాయనీ, మనిషి మనసుకూ చందమామకూ సంబంధం ఉంటుందనీ మరొకరు చెప్పవలసిన పని ఉండదు. పున్నమి చంద్రుడిని చూస్తే... సముద్రమే పట్టరాని ఆవేశంతో పొంగిపోతుంది. మనిషి మనసూ అంతే. 'రసమయ జగతిని ఉసిగొలిపే తన మిసమిస'తో నెలరేడు మనుషుల మదులను ఉత్తేజితం చేసి మైమరపిస్తాడు. మనసు పని తీరును తీవ్రతరం చేస్తాడు. కోరిన దిశలో మరింత వేగంగా నడిపిస్తాడు. భోగులను భోగంవైపూ, యోగులను యోగం వైపూ, భావుకులను భావ తీవ్రతవైపూ, ప్రేమికులను ప్రేమ జ్వరం దిశగానూ, భక్తులను అనన్య భక్తి మార్గంలోనూ నడుపుతాడు. 'చంద్రమా మనసో జాతః' చంద్రుడు విరాట్ పురుషుని మనసు నుండి సృష్టి అయినవాడు అని వేదం. అందుకే కాబోలు మనసుకు పున్నమి చంద్రుడంటే అంత వెర్రి ఆకర్షణ.



జ్యోతిర్మయం

అందునా, కార్తీక పూర్ణిమ మరీ అందమైంది. అసలే శరదృతువు. ఆపైన రాతిరి. ఆ పైన పున్నమి. పున్నమి అంటే మామూలు పున్నమి కాదు. పుచ్చ పూవు వెన్నెలల పున్నమి. మనసు చురుకుగా చిందులు వేస్తూ పరవశంతో, రెట్టింపు ఉత్సాహంతో విజృంభించి విహరించే సమయం.

అయితే చిత్త నది 'ఉభయతో వాహిని' అన్నారు. అది 'కల్యాణం' (శుభం) దిశగానూ ప్రవహించగలదు. వినాశం దిశగానూ ప్రవహించగలదు. మనస్సు యజమానిగా ఉండి, ఇంద్రియాలను నియంత్రిస్తే, చిత్త నది సరయిన దిశలో ప్రవహించేందుకు అవి సాయపడతాయి. ఇంద్రియాలు లొక్కెళ్ళినట్టు, మనసు వెళితే ప్రవాహం వినాశం దిశ పడుతుంది.

చిత్త నదిని 'కల్యాణం' దిశగా మళ్ళించే ప్రయత్నాలకు పున్నమి దినాలు అనువైనవనీ, పున్నములలో కార్తీక పూర్ణిమ ఉత్తమోత్తమమనీ భారతీయ సంప్రదాయం. ఈ పుణ్య దినాన చేసిన నదీస్నానాలకూ, తులసి పూజలకూ, జపతప దాన యజ్ఞ హోమాది కర్మలకూ ఫలితాలు ఇబ్బడి ముబ్బడిగా ఉంటాయని నమ్మిక. ప్రాకృతిక కారణాలవల్ల ఈ పర్వదినాన, మనసు మరింత శ్రద్ధా, శుద్ధీ నిలుపుకొనేందుకు సన్నద్ధంగా ఉంటుంది. కాబట్టి ఈనాడు చేసే ఉపవాసాలూ, శివారాధనలూ, ప్రత్యేక దీపారాధనలూ, దీపదానాలూ, ఆలయాలలో ఆకాశ దీప నమస్కారాలూ, జ్వాలా తోరణ దర్శనాలూ వంటి పర్వదిన విధులు, సత్ఫలాలు కాంక్షించే సజ్జనులకు పెద్దలు చూపిన మార్గం.

కార్తీక పూర్ణిమ శుభాకాంక్షలు!!

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** పౌర్ణమి రా.3.04 వరకు, తదుపరి బహుళ పాడ్యమి, **నక్షత్రం:** భరణి రా.10.34 వరకు, తదుపరి కృత్తిక, **వర్జ్యం:** ఉ.9.04 నుండి 10.32 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.23 నుండి 9.11 వరకు తదుపరి ప.12.09 నుండి 12.57 వరకు, **అమృత ఘడియలు:** రా.6.05 నుండి 7.35 వరకు, కార్తీక పౌర్ణమి; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.08, **సూర్యాస్తమయం:** 5.21.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

పారదర్శకంగా భూసేకరణ

- రెండు నెలల్లో లైఫ్ సైన్సెస్ పాలసీ
- ఒకే చోట కాకుండా భిన్న ప్రాంతాల్లో ఫార్మా క్లస్టర్లు
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

మాదాపూర్: పరిశ్రమల కోసం భూసేకరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తామని ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. రాష్ట్రంలో రెండు నెలల్లో లైఫ్ సైన్సెస్ పాలసీని ప్రకటిస్తామని తెలిపారు. ఈ రంగంలో రాష్ట్రంలో కంపెనీలు నెలకొల్పేందుకు ముందుకొచ్చే సంస్థలకు భూ కేటాయింపు, ప్రోత్సాహకాలకు సంబంధించిన విధానాన్ని ఈ పాలసీలో వెల్లడిస్తామని చెప్పారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో గురువారం ఫార్మా, లైఫ్‌సైన్సెస్ రంగంపై నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఒకే చోట కాకుండా పలు ప్రాంతాల్లో ఫార్మా క్లస్టర్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. పది నెలల్లో రాష్ట్రంలో రూ.35,820 కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయని చెప్పారు. 141 దేశీయ, బహుళజాతి కంపెనీలు ఔషధ టీకాలు, లైఫ్ సైన్సెస్, పరిశోధన రంగాల్లో పనులు ప్రారంభించాయని వెల్లడించారు. ఇవన్నీ పూర్తి స్థాయిలో ఉత్పత్తి ప్రారంభిస్తే 51,086 మందికి ప్రత్యక్షంగా, లక్షన్నర మందికి పరోక్షంగా ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. ఫార్మా రంగంలో ఆసియాలోనే మూడో పెద్ద కంపెనీ అయిన టకెడా లైఫ్ సైన్సెస్ హైదరాబాద్‌లోని బయోలాజికల్– ఈ (బీఈ)తో కలిసి ఏటా ఐదుకోట్ల డెంగ్యూ వ్యాక్సిన్లను ఉత్పత్తి చేస్తుందని, వీటిని ప్రపంచమంతా ఎగుమతి చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐటీ పరిశ్రమల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్, లైఫ్ సైన్సెస్ విభాగం డైరెక్టర్ శక్తి నాగప్పన్, టీజీఐఐసీ సీఈఓ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు. చిత్రంలో జయేశ్ రంజన్ తదితరులు

సికింద్రాబాద్–లక్నో మధ్య ప్రత్యేక రైలు

రైల్వేస్టేషన్ (విజయవాడపశ్చిమ): సికింద్రాబాద్–లక్నో మధ్య ప్రత్యేక రైలు నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. సికింద్రాబాద్–లక్నో రైలు (07084) ఈ నెల 15, 22 తేదీల్లో శుక్రవారం రాత్రి 7.05 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి, ఆదివారం సాయంత్రం లక్నో చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు(07083) ఈ నెల 18, 25 తేదీల్లో సోమవారం ఉదయం 9.50 గంటలకు లక్నోలో బయలుదేరి, బుధవారం మధ్యాహ్నం సికింద్రాబాద్ చేరుకుంటుంది.

పసుపు బోర్డును ఏర్పాటు చేయండి

కేంద్రానికి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు లేఖ

సాక్షి, హైదరాబాద్: ప్రధానమంత్రి మోదీ ప్రకటించిన జాతీయ పసుపు బోర్డును నిజామాబాద్ జిల్లాలో ఏర్పాటు చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు ఆయన గురువారం కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. నిజామాబాద్ జిల్లాలో ఏర్పాటు చేసినట్లయితే పసుపు రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అలాగే రాష్ట్రంలో 3,300 ఎకరాలలో కొబ్బరి తోటలు సాగులో ఉన్నాయని, అందులో అత్యధికంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,757 ఎకరాలలో, ఖమ్మం జిల్లాలో 696 ఎకరాలలో కొబ్బరితోటలు సాగులో ఉన్నాయని పేర్కొన్నారు. అందుకోసం భద్రాద్రి కొత్తగూడెంలో ప్రత్యేకంగా రీజనల్ కోకనట్ డెవలప్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరారు. కోకనట్ బోర్డు ద్వారా రాష్ట్రంలోని కొబ్బరి రైతులకు అంతరపంటలు, మిశ్రమ పంటల విషయంలో చీడ పీడల నివారణలో తగిన సాంకేతిక సలహాలు అందించడానికి అవకాశం ఉంటుందన్నారు. తెలంగాణలో ఇప్పటివరకు 91,200 హెక్టార్లలో పామాయిల్ సాగు చేస్తున్నారని, ప్రతి సంవత్సరం 40 వేల హెక్టార్లలో సాగు విస్తీర్ణాన్ని పెంచడానికి ప్రణాళికలు చేస్తున్నామని తెలిపారు.

సర్వేతో పథకాలకు ముప్పులేదు

- మరిన్ని కొత్త పథకాలు అమలుచేస్తాం
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

బంజారాహిల్స్: ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేతో ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపా రు. ఎవరికీ సంక్షేమ పథకాలను రద్దుచేయబోమని భరోసా ఇచ్చారు. అర్హులకు మరిన్ని పథకాలు అమలవుతాయని చెప్పారు. బంజారాహిల్స్ ఎస్‌బీటీనగర్‌లోని ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్స్‌లో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కమిషనర్ స్నేహ శబరీష్‌తో కలిసి గురువారం ఆయన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కుటుంబ సర్వేపై ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దని ప్రజలకు సూచించారు. సర్వే సమాచారం గోప్యంగా ఉంటుందని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రజల స్థితిగతులు తెలుసుకొని పటిష్టమైన భవిష్యత్తు ప్రణాళికల ద్వారా రాష్ట్రంలో మంచి మార్పు తీసుకువచ్చి ఆదర్శ తెలంగాణను ఆవిష్కరించటమే సర్వే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఇప్పటికే 30 శాతం సర్వే పూర్తయ్యిందని తెలిపారు.


సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు..

హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ
4వ అంతస్తు, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్.
బహిరంగ ప్రకటన
ప్రణాళికా శాఖ
ఫైల్ నం.008026/LO/HMDA/1976/SKP/2024
సంగారెడ్డి జిల్లా, కంది మండలం, ఎర్దనూర్ గ్రామంలో సర్వే నం.లు 278/P, 301, 302 & 303లలో 37714.13 చ.మీటర్ల విస్తీర్ణంలో హౌసింగ్‌తో డ్రాఫ్ట్ లేఔట్ ఆమోదం కొరకు M/s. సర్క్ (Sark) ప్రాజెక్ట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీ G. వెంకటేశ్వరరావు గతంలో దరఖాస్తు చేసారు మరియు అది ఫైల్ నం. 056358/SKP/LT/U6/HMDA/22082022, తేదీ: 05-01-2023 ప్రకారం ఈ కార్యాలయం ద్వారా ఆమోదించబడినది.
సంగారెడ్డి జిల్లా, కంది మండలం, ఎర్దనూర్ గ్రామంలో సర్వే నం.లు 278/P, 301, 302 & 303లలోని 37714.09 చ.మీటర్ల విస్తీర్ణంలోని ఖాళీ ప్లాట్లతో రివిజన్ ఆఫ్ డ్రాఫ్ట్ లేఔట్ యొక్క ఆమోదం కొరకు అప్లికేషన్ తేదీ: 19-07-2024 ప్రకారం M/s. సర్క్ (Sark) ప్రాజెక్ట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీ G. వెంకటేశ్వరరావు దరఖాస్తు చేసారు.
అందువలన, సంగారెడ్డి జిల్లా, కంది మండలం, ఎర్దనూర్ గ్రామంలో సర్వే నం.లు 278/P, 301, 302 & 303లలోని సదరు లేఔట్ యొక్క ప్లాట్ యజమానులు/ కొనుగోలుదార్లు/ అగ్రిమెంట్ హోల్డర్లు ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి (15) రోజులలోగా ఈ కార్యాలయానికి వ్రాతపూర్వకంగా తమ అభ్యంతరాలు/ సూచనలు దాఖలు చేయవచ్చును. పైన తెలిపిన కాలంలోగా ఎట్టి అభ్యంతరాలు/ సూచనలు అందనట్లయితే, సంగారెడ్డి జిల్లా, కంది మండలం, ఎర్దనూర్ గ్రామంలో సర్వే నం.లు 278/P, 301, 302 & 303లలోని 37714.09 చ.మీటర్ల విస్తీర్ణంలోని ఖాళీ ప్లాట్లతో రివైజ్డ్ డ్రాఫ్ట్ లేఔట్ యొక్క ఆమోదం కొరకు దరఖాస్తు యొక్క అభ్యర్థన ఈ కార్యాలయం వద్ద లభించే మెటీరియల్ పేపర్స్ ఆధారంగా పరిశీలించబడుతుంది.
సం/- మెట్రోపాలిటన్ కమిషనర్, డైరెక్టర్, ప్లానింగ్-II, HMDA తరఫున
DIPR RO No.6598-PP/CL/Advt/1/2024-25, Dt:14.11.2024

గుండ్లపోచంపల్లి మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం, మేడ్చల్ - మల్కాజ్‌గిరి జిల్లా
ఆసక్తి వ్యక్తీకరణ (EOI)
E1/EOI/703/2024-25, తేది: 13-11-2024
కమిషనర్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ వారు 1) మున్సిపల్ జనరల్ ఫండ్స్ క్రింద గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో స్వచ్ఛ సర్వేక్షణ కార్యక్రమ పత్రాలు తయారీ కొరకు కన్సల్టెన్సీ నియామకం కొరకు పేరొందిన ఏజెన్సీల నుండి ఆసక్తి వ్యక్తీకరణ కోరుచున్నారు మరియు ఆసక్తిగల ఏజెన్సీలు 16-11-2024న మ.02.00 గం.లోగా ఈ కార్యాలయానికి ఆర్థిక ఆఫరుతో పాటు తమ ఆసక్తి వ్యక్తీకరణను పంపాల్సిందిగా మరియు అవసరమైన పత్రాలు దాఖలు చేయాల్సిందిగా కోరబడుచున్నవి. ఆసక్తిగల సంస్థలు 14-11-2024 నుండి గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కార్యాలయం, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా నుండి RFP (ప్రతిపాదన కొరకు అభ్యర్థన) పత్రాన్ని పొందవచ్చు. అర్హతా ప్రమాణాలు: 1) ఏజెన్సీలు స్వచ్ఛ సర్వేక్షణ పనులు/swm/ODF/GFC/Water+ లో ఇదేతరహా అనుభవం కలిగి ఉండాలి. 2) ఏజెన్సీలు ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్స్‌ను కలిగిఉండాలి మరియు ULBsలో పని అనుభవం కలిగి ఉండాలి. బిడ్డర్లు మరిన్ని వివరాల కొరకు కార్యాలయ వేళల్లో కమిషనర్ గారిని సంప్రదించవచ్చు. దరఖాస్తుదారులు RFP దాఖలు చేసే సమయంలో EOI పత్రంతోపాటు గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద చెల్లింపయ్యేలా కమిషనర్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పేరున తీసిన EOI పత్రం ధర నిమిత్తం రూ.5,000/- కొరకు డిమాండ్ డ్రాఫ్ట్ సమర్పించాలి.
సం/- కమిషనర్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ
DIPR RO No.6583-PP/CL/Advt/1/2024-25, Dt: 14.11.2024

హైదరాబాద్ మహానగర నీటి సరఫరా మరియు మురుగునీటి పారుదల మండలి
చీఫ్ జనరల్ మేనేజర్ (Engg) కార్యాలయం, O&M సర్కిల్ నం.V, సైనిక్‌పురి, సికింద్రాబాద్ - 500094
ఇ-టెండరు ప్రకటన
ఇ-టెండరు ప్రకటన నం. & తేది
135 & 136/ CGM(E) /O&MC-V/2024-25, తేది: 12.11.2024
పని పేరు: 1) వైశాలినగర్ సెక్షన్, SD-I, O&M డివిజన్ నం. X(B) పరిధిలో గాంధీ విగ్రహం చంపాపేట్ నుండి చంపాపేట్ క్రాస్ రోడ్ వరకు 450mm dia RCC UGD లైన్‌తో ప్రస్తుతమున్న 300mm dia UGD లైన్ యొక్క రీమోడలింగ్, 2) రామాంతపూర్ సెక్షన్ ఆఫ్ SD-II, O&M డివిజన్ నం. XIV, ఉప్పల్ పరిధిలో ఇం.నం. 3-3-64 నుండి 3-5-66 & 3-5-5/A, ఇందిరానగర్ వరకు 450mm dia RCC సీవర్ మెయిన్ వేయుట.
అంచనా కాంట్రాక్టు విలువ: రూ.48.06 లక్షలు & రూ.57.21 లక్షలు
(1) టెండరు డాక్యుమెంట్ ఆన్‌లైన్‌లో తేది 13.11.2024, సా.5.00 గం. నుండి లభిస్తుంది మరియు టెండర్ల స్వీకరణకు చివరి తేది 27.11.2024. (2) సంబంధిత అధికారి పేరు మరియు చిరునామా - చీఫ్ జనరల్ మేనేజర్ (Engg), O&M సర్కిల్-V, HMWSSB, సైనిక్‌పురి, సికింద్రాబాద్ - 500094. (3) కాంట్రాక్టర్లు/ సంస్థలు సమాచారమును ముఖ్యంగా "ZIP" ఫార్మాట్‌లో అప్‌లోడ్ చేయవలసిందిగా కోరబడుచున్నారు. (4) తదుపరి వివరాలను https://tender.telangana.gov.in లో చూడవచ్చును.
సం/- చీఫ్ జనరల్ మేనేజర్ (Engg), O&M సర్కిల్ నం. V, సైనిక్‌పురి, సికింద్రాబాద్.
కస్టమర్ కేర్ సెంటర్- డయల్: 155313

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ
టెండరు ప్రకటన నం. 03&04/24-25 Sp.No.G-06, G-07, G-08, G-09 & G-10/2024-25
నల్గొండ సర్కిల్‌లో జిల్లా స్టోర్స్ వద్ద ఐరన్ మెటీరియల్స్ ఫ్యాబ్రికేషన్ (టెండరు ప్రకటన నం. 03/2024-25 ఆఫ్ స్పెసిఫికేషన్స్ నం.G-06, G-07, G-08 & G-09) మరియు నల్గొండ సర్కిల్‌లో నల్గొండ డివిజన్, చిట్యాల మండలం, ఏపూర్ 'వై' జంక్షన్ నుండి 33/11KV గుండ్రాంపల్లి SS, గుండ్రాంపల్లి (గ్రా॥) వరకు 1.4 కి.మీ. 33KV లైన్ నెలకొల్పుట (టెండరు ప్రకటన నం. 04/2024-25 ఆఫ్ స్పెసిఫికేషన్ నం. G-10) కొరకు అర్హత గల వెండార్స్ నుండి టెండర్లు కోరబడుచున్నవి. www.tgsouthernpower.com, ఫోన్ నం.9440814343. చివరి తేది: 26.11.2024.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, ఆపరేషన్ సర్కిల్, నల్గొండ
DIPR RO No.6577-PP/CL/Advt/1/2024-25, Dt: 14.11.2024

తెలంగాణ వైద్య, సేవలు మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ
3వ అంతస్తు, DM & HS క్యాంపస్, సుల్తాన్ బజార్, కోఠి, హైదరాబాద్ -95,
ఫోన్ నం.040-40032888, ఇమెయిల్: cetsmsidc@gmail.com
టెండరు ప్రకటన నం. 16/TGMSIDC/CCT/2024-25, తేది: 14-11-2024
"కమిషనర్ ఆఫ్ కమర్షియల్ టాక్సెస్ డిపార్ట్‌మెంట్, తెలంగాణ, హైదరాబాద్ వారి కార్యాలయంలో ఫంక్షనల్ ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికపై ఆఫీస్ బిల్డింగ్ మరియు ఆఫీస్ ప్రిమిసెస్ క్లీనింగ్ సర్వీసెస్ కొరకు ఏజెన్సీ ఎంపిక" చేయుటకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. టెండర్ల దాఖలుకు చివరి తేది: 02-12-2024. ఇతర వివరాలను వెబ్‌సైట్ https://tender.telangana.gov.inలో చూడవచ్చు.
DIPR RO No.6593-PP/CL/Advt/1/2024-25, Dt: 14.11.2024
సం/- మేనేజింగ్ డైరెక్టర్

ANDHRA PRADESH STATE CIVIL SUPPLIES CORPORATION LIMITED
4th and 5th floor, Corp., H.No.10-152/1, Sri Sai Towers, Ashok Nagar, Besides SIRIS Company, Bandar Road, Kanur, Vijayawada-520007. NTR district, Andra Pradesh
TENDER NOTICE (3rd call)
Lr.No.Proc./M2/KMS-2024-25 Dated: 14.11.2024
APPOINTMENT OF REVENUE DISTRICT WISE PADDY – TRANSPORT CONTRACTORS FOR TRANSPORTATION OF PADDY FROM PPCs AT RSKs TO RICE MILLS WITHIN AND OUTSIDE THE DISTRICTS FOR KMS 2024-25 & 2025-26 UNDER ZONE- I,II & III THROUGH NCDEX E MARKETS LIMITED (NEML) AUCTION PLATFORM IN ANDHRA PRADESH.
Those who are interested to participate in tender should be registered with NCDEX e-Markets Ltd. on their website www.neml.in and can contact the Customer Service Group on phone numbers (+91-22) – 48810500/ 9962059599 / 9032429420 or email:askus@neml.in. Last date for online registration and completion of formalities for submitting the online tenders shall be up to 28.11.2024 by 5.00 PM IST. For complete details and to download tender documents at free of cost visit www.apscsd.in and www.neml.in
Sd/- VC & Managing Director

CSIR - INDIAN INSTITUTE OF CHEMICAL TECHNOLOGY
(Council of Scientific & Industrial Research)
Hyderabad - 500007.
WALK-IN-INTERVIEW NOTIFICATION NO. 13/2024
CSIR-IICT, Hyderabad is conducting Walk-in-Interviews on 27th November, 2024 for the positions of Project Staff having qualifications of M.Sc. in (Chemistry / Microbiology / Biotechnology) / B.Tech in Chemical Engineering / M. Pharm / 10th plus ITI in Refrigeration & AC Trade etc.
For full details visit our website www.iictindia.org
Sd/-
Controller of Administration

Atal Pension Yojana

అరవై తరువాత వృద్ధాప్యంలో ఆదాయం - భద్రత, హుందాతనం కొరకు

అటల్ పెన్షన్ యోజనలో **7 కోట్లమంది** చందాదారులు నమోదైనారు


"భారత పౌరులందరూ హుందాగా, సంతోషంగా జీవితం గడిపేందుకు వారికి ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంగా మా ప్రభుత్వం పనిచేస్తోంది."
గౌ॥ శ్రీ నరేంద్ర మోదీ
ప్రధాన మంత్రి



నేడే చేరండి మరియు రెండు ఇతర ప్రయోజనాలతో పాటు జీవితాంతం హామీగల పెన్షన్ పొందండి:-

1 రూ.1000/- లేదా రూ.2000/- లేదా రూ.3000/- లేదా రూ.4000/- లేదా రూ.5000/- హామీగల జీవితాంతం పెన్షన్
2 చందాదారు మరణం తరువాత భాగస్వామికి జీవితాంతం, సమాన పెన్షన్
3 భర్త / భార్య మరణం తరువాత 60 సంవత్సరాల వరకు జమయిన కార్పస్ నామినీకి వాపసు చేయబడుతుంది

మీ వయసు 18 నుండి 40 సంవత్సరాల మధ్య ఉంటే, మీరు అటల్ పెన్షన్ యోజనలో చేరవచ్చును.

నేడే చేరండి, తక్కువ చెల్లించండి	వయసు	పెన్షన్ స్లాబ్ (రూ.)	చెల్లించాల్సిన మొత్తం (రూ.)	పెన్షన్ స్లాబ్ (రూ.)	చెల్లించాల్సిన మొత్తం (రూ.)
	18	1000	నెలకు 42	5000	నెలకు 210
	40	1000	నెలకు 291	5000	నెలకు 1454

APYపై మరింత సమాచారం కొరకు QR కోడ్ స్కాన్ చేయండి
CBC 15113/15/0002/2425
మీ సమీప పోస్టాఫీస్/బ్యాంకును సంప్రదించండి లేదా కాల్ చేయండి 1800 110 069 లేదా దర్శించండి www.pfrda.org.in





స్టిల్‌ఫాంటీన్‌లో నిరుపయోగ గని విహంగవీక్షణ దృశ్యం

దక్షిణాఫ్రికా గనిలో హాహాకారాలు

మూతపడిన బంగారం గనిలో చిక్కుకుపోయిన 4 వేల మంది

ఆహారం, నీరు అందకుండా మోహరించిన పోలీసులు

బయటకు రప్పించి అరెస్టు చేయడానికి ఎత్తుగడ

జోహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాలో బంగారం గనులు అధికంగా ఉన్నాయి. కొన్నిచోట్ల ముడి ఖనిజాన్ని పూర్తిగా తవ్వేసి గనులను మూసివేశారు. ఆయా గనుల్లోకి వెళ్లడం చట్టవిరుద్ధం. కానీ, అక్రమ మైనింగ్‌కు పాల్పడే ముఠాలు మూతపడిన గనులను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. అక్కడ ఇంకా బంగారం ఉంటుందన్న అంచనాతో మనుషులను అందులోకి పంపిస్తున్నాయి. మట్టిని తవ్వేసి బయటకు చేర్చడమే వీరి పని. వారాల తరబడి పని చేయాల్సి ఉంటుంది. ఈ గనుల్లో పని చేయడానికి పొరుగు దేశాల నుంచి కూడా వస్తుంటారు. ఇదంతా పెద్ద మాఫియాగా మారింది. నార్త్‌వెస్ట్ ప్రావిన్స్‌లోని స్టిల్‌ఫాంటీన్ గనిలో ఏకంగా 4 వేల మంది చిక్కుకుపోవడం సంచలనాత్మకంగా మారింది. వీరంతా కొద్ది రోజుల క్రితం గనిలోకి చేరుకున్నారు. ప్రస్తుతం ఆహారం, నీరు, ఇతర సౌకర్యాలు లేక అలమటిస్తున్నట్లు తెలిసింది. అక్రమ మైనింగ్‌కు పాల్పడే వారిని అరెస్టు చేసి, శిక్షించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అధికారులు స్టిల్‌ఫాంటీన్ ప్రాంతంలోని బంగారు గని ప్రవేశ మార్గాలను మూసివేసినట్లు సమాచారం. ఆహారం అందకపోతే వారు చచ్చినట్లు బయటకు వస్తారని, అప్పుడు అదుపులోకి తీసుకుంటామని అధికారులు చెప్పారు. అక్రమ మైనింగ్‌ను అడ్డుకోవడానికి ఇలా కఠినంగా వ్యవహరించక తప్పదని అంటున్నారు. ప్రస్తుతం గని చుట్టూ పోలీసులు మోహరించారు. గనిలోకి చట్టవిరుద్ధంగా ప్రవేశించిన వారికి సహాయం చేసే ఉద్దేశం లేదని దక్షిణాఫ్రికా మంత్రి ఖుమ్‌బుడ్జో షావెనీ స్పష్టంచేశారు. వారంతా నేరానికి పాల్పడ్డారని, శిక్షించక తప్పదని అన్నారు. నేరగాళ్లకు సహాయం ఎందుకు చేయాలని ప్రశ్నించారు. నార్త్‌వెస్ట్ ప్రావిన్స్‌లోని ఇలా వేర్వేరు గనుల్లో గత కొన్ని వారాల వ్యవధిలో వేయి మందికిపైగా కార్మికులు బయటకు వచ్చారు. సరైన ఆహారం అందక వారంతా చాలా బలహీనంగా, అనారోగ్యంతో కనిపించారు.

శాంతి భద్రతల సమస్యలు

దక్షిణాఫ్రికాలో అక్రమ మైనింగ్ ముఠాలతో శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ ముఠాల వద్ద మారణాయుధాలు ఉంటాయి. ఎంతకైనా తెగిస్తారు. అడ్డుకొనేందుకు ప్రయత్నించిన అధికారులపై దాడులకు దిగుతుంటారు. ముఠాల మధ్య ఆధిపత్య పోరుతో రక్తపాతం జరిగిన సందర్భాలున్నాయి. స్థానికులపై దాడులు, మహిళలపై అత్యాచారాలకు పాల్పడడం సర్వసాధారణంగా మారిపోయింది. అందుకే అక్రమ మైనింగ్ ముఠాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది.

ఇంటెలిజెన్స్ డైరెక్టర్‌గా తులసి



నామినేట్ చేసిన ట్రంప్ ● కీలక పోస్ట్‌కు ఎంపికైన తొలి హిందూ అమెరికన్ మహిళ

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల సమరంలో తనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన నేతలకు డొనాల్డ్ ట్రంప్ కీలక పదవుల పట్టం కడుతున్నారు. ఇందులో భాగంగా ట్రంప్ తన నూతన ప్రభుత్వ పాలనావర్గం ఎంపిక ప్రక్రియ జోరు పెంచారు. గతంలో డెమొక్రటిక్ పార్టీ నాయకురాలిగా అత్యంత ప్రజాదరణ పొంది ఇటీవల రిపబ్లికన్ నేత ట్రంప్‌కు పూర్తి మద్దతు పలికిన తులసీ గబార్డ్‌కు కీలక పదవి దక్కింది. అమెరికా నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్‌గా తులసీని ఎంపిక చేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ పదవికి ఎన్నికైన తొలి హిందూ అమెరికన్ మహిళగా తులసీ చరిత్ర సృష్టించారు. ''గత రెండు దశాబ్దాలుగా మన దేశం కోసం, మన అమెరికన్ల స్వేచ్ఛ కోసం తులసి పోరాడారు. గతంలో డెమొక్రటిక్ పార్టీలో పనిచేయడంతో ఈమెకు రెండు పార్టీల్లోనూ మద్దతుంది. రాజ్యాంగ హక్కులను కాపాడుతూ, శాంతిని పరిరక్షిస్తూ ఇంటెలిజెన్స్ విభాగాన్ని ముందుకు నడిపిస్తారని విశ్వసిస్తున్నా' అని ట్రంప్ పొగిడారు.

ఆర్మీలో పనిచేసి, రాజకీయ నాయకురాలిగా ఎదిగి..

అమెరికాలోని టుటూలియా ద్వీపంలోని లీలోలా గ్రామంలో 1981 ఏప్రిల్ 12న తులసి జన్మించారు. 21 ఏళ్ల వయసులో తొలిసారిగా హవాయి రాష్ట్ర రాజకీయాల్లో అడుగుపెట్టారు. 2001లో అమెరికాలో 9/11 సెప్టెంబర్ దాడుల తర్వాత స్వచ్ఛందంగా ఆర్మీ నేషనల్ గార్డ్‌లో చేరారు. 2004లో ఇరాక్ యుద్ధంలో పాల్గొన్నారు. ఆర్మీ రిజర్వ్ ఆఫీసర్‌గా సేవలందించారు. మేజర్‌గా పనిచేసి లెఫ్టినెంట్ కల్నల్‌గా పదోన్నతి పొందారు. 31 ఏళ్ల వయసులో 2012 పార్లమెంట్ ఎన్నికల్లో రెండో హవాయి కాంగ్రెషనల్ జిల్లా నుంచి డెమొక్రటిక్ అభ్యర్థిగా గెలిచి తొలిసారిగా పార్లమెంట్ దిగువ సభకు ఎన్నికయ్యారు. నాలుగు సార్లు పార్లమెంట్‌కు ఎన్నికైన తులసీ 2020లో డెమొక్రటిక్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం బైడెన్‌తో పోటీపడి చివరకు నిష్క్రమించి ఆయనకే మద్దతు పలికారు. తర్వాత 2022లో డెమొక్రటిక్ పార్టీని వీడుతున్నట్లు ప్రకటించారు. అయితే తాజా అధ్యక్ష ఎన్నికల వేళ ట్రంప్ 'అమెరికా ఫస్ట్' విధానాలకు ఆకర్షితురాలై ఆగస్ట్‌లో ట్రంప్ అనుకూల పోస్ట్‌లు పెట్టి మళ్లీ అందరి దృష్టిలో పడ్డారు. అక్టోబర్‌లో రిపబ్లికన్ పార్టీలో చేరారు.

టీనేజీలో హిందువుగా మారి..

తులసి తల్లి ఇండియానా వాసికాగా, తండ్రికి యూరోపియన్ మూలాలున్నాయి. వీళ్లిద్దరికీ భారత్‌తో సంబంధం లేదు. కానీ తులసి తల్లిదండ్రులు 1970వ దశకం నుంచి హిందుత్వాన్ని నమ్ముతున్నారు. అందుకే తమ కుమార్తెకు సంస్కృత పదమైన తులసి అని పేరు పెట్టారు. హిందువుగా పెంచారు. పార్లమెంట్‌లో భగవద్గీత మీదనే ఆమె ప్రమాణంచేశారు. తులసి తండ్రి మైక్ గబార్డ్ సైతం రాజకీయనేతే. ఆయన హవాయ్ సెనేటర్‌గా గతంలో పనిచేశారు.

18 నిఘా సంస్థల సమన్వయంతో రోజూ బ్రీఫింగ్

అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ(సీఐఏ) డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్‌తో కలిసి తులసి నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్‌గా కీలకమైన బాధ్యతలు నెరవేర్చాల్సి ఉంటుంది. 18 ముఖ్యమైన నిఘా సంస్థల నుంచి అనుక్షణం సమాచారం తెప్పించుకుంటూ వాటిని సమన్వయపరచాలి. ప్రతి రోజూ ఉదయాన్నే అధ్యక్షుడు ట్రంప్‌కు తాజా సమాచారంపై బ్రీఫింగ్ ఇవ్వాలి. అమెరికా విదేశాంగ విధానాలను, విదేశాల్లో అమెరికా అతిసైనిక జోక్యాన్ని తప్పుబట్టిన తులసి తాజా పదవిలో ఏమేరకు రాణిస్తారో వేచిచూడాలి.

పేదలను లూటీ చేసిన కాంగ్రెస్

మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ ఆగ్రహం

- కాంగ్రెస్ పాలనలో పేదలకు ఏనాడూ మేలు జరగలేదు
- బడుగు బలహీన వర్గాలు పైకి ఎదిగితే ఆ పార్టీ సహించలేదు
- పేదలను ఎప్పటికీ పేదరికంలో ఉంచాలన్నదే కాంగ్రెస్ ఎజెండా



ముంబై: కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి నిప్పులు చెరిగారు. గరీబీ హటావో అంటూ నినాదం ఇచ్చిన ఆ పార్టీ పేదరికాన్ని నిర్మూలించకుండా పేదలను విచ్చలవిడిగా లూటీ చేసిందని మండిపడ్డారు. బడుగు బలహీన వర్గాలకు జీవితంలో పైకి ఎదగకుండా కుట్రలు చేయడమే కాంగ్రెస్ విధానమని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలనలో పేదలకు ఏనాడూ మేలు జరగలేదన్నారు. ఏదైనా మంచి జరిగితే ప్రజలు సంతోషిస్తారు గానీ కాంగ్రెస్ మాత్రం కళ్లలో నిప్పులు పోసుకుంటుందని విమర్శించారు. ఇతరులకు లబ్ధి చేకూరడం ఆ పార్టీకి ఇష్టం ఉండదన్నారు. గురువారం మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీ నగర్, పాన్వెల్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభల్లో ప్రజలను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. ఓటు బ్యాంకు రాజకీయాలు చేయడంలో కాంగ్రెస్ ఎవరికీ అందనంత దూరం వెళ్లిపోయిందన్నారు. ఆ పార్టీ ముమ్మాటికీ పేదల వ్యతిరేకి అని ఆరోపించారు. పేదలను ఎప్పటికీ పేదరికంలోనే ఉంచాలన్న ఎజెండాతో పని చేస్తోందన్నారు. అధికారంలోకి రానివ్వకుండా కాంగ్రెస్‌ను అడ్డుకోవాల్సిన బాధ్యత పేద ప్రజలపై ఉందని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌లో ఒక తరం తర్వాత మరో తరం నాయకులు పేదరిక నిర్మూలన గురించి నినాదాలు ఇవ్వడం తప్ప ఆ దిశగా వారు చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. వారి బోగస్ నినాదాలను ఎవరూ నమ్మొద్దని కోరారు. ప్రధాని ఇంకా ఏం మాట్లాడారంటే...

స్వరాజ్.. సురాజ్

''దేశానికి స్వాతంత్య్రం వచ్చి 70 ఏళ్లు పూర్తయిన తర్వాత కూడా ఎంతోమంది ప్రజలు కూడు, గూడు, గుడ్డ కోసం పోరాటం సాగించారు. కనీస అవసరాలు తీర్చుకోవడానికి కష్టపడ్డారు. గత పదేళ్లలో ఈ పరిస్థితిలో తొలిసారిగా మార్పు వచ్చింది. మా ప్రభుత్వం చేపట్టిన చర్యలతో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. ఛత్రపతి శివాజీ జన్మించిన మహారాష్ట్ర గడ్డ అంటే నాకెంతో అభిమానం. 2013లో ప్రధానమంత్రి అభ్యర్థిగా నా పేరు ఖరారైన తర్వాత రాయ్‌గఢ్ కోటను సందర్శించా. దేశానికి సేవ చేయాలన్న సంకల్పంతో ఛత్రపతి శివాజీ ఆశీస్సులు స్వీకరించా. స్వరాజ్(స్వపరిపాలన) అనే ప్రతిజ్ఞను శివాజీ మనకు అందించారు. స్వరాజ్‌తోపాటు సురాజ్(సుపరిపాలన) అనే తీర్మానాన్ని మనమంతా ముందుకు తీసుకెళ్లాలి.


రిజర్వేషన్ల వ్యతిరేకి కాంగ్రెస్

ఆర్టికల్ 370ని పునరుద్ధరించడానికి, జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక రాజ్యాంగాన్ని తీసుకురావడానికి కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు కుతంత్రాలు సాగిస్తున్నాయి. ఆర్టికల్ 370 కోసం జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో తీర్మానం చేశారు. జమ్మూకశ్మీర్ మన దేశంలో అంతర్భాగం. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగమే అక్కడ అమలు కావాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు. పాకిస్తాన్ భాషలో మాట్లాడుతున్న కాంగ్రెస్, దాని మిత్రపక్షాలకు మద్దతు ఇవ్వకూడదు. దేశంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల ప్రయోజనం కోసం అమలు చేస్తున్న రిజర్వేషన్లను కాంగ్రెస్ వ్యతిరేకిస్తోంది. అవి దేశ ప్రయోజనాలకు, మెరిట్‌కు వ్యతిరేకమని చెబుతోంది. ఎన్ని దశాబ్దాలు గడిచినా కాంగ్రెస్ మనస్తత్వం మారడం లేదు. అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తామని కాంగ్రెస్ యువరాజు బహిరంగంగా చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను చిన్నచిన్న కులాల పేరిట ముక్కలు చేయాలన్నదే కాంగ్రెస్ లక్ష్యం. ఒక బీసీ నాయకుడు గత పదేళ్లుగా ప్రధానమంత్రిగా కొనసాగుతుండడాన్ని ఆ పార్టీ సహించలేకపోతోంది''. అని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఛత్రపతి శంభాజీ అభిమానులకు, ఔరంగజేబ్ ఆరాధకులకు మధ్య పోరాటం జరుగుతోందని చెప్పారు.

అమెరికా అటార్నీ జనరల్‌గా మ్యాట్ గేజ్ ఎంపిక

వాషింగ్టన్: తనకు అత్యంత విధేయుడిగా పేరొందిన అమెరికా పార్లమెంట్ సభ్యుడు మ్యాట్ గేజ్‌ను తదుపరి అమెరికా అటార్నీ జనరల్‌గా ఎంపికచేశారు. '' ఫ్లోరిడా నుంచి అమెరికా కాంగ్రెస్‌కు సేవలందిస్తున్న మ్యాట్ గేజ్‌ను అటార్నీ జనరల్‌గా నియమించడం గౌరవంగా భావిస్తున్నా. విపక్ష నేతలపైకి న్యాయ వ్యవస్థను ఆయుధంగా వాడే పెడపోకడకు గేజ్ ముగింపు పలుకు తారని భావిస్తున్నా. సరిహద్దులను కాపాడుతూ, నేరముఠాల పనిపట్టి, న్యాయ వ్యవస్థపై అమెరికన్లలో సన్నగిల్లిన నమ్మకాన్ని గేజ్ మళ్లీ పెంచుతారని ఆశిస్తున్నా. జస్టిస్ డిపార్ట్‌మెంట్‌లోని వ్యవస్థాగత అవినీతిని గేజ్ అంతమొందిస్తారు'' అని ట్రంప్ గురువారం ప్రకటించారు. విలియం అండ్ మేరీ కాలేజ్ ఆఫ్ లాలో పట్టభద్రుడైన గేజ్ అమెరికా న్యాయవ్యవస్థలో సంస్కరణ కోరుకునే వ్యక్తిగా పేరొందారు.





నందూర్‌బార్(మహారాష్ట్ర): తాను తరచూ ప్రదర్శించిన ఎరుపురంగు రాజ్యాంగప్రతి అంతా ఖాళీ అంటూ ప్రధాని మోదీసహా అధికార బీజేపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలకు లోక్‌సభలో విపక్ష నేత గట్టి సమాధానమిచ్చారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం నందూర్‌బాగ్ పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో

ఏమీ ఉండదనే చదవలేదనుకుంటా

అందుకే మోదీ రాజ్యాంగ ప్రతిలో ఏమీ లేదంటున్నారు ● 'తెల్లకాగితాలు' వ్యాఖ్యలను తిప్పికొట్టిన రాహుల్ గాంధీ

రాహుల్ ప్రసంగిస్తూ ప్రధానిపై విమర్శలు గుప్పించారు. '' రాజ్యాంగ ప్రతి కవర్ ఎరుపు రంగులో ఉందా నీలం రంగులో ఉందా అనేది మనం ఎప్పుడూ చూడలేదు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రాణాలు ఇచ్చేందుకైనా సిద్ధపడ్డాం. ఇంతటి ఘనత గల రాజ్యాంగంలో ఏమీ లేదని, ఏమీ ఉండదని ప్రధాని మోదీజీకి గట్టి నమ్మకం కల్గిందేమో. ఎందుకంటే జీవితంలో ఆయన ఎప్పుడూ ఈ రాజ్యాంగాన్ని చదివిఉండరు. ఏమీ ఉండదనే చదవలేదనుకుంటా. అందుకే నేను ర్యాలీల్లో చూపించే ఎరుపురంగు రాజ్యాంగప్రతి లోపల అన్నీ తెల్లపేజీలే అని చెబుతున్నారు. మోదీజీ ఇది ఖాళీ పుస్తకం కాదు. భారతీయ ఆత్మ, జ్ఞానానికి ఆలవాలం ఈ పుస్తకం. బిర్సా ముండా, బుద్ధుడు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా పూలే, మహాత్మాగాంధీల ఆత్మతో భారత రాజ్యాంగం నిండి ఉంది. అయినాసరే మీరు ఈ పుస్తకం ఖాళీ అని అంటున్నారంటే మీరు వీళ్లందరినీ అవమానిస్తున్నట్లే'' అని రాహుల్ అన్నారు. '' ఆదివాసీలు, దళితులు, వెనుకబడిన వర్గాలకు నిర్ణయాధికారం దక్కాలి కాంగ్రెస్ పార్టీ ఆశిస్తోంది. బీజేపీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌లు గిరిజనులను ఆదివాసీలు అని సంబోధించకుండా వనవాసులు అని పిలుస్తున్నారు. నీరు, భూమి, అడవిపై తొలి హక్కుదారులు ఆదివాసీలే. ఎలాంటి హక్కులు కల్పించకుండా బీజేపీ ఆదివాసీలను అడవికి పరిమితం చేసింది. బిర్సా ముండా ఇవే హక్కుల కోసం పోరాడి వీరమరణం పొందారు'' అని రాహుల్ అన్నారు.

మేనిఫెస్టోను ప్రస్తావించిన రాహుల్

''మహారాష్ట్రలో విపక్ష మహా వికాస్ అఘాడీ (ఎంబీఏ) జనప్రయోజన వాగ్దానాలతో మేనిఫెస్టోను మీ ముందుకు తెచ్చింది. అధికారంలోకి వస్తే మా కూటమి సర్కార్ రైతులు, యువతకు నెలకు రూ.3,000 ఆర్థిక తోడ్పాటు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రూ.3,00,000 దాకా రుణమాఫీ, నిరుద్యోగయువతకు నెలకు రూ.4,000 నిరుద్యోగ భృతి అందించనుంది. దళితులు, వెనుకబడిన వర్గాలు, ఆదివాసీల అసలైన జనసంఖ్య తెలిస్తే వారికి ఆ మేరకు వనరుల్లో న్యాయమైన వాటా దక్కుతుంది. అందుకు జనగణన ఎంతగానో దోహదపడనుంది. ప్రస్తుతం 80 శాతం గిరిజనుల జనాభాలో నిర్ణాయాత్మక స్థాయిలో కేవలం ఒక శాతం మంది మాత్రమే ఉన్నారు'' అని అన్నారు.

ఒక్కరే ఆదివాసీ ఆఫీసర్

''కేంద్ర ప్రభుత్వంలో అత్యున్నత ఉన్నతాధికారులు 90 మంది ఉంటే వారిలో ఆదివాసీ వ్యక్తి ఒక్కరే ఉన్నారు. ఉదాహరణకు ఈ 90 మంది అధికారులు రూ.100 విలువైన ప్రజాపనులపై నిర్ణయాలు తీసుకుంటే ఆదివాసీ అధికారి నిర్ణయంపై ఆధారపడే పనుల విలువ కేవలం 10 పైసలు. మొత్తంగా చూస్తే పనిచేసే ఆ కొద్ది మంది ఆదివాసీ అధికారులను కీలకమైన శాఖల్లో ఉండనివ్వరు. అప్రాధాన్యమైన విభాగాల్లో, పోస్టుల్లో నియమిస్తున్నారు. ఈ పద్ధతి మారాలి. మనం ఈ పద్ధతిని మారుద్దాం'' అని రాహుల్ అన్నారు.

ఢిల్లీ మేయర్‌గా మహేశ్ కిచీ ఎన్నిక



న్యూఢిల్లీ: మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ(ఎంసీడీ) మేయర్‌గా ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) సీనియర్ నేత, దళిత అభ్యర్థి మహేశ్ కిచీ ఎన్నికయ్యారు. మేయర్ ఎన్నికల్లో గురువారం ఓట్ల లెక్కింపు చేపట్టారు. మహేశ్‌కు 133 ఓట్లు, బీజేపీ అభ్యర్థి కిషన్‌లాల్‌కు 130 ఓట్లు లభించాయి. కేవలం 3 ఓట్లతో మహేశ్ విజయం సాధించారు. మేయర్ ఎన్నికల్లో ఓటమి ఎదురుకావడంతో డిప్యూటీ మేయర్ ఎన్నిక నుంచి బీజేపీ విరమించుకుంది. దాంతో ఆప్ నేత రవీందర్ భరద్వాజ్ డిప్యూటీ మేయర్‌గా ఎన్నికయ్యారు. ఢిల్లీలో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి.

దిగువసభపై పట్టుసాధించిన రిపబ్లికన్ పార్టీ

వాషింగ్టన్: అమెరికా పార్లమెంట్ ఎన్నికల ఫలితాల లెక్కింపు తాజా గణాంకాల ప్రకారం దిగువసభపై ట్రంప్ సారథ్యంలోని రిపబ్లికన్ పార్టీ పట్టుసాధించింది. బుధవారం తెల్లవారు జామున కాలిఫోర్నియా లోని మరోచోట గెలవగా తాజాగా అరిజోనాలో మరో స్థానంలో గెలవడంతో రిపబ్లికన్లు ఇప్పటిదాకా గెల్చిన సీట్ల సంఖ్య 218కి పెరిగింది. కమలా హారిస్ నేతృత్వంలోని డెమొక్రటిక్ పార్టీ కేవలం 208 చోట్ల మాత్రమే విజయం సాధించింది. దిగువసభలో మొత్తం 435 స్థానాలు ఉండగా ఇంకా 9 స్థానాల్లో ఫలితాలు వెల్లడికావాల్సి ఉంది. పార్లమెంట్ ఎగువ సభ అయిన సెనేట్‌లోనూ ఇటీవలి ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ ఆధిక్యత సాధించింది. ఎగువ, దిగువ సభల్లో ఆధిక్యత కారణంగా త్వరలో ట్రంప్ ప్రభుత్వం తీసుకొచ్చే నూతన చట్టాలకు ఎలాంటి అవాంతరాలులేకుండా సులభంగా ఆమోదముద్ర పడనుంది.

చెన్నైలో ఇద్దరు డాక్టర్లపై దాడి



చెన్నై: తమిళనాడు రాజధాని చెన్నైలో వైద్యులపై దాడుల పరంపర కొనసాగుతూనే ఉంది. బుధవారం చెన్నై ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ హరిహరన్‌పై దాడి జరిగింది. భరత్ అనే రోగి ఆయనపై దాడికి పాల్పడ్డాడు. హరిహరన్ స్టాన్లీ మెడికల్ కాలేజీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైకాలజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. నిందితుడు భరత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హరిహరన్ పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని డాక్టర్లు చెప్పారు. బుధవారం ఉదయం చెన్నై ప్రభుత్వ ఆసుపత్రిలో సీనియర్ అంకాలిస్టు డాక్టర్ బాలాజీపై ఓ రోగి కుమారుడు కత్తితో దాడి చేశాడు. ఏడుసార్లు పొడవడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాలాజీకి వైద్యులు చికిత్స కొనసాగిస్తున్నారు. ఆయనకు ప్రాణాపాయం తప్పినట్లు తెలుస్తోంది. ఒకే రోజు ఇద్దరు డాక్టర్లపై దాడి జరగడం తమిళనాడులో సంచలనం సృష్టించింది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్యులు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు దిగారు.

ఒకే షిఫ్టులో పీసీఎస్ ప్రిలిమినరీ పరీక్ష

ప్రయాగ్‌రాజ్: ప్రావిన్షియల్ సివిల్ సర్వీసెస్(పీసీఎస్) ప్రిలిమినరీ పరీక్ష-2024 వ్యవహారం తీవ్ర అలజడి సృష్టించింది. ఈ పరీక్షను ఒకే రోజు కాకుండా వేర్వేరు రోజుల్లో వేర్వేరు షిఫ్టుల్లో నిర్వహించాలని ఉత్తరప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్(యూపీపీఎస్సీ) నిర్ణయించడంపై అభ్యర్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కమిషన్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. వారిని అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. పరీక్షను పాత విధానంలోనే ఒకే రోజు ఒకే షిఫ్టులో నిర్వహించాలని అభ్యర్థులు డిమాండ్ చేశారు. దీనిపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పందించారు. పాత విధానంలోనే పరీక్షలు నిర్వహించాలంటూ యూపీపీఎస్సీ అధికారులను ఆదేశించారు. దీంతో యూపీపీఎస్సీ వెనక్కి తగ్గింది. పీసీఎస్ ప్రిలిమినరీ పరీక్షను ఒకే రోజు ఒకే షిఫ్ట్‌లో నిర్వహించనున్నట్లు ప్రకటించింది. అలాగే రివ్యూ ఆఫీసర్(ఆర్ఓ), అసిస్టెంట్ రివ్యూ ఆఫీసర్(ఏఆర్ఓ) పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు తెలియజేసింది.

మోదీకి డొమినికా జాతీయ పురస్కారం

న్యూఢిల్లీ: కోవిడ్ మహమ్మారి విజృంభించి దేశాన్ని కలావికలం చేస్తున్న వేళ భారత్ అందించిన ఆపన్నహస్తంతో తెరిపినపడిన డొమినికా దేశం తన కృతజ్ఞత చాటుకునేందుకు సిద్ధపడింది. ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం చేసిన సాయానికి గుర్తుగా మోదీకి 'ది డొమినికా అవార్డ్ ఆఫ్ హానర్'ను ప్రదానం చేయనున్నట్లు ది కామన్వెల్త్ ఆఫ్ డొమినికా గురువారం ప్రకటించింది. భారత ప్రభుత్వ ఉదార గుణాన్ని స్మరించుకుంటూ ఆ దేశ ప్రధాని హోదాలో ఉన్న మోదీకి తమ దేశ అత్యున్నత జాతీయ పురస్కారాన్ని ఇవ్వనున్నట్లు డొమినికన్ ప్రధాని కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. గయానాలోని జార్జ్‌టౌన్ పట్టణంలో నవంబర్ 19 నుంచి 21వ తేదీదాకా జరిగే ఇండియా-కరికోమ్ శిఖరాగ్ర సదస్సులో మోదీకి ఈ అవార్డ్‌ను అందజేస్తారు. ''2021 ఫిబ్రవరిలో ప్రధాని మోదీ ఆదేశాలతో భారతసర్కార్ మాకు 70,000 డోసుల ఆస్ట్రాజెనికా కోవిడ్19 వ్యాక్సిన్లు అందించింది. మా స్థాయికి అది పెద్ద సాయం కావడంతో వాటిలో కొన్నింటిని మా పొరుగు దేశాలకూ సాయంగా అందించగలిగాం. ఆరోగ్యం, వైద్యం, సమాచార సాంకేతిక రంగాల్లోనూ భారత్ మాకు ఎంతో సాయపడింది. అంతర్జాతీయ స్థాయిలో వాతావరణమార్పు నిరోధక చర్యలు చేపట్టడం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకను గుణంగా ముందడుగు వేయడంలో మాకు వెన్నంటి నిలిచింది'' అని ఆ దేశ ప్రధాని కార్యాలయం కొనియాడింది.

ఊపిరాడని రాజధాని

న్యూఢిల్లీని ముంచెత్తిన వాయుకాలుష్యం, పొగమంచు

- దారుణంగా పడిపోయిన వాయునాణ్యత
- ఢిల్లీలోని జహంగీర్‌పురీలో 500 దాటిన ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్
- విమానాలు, రైళ్ల రాకపోకలపై ప్రభావం
- ఆన్‌లైన్ మోడ్‌లోకి ఢిల్లీ ప్రైమరీ స్కూల్ క్లాసులు



ఢిల్లీలో గురువారం దట్టంగా అలుముకున్న కాలుష్యం, పొగమంచు

సాక్షి, న్యూఢిల్లీ: అత్యల్ప ఉష్ణోగ్రతలకు దట్టంగా కమ్ముకున్న వాయుకాలుష్యం తోడవడంతో న్యూఢిల్లీలో గాలి గరళంగా మారుతోంది. రోజు రోజుకూ వాయు నాణ్యత క్షీణిస్తోంది. కేంద్ర వాతావరణ కాలుష్యనియంత్రణ మండలి గణాంకాల ప్రకారం విపరీతమైన వాయు కాలుష్యాన్ని సూచించే వాయునాణ్యతా సూచీ(ఏక్యూఐ) ఢిల్లీలో ఏకంగా 500 దాటింది. గురువారం ఢిల్లీలో 32 ప్రాంతాల్లో వాయుకాలుష్యం తీవ్రస్థాయికి చేరింది. గురువారం ఢిల్లీవ్యాప్తంగా సగటున ఏక్యూఐ 428 కాగా జహంగీర్‌పురీలో 567, ఆనంద్‌విహార్, పంజాబీ బాగ్‌ల్లో 465గా నమోదైంది. ఢిల్లీలో గురువారం ఉష్ణోగ్రత కేవలం 16.1 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది. శీతాకాలం కావడంతో జనాలకు రోడ్లపై వెళ్తుంటే ముందు ఏముందో కనిపించనంతగా దట్టంగా పొగమంచు కమ్ముకుంది. దట్టమైన పొగ కారణంగా ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి 300లకు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. 10 విమానాలను దారిమళ్లించారు. రన్‌వేపై 400 మీటర్ల తర్వాత ఏముందో కనిపించనంతగా దృశ్యగోచరత(విజిబిలిటీ) తగ్గిపోయింది. దీనికారణంగా విమానాల టేకాఫ్, ల్యాండింగ్ చాలా కష్టంగా మారింది. దీంతో మీరు ప్రయాణించబోయే విమానాల రాకపోకలకు సంబంధించిన తాజా సమాచారాన్ని సంబంధిత ఎయిర్‌లైన్స్ నుంచి ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం గురువారం తన 'ఎక్స్' ఖాతా ద్వారా ప్రయాణికులకు సూచించింది. పలు రైళ్ల రాకపోకలపైనా పొగమంచు, వాయుకాలుష్యం ప్రభావం పడింది. వాయునాణ్యత దారుణంగా పడిపోవడంతో ఢిల్లీవ్యాప్తంగా ఏక్యూఐను ఇంకా మూడో 'తీవ్రం' కేటగిరీలోనూ కొనసాగిస్తున్నారు.

గ్రాప్-3 నిబంధనలు అమల్లోకి

వాయుకాలుష్యం విపరీతంగా పెరగడంతో కట్టడి చర్యల్లో భాగంగా గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్(గ్రాప్)-3 నియమనిబంధనలను కాలుష్య నియంత్రణ మండలి అమల్లోకి తెచ్చింది. శుక్రవారం నుంచి ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో వీటిని కఠినంగా అమలుచేస్తామని వాయునాణ్యతా నిర్వహణ కమిషన్(సీఏక్యూఎం) గురువారం తెలిపింది. విద్యుత్, సీఎన్‌జీ, భారత్-6 ప్రమాణాల డీజిల్ బస్సులు మినహా ఇతర అంతర్రాష్ట బస్సులను ఎన్‌సీఆర్ రాష్ట్రాల నుంచి ఢిల్లీలోకి అనుమతించబోరు. నిర్మాణ, కూల్చివేత కార్యకలాపాలపై నిషేధం అమల్లో ఉంటుంది. గనుల తవ్వకాన్నీ ఆపేస్తారు. ఢిల్లీసహా గురుగ్రామ్, ఫరీదాబాద్, ఘజియాబాద్, గౌతమ్‌బుద్ధ్ నగర్ జిల్లాల్లో భారత్-3, భారత్-4 ప్రమాణాల డీజిల్ వాహనాల రాకపోకలను నిషేధించారు. అత్యధిక రద్దీ సమయాల్లో రోడ్లపై నీటిని చిలకరించనున్నారు. ఎవరికి వారు బైకులు, సొంత కార్లలో కాకుండా ప్రజారవాణా వ్యవస్థను వాడుకోవాలని సీఏక్యూఎం సూచించింది. ప్రైమరీ పాఠశాల విద్యార్థుల ఆరోగ్యంతో పాటు తరగతులను కోల్పోకూడదనే ఉద్దేశంతో ఐదోతరగతి వరకు ప్రైమరీ పాఠశాల క్లాసులను ఆన్‌లైన్‌లో చేపట్టాల్సి ఉంటుందని ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశి చెప్పారు.

ఎంత ఉంటే ఎలా వర్గీకరిస్తారు

పాయింట్లు	వాయునాణ్యత
0 నుంచి 50	బాగుంది
51 నుంచి 100	సంతృప్తికరం
101 నుంచి 200	మధ్యస్తం
201 నుంచి 300	బాగోలేదు
301 నుంచి 400	అస్సలు బాగోలేదు
401 నుంచి 450	తీవ్రం
450కంటే ఎక్కువ	అత్యంత తీవ్రం

ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ఏక్యూఐ

జహంగీర్‌పురీ	567పాయింట్లు
పట్‌పర్‌గంజ్	472
వజీర్‌పూర్	467
ఆనంద్‌విహార్	465
పంజాబీ బాగ్	465
ఆర్‌కే పురం	457
రోహిణి	453
సోనియా విహార్	448
షాదీపూర్	430

సాక్షి
హైదరాబాద్
శుక్రవారం । 15 । నవంబర్ । 2024



రూ.30 కోట్లయినా రాలేదు!
గడచిన పదేళ్లలో బల్దియాకు రాష్ట్ర బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించలేదు. ఈ ఆర్థిక సంవత్సరం రూ.30 కోట్లు కూడా విడుదల చేయలేదని తెలుస్తోంది. -10లో



ఒత్తయిన జుట్టు.. ఒత్తిడితో ఫట్టు
ఆధునిక సాంకేతిక మార్పులతో పాటు నగర వాసుల జీవన శైలి మార్పులు కూడా హెయిర్‌కు టెర్రర్‌గా మారుతున్నాయి. సిటీజనుల కేశ సంపదను కొల్లగొడుతున్నాయి. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
32.0/22.0
నగరంలో శుక్రవారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉదయం పొగమంచు వాతావరణం ఉంటుంది. గరిష్టంగా 32, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

సందడిగా చిల్డ్రన్స్ డే


థ్యాంక్యూ సీఎం అంటూ విద్యార్థినుల ప్లకార్డుల ప్రదర్శన

నగరంలోని లాల్ బహదూర్ స్టేడియంలో గురువారం చిల్డ్రన్స్ డే ఉత్సవాలు సంబరంగా జరిగాయి. వేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎస్ శాంతికుమారి తదితరులు హాజరయ్యారు. బాలల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి.


వివిధ వేషధారణల్లో చిన్నారుల సందడి


చిన్నారులతో సీఎం కరచాలనం

ఆన్‌లైన్ గేమ్స్‌కు యువకుడి బలి

మియాపూర్: ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటుపడి అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య పాల్పడిన ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మాణిక్యం తెలిపిన వివరాల ప్రకారం.. ఝార్ఖండ్ రాష్ట్రం కమలాపూర్ జిల్లాకు చెందిన జిహూర్ గోరి (25) తన స్నేహితుడు అవని గోరితో కలిసి మియాపూర్ ఓల్డ్ హాఫీజ్‌పేటలో ఉంటున్నాడు. స్థానికంగా ఉన్న ఓ హోటల్‌లో పని చేస్తున్నాడు. కొంతకాలంగా జిహూర్ ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజాము వరకూ ఆన్‌లైన్ గేమ్ ఆడి రూ.20 వేలు పోగొట్టుకున్నాడు. అంతేకాకుండా గతంలో చేసిన అప్పులు భారీగా పెరిగిపోయాయి. అప్పులు ఎలా తీర్చాలో అర్థం కాని జిహూర్ ఆత్మహత్యే శరణ్యమనుకున్నాడు. హాఫీజ్‌పేట్‌లోని డబుల్ బెడ్రూం భవన సముదాయం సమీపంలోని ఓ చెట్టుకు చీరతో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. స్థానికులు చూసి మియాపూర్ పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అవని గోరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

మీరాలం చెరువుపై కేబుల్ బ్రిడ్జి

2.65 కి.మీ. పొడవునా నాలుగు లేన్లతో వంతెన నిర్మాణం

- బెంగళూరు హైవే-చింతల్ మేట్ రోడ్డును కలుపుతూ..
- పర్యాటక కేంద్రాలుగా మీరాలం, జూ పార్క్ ప్రాంతాలు
- సుమారు వెయ్యి ఎకరాల్లో అభివృద్ధికి ఎంఆర్‌డీసీఎల్ ప్రణాళిక
- డీపీఆర్ బాధ్యత సింగపూర్ సంస్థ మెన్‌హార్ట్‌కు అప్పగింత
- తొలి దశలో బాపూఘాట్, ఆ తర్వాత మీరాలం అభివృద్ధి పనులు

సాక్షి, సిటీబ్యూరో: దుర్గం చెరువు తరహాలో నగరంలో రెండో కేబుల్ బ్రిడ్జి అందుబాటులోకి రానుంది. 2.65 కిలోమీటర్ల పొడవునా నాలుగు లేన్ల ఐకానిక్ బ్రిడ్జి నిర్మించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. ప్రతిపాదిత ఈ వంతెన హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారి (ఎన్‌హెచ్-44) వైపు నుంచి చింతల్‌మెట్ మీదుగా పీవీ ఎక్స్‌ప్రెస్ వేను కలుపుతుంది. గతంలో రూ.363 కోట్ల నిర్మాణ వ్యయంతో మీరాలం చెరువు మీద హైలెవల్ బ్రిడ్జిని నిర్మించాలని హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) నిర్ణయించింది. ఈ మేరకు గత మార్చిలో నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా ఈ వారధి స్థానే.. ఐకానిక్ కేబుల్ బ్రిడ్జిని నిర్మించాలని అధికారులతో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో సీఎం నిర్ణయించారు. ఆయా బాధ్యతలను హెచ్‌ఎండీఏ నుంచి మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్)కు బదిలీ చేశారు.

పర్యాటక కేంద్రాలుగా మీరాలం, జూపార్క్..

మీరాలం చెరువు, నెహ్రూ జంతు ప్రదర్శనశాల పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చెందనున్నాయి. 600 ఎకరాల్లోని మీరాలం, 380 ఎకరాల్లోని జూ పార్క్ రెండు కలిపి సుమారు వెయ్యి ఎకరాలను అభివృద్ధి చేసేందుకు అధికారులు సమీకృత ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ఈ రెండు ప్రాంతాలను కలుపుతూ వ్యూ డెక్, స్కైవాక్‌తో వంతెనను నిర్మించనున్నారు. వాకింగ్, సైకిల్ ట్రాక్‌లతో పాటు గ్రీనరీ, లేక్‌ఫ్రంట్ అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. తద్వారా సందర్శకుల తాకిడి పెరుగుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. మీరాలం చెరువు నీరు జూ తూముల ద్వారా జూపార్కులోని మూడు చెరువుల మీదుగా ముందుకు సాగి..నాలా ద్వారా మూసీలో కలుస్తుంది. ఈ నేపథ్యంలో ఈ నీటిని శుద్ధీకరించి మూసీలోకి వదలాలని భావిస్తోంది.

ముందు బాపూఘాట్.. తర్వాత మీరాలం..

కాలుష్య కాసారాలుగా మిగిలిపోయిన మూసీ నది, మీరాలం చెరువులను సుందరీకరించడంతో పాటు పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. తొలి దశలో బాపూఘాట్ వద్ద మూసీ నది అభివృద్ధి పనులను, ఆ తర్వాత మీరాలం చెరువు అభివృద్ధికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. సరస్సు సుందరీకరణతో పాటు పార్కింగ్, రోడ్ల అనుసంధానం, లైటింగ్, రిటైల్ అవుట్‌లెట్లు తదితర మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు. ఆయా అభివృద్ధి పనుల కోసం అవసరమైన భూములను ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) రూపంలో సమీకరించనున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ డీపీఆర్ పనులను సింగపూర్ కన్సార్టియం మెన్‌హార్ట్ సంస్థకు అప్పగించారు. ఫైనాన్సింగ్, నిర్మాణం, సౌకర్యాల నిర్వహణ అన్నీ బాధ్యతలు ఈ సంస్థదే.

ఐలాండ్స్‌లో టవర్లు

మీరాలం ట్యాంకులో సహజసిద్ధమైన రెండు దీవులు (ఐలాండ్స్) ఉన్నాయి. ఒకటి 5 ఎకరాలు, మరొకటి 2.5 ఎకరాల విస్తీర్ణంలో ఇవీ ఉన్నాయి. గతంలో ఇక్కడకు వెళ్లేందుకు పర్యాటక శాఖ బోటింగ్‌లను నిర్వహించేది. తాజాగా ఈ ఐలాండ్స్‌లో టవర్లను నిర్మించాలని తద్వారా పాతబస్తీకి పర్యాటక శోభ తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది.


మీరాలం చెరువుపై ప్రతిపాదిత కేబుల్ బ్రిడ్జి నమూనా

‘చర్లపల్లి’కి గ్రహణం వీడేనా!

నవంబర్‌లోనే టెర్మినల్‌ను ప్రారంభిస్తామన్న కేంద్రమంత్రి

పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాని రోడ్లు
- కనెక్టివిటీకి కటకట.. నత్తనడకన సాగుతున్న నిర్మాణాలు
- సమస్యగా మారిన మౌలిక సదుపాయాల ఏర్పాట్లు
- ప్రధానితో ఈ నెలలోనే ప్రారంభించేందుకు సన్నాహాలు

సాక్షి, సిటీబ్యూరో: చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు గ్రహణం వీడటం లేదు. పనులు పూర్తయి నెలలు గడిచినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. స్టేషన్‌కు రాకపోకలు సాగించేందుకు చేపట్టిన అనుబంధ రహదారుల పనుల్లో జాప్యం కారణంగా ప్రారంభం ఆలస్యమవుతున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నెలలోనే చర్లపల్లి టెర్మినల్‌కు ప్రయాణికులకు అందుబాటులోకి తేనున్నట్లు ఇటీవల కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సైతం తెలిపారు. కానీ ఆ దిశగా ఇప్పటి వరకు దక్షిణమధ్య రైల్వే ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో నవంబర్‌లో చర్లపల్లి ప్రారంభంపై సందిగ్ధం నెలకొంది. ఒకవైపు అనుబంధ రోడ్ల నిర్మాణ పనుల దృష్ట్యా ఆలస్యమవుతుండగా, మరోవైపు ప్రధాని మోదీ చేతుల మీదుగా చర్లపల్లి టెర్మినల్‌ను ప్రారంభించాలని భావిస్తున్నారు. దీంతో ప్రధాని అపాయింట్‌మెంట్ కోసం కూడా ఎదురు చూస్తున్నట్లు అధికారులు తెలిపారు. గత లోక్‌సభ ఎన్నికల నాటికే టెర్మినల్ ప్రాజెక్టు పూర్తయింది. ఎంఎంటీఎస్ రైళ్ల రాకపోకలకు కూడా రెండోదశ లైన్‌లు అందుబాటులోకి వచ్చాయి. కానీ ప్రయాణికులు స్టేషన్‌కు నలువైపులా రోడ్డు మార్గాల్లో చేరుకొనేందుకు అనుకూలమైన మౌలిక సదుపాయాలు లేకపోవడం సమస్యగా మారింది.



సికింద్రాబాద్ స్టేషన్‌పై ఒత్తిడి..
- సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి వినియోగంలోకి తేవాలనే లక్ష్యంతో పనుల్లో వేగం పెంచారు. దీంతో సికింద్రాబాద్ నుంచి రైళ్ల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రయాణికులు కూడా స్టేషన్‌కు చేరుకొనేందుకు, ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతిరోజూ సుమారు 1.83 లక్షల మంది రాకపోకలు సాగిస్తుండగా.. పండుగలు, ప్రత్యేక సెలవు రోజుల్లో 2.2 లక్షల మందికి పైగా రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో రైళ్ల నిర్వహణ దృష్ట్యా ఒత్తిడి నెలకొంటోంది. ఇటీవల దీపావళి సందర్భంగా ఉత్తరాది రాష్ట్రాలకు ప్రయాణికుల రాకపోకలు అనూహ్యంగా పెరిగాయి.
- రద్దీ నియంత్రణ కోసం అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సి వచ్చింది. కొన్ని రైళ్లను చర్లపల్లి స్టేషన్‌కు తరలించి ఉంటే ఒత్తిడిని కొంత మేరకు తగ్గించే అవకాశం ఉండేది. మరోవైపు వాహనాల పార్కింగ్‌కు కూడా సరైన వసతులు లేవు. రానున్న రోజుల్లో ఈ ఇబ్బందులు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. సికింద్రాబాద్ పునరభివృద్ధి పనులను దృష్టిలో ఉంచుకొనే చర్లపల్లి టెర్మినల్ నుంచి 25 జతల రైళ్లను నడపాలని భావించారు. ఈ మేరకు రైల్వే బోర్డు నిర్ణయం కూడా తీసుకుంది. కనీసం 50 వేల మంది ప్రయాణికులు చర్లపల్లి నుంచి రాకపోకలు సాగించే అవకాశం ఉంది. కానీ టెర్మినల్ ప్రారంభం కాకపోవడమే ప్రధాన ఆటంకం కావడం గమనార్హం.


అన్ని వసతులు ఉన్నా..

చర్లపల్లి శాటిలైట్ టెర్మినల్‌ను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేశారు. రూ.430 కోట్ల వ్యయంతో ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేశారు. ప్రయాణికుల కోసం ఎయిర్‌పోర్ట్ తరహాలో ఎగ్జిక్యూటివ్ లాంజ్, వెయిటింగ్ హాళ్లు, స్లీపింగ్ పాడ్‌లు, కెఫెటేరియాలు, రెస్టారెంట్లు ఉన్నాయి. అలాగే టికెట్ బుకింగ్ కౌంటర్లు, లిఫ్టులు, ఎస్కలేటర్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జీలు, ఈవీ చార్జింగ్ పాయింట్లు, తదితర సదుపాయాలను ఏర్పాటు చేశారు. మొత్తం 19 లైన్ల సామర్థ్యంతో 9 కొత్త లైన్లను అభివృద్ధి చేశారు. ఇది వినియోగంలోకి వస్తే సికింద్రాబాద్‌తో పాటు నాంపల్లి, కాచిగూడ స్టేషన్‌ల పైనా ఒత్తిడి తగ్గుతుంది. ప్రయాణికులు ఔటర్ మీదుగా రాకపోకలు సాగించవచ్చు. నగరంలో ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా వివిధ ప్రాంతాల నుంచి చర్లపల్లికి చేరుకొనేందుకు ఔటర్‌రింగ్ రోడ్డును వినియోగించుకొనే అవకాశం ఉంది.



కంటోన్మెంట్‌కు రూ.303 కోట్లు

- మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం



కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలో రూ.303.62 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (ఎంఏయూడీ) ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.దాన కిశోర్ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్‌ల కోసం కంటోన్మెంట్ బోర్డుకు సంబంధించిన 24.6 ఎకరాలను సేకరిస్తున్నందుకు బదులుగా ఈ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కంటోన్మెంట్ పరిధిలోని భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అండ్ సీవరేజీ బోర్డు ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో ఆధునీకరించనున్నట్లు తెలిపారు. కంటోన్మెంట్ పరిధిలోని ఎస్‌ట్రెంచ్‌మెంట్ రోడ్డు నుంచి శేషాచల కాలనీ, ఎల్‌బీసీ కాలనీ, జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి ప్యాట్నీ కాంపౌండ్ వరకు ఉన్న పికెట్ నాలా, బోయిన్‌పల్లిలోని ప్రోగ్రెసివ్ కాలనీ, రాయల్ ఎన్‌క్లేవ్, పార్క్‌వ్యూ ఎన్‌క్లేవ్, సెయిల్ కాలనీ, భావనా కాలనీ, చిన్నతోకట్టా, బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి ప్యాట్నీ నాలా వరకు ఉన్న హస్మత్‌పేట నాలాలను జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

భూమికి బదులు పనుల ప్రతిపాదన

కంటోన్మెంట్ పరిధిలోని జాతీయ రహదారి -44, రాష్ట్ర రహదారి -1 మార్గాల్లో చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్‌ల కోసం సుమారు 150 ఎకరాల రక్షణ భూముల కేటాయింపునకు కేంద్రం అంగీకారం తెలిపింది. ఈ స్థలాలకు బదులుగా సమాన విలువ కలిగిన భూములను రాష్ట్ర ప్రభుత్వం రక్షణ శాఖకు కేటాయించనుంది. ఇందులో 24.6 ఎకరాల కంటోన్మెంట్ బోర్డుకు సంబంధించిన స్థలానికి మాత్రం, భూమికి బదులుగా రూ.303.62 కోట్లు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. ఈ మొత్తాన్ని కేంద్రం అధీనంలోని కన్సాలిడేటెడ్ ఫండ్ ఆఫ్ ఇండియా (సీఎఫ్‌ఐ)లో జమ చేయాలని నిర్ణయించారు. ఈ మొత్తాన్ని నేరుగా కంటోన్మెంట్‌కు అప్పగించే వీలులేనందున, అంతే విలువ కలిగిన మౌలిక సదుపాయాల అభివృద్ధికి అనుమతి ఇవ్వాలంటూ కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ రక్షణ శాఖ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. కంటోన్మెంట్ పరిధిలోని భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణతో పాటు పికెట్ నాలా, హస్మత్‌పేట్ నాలాలను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనలకు అంగీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

విద్యుత్ సత్వర సేవలకు..


కొత్తగా మరో 101 వాహనాల కేటాయింపు



సాక్షి, సిటీబ్యూరో: విద్యుత్ సరఫరాలో సాంకేతిక సమస్యల పరిష్కారం కోసం కొత్తగా మరో 101 ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం (అంబులెన్స్ తరహా) వాహనాలను సమకూర్చేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఏర్పాట్లు చేసింది. వచ్చే నెల 1 నుంచి ఈ వాహనాలు అందుబాటులోకి రానున్నాయి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇటీవల 10 వాహనాలను ప్రారంభించిన విషయం తెలిసిందే. తాజాగా మరో 101 వాహనాలను సిద్ధం చేసింది. అత్యవసర పరిస్థితుల్లో వినియోగదారులకు సత్వర, నాణ్యమైన సేవలు అందించాలనే ఉద్దేశంతోనే వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు డిస్కం ప్రకటించింది. ప్రస్తుతం ఉన్న వాహనాల స్థానంలో/ వాటికి అదనంగా మెట్రో జోన్‌కు 50, రంగారెడ్డి జోన్‌కు 21, మేడ్చల్ జోన్‌కు 19, రూరల్ జోన్‌కు 11 చొప్పున మొత్తం 101 వాహనాలను కేటాయిస్తూ దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఒక్కో డివిజన్‌కు ఒక వాహనం చొప్పున అందుబాటులోకి రానుంది. వాహనంలో షిఫ్ట్ విధానంలో ఒక అసిస్టెంట్ ఇంజినీర్, ముగ్గురు నైపుణ్యం కలిగిన సిబ్బంది, వాకీటాకీ, థర్మో విజన్ కెమెరాలతో పాటు, అత్యాధునిక భద్రతా పరికరాలైన హెల్మెట్, ఎర్త్ రాడ్, గ్లౌజులు, సేఫ్టీ బెల్ట్, కండక్టర్, ఎల్టీ/హెచ్‌టీ కేబుల్, స్పానర్ కిట్, 14 అడుగుల ఎత్తు నిచ్చెన, గొడ్డలి, రోప్, ఎల్టీ, హెచ్‌టీ ఫ్యూజ్‌వైర్, ఇన్సులేటర్, వుడ్ కట్టర్ వంటివి అందుబాటులో ఉంటాయి. వాహనంలో నలుగురు సిబ్బంది సహా, 100 కేవీఏ సామర్థ్యంతో కూడిన డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సైతం తరలించడానికి అనుకూలంగా ఉంటుందని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ ప్రకటించారు.

సర్టిఫి‘కేటుగాళ్లకు’ సంకెళ్లు

ఆర్‌ఎస్ ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ కేంద్రంగా దందా
- ఓటర్ ఐడీ, ఆధార్, క్యాస్ట్, బర్త్ సర్టిఫికెట్లు విక్రయం
- విదేశీయులకు ఆధార్ కార్డులు ఇప్పించిన ముఠా
- గుట్టు రట్టు చేసిన నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు
- ఇప్పటి వరకు 28 వేల నకిలీ పత్రాలు ఇచ్చినట్లు గుర్తింపు



సాక్షి, సిటీబ్యూరో: మహిళ వేషధారణ గొంతుతో ‘జబర్దస్త్’ ఫేమ్‌గా మారిన వ్యక్తి గుంటూరుకు చెందిన అయ్యప్ప. ఇతడిని నకిలీ పత్రాలతో హైదరాబాద్‌కు చెందిన గట్టు తన్మయిశ్రీగా మార్చి పాస్‌పోర్టు ఇప్పించారు. ప్యాట్నీలోని ఆర్‌ఎస్ ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ కేంద్రంగా సాగిన నకిలీ సర్టిఫికెట్ల దందాకు చిన్న ఉదాహరణ ఇది. దీని యజమాని వై.రాజ్‌కుమార్ నేతృత్వంలోని బృందం గడిచిన కొన్నాళ్లుగా 28 వేల నకిలీ డాక్యుమెంట్లు, గుర్తింపు కార్డులు సృష్టించింది. ఈ వ్యవహారం గుట్టురట్టు చేసిన నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం ఆరుగురు నిందితులను పట్టుకున్నారు. ఇన్‌స్పెక్టర్ కె.సైదులుతో కలిసి బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ వైవీఎస్ సుధీంద్ర వివరాలు వెల్లడించారు.

నకిలీ ఓటర్ ఐడీతో..

కళాసిగూడకు చెందిన రాజ్‌కుమార్ తన ఆర్‌ఎస్ ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ కేంద్రంగా నకిలీ డాక్యుమెంట్లు, గుర్తింపు కార్డుల దందా చేస్తున్నాడు. దీనికోసం ఆర్.విజయలక్ష్మి, కె.పల్లవిలను ప్రత్యేకంగా నియమించుకున్నాడు. నేపాల్ సహా మరికొన్ని దేశాల నుంచి నగరానికి అక్రమంగా వలస వచ్చిన వారికి ఎలాంటి గుర్తింపు కార్డులు ఉండవు. వీళ్లు ఐడీ కార్డుల కోసం రాజ్‌కుమార్‌ను ఆశ్రయిస్తున్నారు. ఇతగాడు ఫొటో షాప్ ద్వారా వేరే వారికి చెందిన ఓటర్ ఐడీలో వీరి పేరు చేరుస్తాడు. దీని ఆధారంగా ఆధార్ కార్డుకు దరఖాస్తు చేస్తాడు. ఇలా ఆధార్ రావడంతో వాళ్లు స్థానికులుగా మారిపోతున్నారు. కొందరికి నేరుగా ఆధార్ ఇప్పిస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. దీనికోసం ఆధార్ కార్డులు జారీ చేసే యూఐడీఏఐ ఇచ్చిన ఓ వెసులుబాటును వినియోగించుకున్నాడు. మైనర్‌గా ఉన్న వ్యక్తి తొలిసారిగా ఆధార్ కోసం దరఖాస్తు చేసుకుంటే వేలిముద్రలు ఇవ్వాల్సిన అవసరం ఉండదు. దీంతో ఆధార్ కోసం వచ్చిన వారిని మైనర్లుగా పేర్కొంటూ తొలుత రిజిస్టర్ చేసి కార్డు తీసి ఇస్తున్నాడు. ఆపై వయస్సు తప్పు పడిందంటూ కరెక్షన్ కోసం దరఖాస్తు చేసి సదరు వ్యక్తి అసలు వయసు చేరుస్తున్న రాజ్‌కుమార్ దాన్ని అధికారిక ఆధార్‌గా మార్చేస్తున్నాడు.

ఇతర ధ్రువీకరణ పత్రాలు సైతం..

రాజ్‌కుమార్ కేవలం ఆధార్, ఓటర్ ఐడీలు మాత్రమే కాకుండా ఇతర సర్టిఫికెట్లు కూడా తప్పుడు మార్గాల్లో ఇప్పిస్తున్నాడు. ఆధార్ కార్డుల కోసం ఇతగాడికి సర్వ శిక్షా అభియాన్ ప్రాజెక్టులో పని చేస్తున్న మహబూబ్ సహకరిస్తుండగా.. బర్త్, క్యాస్ట్ సర్టిఫికెట్లు ఇప్పించడంలో సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ ఆఫీస్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న జి.అనిల్‌కుమార్ సహకరిస్తున్నారు. పాస్‌పోర్టు ఏజెంట్‌గా పని చేస్తున్న బండి శంకర్ తమ వద్దకు వచ్చిన వారిలో వివిధ ధ్రువీకరణలు అవసరమైన వారిని రాజ్‌కుమార్ వద్దకు తీసుకువెళ్తున్నాడు. కొన్ని పత్రాలకు అటెస్టేషన్ చేయాల్సి వస్తుంది. దీని కోసం రాజ్‌కుమార్ కళాసీగూడ ప్రభుత్వ స్కూలు హెడ్‌మాస్టర్, హైదరాబాద్ జిల్లా ఆరోగ్య శాఖ జిల్లా సర్వైలెన్స్ ఆఫీసర్, గాంధీ ఆస్పత్రి ఆర్‌ఎండీ, ఉస్మానియా మెడికల్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ల పేరుతో నకిలీ రబ్బర్ స్టాంపులు సృష్టించాడు. వీరి సంతకాలను గ్రీన్ ఇంక్‌తో వరలక్ష్మి చేస్తోంది. ప్రతి సర్టిఫికెట్‌ను ఎదుటి వారి అవసరాన్ని బట్టి రూ.వందల నుంచి రూ.వేలకు విక్రయించి అంతా పంచుకున్నారు.

వందల నకిలీ కార్డుల డేటా ధ్వంసం...

రాజ్‌కుమార్‌కు దాదాపు పదేళ్లుగా ఈ దందా చేస్తున్నాడు. అయితే ఇతడికి ఏజెంట్‌గా పని చేసిన శ్రావణ్‌కుమార్‌ను 2023 జూన్‌లో నేరేడ్‌మెట్ పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో భయపడిన రాజ్‌కుమార్ అప్పటికి తొమ్మిదేళ్లుగా తన కంప్యూటర్‌లో ఉన్న డేటా ధ్వంసం చేశాడు. మిగిలిన డేటాను విశ్లేషించిన నేపథ్యంలోనే ఈ కేంద్రం నుంచి 50 వేల ఓటర్‌ఐడీ కార్డులు జారీ అయినట్లు తెలిసింది. వీరి దందాపై సమాచారం అందుకున్న నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆరుగురినీ పట్టుకుని మహంకాళి పోలీసులకు అప్పగించారు.


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ వైవీఎస్ సుధీంద్ర

కొత్త టీచర్లలో గుబులు!

- స్పోర్ట్స్ కోటా అభ్యర్థుల సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్
- 20న హైదరాబాద్, 21న రంగారెడ్డి జిల్లాల్లో ప్రక్రియ
- అనర్హులని తేలితే ఉద్యోగాల తొలగింపు

సాక్షి, సిటీబ్యూరో: కొత్తగా ఇటీవల నియమితులైన పలువురు టీచర్ల గుండెల్లో గుబులు పట్టుకుంది. డీఎస్సీ–2024కి ఎంపికైన అభ్యర్థుల ధృవీకరణ పత్రాలపై ఆరోపణలు వస్తుండటంతో విద్యాశాఖ పునఃపరిశీలనకు సిద్ధమైంది. ఇప్పటికే టీచర్ పోస్టుల పోస్టింగ్‌లలో జరిగిన పొరపాట్ల దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించిన విద్యాశాఖ..తాజాగా స్పోర్ట్స్ కోటా కింద ఎంపికైన అభ్యర్థుల ధృవపత్రాలను పునఃపరిశీలించాలని నిర్ణయించింది. ఈ నెల 20 నుంచి ఈ ప్రక్రియను నిర్వహించాలంటూ సర్క్యులర్ జారీ చేసింది. ఈ మేరకు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో పాటు, ఇదే కోటాలో ఉద్యోగాలకు ఎంపికవని అభ్యర్థులకు కూడా ధృవపత్రాల పునఃపరిశీలన జరుగనుంది.

– డీఎస్సీ–2024 కింద ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ధృవీకరణ పత్రాలను పరిశీలించిన అనంతరం గత నెల 9న ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ నియామక పత్రాలను అందజేశారు. అనంతరం కౌన్సిలింగ్ ద్వారా పోస్టింగ్‌లు కూడా ఇచ్చారు. ఎంపికైన వారిలో కొందరు బోగస్ అభ్యర్థులున్నట్టు పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తుండటంతో విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ముందుగా స్పోర్ట్స్ కోటా కింద ఎంపికైన అభ్యర్థులు ధృవీకరణ పత్రాలు పునఃపరిశీలించనుంది. అనంతరం ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, పండిట్ అభ్యర్థుల ధృవీకరణ పత్రాలు కూడా మళ్లీ పరిశీలించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

స్పోర్ట్స్ కోటా కింద 84 మంది.

గ్రేటర్ పరిధిలో స్పోర్ట్స్ కోటా కింద సుమారు 84 మంది అభ్యర్థులు ఎంపికై విధులు నిర్వహిస్తున్నారు. అందులో హైదరాబాద్ జిల్లా పరిధిలో 71 మంది, రంగారెడ్డి జిల్లా పరిధిలో 13 మంది ఎంపికయ్యారు. ఈ నెల 20న హైదరాబాద్ పరిధిలోని అభ్యర్థులకు, 21న రంగారెడ్డి జిల్లా పరిధిలోని అభ్యర్థులకు దోమల్‌గూడలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీలో ఈ ధ్రువపత్రాల పునఃపరిశీలన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కోటా కింద ఎంపికైన అభ్యర్థులతో పాటు, 1:3 కింద ఎంపికైన స్పోర్ట్స్ కోటా అభ్యర్థుల సర్టిఫికెట్లను తిరిగి వెరిఫై చేస్తారు. ఇప్పటికే అభ్యర్థులకు సమాచారం పంపించారు.

మూసీ నది దుస్థితికి గత పాలకులే కారణం

సెమినార్‌లో వక్తల ఆరోపణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్


కాచిగూడ: మూసీ నది ప్రస్తుత దుస్థితికి గత 70 ఏళ్లుగా రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్, టీడీపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలే ప్రధాన కారణమని పలువురు మేధావులు, సామాజిక కార్యకర్తలు, సీపీఐ నేతలు స్పష్టం చేశారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన ' హైడ్రా కార్యకలాపాలు–మూసీ నది ప్రక్షాళన–పేద, మధ్య తరగతి బాధితులకు ప్రత్యామ్నాయం' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, మాజీ ఎమ్మెల్సీ కె.నాగేశ్వర్‌రావు, ప్రొఫెసర్ జి.హరగోపాల్, సీనియర్ జర్నలిస్ట్ కె.శ్రీనివాస్, సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ తదితరులు పాల్గొని ప్రసంగించారు. గత పాలకులు ఎలాంటి ప్రణాళికలు లేకుండా ఇష్టానుసారంగా హైదరాబాద్ రూపు రేఖలు, భవిష్యత్ నిర్ణయించే విధానాలు అమలు చేసిన కారణంగానే ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. మూసీని, హైదరాబాద్‌ను విడదీసి చూడలేమని, హైదరాబాద్ జలవ్యవస్థ అంతా మూసీపై ఆధారపడి ఉందన్నారు. అందుకే మూసీ ప్రక్షాళనను హైడ్రాను వేరు చేసి చూడలేమని పేర్కొన్నారు. మూసీ నదిని పునరుజ్జీవింప చేయాల్సిందేనని, ఇందుకు ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు.

వ్యూహాత్మక చర్యలు తీసుకోవాలి..

అయితే మూసీ ప్రక్షాళన విషయంలో ప్రభుత్వం వ్యూహాత్మకంగా చర్యలు తీసుకోవాలనే కాని..అడ్డగోలు నిర్ణయాలు తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తామని వక్తలు పేర్కొన్నారు. మూసీ బాధితుల సమస్యలు, బాధలు పూర్తిగా మానవీయ కోణంలో ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ప్రతి బాధితుడికి సంపూర్ణమైన పరిహారం చెల్లించడంతో పాటు జీవనోపాధిని చూపిన తర్వాతే మూసీ పునరుజ్జీవన ప్రక్రియ చేపట్టాలన్నారు. మూసీని పునరుద్ధరించడం అంటే కేవలం మూసీని బాగు చేయడమే కాదని, మూసీ నదిపై ఆధారపడిన వారందరికి మెరుగైన జీవన పరిస్థితులను అందజేయాలన్నారు. మూసీ పునరుజ్జీవనం ఎంత అవసరమో ప్రజలకు ముందు అవగాహన కల్పించి, వారిని చైతన్యం చేయాలని సూచించారు. బాధిత ప్రజలకు ప్రత్యామ్నాయం చూపడంతో పాటు వారికి జీవనోపాధి లభించే వరకు నెలకు రూ.10 వేల చొప్పున అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాస్, ఎన్.బాలమల్లేష్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీఎస్ బోసు, ఈటి నరసింహ, బాధిత ప్రజలు పాల్గొన్నారు.

తెలంగాణలో 12 శాతం మందికి మధుమేహ వ్యాధి

ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు ద్వారకనాథ్‌రెడ్డి



సుల్తాన్‌బజార్: తెలంగాణ రాష్ట్రంలో మధుమేహం వ్యాధి ప్రమాదకరంగా పెరుగుతోందని, ప్రజలు వెంటనే అప్రమత్తమై పరీక్షలతో వ్యాధిని గుర్తించడం ఆరోగ్యవంతమైన జీవనశైలితో వ్యాధిని నిత్యం అదుపులో ఉంచడంపై దృష్టి పెట్టాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దువ్వూరు ద్వారకనాథరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వి.అశోక్‌లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం ప్రపంచ డయాబెటిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రజలు మధుమేహం వ్యాధి పట్ల నిర్లక్ష్యం చేస్తే గుండె, కిడ్నీ, చర్మ, నరాలు, కంటి జబ్బుల బారిన పడాల్సి వస్తుందని, ఇది ఆర్థికంగాను, ఆరోగ్యపరంగాను తీవ్రంగా నష్టపరుస్తుందన్నారు. కాబట్టి ప్రజలు షుగర్ వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత కూడా అదేదో రుగ్మత అని భావించకుండా అది ఒక జీవన శైలిగా మార్చుకోవాలని సూచించారు. ప్రతి రోజు కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం చేయడం, ఫైబర్, ఫ్రూట్స్, విత్తనాలు, వెజిటబుల్స్‌తో కూడిన ఆహారాన్ని తీసుకోవడం నిత్యం చేయాలని సూచించారు. వ్యాధిలో ఎలాంటి తీవ్రత ఉన్నా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

మీదికుంట వాకింగ్ బ్రిడ్జి ప్రారంభం

బాలల దినోత్సవం నేపథ్యంలో ప్రారంభించిన విద్యార్థులు



సాక్షి, సిటీబ్యూరో: మియాపూర్ పరిధిలోని మీదికుంట సరస్సు వద్ద నూతనంగా నిర్మించిన వాకింగ్ బ్రిడ్జ్‌ను బాలల దినోత్సవం నేపథ్యంలో ఫౌంటెన్‌హెడ్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు ప్రారంభించారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా చేపట్టిన నిధుల సమీకరణతో పాటు స్కూల్ విద్యార్థులు, సేవ్ వాటర్ అండ్ సేవ్ నేచర్ ఎన్‌జీఓ సహకారంతో నిర్మించిన ఈ వంతెనను ప్రారంభించి సమాజానికి అంకితం చేశారు. 2020లో సరస్సు పునరుజ్జీవనం చేసినప్పటి నుంచి సరస్సు పరిరక్షణకు విద్యార్థులు చూపుతున్న అంకితభావాన్ని సరస్సు చుట్టుపక్కల కమ్యూనిటీలు అభినందించాయి. ఇందులో భాగంగా క్రమం తప్పకుండా సరస్సును శుభ్రం చేయడం, దీని పైన ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ వంతెన ప్రారంభోత్సవంలో ఫౌంటెన్‌హెడ్ గ్లోబల్ స్కూల్ వ్యవస్థాపకులు మేఘనా ముసునూరి, డైరెక్టర్ శ్రీధర్ వున్నం పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలపై వెంటనే స్పందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ నేత వెంకటేశం

కాచిగూడ: గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సమస్యలపై ఉదాసీన వైఖరి ప్రదర్శించడం దారుణమని తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్ జేఏసీ నేత బి.వెంకటేశం అన్నారు. గురువారం నారాయణగూడలోని ఏఐటీయూసీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలు పెంచాలని, మహాలక్ష్మి పథకం వల్ల ఆర్థికంగా నష్టపోయి ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున నష్టపరిహారం ప్రకటించాలని కోరారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 20 వేల కొత్త ఆటో పర్మిట్లు ఇవ్వాలని, ఆటోలకు థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ చెల్లించాలని అన్నారు. ఈ నెల 21వ తేదీన బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎ.బిక్షపతి (ఎఐటియుసి), కె.అజయ్‌బాబు (సిఐటియు), జి.లింగంగౌడ్ (టియుసిఐ), ఎంఏ సలీమ్, షేక్ నజీర్ (యుటిఎడిడబ్ల్యూఏ), ఎ.సత్తిరెడ్డి (టిఏడిఎస్), ఎస్.రాంకిషన్ (బిఆర్‌టియు) తదితరులు పాల్గొన్నారు.

ఓయూ ఆర్ట్స్ కాలేజీ నూతన ప్రిన్సిపాల్‌గా ప్రొ.కాశీం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా తెలుగు శాఖ అధ్యాపకులు ప్రొ.కాశీం నియమితులయ్యారు. యూనివర్సిటీ క్యాంపస్ న్యాయకళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాంప్రసాద్, సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ప్రొ.గుండా ప్రభాకర్ సైఫాబాద్ పీజీ సైన్స్ కాలేజీ ప్రిన్సిపల్ బాటని విభాగం ప్రొ.శైలజ, నిజాం కాలేజీ ప్రిన్సిపాల్‌గా జువాలజీ అ విభాగం ప్రొ.ఏవీ రాజశేఖర్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా కామర్స్ విభాగం అధ్యాపకులు ప్రొ.ఐ.శేఖర్, యూనివర్సిటీ టెక్నాలజీ ప్రిన్సిపాల్‌గా ప్రొ.రమేష్‌కుమార్ నియమితులయ్యారు. ఇక ఓయూ ఎగ్జామినేషన్ నూతన కంట్రోలర్‌గా సివిల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొ.శశికాంత్ నియమితులయ్యారు. గతంలో అడిషనల్ కంట్రోలర్‌గా పని చేసి ఆయన ఇంజినీరింగ్ కాలేజీలో పలు పదవులు చేపట్టారు.

నెహ్రూకు మహేశ్‌కుమార్ గౌడ్ నివాళులు



నివాళులర్పిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: భారత దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అబిడ్స్ చౌరస్తాలోని చాచా నెహ్రూ విగ్రహానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మాజీ ఎంపీ వీహెచ్, మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌తో పాటు పలువురు ప్రతినిధులు హాజరై నివాళులర్పించారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



జశ్వంత్ గౌడ్(ఫైల్)

నిజాంపేట్: నిజాంపేట పరిధిలోని జర్నలిస్టు కాలనీ శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న జశ్వంత్ గౌడ్(17) గురువారం తెల్లవారుజామున హాస్టల్ గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కామారెడ్డి జిల్లాకు చెందిన రాజు, రాధికల కుమారుడు జశ్వంత్ ఇంటర్ చదువుతూ కొద్దిరోజులుగా హాస్టల్‌లో ఉంటున్నాడు. ఆత్మహత్య సమాచారం అందుకున్న కాలేజీ సిబ్బంది జశ్వంత్‌ను ఆసుపత్రికి తరలించగా..అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు వెల్లడించారు. వెంటనే కాలేజీ సిబ్బంది బాచుపల్లి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. కాగా సంఘటన స్థలంలో సూసైడ్ నోట్ లభించింది. 'అమ్మ.. నాన్న నన్ను క్షమించండి..నా చావుతోనైన మన కష్టాలు తీరాలి..కొందరి కారణంగానే నేను చనిపోతున్నా..' అని వారి పేర్లు సైతం సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. అమ్మను, చెల్లిని జాగ్రత్తగా చూసుకో నాన్న అని లెటర్‌లో పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. జశ్వంత్ సూసైడ్ నోట్‌లో కొందరి పేర్లు ప్రస్తావిస్తూ..వీరి మూలంగానే తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు పేర్కొనడంతో బంధువులతో ఏమైనా గొడవలు ఉన్నాయా?అనే కోణంలో సైతం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బాచుపల్లి పోలీసులు మాత్రం మృతుడి తండ్రి రాజు ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నారు. కాగా జశ్వంత్ గౌడ్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన తెలుసున్న విద్యార్థి సంఘాలు కాలేజీ ముందు ఆందోళనకు దిగాయి.

కల్వర్టును ఢీకొన్న కారు: డ్రైవర్ దుర్మరణం



శంషాబాద్: కల్వర్టును కారు ఢీ కొట్టిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆ కారు డ్రైవర్ మృతి చెందిన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మైలార్‌దేవ్‌పల్లి శాస్త్రీపురంలో నివాసం ఉంటున్న పఠాన్ అమీర్‌ఖాన్ జబ్బార్(31) క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం శంషాబాద్ నుంచి ప్రయాణికుడిని ఎక్కించుకుని ఎయిర్‌పోర్టుకు బయలుదేరాడు. మార్గమధ్యలో ఆశారాం బాపూజీ ఆశ్రమానికి దగ్గరలో కల్వర్టు ఢీ కొట్టడంతో కారు ముందుభాగం ధ్వంసం అయింది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న అమీర్‌ఖాన్‌కు తీవ్రంగా గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కారులో ఉన్న ప్రయాణికుడి కాలికి గాయం కావడంతో పోలీసులు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

IN THE COURT OF THE HON'BLE PRL. DISTRICT JUDGE :: RANGA REDDY DISTRICT COURT: AT L.B. NAGAR

O.S. NO: 680 of 2024

Between :
Chennoju Baburao, S/o. Late C. Satyanarayana, Age : 57 Years, Occ: Business, R/O of H.No.16-2-752/121 C 46, S B H Colony, Saidabad, Hyderabad-T.S. ...PLAINTIFFS

AND

1) THE TAHSILDAR / M.R.O., Saroor Nagar Mandal, R.R. District., 2) All Concerned, 3) The Tahsildar/MRO, Charminar Mandal, Hyderabad, 4) The Tahsildar / MRO Amberpet Mandal, Hyderabad, 5) The Tahsildar/MRO Marredpally Mandal, Secunderabad, 6) The Tahsildar / MRO Hayathnagar Mandal, R.R. District ...DEFENDANTS

NOTICE

To, ALL CONCERNED
Sir/Madam,

Whereas Plaintiff has instituted a suit for Declaration, declare the plaintiff has only legal heir and successor of deceased, Chennoji. Satyanarayana and absolute owner of suit schedule properties, you are hereby directed to appear in this court in person or through counsel to answer all material questions relating to the suit on 11-12-2024 at 10.30 am to answer the claim.

Take notice that in default of your appearance on the day before mentioned, you will be placed ex-party and the suit will be heard and determined in your absence.

SCHEDULE OF PROPERTY

SCHEDULE-C : All that 1/3rd share in piece and parcel of southern part of Plot No: 47, admeasuring 145 Sq. Yards or 121.23 Sq. mtrs out of 300 Sq. Yards, in Sy. No's: 309 & 310 in Gaddiannaram, ward No. 16, Block No.2, municipal corporation of Hyderabad, Charminar revenue mandal, Hyderabad urban district bounded by : North : Plot No: 47 Northern Part, South : Plot No : 48, East : 30' Wide Road, West : Plot No : 44.

SCHEDULE-D : All that 1 /3rd share in piece and parcel of northern part of Plot No.47 admeasuring 155 Sq. Yards or 129.6 Sq. mtrs out of 300 Sq. Yards in Sy. No. 309 & 310 in Gaddiannaram, Ward No. 16, Circle No. 2, municipal corporation of Hyderabad, Charminar revenue mandal, Hyderabad urban district and bounded by : North : Plot No : 46, South : Plot No : 47 Southern Part, East : 30' Wide Road, West : Plot No: 44.

SCHEDULE-J : All that 1/3rd share in lease Deed on Plot No. 210 admeasuring 167.00 Sq Yards or Equivalent to 137.77 Sq. mtrs, in Sy.No.127/1, situated at Mahaboobmansion, Malakpet, Hyderabad and bounded by: North : 40' wide road, South : Plot no: 181, East : Plot No: 209, West : Plot no: 211.

(By Order of the Court)

Sd/- M/s. SARAF ANURADHA, Advocate
Off : 16-2-701/D/1, Kalanilayam, 2nd Floor, Palton, Malakpet, Hyderabad - TS
Mobile 9849471622.
E-mail: sarafanuradha27@gmail.com

IN THE COURT OF THE HON'BLE PRL. DISTRICT JUDGE :: RANGA REDDY DISTRICT COURT: AT L.B. NAGAR

O.S. NO: 681 of 2024

Between :
Chennoju Babu @ Chitti Babu Rao, S/o Late Chennoju @ Chennoji Yadagiri, Age: 54 Years, Occ: Business, R/O of H.No. 16-2-740/47, Kalyan Nagar, Gaddiannaram, Hyderabad-T.S. ...PLAINTIFFS

AND

1) THE TAHSILDAR/M.R.O., Saroor Nagar Mandal, R.R. District., 2) The Tahsildar / MRO Hayathnagar Mandal, R.R. District, 3) All Concerned, 4) The Tahsildar/MRO Charminar Mandal, Hyderabad, 5) The Tahsildar/MRO Amberpet Mandal, Hyderabad, 6)The Tahsildar /MRO Marredpally Mandal, Secunderabad. ...DEFENDANTS

NOTICE

To, ALL CONCERNED
Sir/Madam,

Whereas Plaintiff has instituted a suit for Declaration, declare the plaintiff has only legal heir and successor of deceased, Chennoju @ Chenoji Yadagiri and Chennoju @ Chennoji Sugunamma and absolute owner of suit schedule properties, you are hereby directed to appear in this court in person or through counsel to answer all material questions relating to the suit on 11-12-2024 at 10.30 am to answer the claim. Take notice that in default of your appearance on the day before mentioned, you will be placed ex-party and the suit will be heard and determined in your absence.

SCHEDULE OF PROPERTY

SCHEDULE-C : All that 1/3rd share in piece and parcel of southern part of Plot No: 47, admeasuring 145 Sq. Yards or 121.23 Sq. mtrs out of 300 Sq. Yards, in Sy. No's: 309 & 310 in Gaddiannaram, ward No. 16, Block No.2, municipal corporation of Hyderabad, Charminar revenue mandal, Hyderabad urban district bounded by : North: Plot no: 47 Northern part, South: Plot no: 48, East: 30' wide Road, West: Plot no: 44.

SCHEDULE-D : All that 1/3rd share in piece and parcel of northern part of Plot No.47 admeasuring 155 Sq. Yards or 129.6 Sq. mtrs out of 300 Sq. Yards in Sy. No. 309 & 310 in Gaddiannaram, Ward No. 16, Circle No. 2, municipal corporation of Hyderabad, Charminar revenue mandal, Hyderabad urban district and bounded by: North: Plot no: 46, South : Plot no: 47 Southern part, East : 30' wide road, West : Plot no: 44.

SCHEDULE-J : All that 1/3rd share in lease Deed on Plot No. 210 admeasuring 167.00 Sq. Yards or Equivalent to 137.77 Sq. mtrs, in Sy.No.127/1, situated at Mahaboobmansion, Malakpet, Hyderabad and bounded by : North: 40' wide road, South: Plot no: 181, East: Plot no: 209, West: Plot no: 211.

SCHEDULE-N : All that Part of Double Storied Building bearing municipal No: 16-2-752/19(Ground floor) and 162-752/19/1 (First floor) on Plot No: GA-13, in survey No's: 290,291,292/1,292/2, 1/3rd Undivided Share of Land admeasuring 95.66 Sq. Yards or 77.47 Sq. Mtrs, out of 287 Sq. Yards having plinth area of 283.86 Sq. ft., in Ground floor and 216.14 Sq.ft., in First floor, situated at Gaddiannaram village, Charminar Mandal, Hyderabad, and bounded by: BOUNDARIES OF GROUND FLOOR : North: 40 Ft. Wide Road, South: Neighbours Property, East: Part of the Same Property, West: Part of the Same Property, BOUNDARIES OF FIRST FLOOR : North: Open to Sky, South: Open to Sky, East: Part of the same Property, West: Part of the Same Property.

(By Order of the Court)

Sd/- M/s. SARAF ANURADHA, Advocate
Off: 16-2-701/D/1, Kalanilayam, 2nd Floor, Palton, Malakpet, Hyderabad - TS
Mobile 9849471622
e-mail: sarafanuradha27@gmail.com

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■ ఇస్నాపూర్@పటాన్ చెరువులో 64 లక్షలకే/150Sqd ఫ్లాట్, 85లక్షలకే – 2BHK విల్లాస్ 94 లక్షలకే 3BHK విల్లాస్. HMDA-RERA & బ్యాంక్‌లోన్‌తో కలవు. Ph: 9000014424 [HA-62]

■ VJA, రాజధాని అమరావతి, మంగళగిరి, గన్నవరం, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ, బందరు రోడ్డు, నున్న నూజివీడు రోడ్డు, కంచికచర్లలో DTCP, AP CRDA ప్లాట్స్ చ।।గ।। 1,900/- నుండి 12,900/- ఇళ్ళ మధ్యలో ఇళ్ళ ప్లాట్స్. సంప్ర: 99085 66079 [B-107]

Services

BUSINESS SERVICE

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్:9100329739 [800517]

BUSINESS OFFER

■ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారా? అయితే మీకోసం ఒక అద్భుత వ్యాపార అవకాశం. ఇప్పుడు మన హైదరాబాద్‌లో వివరాలకు సంప్ర : 9989394959 [SCA24000608]

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9398709618 [H-796650]

PERSONAL CARE

OLD AGE HOME

■ వృద్ధులు, NRI'S, విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి, దీర్ఘకాలిక మంచాన ఉన్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్. ఉప్పల్ & ECIL-కీసర రోడ్, చీర్యాల్ 'x' రోడ్, భోజన వసతితో. ఫోన్: 7981467036, 9391039990, 8074327715 [H-783362]

Wanted

■ ఉప్పల్ డిపో వద్ద మా ఫార్మా కంపెనీకి సొంత వేహికిల్ కలిగి, మంచి అనుభవం గల క్లర్క్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ 35yrs లోపు కావలెను. ఫోన్ : 9515906315/ 7989823219 [SCA24000638]

■ ప్రముఖ వసుంధర ఓల్డ్ ఏజ్ హోంలో పని చేయుటకు హెల్పర్స్, ఆయాలు, ANM, GNM, నర్సులు అర్జెంట్‌గా కావలెను. జీ : 12,000/- నుండి 24,000/-, రూం + భో ఫ్రీ. ఫోన్: 95424 49944 [V- 823885]

■ రియల్ ఎస్టేట్ Co.HYD, కోకాపేట్, శంకర్‌పల్లిలో విల్లాస్/ప్లాట్స్ సేల్స్‌కై మార్కెటింగ్ Exe. కావలెను. జీ/కమీషన్ + 2వీలర్ + రూం+భో ఫ్రీ, నె।।లక్ష రూ।। ఫ్రెష్/Exp. ఫోన్: 7416396781 [HA-16464]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1253914]

■ ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీలో పార్ట్ టైం అడ్వైజర్స్ కావలెను. పెన్షన్ పాలసీల కొరకు హౌస్‌వైఫ్స్, రిటైర్డ్ వారు Ph: 9849248282 [SCA24000589]

■ Sr Executive Recruitment/ Placement Officers for Leading Outsourcing Staff Services Co., Sanathnagar / Tukkuguda, Hyd. Ph : 9000950038 / 8522932468 [HA-33272]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి క్లాసిఫైడ్స్
3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి
హైదరాబాద్ సిటీ ఎడిషన్‌లో 5 ప్రకటనలకు రూ. 2280/- (4 లైన్లు). ప్రతి అదనపు లైనుకు రూ. 540/-
గమనిక : ఇక్కడ మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం

జోన్ సెంటర్స్

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

రెడ్‌హిల్స్‌లో కారు బీభత్సం

- మద్యం మత్తులో డ్రైవింగ్..
- జనాల మీదకు దూసుకురావడంతో పలువురికి గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం



కారును పోలీసు స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

నాంపల్లి: రెడ్‌హిల్స్‌లోని నిలోఫర్ కేఫ్ వద్ద ఓ కారు బీభత్సం సృష్టించింది. కేఫ్‌లో టీ తాగేందుకు వచ్చిన వారిపైకి దూసుకొచ్చింది. రోడ్డు పక్కన నిలబడ్డ వారిని ఢీకొట్టుకుంటూ వెళ్లిపోయింది. ఈ ఘటనలో 12 మంది గాయపడగా..నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఇందులో ఎనిమిది ద్విచక్రవాహనాలు, ఒక కారు పాక్షికంగా దెబ్బతిన్నాయి. మితిమీరిన వేగంతో ఢీకొట్టుకుంటూ వెళ్లిన డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించగా స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. డ్రైవర్ మద్యం మత్తులోనే ఈ దారుణానికి పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..అత్తాపూర్‌కు చెందిన అహ్మద్ మాలిక్ (32) బుధవారం రాత్రి మద్యం తాగి.. స్నేహితులతో కలిసి అర్ధరాత్రి దాటాక భోజనం చేసేందుకు కారులో నిలోఫర్ కేఫ్‌కు బయలుదేరాడు. అప్పటికే కేఫ్ కిక్కిరిసిపోయి ఉంది. 2 గంటల సమయంలో అతను కారు వేగంగా నడుపుతూ లక్డీకాపూల్ సింగరేణి భవన్ వైపు నుంచి నిలోఫర్ కేఫ్ వైపు దూసుకొచ్చాడు. కారును అదుపుచేయలేకపోవడంతో . రోడ్డు మీద టీ తాగుతున్న వారిని ఢీకొంటూ ముందుకు వెళ్లింది. అంతటితో ఆగకుండా మళ్ళీ ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి వద్ద రివర్స్ తీసుకుని మళ్లీ రోడ్డుపై నిల్చున్న వ్యక్తులపైకి దూసుకువచ్చింది. ఈ ఘటనలో 12 మందికి గాయాలయ్యాయి. వీరిలో చాలా మందికి కాళ్లు, చేతులు విరిగాయి. క్షతగాత్రులను హుటాహుటిన గన్‌ఫౌండ్రీలోని ఖాన్ లతీఫ్ ఖాన్ బిల్డింగ్‌కు ఎదురుగా ఉండే ఉదయ్ ఓమ్నీ ఆసుపత్రికి తరలించారు. చంచల్‌గూడకు చెందిన మొయినుద్దీన్ పరిస్థితి విషమంగా మారడంతో అతడిని మరో ఆసుపత్రికి మార్చారు. మొయినుద్దీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కారు డ్రైవర్ పోలీసుల అదుపులో ఉన్నారు. దెబ్బతిన్న కారును నాంపల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు.

తప్పు చెప్పిన వారి సంగతి తేలుస్తాం

రామమ్మ కుంట ఆక్రమణ తొలగింపుపై హైకోర్టు హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: నగరంలోని రామమ్మ కుంట ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలను తొలగించామని ప్రభుత్వం, పూర్తిగా తొలగించలేదని పిటిషనర్ పేర్కొంటున్నందున.. ఇరు పార్టీలు అఫిడవిట్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. వివరాలను పరిశీలించి తప్పుడు సమాచారం ఇచ్చిన వారి సంగతి తేలుస్తామని మౌఖిక హెచ్చరిక జారీ చేసింది. రెండు వారాలు సమయం ఇచ్చింది. ఆలోగా అఫిడవిట్లు దాఖలు చేయాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది. రామమ్మ కుంట బఫర్ జోన్‌లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్) భవనం నిర్మించడాన్ని సవాల్ చేస్తూ మానవ హక్కులు, వినియోగదారుల రక్షణ సెల్ ట్రస్ట్ ఏప్రిల్ 2023లో పిల్ దాఖలు చేసింది. ఇది సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధమని పేర్కొంది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఎలాంటి నిర్మాణం చేపట్టడం లేదని అఫిడవిట్ దాఖలు చేయాలని లేక్ ప్రొటెక్షన్ కమిటీని హైకోర్టు 2023 జూలైలో ఆదేశించింది. నగరంలోని చెరువుల, కుంటల ఇతర నీటి వనరుల ఎఫ్టీఎల్ బఫర్ జోన్ నిర్ధారణకు నోటిఫికేషన్ జారీ చేయాలని, దీన్ని తదుపరి విచారణ రోజున కోర్టుకు అందజేయాలని స్పష్టం చేసింది. అనంతరం 2024 జూలైన హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ కోర్టుకు హాజరయ్యారు. హెచ్ఎండీఏ పరిధిలో 3,532 నీటి వనరులు ఉన్నాయని చెప్పారు. వీటిలో 230 చెరువులకు ఎఫ్‌టీఎల్ నిర్ధారణ తుది నోటిఫికేషన్ ఇచ్చామని, 2,525 చెరువులకు ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చామని కోర్టుకు వెల్లడించారు. మూడు నెలల్లో వీటికి కూడా తుది నోటిఫికేషన్ ఇస్తామన్నారు.

ఇరుపక్షాలు అఫిడవిట్లు సమర్పించండి..

ఈ పిటిషన్ గురువారం మరోసారి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున న్యాయవాది కిరణ్‌సింగ్, కేంద్రం తరఫున ప్రణతిరెడ్డి హాజరయ్యారు. లేక్ ప్రొటెక్షన్ కమిటీ చైర్మన్, హెచ్ఎండీఏ కమిషనర్ దాఖలు చేసిన నివేదికలో పేర్కొన్నట్లు నిథమ్ ఆక్రమణలు పూర్తిగా తొలగించలేదని కిరణ్‌సింగ్ వాదనలు వినిపించారు. మరోవైపు ఆక్రమణలు పూర్తిగా తొలగించినట్లు ప్రభుత్వ న్యాయవాది పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. ఒకరు తొలగించామని, మరొకరు పూర్తిగా తొలగించలేదని వాదిస్తున్నారని, లిఖిత పూర్వక అఫిడవిట్ అందజేయాలని ఆదేశించారు. ఆక్రమణలు తొలగిస్తే పిటిషనర్.. తొలగించకుంటే సంబంధిత అధికారులు తప్పుడు సమాచారం ఇచ్చినందుకు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది.

SOUTH INDIAN Bank

ది సౌత్ ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్, రీజనల్ ఆఫీస్ హైదరాబాద్
నం. 157/6, మొదటి అంతస్తు, CHAI కాంప్లెక్స్, స్టాఫ్ రోడ్, గన్‌రాక్ ఎన్‌క్లేవ్, సిఖ్‌విలేజ్, డైమండ్ పాయింట్, సికింద్రాబాద్ – 500009.

Ref:- RO-HYD/REC/GEN/447/2024-25

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8(6) మరియు 9(1)కి నిబంధనలతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

రుణ గ్రహీతలు

1 M/s విజయలక్ష్మి పేపర్స్: డోర్ నం.1-9-2, ప్లాట్ నం.19/4, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్ - 500020 మరియు 1వ అంతస్తు, ఇంటి నం.2-1-18/3, సరస్వతి నగర్ కాలనీ, ఉప్పల్, హైదరాబాద్ - 500039.
2 శ్రీ వెంపటి ప్రతాప్ రెడ్డి: డోర్ నం.1-9-2, ప్లాట్ నం.19/4, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్ - 500020 మరియు 1వ అంతస్తు, ఇంటి నం.2-1-18/3, సరస్వతి నగర్ కాలనీ, ఉప్పల్, హైదరాబాద్ - 500039.
3 Ms. వెంపటి చంద్ర లిఖిత: డోర్ నం.1-9-2, ప్లాట్ నం.19/4, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్ - 500020 మరియు 1వ అంతస్తు, ఇంటి నం.2-1-18/3, సరస్వతి నగర్ కాలనీ, ఉప్పల్, హైదరాబాద్ - 500039.

గ్యారంటార్లు

4 శ్రీమతి కొత్త రమాదేవి: ఇం.నం. 41-20/2-65, 2వ అంతస్తు, పచ్చిమేడ బజార్, కృష్ణలంక, విజయవాడ (అర్బన్), కృష్ణ, ఆంధ్రప్రదేశ్ - 520013
5 శ్రీమతి బి. శివ కుమారి: భర్త వెంకటేశ్వర రెడ్డి, ఇంటి నం.20-6-67/1, రామలింగేశ్వరపేట, ICE ఫ్యాక్టరీగేట్, విజయవాడ, గాంధీనగరం, కృష్ణ, విజయవాడ (అర్బన్), ఆంధ్రప్రదేశ్ - 520003

ది సౌత్ ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్, బ్రాంచ్ సికింద్రాబాద్ (సెక్యూర్డ్ క్రెడిటార్)కు తనఖాపెట్టిన దిగువ వివరించబడిన స్థిరాస్తి ది సౌత్ ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్ (సెక్యూర్డ్ క్రెడిటార్) అధీకృత అధికారిచే భౌతిక స్వాధీనంలోకి తీసుకోబడినదని, పైన పేర్కొన్న రుణగ్రహీత(లు), గ్యారంటార్(ల) నుండి ది సౌత్ ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్, బ్రాంచ్ సికింద్రాబాద్ (సెక్యూర్డ్ క్రెడిటార్)కు చెల్లించవలసిన బకాయి 13.11.2024 నాటికి M/s విజయలక్ష్మి పేపర్స్ ఖాతాలో రుణసదుపాయాలకు సంబంధించి మొత్తం రూ.2,05,93,271.94 (రెండు కోట్ల ఐదు లక్షల తొంభై మూడు వేల రెండు వందల డెబ్బై ఒక్క రూపాయల తొంభై నాలుగు పైసలు మాత్రమే)తో పాటు భవిష్య వడ్డీ, వ్యయాలు మరియు ఖర్చులు మొ।।వి రికవరీ చేయడానికి సదరు ఆస్తి "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా" ప్రాతిపదికన", "ఉన్నది ఉన్నట్లుగా" మరియు "అక్కడ ఏమున్నదో అదే" నిబంధనపై 05.12.2024న విక్రయించబడునని సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రహీతకు/ గ్యారంటార్‌కు/ న్యాయవారసులకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

ఆస్తి యజమాని పేరు **శ్రీమతి బి. శివ కుమారి**

స్థిరాస్తి వివరణ

సేల్ డీడ్ నం.3708/2004 తేది: 26.03.2004 ఆఫ్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ - ఉప్పల్‌లో మరింత పూర్తిగా వివరించిన బి.శివకుమారి స్వంతమై ఉండి, SRO ఉప్పల్, రంగారెడ్డి జిల్లా పరిధిలో ఉప్పల్ మండలం/ మున్సిపాలిటీ, ఉప్పల్ భగాయత్ గ్రామం, శాంతినగర్ వద్ద సర్వే నం.221లో దానిపై గల అన్ని ఇతర నిర్మాణాలు, అభివృద్ధి, ప్రస్తుతం గల అనుభోగ హక్కులు మరియు అనుబంధాలతోపాటు ప్లాట్ నం.5పై ఇంటి నం. 3-133/30/5 కలిగిన 910.59 చ.గజాల విస్తీర్ణం భూమి యావత్తు. సరిహద్దులు: ఉత్తరం: సర్వే నం.221లోని భూమి మరియు రోడ్, దక్షిణం: సర్వే నం.221లోని భూమి, తూర్పు: ప్లాట్ నం.4, పశ్చిమం: ప్లాట్ నం.6.

రిజర్వు ధర	రూ.2,18,55,000/- (రెండు కోట్ల పద్దెనిమిది లక్షల యాభై ఐదు వేల రూపాయలు మాత్రమే)
బయానా (EMD)	రూ.21,85,500/- (ఇరవై ఒక్క లక్షల ఎనభై ఐదు వేల ఐదు వందల రూపాయలు మాత్రమే) బయానాను 04.12.2024న లేదా ఆలోగా సా.5.00 గం. లోగా దాఖలు చేయాలి
బిడ్ పెంపుదల మొత్తం	రూ.50,000/- (యాభై వేల రూపాయలు మాత్రమే)
బ్యాంకుకు తెలిసిన తాకట్టు రుణభారాలు	లేవు
బయానాతో బిడ్ దాఖలుకు చివరి తేది మరియు సమయం	04.12.2024న లేదా ఆలోగా సా.5.00 గం. వరకు
ఆస్తి తనిఖీ	పని రోజులలో మ.3.00 గం. నుండి సా.5.00 గం. వరకు.
బిడ్ పెంపుదల మొత్తం	రూ.1,00,000/- (ఒక లక్ష రూపాయలు మాత్రమే)
వేలం తేది మరియు సమయం	05.12.2024, ఉ.11.00 గం. నుండి మ.12.00 గం. వరకు (అమ్మకం ముగిసేంతవరకు 5 నిమిషాల అపరిమిత ఆటో ఎక్స్‌టెన్షన్స్‌తో)

ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్: M/s 4 closure, వెబ్‌సైట్ పేరు: https://bankauctions.in ఆఫీస్ మెయిల్ id: info@bankauctions.in, ఆఫీస్ చిరునామా: M/s 4 closure, # 605A, 6వ అంతస్తు, మైత్రీవనం, అమీర్‌పేట్, హైదరాబాద్, తెలంగాణ - 500038. హెల్ప్ లైన్ డెస్క్: ల్యాండ్ లైన్: 040-23736405, శ్రీ జయప్రకాష్ - 8142000064. బ్యాక్‌ఎండ్ టీమ్: Ms ప్రియ (8142000066/62)

అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కోసం సౌత్ ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్ (సెక్యూర్డ్ క్రెడిటార్) వెబ్‌సైట్ అంటే www.southindianbank.com వెబ్ పోర్టల్‌లో ఏర్పాటు చేసిన లింక్‌ను రిఫర్ చేయండి. వివరాలు assets.matexauctions.comలో కూడా లభిస్తాయి. ఆస్తి తనిఖీకి సంబంధించి ఏదేని తదుపరి స్పష్టీకరణ, ఇ-వేలం నియమ నిబంధనలు లేదా బిడ్ల దాఖలు కోసం సంప్రదించండి: సౌత్ ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్, 09778495589 / 09000297130

తేది: 14.11.2024 — అధీకృత అధికారి
ప్రదేశం: హైదరాబాద్ — (చీఫ్ మేనేజర్)

యువత తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి

2కే రన్ పోస్టర్ ఆవిష్కరించిన సీపీ సీవీ ఆనంద్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీవీ ఆనంద్

బంజారాహిల్స్: యువత చెడు వ్యసనాల బారిన పడకుండా తల్లిదండ్రుల కలలను సాకారం చేసి జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ పిలుపునిచ్చారు. తెలంగాణ విద్యా సమితి ఆధ్వర్యంలో డిసెంబర్ 21న నెక్లెస్ రోడ్డులో జరగనున్న డ్రగ్స్ రహిత తెలంగాణ 2కే రన్, మానవ హారం కార్యక్రమాల పోస్టర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీవీ ఆనంద్ మాట్లాడుతూ చెడు అలవాట్ల బారిన పడి నిండు జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. తల్లిదండ్రులకు మానసిక క్షోభను మిగల్చవద్దన్నారు. తెలంగాణ విద్యా సమితి అధ్యక్షుడు పెండెం తారక్‌గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు, విద్యావంతులు 2కే రన్‌లో పెద్దసంఖ్యలో పాల్గొని ఆరోగ్య తెలంగాణ ఆవశ్యకతను తెలిసేలా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్ అశోక్, సాయినాథ్‌రెడ్డి, మంత్రి రాజు, చిరంజీవి, శ్యాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో డయాబెటిస్‌పై అవగాహన సదస్సు

సాక్షి, సిటీబ్యూరో: డయాబెటిస్‌పై జాగ్రత్తగా ఉండాలని, 35 ఏళ్లు నిండిన వారు ఎప్పటికప్పుడూ టెస్టులు చేయించుకోవాలని నిమ్స్ వైద్యులు సూచించారు. గురువారం నిజాం వైద్య విజ్ఞాన కేంద్రం (నిమ్స్)లో ప్రపంచ డయాబెటిస్ డే సందర్భంగా అవగాహన సదస్సు జరిగింది. సొసైటీ ఫర్ స్టడీ ఆఫ్ డయాబెటిస్ తెలంగాణ విభాగంతో కలిసి నిమ్స్ ఎండోక్రైనాలజీ విభాగం అవగాహనా సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా డయాబెటిస్ విషయంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పలువురు నిపుణులు సూచనలు చేశారు. టైప్–1 డయాబెటిస్‌తో బాధపడుతున్న చిన్నారులకు సంబంధించి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇక, డయాబెటిస్ విషయంలో జాగ్రత్తలు పాటించకపోతే రక్తనాళ సంబంధిత సమస్యలు తలెత్తి కిడ్నీలు, కళ్లు, నాడీ వ్యవస్థ, గుండె, మెదడు, కాళ్లు దెబ్బతినే ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు. కాగా ఈ కార్యక్రమానికి హాజరైన ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ హాజరయ్యారు. టైప్–1 డయాబెటిస్‌తో బాధపడుతున్న చిన్నారులకు ఇన్సులిన్ పంప్స్ రూపంలో తెలంగాణ ప్రభుత్వ సాయంతో నిమ్స్ చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు.

హైడ్రా సిబ్బందికి ట్రాఫిక్‌పై సూచనలు



బంజారాహిల్స్: కొద్దిరోజుల నుంచి ట్రాఫిక్ విధుల్లో హైడ్రా సిబ్బంది పాల్గొంటూ ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు. వీరు మరింత బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా ట్రాఫిక్ విధులు నిర్వర్తించే విధంగా శిక్షణ ఇవ్వాలని ట్రాఫిక్ అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా గురువారం బంజారాహిల్స్ రోడ్డునెంబర్–1/3 చౌరస్తాలోని నాగార్జున సర్కిల్‌లో ట్రాఫిక్ డీసీపీ రాహుల్‌హెగ్డే హైడ్రా సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. స్టాప్‌లైన్ ముందుకువచ్చి ఎవరైనా ఆగితే వెంటనే వారిని వెనక్కి వెళ్లేవిధంగా చూడాలన్నారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే సంబంధిత ఎస్‌ఐ దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

దళితులకు నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యం ఇవ్వాలి

లిబర్టీ: కాంగ్రెస్ కమిటీ కార్యవర్గం, నామినేటెడ్ పదవుల్లో దళితులకు ప్రాధాన్యత కల్పించాలని కాంగ్రెస్ నాయకులు, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వి.సదానందు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పీసీసీ అధ్యక్షులు ఉమా మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దళితులకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. నూతన పీసీసీ కార్యవర్గంలోనూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శి, ఉపాధ్యక్ష పదవుల్లోనూ ప్రాధాన్యత కల్పించాలని విన్నవించారు. కాంగ్రెస్ పార్టీకి నమ్ముకుని జెండాను భుజాన వేసుకొని పని చేస్తున్న వారికి తగిన న్యాయం చేయాల్సిన అవసరం ఉందని కోరారు. ఈ సందర్భంగా దళితులకు సంపూర్ణ న్యాయం చేస్తామని నామినేటెడ్ పోస్టుల్లోనూ పీసీసీ కార్యవర్గంలోనూ తగిన ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చినట్లు సదానందు తెలిపారు.

ఎన్యుమరేటర్లకు వివరాలు తెలిపిన కార్పొరేటర్



శ్రీనగర్‌కాలనీ: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, కులగణన కార్యక్రమంలో భాగంగా సోమాజీగూడ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్‌యాదవ్ ఇంటికి గురువారం ఎన్యుమరేటర్లు వచ్చి సర్వే నిర్వహించారు. పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వనం సంగీత తమ పూర్తి వివరాలను ఎన్యుమరేటర్లకు వివరించారు.

బంజారాహిల్స్ రోడ్ నెంబర్–14 లోని నందినగర్ అంగన్వాడీ కేంద్రంలో గురువారం వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవిత రెడ్డి బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు పలు బహుమతులు అందజేసిన అనంతరం వారికితో కలిసి కేక్ కట్ చేశారు. - వెంకటేశ్వర కాలనీ



చిన్నారుల ఆట, పాటలు అదుర్స్..!

- ఘనంగా జాతీయ బాలల దినోత్సవం
- వివిధ వేషధారణలతో ఆకట్టుకున్న చిన్నారులు
- ఆలోచింపచేసిన సాంస్కృతిక ప్రదర్శనలు

జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా చిన్నారులు ఆట,పాటలతో అదుర్స్ అనిపించారు. ఈ సందర్భంగా జాతీయ నేతలతోపాటు విచిత్ర వేషధారణలతో ఆకట్టుకున్నారు. అలాగే ప్రకృతిపై సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చి ఎంతగానో ఆలోజింపచేశారు. చిన్నారులకు వివిధ అంశాలపై క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.





వేడుకల్లో చిన్నారులు



సంప్రదాయ నేపాలీ నృత్యం చేస్తున్న సరస్వతి

బీవీబీపీ స్కూల్‌లో కనువిందు చేసిన వేడుకలు..

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ విద్యాశ్రమంలో గురువారం జాతీయ బాలల దినోత్సవ వేడుకలు కనులపండువగా నిర్వహించారు. ప్రకృతి నేపథ్యంగా తీసుకుని వినూత్నంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రీ ప్రైమరీ విద్యార్థులు పండ్లు, చెట్లు తదితర అంశాల వేషధారణలతో అలరించారు. ఇక్కడి టీచర్లు నృత్యాలు చేసి చిన్నారులను విశేషంగా ఆకట్టుకున్నారు. ఆటపాటలతో ఈ కార్యక్రమం వేడుకగా సాగింది. స్కూల్ ప్రిన్సిపాల్ అరుణశ్రీ కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు చదువులపై దిశా నిర్దేశం చేసి బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రీ ప్రైమరీ విభాగం మొత్తం ఈ వేడుకతో రంగులమయంగా మారింది. మూడు గంటల పాటు పాఠశాల ఆవరణ ఆటపాటలు, క్విజ్, పెయింటింగ్ తదితర పోటీలతో విశేషంగా ఆకట్టుకుంది.

ఆకట్టుకున్న నేపాలీ సంప్రదాయ నృత్యం

ఫిలింనగర్: జాతీయ బాలల దినోత్సవ వేడుకల్లో భాగంగా జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–10సీ లోని గాయత్రీహిల్స్ లిటిల్‌స్టార్ హైస్కూల్‌లో విద్యార్థులు జాతి నేతల వేషధారణల్లో ఆకట్టుకున్నారు. ఇక్కడ చదువుతున్న నేపాలీ విద్యార్థిని సరస్వతి చేసిన నేపాలీ సంప్రదాయ నృత్యం అందరినీ ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులు దేశభక్తి గీతాలను ఆలపిస్తూ భారీ ర్యాలీ నిర్వహించగా ఈ ర్యాలీలో స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ అస్మతున్నీసా కూడా పాల్గొన్నారు. విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించిన అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

బడ్స్ అండ్ బ్లూమ్స్ స్కూల్‌లో...

శ్రీనగర్‌కాలనీ: బాలల దినోత్సవ వేడుకలు గురువారం బడ్స్ అండ్ బ్లూమ్స్ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు పలు పోటీలను నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి వెల్‌నెస్ కోచ్ హరీశ్, సంతోష్‌లు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలుఅలరించాయి. కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి శ్రీనగర్‌కాలనీ, బంజారాహిల్స్‌లో చిన్నారులకు స్వీట్స్ అందించి బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ శశిభూషన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

మాజీ డీజీపీ అరుణ బహుగుణ

బంజారాహిల్స్: పిల్లలు బాగా చదువుకుని ఉన్నత స్థానాల్లో రాణించాలని, పాఠశాల ప్రతి విద్యార్థికి ఒక మెట్టులాంటిదని మాజీ డీజీపీ అరుణ బహుగుణ అన్నారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన జాతీయ బాలల దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొని నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బాలికలు చదువుల తర్వాత మంచి ఉద్యోగం సంపాదించాకనే వివాహాలు చేసుకోవాలని, బాల్య వివాహాలు మంచిది కాదన్నారు. ప్రతి విద్యార్థీ ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలన్నారు. అనంతరం ఆమె వెయ్యిమంది విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేశారు. అంతకముందు పాఠశాల విద్యార్థులు పేపర్‌తో తయారు చేసిన ఫ్లవర్ బొకేను అందుకున్న ఆమె వారి ప్రతిభను కొనియాడి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్‌మాస్టర్ బి. రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పార్కులు, రోడ్ల నిర్మాణాలకు అంచనాలు తయారు చేయాలి

అక్రమ నిర్మాణాలు, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి : జడ్‌సి ఉపేందర్‌రెడ్డి



వివరిస్తున్న కార్పొరేటర్ తదితరులు

వెంగళరావునగర్: డివిజన్ పరిధిలోని అన్ని పార్కులు, అసంపూర్తిగా ఉన్న రోడ్ల నిర్మాణాల విషయంలో అధికారులు అంచనాలు తయారు చేయాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి తెలియజేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్‌కాలనీ, సిద్ధార్థనగర్‌కాలనీ, జవహర్‌నగర్, ఈస్ట్ రహమత్‌నగర్ తదితర ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఇందులో భాగంగా తొలుత ఆయా పార్కులను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్, మధురానగర్, సిద్ధార్థనగర్ కాలనీలకు చెందిన అసోసియేషన్ నేతలు తమ ప్రాంతాల్లోని సమస్యలను ఆయనకు వివరించారు. సీ,డీ,ఎ ఫ్,జీ బ్లాకుల్లోని పార్కుల్లో వాకింగ్ ట్రాక్‌తో పాటుగా ఓపెన్ జిమ్‌లు నిర్మించాలని పేర్కొన్నారు. ఈ క్రమంలో డీ–బ్లాక్‌లో కొత్తగా వేసిన సీసీ రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో జడ్‌సి కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే గుంతలను పూడ్చాలని, ప్రధాన నాలాకు ఇరువైపులా ఉన్న రోడ్డు జాయింట్లను క్రమపద్ధతిలో కలపాలని సూచించారు. ఈస్ట్ రహమత్‌నగర్, జవహర్‌నగర్ ఏరియాల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఆయనకు ఫిర్యాదు చేయగా, అనుమతులు లేని నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని టౌన్‌ప్లానింగ్ అధికారులకు సూచించారు. శానిటేషన్ విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని అన్నారు. జోనల్ కమిషనర్ పర్యటనలో కార్పొరేటర్‌తో పాటుగా మధురానగర్, సిద్ధార్థనగర్ కాలనీనేతలు, సర్కిల్–19 ఉప కమిషనర్ జకియా సుల్తానా, హార్టికల్చర్ డిడి అనిల్‌కుమార్, వీధి దీపాలు, రోడ్ల ఈఈలు మల్లిఖార్జున్, రాజ్‌కుమార్, ఏఎంటహెచ్ సాలోమన్, డీఈ రామచంద్రరాజు, ఏఈ అవినాష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఆటోపై కూలిన భారీ వృక్షం

ఆటోడ్రైవర్‌కు గాయాలు



ఖైరతాబాద్: సచివాలయం వెనుక మింట్ కాంపౌండ్ రోడ్డులో ఓ భారీ వృక్షం కూలిపోవడంతో ఆటోడ్రైవర్‌కు గాయాలైన సంఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గురువారం సాయంత్రం మింట్ కాంపౌండ్ రోడ్డులో పాఠ్యపుస్తక ముద్రణాలయం వెనుక వైపు ఉన్న భారీ వృక్షం ఒక్కసారిగా కూలిపోయింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఆటో (టిఎస్07యుఈ3742)పై పడటంతో డ్రైవర్ షేక్ జానీకి తలకు గాయాలయ్యాయి. వెంటనే ఆటోడ్రైవర్‌ను 108లో ఆసుపత్రికి తరలించారు. ఆ సమయంలో ఆటోలో ప్రయాణికులెవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఆ తరువాత అధికారులు రోడ్డుపై కూలిన భారీ వృక్షాన్ని తొలగించి వాహనాల రాకపోకలకు పునరుద్ధరించారు.

ప్రభుత్వ నిర్ణయం మార్చుకోకుంటే తీవ్ర పరిణామాలు

అంబేడ్కర్ వర్సిటీ ఉద్యోగుల హెచ్చరిక



అంబేడ్కర్ వర్సిటీ ఉద్యోగుల ఆందోళన

బంజారాహిల్స్: గత 56 రోజులుగా ప్రశాంతంగా మధ్యాహ్న భోజన విరామ సమయంలో జరిగే నిరసనలు రానున్న రోజుల్లో ప్రజా ఉద్యమంగా మారనున్నట్లు జేఏసీ సభ్యులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పదెకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో పరిపాలనా భవనం ముందు బైఠాయించి, నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనను కొనసాగించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయాన్ని మార్చుకోకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ వడ్డాణం శ్రీనివాస్, చైర్‌పర్సన్ పల్లవీ కాబ్డే, జేఏసీ నేతలు రవీంద్రనాథ్ సోలమన్, ప్రమీల కేతావత్, కాంతం ప్రేమ్‌కుమార్, బ్రహ్మానందనాయుడు, అవినాష్, కిషోర్, రాఘవేంద్ర, రజిత తదితరులు పాల్గొన్నారు.

కొత్త సంవత్సరంలో రిజర్వాయర్ ప్రారంభం

రహమత్‌నగర్: జనవరిలో ఎస్పీఆర్‌హిల్స్ కొత్త రిజర్వాయర్ ద్వారా నీరందిస్తామని కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి తెలిపారు. గురువారం రిజర్వాయర్ పనులను ఆయన పరిశీలించి అక్కడి అధికారులతో మాట్లాడారు. రిజర్వాయర్ పనులు దాదాపు పూర్తి అయ్యాయని కేవలం పైప్‌లైన్ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయన్నారు. వాటిని వచ్చే జనవరిలోపు పూర్తిచేసి బస్తీలకు నీరందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని సీఎన్‌రెడ్డి తెలిపారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి

ట్రాస్ స్వచ్ఛంద సంస్థ మేనేజర్ రాజేష్ లిమ్కర్



విద్యార్థులతో ట్రాస్ సంస్థ మేనేజర్ రాజేష్, కరస్పాండెంట్ సుధాకర్‌లు

రహమత్‌నగర్: దేశ వ్యాప్తంగా ప్రతిరోజూ గంటకు 20మంది రోడ్డు ప్రమాదంలో మృతి చెందుతున్నారని, హెల్మెట్ వాడటంతో మరణాలను కొంత మేరకైనా నివారించొచ్చని ట్రాస్ స్వచ్ఛంద సంస్థ మేనేజర్ రాజేష్ లిమ్కర్ అన్నారు. తమ సంస్థ తొలివిడతగా గ్రేటర్ హైదరాబాద్ నగరంలో 300 పాఠశాలలు ఎంపిక చేసుకుని విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఉచితంగా హెల్మెట్‌లను అందజేస్తున్నదని స్పష్టం చేశారు. ఎస్పీఆర్‌హిల్స్ బ్రహ్మశంకర్‌నగర్ సెయింట్ సాల్మాన్ హైస్కూల్లో ఇండస్‌లాండ్ బ్యాంకు సౌజన్యంతో గురువారం హెల్మెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ప్రయాణం చేస్తున్నప్పుడు సురక్ష, భద్రత ప్రామాణాలు ప్రతి వ్యక్తి పాటించాలని సూచించారు. ప్రతి వాహనదారుడు వారితో ప్రయాణిస్తున్న వారు తప్పక హెల్మెట్ ధరించాలన్నారు. నాసికరం హెల్మెట్ వాడకుండా ఐఎస్ఐ బ్రాండు హెల్మెట్ వాడాలని తెలిపారు. కరస్పాండెంట్ సుధాకర్ మాట్లాడుతూ హెల్మెట్ లేని కారణంగా ఎంతోమంది ప్రముఖుల కుమారులు రోడ్డు ప్రమాదంతో మృతి చెందారని ఆయన గుర్తు చేశారు. అనంతరం 150 హెల్మెట్లను విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అందజేశారు. అనంతరం ఛాయచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ప్రీతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపులో జాప్యం తగదు

సీఎంకు జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ విజ్ఞప్తి

కాచిగూడ: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించే విషయంలో జాప్యం చేయడం తగదని, ఈ సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ కార్యవర్గ సమావేశం విజ్ఞప్తి చేసింది. ఇళ్ల స్థలాల విషయంలో గత ప్రభుత్వం నమ్మబలికి జర్నలిస్టులకు అన్యాయం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మోసం చేయవద్దని సమావేశం కోరింది. గురువారం సొసైటీ కార్యాలయంలో కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ స్థలం విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను గత ప్రభుత్వం అమలు చేయలేదని, కాగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేసిందని, అందుకు తాము ముఖ్యమంత్రికి రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఇటీవల జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యపై ముఖ్యమంత్రి మాట్లాడిన తీరు యావత్ జర్నలిస్టులను నిరాశకు గురిచేసిందని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ, కాంగ్రెస్ మేనిఫెస్టో మేరకు అర్హులైన జర్నలిస్టులందరికీ వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి బొల్లం శ్రీనివాస్, పిల్లి రాంచందర్, తన్నీరు శ్రీనివాస్, పట్లోళ్ల భాస్కర్ రెడ్డి, బి.రామారావు, యర్రమిల్లీ రామారావు, గజ్జల వీరేశం, రమాదేవి పాల్గొన్నారు.



జవహర్‌లాల్ నెహ్రూ అందించిన సేవలు ఎనలేనివి

రహమత్‌నగర్: భారత తొలి ప్రధానిగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ దేశానికి అందించిన సేవలు ఎనలేనవని కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి కొనియాడారు. జవహర్‌లాల్ నెహ్రూ జయంతి జయంతి సందర్భంగా గురువారం ఎస్పీఆర్‌హిహిల్స్‌లో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని బాలల దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. అదే విధంగా రహమత్‌నగర్, బోరబండ డివిజన్‌లోని పలు పాఠశాలల్లో బాలల దినోత్స ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయుల భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జీవత గాధకు విద్యార్థులకు వివరించారు.



ఎస్పీఆర్‌హిల్స్ నివాళులు అర్పిస్తున్న సీఎన్ రెడ్డి

సీఎం రిలీఫ్ ఫండ్ వరం


రహమత్‌నగర్: సీఎంఆర్‌ఎఫ్ ఫండ్ ద్వారా ఎంతోమంది నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భవానిశంకర్ గుర్తు చేశారు. ఎస్పీఆర్‌హిల్స్ ఓంనగర్‌కు చెందిన బాధితురాలు సరళకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 90వేల ఎల్‌ఓసీని గురువారం ఆమె కుమారుడికి అందజేశారు. ఈ సందర్భంగా సీఎంఆర్‌ఎఫ్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గ్యారనాగరాజు, సుందర్‌రాజ్, మార్టిన్, బెన్నార్‌కిరణ్‌బాబు, సాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బెల్టులు, ఐడీ కార్డుల అందజేత

ఖైరతాబాద్: ఖైరతాబాద్ డివిజన్ మార్కెట్ రోడ్డులోని నిశుల్క్ ప్రభాత్ ప్రభుత్వ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈ పాఠశాల 1998–99 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు 39 మంది తాము చదువుకున్న పాఠశాలకు ఏదైనా చేయాలనే సంకల్పంతో రూ.18 వేలతో పాఠశాలలో చదువుతున్న 280 మంది విద్యార్థులకు బెల్టులు, ఐడీ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వై.కరుణాకర్‌రెడ్డి, మేనేజ్‌మెంట్ సభ్యులు రాకేష్ భట్నాగర్, ప్రణీత పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఘనంగా 'బీబీజీ' బంగారు తల్లి ఫౌండేషన్ వేడుకలు



చెక్కును అందజేస్తున్న సినీనటి నయన సారిక

బంజారాహిల్స్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సినీనటి నయన సారిక అన్నారు. బిల్డింగ్ బ్లాక్స్ గ్రూప్ (బీబీజీ) ఆధ్వర్యంలో నగరంలో జరిగిన బీబీజీ బంగారు తల్లి ఫౌండేషన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు హాజరైన నయన సారిక మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచే విద్యలో రాణించాలన్నారు. కృషి, పట్టుదల, అంకితభావంతో ఉన్నత శిఖరాలు అధిరోహించగలరన్నారు. బంగారు తల్లి ద్వారా బాలికా సాధికారతకు పాటుపడడం అభినందనీయమన్నారు. బీబీజీ సీఎండీ మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ 2040 నాటికి రెండు మిలియన్ల మంది బాలికలకు విద్యను అందించాలన్న లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. బంగారు తల్లి ఫౌండేషన్ బాలికా విద్యపై విశేషంగా కృషి చేస్తుందన్నారు. మహిళల అభ్యున్నతి దేశ ఉన్నతికి ఎంతో అవసరం అన్నారు. పేద బాలికలకు కూడా నాణ్యమైన విద్యను అందేలా చేయడం తమ లక్ష్యమన్నారు. విద్య ద్వారా వారి కలలను సాకారం చేయనున్నామన్నారు. జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయురాలు జ్యోతి మా ట్లాడుతూ బిల్డింగ్ బ్లాక్ గ్రూప్, బంగారు తల్లి బృందాలకు అభినందనలు తెలిపారు. బంగారు తల్లి ప్రోగ్రాం బాలికలు విద్యనభ్యసించడానికి ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. ఆడ పిల్లల చదువుపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. బీబీజీ కృషితో ఆడ పిల్లలు ఆత్మవిశ్వాసంతో ఎదుగుతూ, సమాజంలో మార్పు తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. బిల్డింగ్ బ్లాక్ గ్రూప్ అసోసియేట్స్ రూ.10 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో బంగారు తల్లి ప్రతినిధి నీరజ, ఉషా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం వాల్మీకులను ఆదుకోవాలి

లిబర్టీ: అత్యంత దయనీయ బతుకులు వెళ్లదీస్తూ ఆర్థికంగా చితికిపోయిన వాల్మీకులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని వాల్మీకి సేవ సమాజ్‌సంగ్ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు డి.ప్రీతం విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క వెంటనే తమను ఆదుకోకపోతే మరింత దుర్భర జీవితాలు వెళ్లదీంచాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో సంప్రదాయ వృత్తి లేక కుటుంబాలను సైతం పోషించుకోలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పదేళ్లకాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తమను పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి వాల్మీకులు అండగా నిలవాలని కోరారు. వాల్మీకుల కోసం ప్రత్యేక ఆర్థిక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. 500 కోట్లు కేటాయించాలని, ఫలితంగా వాల్మీకులకు ఆర్థిక అభివృద్ధి సాధిస్తారని చెప్పారు. అనేక ప్రభుత్వాలు మారుతున్న తమ జీవన స్థితిగతులు, జీవన ప్రమాణాల్లో మెరుగుదల లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

16న తెలంగాణ ఉద్యమకారుల స్టీరింగ్ కమిటీ సమావేశం

కాచిగూడ: తెలంగాణ ఉద్యమకారుల స్టీరింగ్ కమిటీ సమావేశం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం ఉదయం 10:30 గంటలకు జరుగుతుందని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రజాసంఘాల నాయకులు, తొలి, మలిదశ ఉద్యకారులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఉద్యమకారులను గుర్తించాలని, అమరుల కుటుంబాలను ఆదుకోవాలని, 250 గజాల ఇంటి స్థలంతో పాటు 4 గదుల ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారులకు రూ.30వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఉద్యమకారులు అధిక సంఖ్యలో పాల్గొని తమ సూచనలు, సలహాలు చేయాలని ఆయన కోరారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకుని భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. కళాకారుల బృందాలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

సీఎం మామ పద్మారెడ్డి ఇంట్లో సర్వే పూర్తి



సీఎం రేవంత్‌రెడ్డి మామ సూదిని పద్మారెడ్డి ఇంట్లో సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లు

బంజారాహిల్స్: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సమగ్ర సర్వేలో భాగంగా జూబ్లీహిల్స్ రోడ్ నంబర్–10 సీలోని ఎంపీ, ఎమ్మెల్యేకాలనీలో నివసించే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మామ సూదిని పద్మారెడ్డి ఇంట్లో ఎన్యుమరేటర్లు సర్వే చేశారు. సమగ్ర కుటుంబ సర్వే సూపర్‌వైజరీ అధికారి వి.గంగాధర్, ఎన్యుమరేటర్లు రమేష్, వెంకట్ ప్రసాద్‌లు సర్వేలో భాగంగా 75 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని ఆయనకు అందజేశారు. ఆయన దరఖాస్తును పూరించారు. ఈ సందర్భంగా సమగ్ర సర్వే జరుగుతున్న తీరును ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సర్వే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన తెలిపారు.

23న కలెక్టరేట్‌లో బీసీ పబ్లిక్ హియరింగ్

అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి



సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ కలెక్టరేట్‌లో ఈ నెల 23న ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని అదనపు కలెక్టర్ రెవెన్యూ ముకుందరెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో బీసీ కమిషన్ పర్యటన ఏర్పాట్లపై అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ కమిషన్ పబ్లిక్ హియరింగ్ కోసం అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బీసీల అభ్యున్నతి, జీవన స్థితిగతులు, ప్రయోజనాలపై సూచనలు, అభ్యంతరాల స్వీకరణ కార్యక్రమంలో కులసంఘాల నుంచి దరఖాస్తులు స్వీకరణలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పించాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌ఓ వెంకటాచారి, ఆర్డీఓలు హైదరాబాద్ రామకృష్ణ, సికింద్రాబాద్ సాయిరామ్, బీసీ సంక్షేమ జిల్లా అధికారి ఆశన్న, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఇలియాస్ అహ్మద్, జీహెచ్‌ఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



బాలలతో ఆచార్య అలేఖ్య పుంజాల, అందెశ్రీ, డాక్టర్ బాలాచారి

నాంపల్లి: తెలంగాణ సాహిత్య అకాడమి, తెలంగాణ సంగీత నాటక అకాడమీ సంస్థల సంయుక్తాధ్వర్యంలో నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో బాలల దినోత్సవం వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ సంగీత నాటక అకాడమి అధ్యక్షురాలు ఆచార్య అలేఖ్య పుంజాల హాజరై స్ఫూర్తిదాయకమైన ప్రసంగం చేశారు. లోక కవి అందెశ్రీ మాట్లాడుతూ.. దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకు పిల్లలంటే ఇష్టమని చెబుతూ భవిష్యత్తులో పెద్దయ్యాక ఏ వృత్తి చేపట్టినా అందులో రాణించాలన్నారు. సాహిత్య అకాడమి కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి అధ్యక్షోపన్యాసం చేస్తూ.. బాల్యం నుంచే బాలలు సాహిత్య పఠనం, సృజన అలవర్చుకోవాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన బాలల కథానిక, కవిత్వం, వ్యాసరచన పోటీలకు సంబంధించిన నేపథ్యాన్ని వివరించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన బాలబాలికలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంగీత నాటక అకాడమి కార్యదర్శి మనోహర్ పాల్గొన్నారు.

బాటిళ్ల నీళ్లూ కలుషితం!

కాచిగూడలోని ఓ కంపెనీలో ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీ



సాక్షి, సిటీబ్యూరో: పలు హోటళ్లలో ఆహారం నాణ్యతపై వరుసగా దాడులు చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు.. బాటిళ్లలోని నీళ్ల నాణ్యతపై ఫోకస్ పెట్టారు. గురువారం రాత్రి ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ అధికారులతో కలిసి జీహెచ్‌ఎంసీకి చెందిన ఫుడ్ సేఫ్టీ అధికారులు కాచిగూడలోని కే2 కింగ్ ఆక్వా అనే కంపెనీపై ఆకస్మిక తనిఖీలు చేశారు. టీడీఎస్ నిబంధనల ప్రకారం నీటి నాణ్యత లేదని గుర్తించిన అధికారులు.. రూ.3.85 లక్షల విలువైన 19,268 లీటర్ల తాగు నీటిని సీజ్ చేశారు. ఈ కంపెనీ ఐదు రకాల పేర్లతో వాటర్ బాటిళ్లు తయారు చేసి అమ్ముతున్నారని గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకున్నారు. తదుపరి పరీక్షల కోసం శాంపుల్స్‌ను ఫుడ్ ల్యాబ్స్‌కు తరలించారు.

రూ.30 కోట్లయినా రాలేదు!

కేటాయించింది రూ.3,065 కోట్లు

- కొత్త బడ్జెట్‌కు సమయమొచ్చినా.. రాష్ట్ర బడ్జెట్ నుంచి నిధులు లేవు
- మిగిలింది నాలుగున్నర నెలలు..
- ఈ ఆర్థిక సంవత్సరానికి వచ్చేవెన్నో?
- సంకట స్థితిలో బల్దియా



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రం ఏర్పడిన తర్వాత జీహెచ్‌ఎంసీకి గడచిపోయిన పదేళ్లలో రాష్ట్ర బడ్జెట్‌లో ఏ సంవత్సరం కూడా తగిన నిధులు కేటాయించలేదు. తప్పదన్నట్లు.. మొక్కుబడిగా ఉండేవి తప్ప ఏనాడూ కనీసం రూ.50 కోట్లు కూడా కేటాయించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర బడ్జెట్‌లో గతంలో మునుపెన్నడూ లేనివిధంగా ఏకంగా రూ.3,065 కోట్లు కేటాయించడంతో జీహెచ్‌ఎంసీ వర్గాలు తబ్బిబ్బయ్యాయి. ఎంతో కాలంగా ఆర్థిక అవస్థలతో అల్లాడుతున్న బల్దియాకు కొత్త బలం వస్తుందని ఆశించాయి. కానీ.. రాష్ట్ర బడ్జెట్‌లోని కేటాయింపులు కాగితాల్లో తప్ప జీహెచ్‌ఎంసీకి మాత్రం ఇంతవరకూ రాలేదు. అంతో ఇంతో కేంద్రం నుంచి అందిన నిధులు తప్ప, ఈ ఆర్థిక సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం తన ఖజానా నుంచి కనీసం రూ.30 కోట్లు కూడా జీహెచ్‌ఎంసీకి విడుదల చేయలేదని తెలుస్తోంది.

నిధులెలా..?

ఈ ఆర్థిక సంవత్సరం జీహెచ్‌ఎంసీ బడ్జెట్‌ను రూ.7,937 కోట్లతో ఆమోదించారు. అందులో ఇప్పటి వరకు రూ.3 వేల కోట్లకు పైగా ఖర్చయినట్లు తెలుస్తోంది. ఇందులో జీహెచ్‌ఎంసీ సొంత వనరులైన ఆస్తిపన్ను, టౌన్‌ప్లానింగ్ ఫీజులు, ట్రేడ్ లైసెన్సుల వంటి ద్వారా వచ్చిన ఆదాయంతో పాటు అప్పులు కూడా ఉన్నాయి. ఇందులో రూ.1300 కోట్ల మేర ఆస్తిపన్ను ద్వారానే సమకూరింది. కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రాజెక్టు పనులకు ప్రత్యేక సహాయం, చెరువుల పునరుద్ధరణ, 15వ ఆర్థిక సంఘానికి సంబంధించిన నిధులు తదితరమైనవి వెరసి దాదాపు రూ.415 కోట్ల వరకు అందినట్లు సమాచారం. అంతేతప్ప రాష్ట్ర ప్రభుత్వం నుంచి మాత్రం చెప్పుకోదగ్గ నిధులేవీ ఇంతవరకు అందలేదు. మరో నాలుగున్నర నెలల్లో ఆర్థిక సంవత్సరం ముగిసిపోనుంది. అప్పటిలోగానైనా రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని నిధులిస్తుందో..? ఏ పనులకు కేటాయిస్తుందో వేచి చూడాల్సిందే..

రాష్ట్ర బడ్జెట్‌లో జీహెచ్‌ఎంసీకి కేటాయింపులిలా..

అంశం	కేటాయింపులు(రూ.కోట్లు)
హైసిటీ(హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)	: రూ.2,654
మిలియన్ ప్లస్ నగరాలకు ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్లు	: రూ.411

◆ వెరసి రూ.3,065 కోట్లు బడ్జెట్‌లో కేటాయించినప్పటికీ, కనీసం రూ.30 కోట్లు కూడా రాకపోవడంతో జీహెచ్‌ఎంసీ పరిస్థితి కష్టంగా మారింది.

అన్నీ హైసిటీ కిందే..

గతంలో వ్యూహాత్మక రహదారుల పథకం (ఎస్సార్‌డీపీ), వ్యూహాత్మక నాలా అభివృద్ధి పథకం(ఎస్‌ఎన్‌డీపీ), సమగ్ర రోడ్డు నిర్వహణ పథకం(సీఆర్‌ఎంపీ) తదితర పేర్లతో వివిధ పనులకు వివిధ పేర్లుండగా, వాటన్నింటినీ రద్దుచేసి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నగరంలో చేసే పనులన్నింటినీ హైసిటీ ప్రాజెక్ట్ పేరిటే చేస్తోంది. అందుకే రాష్ట్ర బడ్జెట్ కేటాయింపుల్లోనూ అలాగే పేర్కొంది. కానీ.. ఇంకా నిధులే రాలేదు. ఇదే సమయంలో వివిధ ప్రాజెక్టుల పనులకు రూ.వందల కోట్ల మేర పరిపాలన అనుమతులు మాత్రం జారీ చేసింది. కేబీఆర్ పార్కు చుట్టూ ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణాలకు రూ.826 కోట్లకు పరిపాలన అనుమతులు జారీ చేసి, టెండర్లు పిలవాల్సిందిగా కూడా జీహెచ్‌ఎంసీని ఆదేశించింది. నిధులు రాష్ట్ర బడ్జెట్ నుంచి కేటాయించనున్నట్లు తెలిపింది. కానీ.. నిధులెప్పుడు వస్తాయో తెలియకుంది.



విటమిన్ డి లోపం ఉన్న గ్రామీణుల కోసం..

సాక్షి, సిటీబ్యూరో: మారుమూల గ్రామాల్లో విటమిన్–డితో బాధపడుతున్న నిరుపేదల ఆరోగ్యానికి భద్రత అందించేందుకు వైద్య సేవలు అందించే సామాజిక సంస్థ ది సెర్ఫ్ ఫౌండేషన్‌తో ఆరోగ్య ఆవిష్కరణలకు పేరొందిన యుకె సంస్థ విటోన్నిక్స్ సంస్థ చేతులు కలిపింది. ఈ విషయాన్ని ఇరు సంస్థల ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా తొలి దశలో రూ.కోటి విలువ చేసే విటమిన్–డి సబ్లిస్ప్రే 20వేల బాటిల్స్ సప్లిమెంట్‌ను అందించనుందని, రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగానూ ఈ కార్యక్రమం కొనసాగనుందని వివరించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో సత్తా చాటాలి



విజ్ఞాన ప్రదర్శనను తిలకిస్తున్న రెవరెండ్ బి.విన్‌స్టన్ తదితరులు, ఫుడ్ కోర్టులో విద్యార్థులు

అబిడ్స్: విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని మెదక్ చర్చ్ ఆఫ్ సౌంత్ ఇండియా వైస్ చైర్మన్ రెవరెండ్ బి.విన్‌స్టన్ అన్నారు. అబిడ్స్‌లోని సెయింట్ జార్జెస్ గ్రామర్ స్కూల్స్ 190 సంవత్సరాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో గురువారం జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన రెవరెండ్ విన్‌స్టన్ విద్యార్థుల సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి తిలకించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే అతి పురాతనమైన సెయింట్ జార్జెస్ గ్రామర్ స్కూల్స్ ఉత్తమమైన విద్యను బోధిస్తూ లక్షలాది మంది విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దిందన్నారు. విద్యార్థి దశ నుంచే విద్యార్థులను విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో తమ ప్రతిభను చాటేలా సెయింట్ జార్జెస్ యాజమాన్యం కృషి చేస్తుందన్నారు. స్కూల్ ప్రారంభించిన నాటి నుండి నేటి వరకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తూ విద్యారంగ వ్యాప్తికి కృషి చేస్తుందన్నారు. తమ పాఠశాలల ప్రత్యేక అధికారి ఆర్.సత్యానందం గ్రామర్ స్కూల్స్ అభివృద్ధికి చేస్తున్న కృషి అమోఘమన్నారు. సత్యానందంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమ పాఠశాలల ప్రిన్సిపాల్స్ విద్యార్థుల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న మినిస్టీరియల్ సెక్రెటరీ జయానంద్, లే సెక్రెటరీ డీసీ రిప్రజెంటీవ్‌లు మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్రతి రంగంలో రాణించే విధంగా అధ్యాపకులు, ప్రిన్సిపాపల్స్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సత్యానందం మాట్లాడుతూ తమ పాఠశాలల్లో విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారు ఏ రంగాల్లో రాణిస్తారో ఆయా రంగాల్లో ప్రావీణ్యం సాధించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్..

విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ఎగ్జిబిషన్ విశేషంగా ఆకట్టుకుంది. పుస్తకాల ప్రదర్శన, సోలార్ సిస్టమ్, పలు రకాల స్టాల్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జి.ఈబర్, జైపాల్, పవన్ ప్రభుకుమార్, మంత్రి సోలేమాన్, డాక్టర్ పి.సాల్‌మన్‌రాజ్, డాక్టర్ ఎం.విల్సన్, ప్రిన్సిపల్ మార్తా నిస్సి తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్‌కు ఎంపికైతే దేశానికి సేవ చేసే అవకాశం

21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ కృష్ణప్రదీప్



సదస్సులో కృష్ణప్రదీప్

మణికొండ: సివిల్ సర్వీసుకు ఎంపికైతే దేశానికి సేవ చేసే అవకాశం కలుగుతుందని, అలాంటి దిశగా విద్యార్థులు అడుగులు వేయాలని 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ పి.కృష్ణప్రదీప్ అన్నారు. గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాలలో జీ5 మీడియా గ్రూప్‌తో కలిసి తొలి ప్రయత్నంలోనే సివిల్ సర్వీసులు ఎలా సాధించాలనే అంశంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే తరానికి ఉత్తమమైన లక్షణాలు ఉన్న నాయకులను తయారు చేయడం తమ అకాడమీ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. సివిల్ సర్వెంట్లుగా ఉంటే దేశంలోని ముఖ్యమైన సమస్యల పరిష్కారకర్తలుగా, సానుకూల సామాజిక మార్పు తీసుకుని వచ్చేందుకు కృషి చేయవచ్చన్నారు. ఎంజీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. సివిల్ సర్వీసులో ఉన్న వారిలో 10మందిలో ఆరుగురు ఇంజినీరింగ్ విద్యార్థులే ఉన్నారన్నారు. ఆ దిశగా విద్యార్థులు దృష్టి సారించి సమాజాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ రాజిరెడ్డి, డాక్టర్ రవిచంద్ర, గిరిప్రకాష్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలతో శరీరం, మెదడు ఉత్సాహం

రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న శివసేనారెడ్డి

మణికొండ: ప్రతి ఒక్కరి జీవితంలో క్రీడలు ఒక భాగమైతే వారంతా ఆరోగ్యంగా ఉండటంతో పాటు జీవితంలో అన్ని రంగాల్లో రాణించే అవకాశం ఉంటుందని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో జాతీయస్థాయి ఇంటర్ ఇంజినీరింగ్ స్పోర్ట్స్ ఫెస్ట్(ఆరా–2024)ను ఆయన గురువారం నార్సింగి ఏసీపీ రమణగౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడల్లో చురుగ్గా పాల్గొంటే శరీరం, మెదడు ఉత్సాహంగా ఉంటాయన్నారు. చిన్నతనం నుంచే నచ్చిన క్రీడను ఎంచుకుని అందులో చదువుతో పాటు రాణించాలన్నారు. క్రీడల్లో రాణించే వారికి ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అవకాశాలు లభిస్తాయన్నారు. జాతీయ స్థాయి ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించడం శుభపరిణామన్నారు. సీబీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీవీ నరసింహులు మాట్లాడుతూ.. క్రీడా పోటీలు ఈ నెల 16వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చెస్, క్యారమ్స్, త్రోబాల్, కబడ్డీ, బాస్కెట్ బాల్, ఫుట్‌బాల్ వంటి 10 క్రీడాపోటీల్లో జాతీయ స్థాయిలో పలు కళాశాలలకు చెందిన 140 జట్లు పాల్గొంటున్నాయన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ హెడ్ డాక్టర్ ఆర్.రాజేశ్వరి, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు, అధ్యాపకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

వచ్చేనెల 15న ఇండస్ట్రియల్ క్రికెట్ టోర్నమెంట్

- ఎల్బీ స్టేడియంలో మూడు రోజుల పాటు కొనసాగింపు
- ఫెడరేషన్ హౌస్‌లో టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరణ



టోర్నమెంట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అజారుద్దీన్

నాంపల్లి: ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో ప్రెసిడెంట్స్ కప్–2024 పేరిట మూడు రోజుల ఇండస్ట్రియల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తోంది. ఈ క్రికెట్ టోర్నమెంట్ వచ్చేనెల 15, 16, 17వ తేదీల్లో నిర్వహిస్తోంది. ఎల్బీ స్టేడియం వేదికగా ప్రారంభమయ్యే లీగ్‌లో ఎనిమిది జట్లు పాల్గొంటాయి. ఈ సందర్భంగా రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో భారత మాజీ కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్ హాజరై గురువారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహ్మద్ అజారుద్దీన్ మాట్లాడుతూ.. క్రికెట్‌కు ఎప్పుడూ అండగా ఉంటానని చెప్పారు. పరిశ్రమలకు కొంత సడలింపు అవసరమని, పరిశ్రమల కోసం క్రికెట్ లీగ్‌ను కొనసాగించడం మంచి ఆలోచన అన్నారు. క్రమశిక్షణ కలిగిన జీవన శైలి మనిషిని సన్మార్గంలో నడుపుతుందన్నారు. క్రికెట్‌తో పాటు ఇతర క్రీడల కోసం టోర్నమెంట్లు తప్పనిసరిగా నిర్వహించాలని కోరారు. క్రికెట్‌ను ప్రోత్సహించినట్లు ఇతర క్రీడలను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. క్రికెట్‌లో నిజమైన రొమాన్స్ టెస్ట్ మ్యాచ్‌లే అని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు సురేష్ సింఘాల్ మాట్లాడుతూ.. ఇది కేవలం క్రీడా కార్యక్రమం కాదని, పరిశ్రమల్లోని వ్యక్తుల మధ్య స్నేహ బంధాలను పెంపొందించడానికి దోహదపడుతుందని తెలిపారు.

నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌పై ఉక్కుపాదం

సాక్షి, సిటీబ్యూరో: నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌పై ఉక్కు పాదం మోపాలని ఎక్సైజ్‌శాఖ రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్ అన్నారు. గురువారం అబ్కారీ భవన్‌లో జరిగిన రంగారెడ్డి డివిజన్ ఎక్సైజ్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎక్సైజ్‌శాఖ అంటే ప్రజల్లో మంచి భావన కలిగే విధంగా కింది స్థాయి ఉద్యోగుల నుంచి అన్ని స్థాయిల్లోని ఎక్సైజ్ యంత్రాంగం వ్యవహరించాలని సూచించారు. ఫంక్షన్స్ హాళ్లు, ఫామ్ హౌస్‌లలో జరిగే విందులు, వేడుకల్లో తెలంగాణ మద్యం మాత్రమే వినియోగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్ వినియోగిస్తే కేసులు నమోదు చేయాలని చెప్పారు.

జ్ఞాన తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం



అఫ్జల్‌గంజ్: జ్ఞాన తెలంగాణ సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను అఫ్జల్‌గంజ్‌లోని కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాల్లో సుమారు కోటి పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని అలాగే అఫ్జల్‌గంజ్‌లోని కేంద్ర గ్రంథాలయంలో ఆరు లక్షలకు పైగా పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. వివిధ పోటీ పరీక్షల కోసం ప్రిపేరయ్యే అభ్యర్థుల కోసం చిక్కడపల్లిలోని నగర కేంద్ర గ్రంథాలయం, అఫ్జల్‌గంజ్‌లోని రాష్ట్ర కేంద్ర గ్రంథాలయంలో పుస్తకాలు అందుబాటులో తీసుకువస్తామని ఆయన వెల్లడించారు.

16న విశాఖ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్



మాట్లాడుతున్న పులగం రామచంద్రారెడ్డి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఇండియన్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 6 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విశాఖ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ మొదటి విడత చిత్రాన్ని ప్రదర్శిస్తున్నట్లు ఫిలిం మేకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పులగం రామచంద్రారెడ్డి తెలిపారు. సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డిసెంబర్ 29న విశాఖలోని అల్లూరి సీతారామారాజు విజ్ఞాన కేంద్రంలో రెండవ విశాఖ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ కూడా ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి గౌరవ అతిథులుగా సినీనటులు తనికెళ్ల భరణి పాల్గొంటారని అన్నారు. సాయంత్రం 6గంటలకు ఇన్ దా లాఫ్ మళయాలం, 6.30గంటలకు డెడ్ ఎండ్ తెలుగు, 7 గంటలకు సుమ కన్నడ, 7.30 గంటలకు క్యాసెరా సెరా తెలుగు, 8గంటలకు జల్వంత్ హిందీ, 8.30గంటలకు సాగరవాసి తెలుగు చిత్రాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో దాసరది ఫిలిం సొసైటీ అధ్యక్షుడు ఎస్.వినయ్ కుమార్, కార్యదర్శి బీడీఎల్ సత్యనారాయణ, చిత్ర దర్శకులు కపిల్ జోన్ దాలే, హెచ్ఆర్ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి నిలయంలో బాలల దినోత్సవం



రసూల్‌పురా: బొల్లారం రాష్ట్రపతి నిలయంలో బాలల దినోత్సవాన్ని గురువారం పరిపాలనాధికారి రజనిప్రియా ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. జవహర్ బాలభవన్ తెలంగాణ డైరెక్టర్ ఎస్.విజయలక్ష్మి బాయి, హిమాయత్‌నగర్ చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మన్ వేద కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాలను ప్రారంభించారు. పెయింటింగ్, కవితలు, గీతాలాపన పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ప్రముఖ మెజీషియన్ జాతీయ అవార్డు గ్రహీత చెరువు రవిచంద్ర మ్యాజిక్ ప్రదర్శన, జనగామ జిల్లాకు చెందిన మోతే జగన్నాథం బృందం, ప్రఖ్యాతి చెందిన ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి బృందం ఆధ్వర్యంలో చెక్క బొమ్మలాట ప్రదర్శించారు. సెయింట్ ఆన్స్ పబ్లిక్ స్కూల్, సంస్కృతి కాన్సెప్ట్ స్కూల్, హైటెక్ మోడ్రన్ స్కూల్, జవహర్ బాలభవన్, వివేకానంద హైస్కూల్, వైష్ణవి గ్రూప్ ఆఫ్ స్కూల్స్, ఢిల్లీ వరల్డ్ స్కూల్, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.



చదువుతోనే ఏదైనా సాధించవచ్చు

జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ బాలల దినోత్సవం పురస్కరించుకొని కలెక్టరేట్ ప్రాంగణంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ బాలబాలికలు చదువుతోనే ఏదైనా సాధించగలుగుతామని, ఉన్నత స్థాయిలో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ మాట్లాడుతూ.. బాలబాలికల అభ్యున్నతికి ప్రభుత్వం ఎంతగానో తోడ్పడుతుందని తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత మాట్లాడుతూ బాలల రక్షణకు చైల్డ్ హెల్ప్ లైన్ 1098, 112లకు ఫోన్ చేయవచ్చు అన్నారు. ఈ ఉచిత టోల్ ఫ్రీ నంబర్ 24/7 పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ రాజారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి రఘునాథ్, ఎస్సీ వెల్ఫేర్ అధికారి వినోద్ కుమార్, చైల్డ్ వెల్ఫేర్ రామ్మోహన్, బాల రక్షభవన్ కో ఆర్డినేటర్ నాగమణి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఇంతియాజ్ రహీం, జిల్లా బాలల పరిరక్షణ సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'చదువుకుంటున్నప్పుడు, ఉద్యోగాల వేటలో ఉన్నప్పుడు కూడా నా జుట్టు ఒత్తుగా ఉండేది. ఈ మధ్యే బాగా పలచబడిపోయింది. ఇంకో నాలుగైదేళ్లలో బట్టతల గ్యారెంటీ' అంటూ ఫ్రెండ్స్‌తో బాధను పంచుకున్నాడు జూబ్లీహిల్స్ నివాసి పరమ్. 'పెళ్లి కూడా కాలేదు సార్.. ఏదో విధంగా నా జుట్టు పెరిగే మార్గం చెప్పండి ప్లీజ్' అంటూ మమ్మల్ని ప్రాధేయపడే యువతీ యువకుల సంఖ్య ఇటీవల బాగా పెరిగింది అంటూ చెప్పారు నగరానికి చెందిన హెయిర్ అండ్ స్కిన్ స్పెషలిస్ట్ డా.జాన్‌వాట్స్. మరోవైపు సిటీలైఫ్ అనేది జుట్టుకు హానికారకంగా మారిందని అదెలా అనేదానిపై అవగాహన అవసరం అంటున్నారాయన. - సాక్షి, సిటీబ్యూరో

నేటి నుంచి కామిక్ కాన్ ఫెస్ట్..

సాక్షి, సిటీబ్యూరో: నగరం వేదికగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న అతిపెద్ద పాప్ కల్చర్ కార్యక్రమం 'కామిక్ కాన్ ఇండియా' నేడు ప్రారంభం కానుంది. నగరంలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ వేదికగా నేటి నుంచి 3 రోజుల పాటు కొనసాగనున్న ఈ ఈవెంట్‌లో కామిక్ బుక్స్, టీవీ, ఫిల్మ్స్ మాంగా, యానిమే, గేమింగ్, యానిమేషన్‌లు మొదలు వాటి అధునాతన ట్రెండ్‌ల వరకూ విభిన్న కార్యక్రమాలు, ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ఇందులో ప్రముఖ కాస్ప్లేయర్ పాల్గొనున్నారు. ఇందులో భాగంగా నేడు లెజియన్ ఆధారిత గేమింగ్ ఫైర్‌సైడ్ చాట్..., ది అడ్వెంచర్స్ ఆఫ్ కికిబూ, బుల్సేయ్ ప్రెస్, సావియో మస్కరెన్హాస్ కామిక్‌బుక్‌ల ఆవిష్కరణలు జరగనున్నాయి. అంతేకాకుండా ప్రధానంగా డైసుకి అనిమే ప్రదర్శన, అజీమ్ బనాత్‌వాల్లా, ఇంటర్నెట్ సెడ్ సో కామెడీ షోకేస్ స్టేజ్ ప్రదర్శనలు అలరించనున్నాయి. ఇందులో మారుతి సుజుకి అరేనా, క్రంచైరోల్, హైదరాబాద్ అతిపెద్ద కామిక్ బుక్ స్టోర్ కాస్ ప్లే ప్రియులను ఆకట్టుకోనున్నాయి.



'మైన్ అండ్ యువర్స్' వెడ్డింగ్ షో..

పోస్టర్ ఆవిష్కరించిన సినీతారలు

నగరంలోని హోటల్ తాజ్ కృష్ణా వేదికగా ఈ నెల 19, 20 తేదీల్లో 'మైన్ అండ్ యువర్స్' వెడ్డింగ్ షో నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన కర్టెన్ రైజర్‌ను గురువారం సినీతారలు కుషిత కల్లపు, చాందిని భగ్వానని, మిస్ ఇండియా తెలంగాణ 2023 ఊర్మిలా చౌహాన్‌లు ఆవిష్కరించారు. ఈ ప్రదర్శనలో వెడ్డింగ్, ఫ్యాషన్, జ్యువెలరీ వేర్ అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.
సాక్షి, సిటీబ్యూరో:









ఒత్తయిన జుట్టు ఒత్తిడితో ఫట్టు

నగర వాతావరణం, కాలుష్యమూ కారణమే

- కాఫీ నుంచి కాలుష్యం దాకా కాదేదీ కాటుకు అనర్హం
- కొన్ని ప్రాంతాల్లో దొరికే నీళ్లు సైతం కారణమే..
- అవగాహన పెంచుకొని అలవాట్లు మార్చుకోవాలి
- జుట్టు రక్షణకు పలు సూచనలు చేస్తున్న వైద్యులు

ఆధునిక సాంకేతిక మార్పులతో పాటు నగరవాసుల జీవనశైలి మార్పులు కూడా హెయిర్‌కి టెర్రర్‌గా మారుతున్నాయి. బిజీ లైఫ్‌లో పట్టించుకోని, మార్చుకోలేని అలవాట్లు సిటిజనుల కేశ సంపదను కొల్లగొడుతున్నాయి. సమయానికి తినడం తప్ప సమతుల్య ఆహారాన్ని తీసుకోవడం తగ్గిపోతోంది. జంక్ ఫుడ్ వినియోగంతో కేశాల ఆరోగ్యానికి అత్యవసరమైన ఐరన్, జింక్, బయోటిన్ అందడం లేదు. కాబట్టి ఆహారంలో తప్పనిసరిగా గుడ్లు, చేపలు, పాలకూర వంటి ఆకుకూరలు, గింజలు, లీన్ ప్రోటీన్లు ఉండేలా చూసుకోవాలి. మంచినీళ్లు 2 నుంచి 3 లీటర్లు తాగాలి. ఒమెగా ఫ్యాటీ యాసిడ్స్ లభించే డ్రైఫ్రూట్స్, నట్స్ తీసుకోవాలి.

స్టైలింగ్.. కిల్లింగ్..

జుట్టు పొడిబారడానికి హెయిర్ డ్రైయర్‌లు, స్ట్రైయిట్‌నెర్‌లు ఉపయోగించడం వల్ల జుట్టు విరిగిపోతోంది. పోనీటెయిల్స్ లేదా బ్రెయిడ్స్ వంటి బిగుతు హెయిర్ స్టైల్స్‌తో ట్రాక్షన్ అలోపేసియా అనే పరిస్థితికి గురై జుట్టు రాలిపోతుంది. కాబట్టి హీట్-ఫ్రీ స్టైలింగ్ పద్ధతులను, స్టైలింగ్ చేసేటప్పుడు హీట్ ప్రొటెక్షన్ ఉత్పత్తులను ఉపయోగించాలి. జుట్టు షాఫ్ట్‌లపై ఒత్తిడి తగ్గించడానికి వదులుగా ఉండే కేశాలంకరణను ఎంచుకోవాలి. ఫ్యాషన్ కోసం పెరమ్స్, రిలాక్సర్‌ల మితిమీరిన రంగుల వినియోగం, రసాయన చికిత్సలతో జుట్టు నిర్మాణం బలహీనపడుతోంది.



అలవాట్లు.. జుట్టుకు పోట్లు..

నగర యువతలో పెరిగిన ధూమపానం, ఆల్కహాల్ వినియోగం రెండూ కేశాలకు నష్టం కలుగజేస్తున్నాయి. ఈ అలవాట్లతో రక్తనాళాలు కుంచించుకుపోవడం వల్ల చక్కని హెయిర్ కోసం ఖచ్చితంగా ధూమపానం మానేయడంతో పాటు మద్యపానాన్ని బాగా తగ్గించడం అవసరం.

ఉపరి'తల'ం.. ఇలా క్షేమం..

తల ఉపరితలం(స్కాల్ప్) తరచుగా నగరవాసులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇది జుట్టుకు హాని చేస్తోంది కాబట్టి స్కాల్ప్‌ను శుభ్రంగా తేమగా ఉంచుకోవడం అవసరం. అవసరాన్ని బట్టి హెయిర్ ఫోలికల్స్‌ను పోషించడానికి ఉత్తేజపరిచేందుకు అందుబాటులో ఉన్న ఉత్పత్తులను ఉపయోగించవచ్చు.

కదలికతో కేశాలకు మేలెంతో..

కూర్చుని పనిచేయడం, ఎక్కడకు వెళ్లాలన్నా వాహనాల వినియోగం.. ఇలా కదలికలు తగ్గిపోతున్న నగరవాసుల నిశ్చల జీవనశైలి రక్త ప్రసరణ లోపానికి దారితీస్తోంది. తలపై భాగానికి రక్త ప్రసరణ లేకపోవడం కేశాల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తోంది. రక్త ప్రసరణను మెరుగుపరచడానికి శారీరక శ్రమ అవసరం.


నీళ్లూ.. నష్టమే..

సిటీలో కొన్ని ప్రాంతాల్లో సాల్ట్స్ ఎక్కువగా ఉండే హార్డ్ వాటర్‌తో స్నానం చేస్తున్నారు. దీంతో తలలో ఉండే సహజమైన నూనెలు ఆవిరై తల ఉపరితలం పొడిబారి కేశాలు దెబ్బతింటాయి.

నిద్రలేమీ.. ఓ సమస్యే..

దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యల విషయంలో నిర్లక్ష్యం హెయిర్‌పై దుష్ప్రభావం చూపిస్తోంది. గుర్తించిన థైరాయిడ్ వంటి వ్యాధులు లేదా గుర్తించలేని హార్మోన్ల అసమతుల్యత వంటివి.. జుట్టుపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి. ఆరోగ్య సమస్యలను గుర్తించడం తగిన చికిత్స పొందడం అవసరం. అలాగే నిద్రలేమి సిటీలో సర్వసాధారణమైపోయింది. ఇది జుట్టు పెరుగుదల వంటి శరీరపు సహజ ప్రక్రియలను నిరోధిస్తోంది. ప్రతి రాత్రి 7-9 గంటల నాణ్యమైన నిద్ర తప్పనిసరి.





వ్యాధులుంటే.. నష్టమే..

థైరాయిడ్ వంటి దీర్ఘకాలిక రుగ్మతలు మాత్రమే కాకుండా హార్మోన్ల అసమతుల్యత వంటివి కేశాలకు హాని చేస్తాయి. కాబట్టి అంతర్లీన ఆరోగ్య సమస్యలను గుర్తించి, ఆరోగ్య సంరక్షణ నిపుణులను సంప్రదించాలి. లక్ష్యసాధన కోసం పరుగుతో దీర్ఘకాలిక మానసిక ఒత్తిడి జుట్టు ఆరోగ్యంపై పడుతోంది. ఒత్తిడికి విరుగుడుగా ధ్యానం, యోగా బ్రీతింగ్ వ్యాయామాలు చేయాలి.

కారణాలెన్నో.. జాగ్రత్తలు తప్పనిసరి..



మన జుట్టులో 80శాతం ఎదిగే దశలో ఉంటే 12 నుంచి 13శాతం విశ్రాంతి దశ, మరో 7 నుంచి 8శాతం మృత దశలో ఉంటుంది. అనారోగ్యపు అలవాట్ల వల్ల గ్రోత్ దశలో ఉండాల్సిన 80శాతం 50 శాతానికి అంతకంటే తక్కువకు పడిపోయి డీలోజన్ ఫేజ్ అనే దశకు చేరి హెయిర్ ఫాల్ జరుగుతుంది. రోజుకు 60 నుంచి అత్యధికంగా 100దాకా వెంట్రుకలు ఊడటం సాధారణం కాగా.. ఈ సంఖ్య 200కి చేరితే తీవ్రమైన హెయిర్‌ఫాల్‌గా గుర్తిస్తాం. నివారణ కోసం సల్ఫేట్ ఫ్రీ షాంపూల వాడకం, వారానికి ఒక్కసారైనా హెయిర్ కండిషనర్ గానీ హెయిర్ మాస్క్ గానీ వాడటం అవసరం. అలాగే కాలుష్యం బారిన పడకుండా అవుట్‌డోర్ వెళ్లినప్పుడు మహిళలు చున్నీ, స్కార్ఫ్ మగవాళ్లైతే హెల్మెట్ వంటివి తప్పనిసరి. జాగ్రత్తలు తీసుకున్నా కేశాల ఆరోగ్యం సరిగా లేదంటే తప్పనిసరిగా వైద్యుల్ని సంప్రదించాలి.

- డా.జాన్‌వాట్స్, డెర్మటాలజిస్ట్, సీనియర్ హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్

వారె వాహ్.. వాల్ఆర్ట్..

రహదారులకు కొత్త సొబగులు

కుంచెతో మైమరిపిస్తున్న 700 మంది ఆర్టిస్టులు

బంజారాహిల్స్: హైదరాబాద్ అంటేనే శతాబ్దాల చారిత్రక వారసత్వ సంపద కలిగిన నగరం. ఇక్కడ ఒక్కో ప్రాంతానికీ ఒక్కో నేపథ్యం. పాత బస్తీకి వెళితే నిజామీ చరిత్ర కళ్లకు కడుతోంది. సికింద్రాబాద్ వెళితే ఆర్మీ నేపథ్యం, బ్రిటీష్ పాలనలో కట్టడాలు కళ్లకు కడతాయి. మాదాపూర్ వైపు వెళితే సాఫ్ట్‌వేర్ రంగం కనిపిస్తోంది. సోమాజీగూడ, పంజగుట్టకు వెళితే ఆభరణాల దుకాణాలు, ఆర్టీసీ క్రాస్‌రోడ్డుకు వెళితే సినిమా థియేటర్లు.. జనరల్ బజార్‌కు వెళితే చీరల షాపులు.. ఇలా నగరంలోని ప్రతి ప్రాంతం ఒక చరిత్రతో కూడుకున్నదిగా కనిపిస్తుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని జీహెచ్‌ఎంసీ నగర సుందరీకరణలో భాగంగా రోడ్లకు ఇరువైపులా గోడలు, ఫ్లైఓవర్ల గోడలు, అండర్‌పాస్‌లను రంగుల మిశ్రమాలతో కళాత్మకంగా తీర్చిదిద్దాలని, ఆయా ప్రాంతాల నేపథ్యాన్ని కళ్లకు కట్టాలని నిర్ణయించింది.

700 మంది చిత్రకారులు..

ఇందులో భాగంగా మూడు నెలల నుంచి సుమారు 700 మంది చిత్రకారులు తమ కుంచెలకు పనిచెబుతూ ఆకట్టుకునే బొమ్మలతో గోడలను పెయింట్ చేస్తున్నారు. డిఫెన్స్ ఏరియాలో యుద్ధ ట్యాంక్‌లు, అగ్ని మిస్సైల్ బొమ్మలు వేస్తే, కొండాపూర్ అండర్‌పాస్ మిలటరీ థీమ్‌తో దివంగత సంతోష్‌బాబు జ్ఞాపకాలతో పెయింట్ వేశారు. కామినేని ఆస్పత్రి వద్ద పక్షులు, పువ్వులు ఆకట్టుకుంటుంటే.. ఒవైసీ ఆస్పత్రి వద్ద హెల్త్ థీమ్‌తో బొమ్మలు వేశారు. ఉప్పల్‌లో క్రీడల నేపథ్యం, హఫీజ్‌పేట ఫ్లై ఓవర్‌పై బర్డ్స్ అండ్ ఫ్లవర్స్, చాంద్రాయణగుట్టలో ముస్లిం జనాభా ఎక్కువగా ఉండగా అక్కడ నిజామీ కల్చర్ ఉట్టిపడే రీతిలో బొమ్మలు వేసి విశేషంగా ఆకట్టుకుంటున్నారు.



నగర వ్యాప్తంగా 50 థీమ్స్...

ప్రముఖ చిత్రకారులు, ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు కుంచెలతో ఈ బొమ్మలు ఆకట్టుకునే రీతిలో వేస్తున్నారు. నగర వ్యాప్తంగా 50 థీమ్‌లతో వాల్ ఆర్ట్‌కు శ్రీకారం చుట్టినట్లు వాల్ ఆర్ట్ ఆపరేషన్స్ హెడ్ శ్రీపతి రవితేజ వెల్లడించారు. నగర సుందరీకరణలో భాగంగా వాల్ ఆర్ట్ విశేషంగా ఆకట్టుకుంటుందని ఆయన పేర్కొన్నారు. ఒక్కో ప్రాంతంలో ఒక్కో నేపథ్యంతో అక్కడి సంస్కృతి, ఆచారాలకు అద్దంపట్టే రీతిలో పెయింటింగ్ వేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

రెండు వేలకు పైగా...

ఇప్పటికే 2,000లకు పైగా వాల్ ఆర్ట్స్‌తో పలు ప్రాంతాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. రహదారుల వెంబడి వెళ్లే వారికి కంటికి ఇంపుగా ఉండేవిధంగా ఈ ఆర్ట్స్ వేస్తున్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, అమీర్‌పేట, అసెంబ్లీ, అబిడ్స్, మెహిదీపట్నం, మాసబ్‌ట్యాంక్ ఇలా ఇంకొన్ని రహదారులకు ఇరువైపులా వాల్‌ఆర్ట్ వేయాలని నిర్ణయించారు. జీహెచ్‌ఎంసీ ప్రోత్సాహంతో ఆర్టిస్టులు మరింత ఉత్సాహంగా వీటిని కనువిందుగా తీర్చిదిద్దుతున్నారు.



నగర సుందరీకరణలో భాగంగా రోడ్లకు ఇరువైపులా ఉన్న గోడలపై చిత్రాలు

క్లుప్తంగా...

'ఓటుకు నోటు' విచారణకు రేవంత్ గైర్హాజరు

సిటీ కోర్టులు: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేకెత్తించిన ఓటుకు నోటుపై ఈడీ దాఖలు చేసిన కేసు విచారణ గురువారం నాంపల్లిలోని మొదటి మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టులో జరిగింది. ఈ విచారణకు సీఎం రేవంత్ రెడ్డి, వేం కృష్ణ కీర్తన్ గైర్హాజరుకాగా, సెబాస్టియన్, ఉదయ్ సింహ, జెరూసలేం మత్తయ్య, సండ్ర వెంకటవీరయ్య హాజరయ్యారు. 2015లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌ను టీడీపీ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని రూ.కోట్లు ఆశ చూపించారన్న ఆరోపణలపై నాటి టీడీపీ ఎమ్మెల్యే, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఏసీబీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ డబ్బు అక్రమ మార్గాల్లో వచ్చిందన్న ఏసీబీ అభియోగాలతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా కేసు నమోదు చేసింది. ఈడీ కేసుపై విచారణ చేపట్టిన నాంపల్లి కోర్టు తదుపరి విచారణను 16 డిసెంబర్‌కి వాయిదా వేసింది.

బీసీ రిజర్వేషన్ల పెంపునకే కులగణన

• జాజుల శ్రీనివాస్‌గౌడ్



కాజీపేట రూరల్: రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల పెంపునకే సమగ్ర కులగణన జరుగుతోందని, దీనిని బీసీ సమాజం వినియోగించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కాజీపేటలో సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన బీసీ కులగణన చైతన్య సదస్సులో జాజుల మాట్లాడారు. సంక్షేమ పథకాలకు, కులగణనకు ఎలాంటి సంబంధం లేదని, ప్రజలు ఆందోళన చెందవద్దని అన్నారు. బీసీ కులాలు తప్పనిసరిగా కులగణనలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ నేతలకు చిత్తశుద్ధి ఉంటే కులగణనపై కేంద్రాన్ని ఒప్పించాలన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అప్పులు తీర్చలేక అన్నదాత ఆత్మహత్య


నేరెళ్ల లక్ష్మణ్

కుంటాల: అప్పులు తీర్చలేక ఓ రైతు పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన నిర్మల్ జిల్లా కుంటాల మండలం సూర్యాపూర్‌లో జరిగింది. ఎస్సై భాస్కరాచారి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నేరెళ్ల లక్ష్మణ్ (38)కు సూర్యాపూర్ వాగు పక్కన రెండు ఎకరాల సాగుభూమి ఉంది. మూడేళ్లుగా వాగు పొంగడంతో ఖరీఫ్‌లో వేసిన పంటలు కొట్టుకుపోతున్నాయి. ఈ ఖరీఫ్ సీజన్‌లోనూ లక్ష్మణ్ సోయా సాగు చేశాడు. సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు వాగు పొంగడంతో పంట కొట్టుకుపోయింది. దీంతో రెండేళ్లు పంట సాగుకోసం చేసిన అప్పులు తీరలేదు. ఈ ఏడాది మళ్లీ పెట్టుబడికి అప్పు చేయడంతో రూ.3 లక్షల వరకు అప్పులు పేరుకుపోయాయి. మూడేళ్లుగా పంట నష్టపోతుండటంతో లక్ష్మణ్‌కు అప్పులు తీర్చే మార్గం కనబడలేదు. దీంతో మనస్తాపం చెంది గురువారం ఉదయం పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఇంటికి వచ్చాడు. గమనించిన భార్య నీలాబాయి ఆరా తీయగా, విషయం చెప్పడంతో హుటాహుటిన భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందాడు.

పెళ్లి వేడుకలో నృత్యం చేస్తూ.. గుండెపోటుతో యువకుడి మృతి


సంజీవ్

మేడిపల్లి: పెళ్లి వేడుకలో డ్యాన్స్ చేస్తూనే ఓ యువకుడు గుండెపోటుతో కుప్పకూలాడు. ఈ ఘటన జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలోని మోత్కురావుపేటలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. మండలంలోని కమ్మరిపేట గ్రామానికి చెందిన వన్నెల సంజీవ్ (23) తన మేనమామ కొడుకు పెళ్లివేడుకలో పాల్గొన్నాడు. రాత్రి బరాత్‌లో డ్యాన్స్ చేస్తుండగా గుండెపోటు వచ్చి కుప్పకూలాడు. స్థానికులు వెంటనే జగిత్యాలలోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం మృతుడి చెల్లి వివాహం ఉండగా, ఈ ఘటనతో కుటుంబంతోపాటు గ్రామంలో విషాదం నెలకొంది.

'హక్కుల కోసం మిలిటెంట్ పోరాటాలు చేయండి'

సాక్షి, హైదరాబాద్: మూసీనది ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలపై కొనసాగిస్తున్న అనాగరిక బుల్డోజర్ దాడులను తిప్పికొట్టాలని మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ ప్రజలకు పిలుపునిచ్చారు. వికారాబాద్ జిల్లా దామగుండంలో నిర్మించనున్న నేవీ రాడార్ స్టేషన్‌ను, లగచర్లలో ఫార్మాసిటీ పేరిట రైతుల భూములు కొల్లగొట్టడాన్ని అడ్డుకొనేందుకు మిలిటెంట్ పోరాటాలు చేయాలని సూచించారు. ఈ మేరకు జగన్ పేరిట గురువారం మావోయిస్టు పార్టీ ఓ లేఖ విడుదల చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ భారీగా కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు.

కొత్తగూడెం ఎయిర్‌పోర్టుకు

ముందడుగు

నిర్మాణానికి 950 ఎకరాల భూమి గుర్తింపు

పది రోజుల్లో ఏఏఐ ప్రీ ఫీజిబులిటీ అధ్యయనం	వరంగల్ తరహాలో భారీ విమానాశ్రయ నిర్మాణం	పెద్ద విమానాలు సైతం దిగేలా రన్‌వే	రాష్ట్రంలో మూడో విమానాశ్రయానికి వేగంగా అడుగులు

సాక్షి, హైదరాబాద్: వరంగల్‌లో అంతర్జాతీయ స్థాయి రన్‌వేతో పెద్ద విమానాశ్రయాన్ని నిర్మించేందుకు చకచకా ఏర్పాట్లు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. ఆ పనులు ప్రారంభమయ్యేనాటికి రాష్ట్రంలో మూడో విమానాశ్రయ నిర్మాణ ప్రక్రియను కూడా కొలిక్కి తేవటానికి చర్యలు ప్రారంభించాయి. హైదరాబాద్, వరంగల్ విమానాశ్రయాల తర్వాత మూడో విమానాశ్రయాన్ని కొత్తగూడెంలో నిర్మించాలని నిర్ణయించాయి. ఇది కూడా రాష్ట్రంలో కీలక విమానాశ్రయంగా మారుతుందని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, దాన్ని వెంటనే మంజూరు చేసి పనులు ప్రారంభించాలని పౌర విమానయాన శాఖను కోరింది. ఆ శాఖ కూడా సానుకూలంగా స్పందించింది. దీంతో వరంగల్ తరహాలో దీన్ని కూడా వేయి ఎకరాల్లో నిర్మించేందుకు ప్రాథమిక కసరత్తు మొదలైంది.



పది రోజుల్లో సర్వేకు ఏఏఐ బృందం

విమానాశ్రయం కోసం గుర్తించిన ప్రాంతానికి సంబంధించి గత పదేళ్ల వాతావరణ (మెటియోరాలాజికల్) నివేదికలు, విండ్‌రోజ్ డయాగ్రామ్ తదితర వివరాలను ఏఏఐకి అధికారులు సమర్పించారు. విమానాశ్రయ నిర్మాణానికి ఈ భూమి యోగ్యమైందో కాదో తేల్చేందుకు మరో పదిరోజుల్లో ఏఏఐ సాంకేతిక బృందం ప్రీ ఫీజిబిలిటీ స్టడీ చేయబోతోంది. అది యోగ్యమైన భూమి అని తేలితే వెంటనే అటవీ శాఖతో సమన్వయం చేసుకుని ఆ భూమిని రాష్ట్ర ప్రభుత్వం సేకరించి ఏఏఐకి అప్పగిస్తుంది. దీనికి బదులుగా అటవీ శాఖకు మరోచోట భూమిని కేటాయిస్తారు. ఇక్కడ విమానాశ్రయ నిర్మాణం వల్ల వన్యప్రాణులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని అధికారులు చెబుతున్నారు.

ఇక్కడ కూడా పెద్ద రన్‌వే..

వరంగల్‌లో దాదాపు 2,800 మీటర్ల పొడవైన రన్‌వేను నిర్మించనున్నారు. కొత్తగూడెంలో కూడా అలాంటి భారీ రన్‌వేను నిర్మించాలని భావిస్తున్నారు. వచ్చే 40 ఏళ్ల అవసరాలను తీర్చేలా, భారీ విమానాలు దిగగలిగే సామర్థ్యంతో ఈ విమానాశ్రయాన్ని నిర్మించనున్నట్టు తెలంగాణ ఏవియేషన్ అకాడమీ పేర్కొంది.

950 ఎకరాల భూమి గుర్తింపు

రాష్ట్రంలో ఆరు విమానాశ్రయాలు నిర్మించాలన్న ప్రతిపాదన చాలాకాలంగా పెండింగులో ఉంది. నిజాం హయాంలో కొనసాగిన ఎయిర్‌స్ట్రిప్స్‌ను పునరుద్ధరించటంతోపాటు మరో మూడు చోట్ల గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టులు నిర్మించాలన్నది ప్రతిపాదన. వీటిల్లో తొలుత వరంగల్ శివారులోని మామునూరు పాత ఎయిర్‌స్ట్రిప్ ఉన్న స్థలంలో ఎయిర్‌బస్ వంటి భారీ విమానాలు కూడా దిగగలిగే రన్‌వేతో విమానాశ్రయం నిర్మాణానికి కేంద్రం పచ్చజెండా ఊపింది. మరో ఆరు నెలల్లో టెండర్ల ప్రక్రియ చేపట్టనున్నారు. ఇప్పుడు దానితోపాటు కొత్తగూడెం విమానాశ్రయాన్ని కూడా అందుబాటులోకి తేవాలన్న యోచనతో ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయి. ఇక్కడ తొలుత చిన్న విమానాశ్రయాన్ని నిర్మించాలని భావించినా.. ఆ ప్రాంతానికి ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా వరంగల్ తరహాలో వేయి ఎకరాల్లో నిర్మించాలని ఇప్పుడు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) భావిస్తోంది. గతంలో విమానాశ్రయం కోసం పాల్వంచ సమీపంలో గుడిపాడు–బంగారుజాల మధ్య స్థలాన్ని ఎంపిక చేశారు. రాష్ట్రంలో విమానాశ్రయాల నిర్మాణానికి కన్సల్టెన్సీ సేవలందిస్తున్న ఏఏఐ.. ఆ స్థలం ఎయిర్‌పోర్టు నిర్మాణానికి పనికిరాదని ఇటీవల నివేదిక సమర్పించింది. ఆ ప్రాంతంలో గుట్టలుండటంతోపాటు భూమి పొరలు కూడా నిర్మాణానికి వీలుగా లేవని పేర్కొంది. దీంతో తదుపరి ప్రక్రియ నిలిచిపోయింది. తాజాగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఏఏఐ అధికారులతోపాటు పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడును కలిసి విమానాశ్రయ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లాల్సిందిగా కోరారు. ప్రత్యామ్నాయ స్థల సేకరణపై అధికారులతో చర్చించారు. దీనికి ఏఏఐ సమ్మతించటంతో జిల్లా కలెక్టర్‌కు ప్రత్యామ్నాయ స్థల సేకరణ కోసం ఆదేశాలిచ్చారు. దీంతో అధికారులు మూడు మండలాల పరిధిలోకి వచ్చే 950 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. కొత్తగూడెం మండలంలోని రామవరం గ్రామం, సుజాతానగర్ మండల పరిధిలోని సుజాతానగర్ గ్రామం, చుంచుపల్లి మండల పరిధిలోని చుంచుపల్లి గ్రామం పరిధిలో 950 ఎకరాల అటవీ భూములను ఎంపిక చేశారు.

ఎన్నో ఉపయోగాలు

కొత్తగూడెం ప్రాంతంలో విమానాశ్రయ నిర్మాణం వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయన్న మా ప్రతిపాదనకు అంగీకరించిన కేంద్రం.. అక్కడ విమానాశ్రయ నిర్మాణానికి సమ్మతించింది. బొగ్గు గనుల కేంద్రం, సిమెంటు పరిశ్రమల నిలయం, పారిశ్రామికంగా అభివృద్ధి చెందే ప్రాంతం.. ఛత్తీస్‌గఢ్‌కు చేరువగా ఉన్నందున రెండు రాష్ట్రాల అనుసంధానం తేలికవుతుంది. ఇది హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి 300 కి.మీ. దూరంలో ఉన్నందున ఎలాంటి నిబంధనలు అడ్డు రావు. ఇక దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం దేవాలయానికి దేశవిదేశాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చేందుకు ఇది దోహదపడుతుంది.

– తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయశాఖ మంత్రి

రేవంత్ మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారు

గవర్నర్‌పై తొందరపాటు వ్యాఖ్యలు సరికాదు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. 'రాష్ట్ర గవర్నర్ ఏ నిర్ణయం తీసుకోవాలన్నా లీగల్ ఒపీనియన్ తీసుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో కొంత జాప్యం జరగడం సహజం. అంతమాత్రానికే తొందరపాటు వ్యాఖ్యలు చేయడం సరికాదు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే అని చెప్పడం అవివేకం'అని కిషన్‌రెడ్డి దుయ్యబట్టారు. గురువారం భారత్ మండపంలో ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫేర్– 2024లో కేంద్ర గనుల శాఖ, కోలిండియా పెవిలియన్‌లను కిషన్‌రెడ్డి ప్రారంభించారు. అంతకుముందు పెవిలియన్‌లో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేట్ సంస్థల స్టాళ్లను కేంద్రమంత్రి సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. అవినీతి ఎక్కడ జరిగినా నిష్పక్షపాతంగా విచారణ జరపాలన్నదే తమ డిమాండ్ అని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో తాము హైకోర్టుకు వెళ్లామని, ఈ వ్యవహారాన్ని కూడా సీబీఐకి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. విచారణ సరిగ్గా జరిగితేనే తప్పు ఎవరు చేశారో ప్రజలకు అర్థమవుతుంది కదా అని చెప్పారు. కేంద్ర మంత్రులు ఏం చేయాలి? ఏం చేస్తున్నారనే విషయంలో.. కేటీఆర్, కేసీఆర్ ఇచ్చే సర్టిఫికెట్లు మాకు అవసరం లేదని స్పష్టం చేశారు. అనవసరంగా ఒకరిపైఒకరు బురదజల్లుకునే ప్రయత్నంలో బీజేపీ గురించి అసత్యాలు మాట్లాడితే ఊరుకోమని హెచ్చరించారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ మీద జరిగిన దాడి ఘటనను ఖండిస్తున్నామన్నారు. సీఎం సొంత నియోజకవర్గంలో జరిగిన ఘటనపై ఆయన ప్రజలతో మాట్లాడాలి.. అంతే తప్ప ఈ విషయంలో రాజకీయ ప్రయోజనం ఆశించడం సరికాదని సూచించారు. మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి రాబోతుందని.. ఇందులో సందేహం అక్కర్లేదని కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

త్వరలో ఆఫ్‌షోర్‌పై 10 బ్లాకుల వేలం: సముద్రాల్లో ఉన్న మినలర్స్‌ను సద్వినియోగం చేసుకునేందుకు ఆఫ్‌షోర్ మైనింగ్‌పైనా ప్రత్యేకంగా దృష్టి సారించామని కిషన్‌రెడ్డి తెలిపారు. ఆఫ్‌షోర్‌పై 10 బ్లాకుల వేలానికి అంతా సిద్ధమైందని, రెండుమూడు నెలల్లో ఈ బ్లాకులను వేలం వేస్తామని చెప్పారు. ఇప్పటికే అర్జెంటీనాలో పలు బ్లాక్‌లను వేలంలో దక్కించుకున్నామని, అక్కడ తవ్వకాల పనులను త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. భారతదేశం బొగ్గు, గనుల రంగంలో సాధిస్తున్న ప్రగతి, ఆధునిక సాంకేతికత వినియోగం, కార్మికుల భద్రత, సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలను భారత్‌మండపంలో ప్రారంభించిన పెవిలియన్ ద్వారా సందర్శకులకు వివరిస్తున్నామన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో బొగ్గు రంగంలో భారతదేశం ఆత్మనిర్భరత సాధించే దిశగా ముందుకెళ్తోందని వివరించారు. ప్రపంచంలోనే కోలిండియా మూడో అతిపెద్ద బొగ్గు ఉత్పత్తి సంస్థ అని, అలాంటి ప్రతిష్టాత్మక సంస్థ.. ఈ ఏడాది స్వర్ణోత్సవాలు జరుపుకుంటోందన్నారు. సంవత్సరంపాటు ఈ ఉత్సవాలు జరుగుతాయని కిషన్‌రెడ్డి తెలిపారు.



టీజీఓ అధ్యక్షుడు శ్రీనివాసరావు నేతృత్వంలో సీసీఎల్ఏ కార్యాలయం వద్ద నిరసన

రాజకీయాల కోసం మాపై దాడులా?

• తెలంగాణ ఉద్యోగుల జేఏసీ నేతలు లచ్చిరెడ్డి, శ్రీనివాసరావు

సాక్షి, హైదరాబాద్: నేతలు తమ రాజకీయ లక్ష్యాల కోసం ప్రజాసేవ చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడులకు పాల్పడటం దుర్మార్గ చర్య అని ఉద్యోగ సంఘాల జేఏసీ కార్యదర్శి, టీజీఓ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు విమర్శించారు. లగచర్లలో ఉద్యోగులపై జరిగిన దాడి కుట్రకు అసలు సూత్రధారులు ఎవరో తేల్చాలని జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. లగచర్ల దాడిని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ, అధికార సంఘాలు గురువారం అన్ని కలెక్టరేట్ల ముందు ధర్నాలు, నల్లబ్యాడ్జీలతో నిరసనలు నిర్వహించాయి. లచ్చిరెడ్డి నేతృత్వంలో హైదరాబాద్ కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించగా, శ్రీనివాసరావు నాయకత్వంలో భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయం ముందు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లగచర్ల దాడిపై పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వస్తున్న విషయాలు ఉద్యోగ లోకాన్ని భయాందోళనకు గురి చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. దాడికి పాల్పడిన వారిపైనే కాకుండా తెరవెనుక ఉండి వారిని రెచ్చగొట్టిన వ్యక్తులపైనా చర్యలు తీసుకోవాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమాల్లో ట్రెసా అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, టీఎన్జీఓ ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్, జేఏసీ ప్రతినిధులు ఎ.సత్యనారాయణ, చంద్రమోహన్, కస్తూరి వెంకటేశ్వర్లు, ఉద్యోగుల జేఏసీ నాయకులు కె.రామకృష్ణ, ఎస్.రాములు, జి. నిర్మల, దర్శన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. నిరసన ప్రదర్శనల అనంతరం కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించారు.



హైదరాబాద్ కలెక్టరేట్ ముందు జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న ఉద్యోగులు

ఆ రెండు నంబర్ల కేంద్రంగానే విచారణ!

మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను ప్రశ్నించిన పోలీసులు	అదనపు ఎస్పీ తిరుపతన్నతో సంప్రదింపుల కారణంగానే విచారణకు..	కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పిన లింగయ్య

సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసులు తొలిసారిగా ఓ రాజకీయ నాయకుడిని విచారించారు. నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను గురువారం దాదాపు 2 గంటలపాటు ప్రశ్నించారు. మునుగోడు ఉప ఎన్నికల నేపథ్యంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌కు సహకరించారా? ఆ రెండు ఫోన్ నంబర్లు ఎందుకు పంపారనే కోణంలోనే లింగయ్య విచారణ సాగింది. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ ఐబీ) కేంద్రంగా సాగిన ఈ నిఘా కేవలం ప్రతిపక్షాలకే పరిమితం కాలేదు. అప్పటి అధికార బీఆర్ఎస్‌కు చెందిన అసమ్మతి నేతలపైనా సాగినట్లు పోలీసులు గుర్తించారు. ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ మేకల తిరుపతన్న వివిధ నియోజకవర్గాల్లోని రాజకీయ పరిస్థితులపై ఆరా తీశాడు. ప్రధానంగా మునుగోడు ఉప ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌కు ఇబ్బందికరంగా ఉన్న పరిణామాలను గుర్తించడంపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

లింగయ్యను సంప్రదించిన తిరుపతన్న

బీఆర్ఎస్‌లో ఉంటూ ఆ పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తున్న, అసమ్మతితో ఉన్న నాయకులతోపాటు వారి అనుచరుల ఫోన్ నంబర్లను సేకరించిన ఎస్ఐబీ అధికారులు వాటిని నాటి డీఎస్పీ ప్రణీత్‌రావుకు ఇచ్చి ట్యాపింగ్ చేయించారు. ఇందులో భాగంగా నకిరేకల్‌కు చెందిన వేముల వీరేశం (అప్పట్లో బీఆర్ఎస్ అసమ్మతి నేత)తోపాటు ఆయన అనుచరులపై నిఘా ఉంచాలని అందిన ఆదేశాల మేరకు ఆ వివరాలు సేకరించే బాధ్యతను తిరుపతన్నకు అప్పగించారు. వీరేశంతో సన్నిహితంగా ఉంటున్న పెదకాపర్తికి చెందిన రాజ్‌కుమార్, నకిరేకల్‌కు చెందిన మదన్‌రెడ్డి ఫోన్లు ట్యాప్ చేయాలని భావించారు. ఆ ఇద్దరి ఫోన్ నంబర్ల కోసం తిరుపతన్న అప్పటి నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను సంప్రదించారు. గతంలో నల్లగొండ జిల్లాలో పనిచేసి ఉండటంతో తిరుపతన్నకు లింగయ్యతో పరిచయం ఉంది. తొలుత రెండు–మూడుసార్లు ఫోన్‌లో సంప్రదించిన తిరుపతన్న ఆపై ఆ ఇద్దరి ఫోన్ నంబర్లు కావాలని కోరారు. దీంతో తనకున్న పరిచయాలతో మదన్‌రెడ్డి, రాజ్‌కుమార్ నంబర్లు తీసుకున్న లింగయ్య వాటిని తిరుపతన్నకు పంపారు. ట్యాపింగ్ కేసులో తిరుపతన్న అరెస్టుకు ముందే తన ఫోన్‌ను ఫార్మాట్ చేశారు. దీంతో డిలీట్ అయిన డేటాను రిట్రీవ్ చేయడానికి ఆ ఫోన్‌ను దర్యాప్తు అధికారులు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. ఇటీవల ల్యాబ్ నుంచి ఆ నివేదిక పోలీసులకు అందింది. ఇందులో మునుగోడు ఉప ఎన్నికల సమయంలో తిరుపతన్న–లింగయ్య మధ్య ఫోన్ కాల్స్, ఆపై లింగయ్య నుంచి తిరుపతన్నకు మదన్‌రెడ్డి, రాజ్‌కుమార్‌ల ఫోన్ నంబర్లు వచ్చినట్లు తేలింది. దీని ఆధారంగా నోటీసులిచ్చి పోలీసులు లింగయ్యను విచారించారు. ఫోన్‌లో తిరుపతన్న ఏం అడిగారు? ఫోన్ ట్యాపింగ్‌తో సంబంధం ఉందా? ఆ ఇద్దరి నంబర్లు ఎందుకు పంపారు? అనే వివరాలు ఆరా తీసి లింగయ్య వాంగ్మూలాన్ని వీడియో రికార్డింగ్ చేశారు.

అన్ని ప్రశ్నలకూ జవాబు చెప్పా..

ఫోన్ ట్యాపింగ్ కేసుతో నాకు ఎలాంటి సంబంధం లేదు. పోలీసులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పా. చాలా కాలంగా పరిచయం ఉన్న అధికారి కాబట్టే తిరుపతన్నతో మాట్లాడాను. మదన్‌రెడ్డి, రాజ్ కుమార్‌ల ఫోన్ నంబర్లు అడిగితే నా అనుచరుల నుంచి తీసుకుని ఇచ్చా. అప్పట్లోనూ ఆ నంబర్లు ఎందుకని ప్రశ్నించా. మునుగోడు ఉప ఎన్నికల ప్రచారం ఎలా జరుగుతోందని, ఆ వివరాలు తెలుసుకోవడానికే వారి నంబర్లు తీసుకున్నట్లు చెప్పారు. వేముల వీరేశం అనుచరుల ఫోన్ ట్యాప్ చేశాననేది అవాస్తవం. కేవలం మీడియాలో ప్రాచుర్యం పొందాలనే నాపై వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ కేసులో ఎప్పుడు విచారణకు పిలిచినా వస్తా.

– మీడియాతో చిరుమర్తి లింగయ్య



కారుతో ఢీకొట్టి.. కత్తితో పొడిచి..

• నడిరోడ్డుపై తల్లీకుమారుడు దారుణ హత్య
• సంగారెడ్డి జిల్లా బొంతపల్లిలో ఘటన


నిందితుడు నాగరాజు

జిన్నారం (పటాన్‌చెరు): నడిరోడ్డుపై అందరూ చూస్తుండగానే తల్లీకొడుకులను ఓ వ్యక్తి దారుణంగా హత్య చేశాడు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం బొంతపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. బొంతపల్లి పంచాయతీ పరిధిలోని వీరభద్రనగర్‌లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన నాగరాజు, సరోజాదేవి కుటుంబాలు జీవనోపాధి కోసం వచ్చి ఇక్కడే స్థిరపడ్డాయి. ఏప్రిల్ నాలుగో తేదీన నాగరాజు కొడుకు శివాన్స్ (రెండున్నరేళ్లు) అనుమానాస్పద స్థితిలో సంపులో పడి మృతి చెందాడు. తన కుమారుడి మృతికి సరోజాదేవి కుటుంబీకులే కారణమని నాగరాజు కక్ష పెంచుకున్నాడు. దీంతో ఈ కుటుంబాలకు తరచూ గొడవలు జరుగుతుండేవి. గురువారం ఉదయం పదకొండు గంటల సమయంలో సరోజాదేవి (50), కొడుకు అనిల్ (30) ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయటకు వెళుతున్న క్రమంలో నాగరాజు తన కారుతో బైకును ఢీకొట్టాడు. తల్లీకొడుకులు వాహనంపై నుంచి కింద పడగానే కారులో నుంచి దిగిన నాగరాజు రోడ్డుపైనే కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. సరోజాదేవి, అనిల్ అక్కడికక్కడే మృతి చెందారు. జిన్నారం సీఐ సుధీర్ కుమార్, గుమ్మడిదల ఎస్సై మహేశ్వర్‌రెడ్డి, జిన్నారం ఎస్సై నాగలక్ష్మి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. తన కొడుకును చంపారన్న ద్వేషంతోనే హత్య చేసినట్లు నిందితుడు చెప్పాడని పోలీసులు వెల్లడించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యను హతమార్చి.. భర్త ఆత్మహత్య


వెంకటేశ్,వసంత దంపతులు

సిరిసిల్ల క్రైం: భార్యపై అనుమానం పెంచుకున్న ఓ భర్త ఆమెను హత్యచేసి, అనంతరం తానూ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం శాంతినగర్‌కు చెందిన ముదాం వెంకటేశ్, వసంత (36) భార్యాభర్తలు. కొద్ది రోజులుగా వెంకటేశ్ భార్య వసంతకు వస్తున్న ఫోన్‌కాల్స్‌పై అనుమానం పెంచుకున్నాడు. అంతేకాకుండా భార్య అనారోగ్యానికి చికిత్స కోసం ప్రతినెలా వేలాది రూపాయలు ఖర్చు అవుతుండడం భారంగా భావించాడు. దీంతో భార్యను హత్య చేసేందుకు ప్రణాళిక ప్రకారం వెంకటేశ్ పొలం వద్ద ఓ కర్రను, పురుగుల మందు డబ్బాను ఏర్పాటు చేసుకున్నాడు. రోజు మాదిరిగానే గురువారం ఉదయం భార్యను పొలం వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ భార్య తలపై కర్రతో బాది హత్య చేశాడు. అనంతరం తానూ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాలను స్థానికులు గమనించడంతో ఈ విషయం వెలుగుచూసింది. ఈ దంపతులకు ఇంటర్ చదువుతున్న కూతురు, ఏడో తరగతి చదువుతున్న కుమారుడు ఉన్నారు.

మావోయిస్టు మంజుల లొంగుబాటు

• అనారోగ్య సమస్యల కారణంగా లొంగుబాటు
• సీపీ అంబర్ కిశోర్ ఝా వెల్లడి



పునరావాస పథకంకింద రూ.20 లక్షల చెక్కును మంజులకు అందజేస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

హసన్‌పర్తి: మావోయిస్టు పార్టీ స్పెషల్ జోన్ కమిటీ సభ్యురాలు కొడి మంజుల అలియాస్ నిర్మల పోలీసుల ఎదుట లొంగిపోయింది. దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ, సౌత్ జోన్ బ్యూరోగా కొనసాగుతున్న ఆమె వరంగల్ పోలీస్ కమిషనర్ (సీపీ) అంబర్ కిశోర్ ఝా ఎదుట ఆయుధాలు వీడారు. ఈ మేరకు సీపీ గురువారం ఆమెను మీడియా ఎదుట ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. అనారోగ్య కారణాలతో మంజుల లొంగిపోయినట్లు చెప్పారు. ప్రభుత్వం అందించే పునరావాస పథకం ద్వారా ప్రశాంతమైన జీవనం గడపాలని సూచించారు. ఆమెకు రూ.20 లక్షల చెక్కును అందజేశారు. వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం బుధరావుపేటకు చెందిన మంజుల తండ్రి అప్పటికి పీపుల్స్‌వార్ దళానికి సానుభూతిపరుడిగా పనిచేసేవాడు. అదే సమయంలో మంజుల సోదరుడు కుమారస్వామి అలియాస్ ఆనంద్‌తోపాటు సమీప బంధువు వెంకన్న అలియాస్ గోపన్న కూడా పీపుల్స్‌వార్‌లో చురుకుగా వ్యవహరించేవారు.

పదవ తరగతిలోనే పీపుల్స్‌వార్‌లోకి...

పీపుల్స్‌వార్ సిద్ధాంతాలకు ఆకర్షితురాలై పదవ తరగతి చదువుతుండగానే మంజుల విప్లవబాట పడింది. 2002లో మహదేవపూర్ డిప్యూటీ కమాండర్‌గా బాధ్యతలు చేపట్టింది. 2002లో అరెస్టయి జైలుకు వెళ్లిన ఆమె.. 2004లో జైలు నుంచి విడుదలై మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లినట్లు చెప్పారు. 2013లో ఛత్తీస్‌గఢ్ దర్బా డివిజన్‌లో 27 మంది పోలీసులను హత్యచేసిన ఘటనతోపాటు చిట్యాల, నర్సంపేట, ఏటూరునాగారం, నెక్కొండ స్టేషన్ పరిధిలో పోలీసులపై జరిగిన కాల్పుల్లో మంజుల నిందితురాలని సీపీ పేర్కొన్నారు.

భుజంగరావు మధ్యంతర బెయిల్ పొడిగింపు

• ఈ నెల 18 వరకు పొడిగించిన న్యాయస్థానం
• ఫోన్ ట్యాపింగ్ కేసులో హైకోర్టు ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు (ఏ–3), మాజీ ఏఎస్పీ భుజంగరావు మధ్యంతర బెయిల్‌ను హైకోర్టు పొడిగించింది. వైద్య కారణాలతో ఈనెల 18వ తేదీ సాయంత్రం 4.30 గంటల వరకు పొడిగిస్తున్నట్లు చెప్పింది. ఈ కేసులో గత మార్చిలో అరెస్టయిన భుజంగరావుకు వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్సల నిమిత్తం నాంపల్లి కోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ మధ్యంతర బెయిల్‌ను మూడుసార్లు పొడిగించింది. ఆయన బెయిల్ గడువు గురువారంతో ముగియనుండటంతో మరోసారి పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి నాంపల్లి కోర్టు నిరాకరించింది. గురువారం సాయంత్రం 4 గంటల్లోగా కోర్టు ఎదుట హాజరుకావాలని స్పష్టం చేసింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ భుజంగరావు హైకోర్టులో గురువారం లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.సుజన విచారణ చేపట్టారు. ఇప్పటికే ఓ స్టంట్ ఉండగా గుండె జబ్బుతోపాటు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది చెప్పారు. రోజూ డయాలసిస్ చేయించుకోవాలని వైద్యులు సూచించారన్నారు. జైలుకు వెళ్లకుండా తప్పించుకోవడానికే లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారని, మధ్యంతర బెయిల్ పొడిగించొద్దని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు వాదనలు వినిపించారు. కాగా, ఇదే కేసులో మరో నిందితుడు (ఏ–5) రిటైర్డు పోలీస్ అధికారి పి.రాధాకిషన్‌రావు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై తదుపరి విచారణను హైకోర్టు ఈ నెల 18కి వాయిదా వేసింది.

రెండు దుడ్డెలపై పెద్దపులి దాడి


పులిదాడిలో గాయపడ్డ దుడ్డె

ఖానాపూర్: నిర్మల్ జిల్లా ప్రజలను పులి భయం వీడడం లేదు. ఖానాపూర్ మండలంలో మేతకు వెళ్లిన రెండు దుడ్డెలపై దాడి చేసింది. వాటిని మేతకు తీసుకెళ్లిన కాపరులపైనా దాడికి యత్నించింది. ఈ ఘటన బావాపూర్(ఆర్)తండా శివారులోని అటవీ ప్రాంతంలో జరిగింది. గ్రామానికి చెందిన కాపరులు లావుడ్య అర్జున్, గుగ్లావత్ జైసింగ్ రోజులాగానే గురువారం గేదెలను పెద్దవాగు అటవీ ప్రాంతంలోకి మేతకు తీసుకెళ్లారు. మధ్యాహ్నం పొదల్లో నుంచి వచ్చిన పులి రెండు దుడ్డెలపై పంజా విసిరింది. వాటి తల్లులు అయిన గేదెలు తిరగబడడంతో పులి దుడ్డెలను వదిలిపెట్టింది. అయినా అక్కడి నుంచి పులి వెళ్లకుండా సుమారు మూడు గంటలపాటు గేదెలు, ఆవులతోపాటు కాపరులపై దాడికి యత్నించింది. అదే సమయంలో అటువైపు వచ్చిన గొర్రెల కాపరులు పులిని కర్రలతో బెదిరిస్తూ, రాళ్లు రువ్వడంతో నల్లగుట్టపైకి వెళ్లింది.

'మండలి'లో మంటలు!

సోషల్ మీడియా యాక్టివిస్టుల అక్రమ అరెస్టులపై వైఎస్సార్‌సీపీ వాయిదా తీర్మానం

తిరస్కరించిన చైర్మన్.. చర్చకు ప్రతిపక్ష ఎమ్మెల్సీల ఉడుం పట్టు

పోడియం వద్ద నిరసన.. న్యాయం కావాలి.. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలంటూ నినాదాలు

- చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని పలువురు యువకులను అన్యాయంగా అరెస్టు చేస్తున్నారు.. దీనిపై సభలో చర్చ జరగాలని డిమాండ్ చేసిన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స
- కొద్దిసేపు స్తంభించిన కార్యకలాపాలు..
- అంతకు ముందు బడ్జెట్‌పై చర్చను అడ్డుకున్న మంత్రులు
- హామీలపై తమ బండారం బయటపడుతుందని అడుగడుగునా ఆటంకాలు.. సూపర్ సిక్స్ పథకాలు, కేటాయింపులపై నిలదీసిన వైఎస్సార్‌సీపీ
- బడ్జెట్‌పై చర్చ పక్కదోవ.. అధికార పార్టీ సభ్యుల తీరు మారకపోవడంతో సభ వాయిదా.. తిరిగి సభ ప్రారంభమైన తర్వాత కూడా అదే వైఖరి కొనసాగింపు



సోషల్ మీడియా యాక్టివిస్టుల అక్రమ అరెస్టులపై చర్చకు డిమాండ్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ సభ్యులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సోషల్ మీడియా యాక్టివిస్టుల అక్రమ అరెస్టులపై శాసన మండలి అట్టుడికింది. కూటమి సర్కారు నిరంకుశ వైఖరి, అరాచక విధానాలపై ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీలు మండిపడ్డారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారనే నెపంతో చట్టాన్ని దుర్వినియోగం చేస్తూ కక్ష సాధింపు చర్యలకు దిగడం సరికాదని పేర్కొన్నారు. అక్రమ అరెస్టులను అరికట్టాలి.. నిరంకుశ రాజ్యం నశించాలి.. ఉయ్ వాంట్ జస్టిస్.. సేవ్ డెమొక్రసీ అంటూ నినదించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కించపరుస్తూ, వ్యక్తిత్వ హననానికి పాల్పడుతూ కూటమి పార్టీలకు చెందిన కొందరు పెట్టిన అభ్యంతరకర పోస్టుల ప్లకార్డులను ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ సభ్యులు ప్రదర్శించారు. యథేచ్ఛగా జరుగుతున్న అక్రమ అరెస్టులపై చర్చకు అనుమతించాలని వైఎస్సార్‌సీపీ సభ్యులు మొండితోక అరుణ్‌కుమార్, తుమాటి మాధవరావు, పి.రామసుబ్బారెడ్డి వాయిదా తీర్మానాన్ని ఇవ్వగా మరో ఫార్మాట్‌లో తేవాలంటూ వాయిదా తీర్మానాన్ని మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు తిరస్కరించారు. దీనిపై చర్చకు అనుమతించాలంటూ పట్టుబట్టిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, దువ్వాడ శ్రీనివాస్, తలశిల రఘురాం, వరుదు కళ్యాణి, కల్పలతా రెడ్డి, పండుల రవీంద్రబాబు, తోట త్రిమూర్తులు, మహ్మద్ రుహుల్లా తదితరులు పోడియం వద్ద ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. మంత్రులు పయ్యావుల కేశవ్, నారా లోకేశ్, గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు, వంగలపూడి అనిత, మండలి చీఫ్‌విప్ పంచుమర్తి అనురాధ, టీడీపీ ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు దీనిపై జోక్యం చేసుకుంటూ వాయిదా తీర్మానాన్ని తిరస్కరించిన తర్వాత చర్చకు పట్టుబట్టడం సరికాదన్నారు. దీనిపై మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ స్పందిస్తూ రాష్ట్రంలో చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని అనేక మంది యువకులను అక్రమ అరెస్టులు చేస్తున్నారని, దీనిపై సభలో ఖచ్చితంగా చర్చ జరపాల్సిందేనని పట్టుబట్టారు. చర్చ కోసం వైఎస్సార్‌సీపీ సభ్యులు నిరసన తెలపడంతో సభ 34 నిమిషాల పాటు నిలిచిపోయింది. దీంతో చైర్మన్ మోషేన్‌రాజు సభను కొద్దిసేపు వాయిదా వేసి మళ్లీ కొనసాగించారు. డీఎస్సీ నోటిఫికేషన్ కాలయాపనపై చర్చించేందుకు పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని కూడా మండలి చైర్మన్ మోషేన్‌రాజు తిరస్కరించారు.

మా రాజీనామాలు ఆమోదించండి..

సోషల్ మీడియా యాక్టివిస్టుల అక్రమ అరెస్టులపై చర్చించాలని వైఎస్సార్‌సీపీ సభ్యులు ఆందోళన చేస్తున్న సమయంలోనే వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్సీలుగా ఎన్నికైన పోతుల సునీత, బల్లి కళ్యాణ చక్రవర్తి, కర్రి పద్మశ్రీ తమ రాజీనామాలు ఆమోదించాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ, టీడీపీ సభ్యులు కలసి వారిని ముందుకు తీసుకెళ్లడం గమనార్హం. ఆ ముగ్గురూ పోడియం పైకి వెళ్లి చైర్మన్‌ను కలసి తమ రాజీనామాలు ఆమోదించాలని విజ్ఞాపన పత్రాలు అందించారు. మీ రాజీనామాల అంశం పరిశీలనలో ఉందని, వాటిపై తర్వాత నిర్ణయం తీసుకుంటానని చైర్మన్ స్పష్టం చేశారు.

బడ్జెట్‌పై చర్చను అడ్డుకున్న మంత్రులు

శాసన మండలిలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు బడ్జెట్‌పై మాట్లాడుతున్న సమయంలో మంత్రులు, టీడీపీ ఎమ్మెల్సీలు పదేపదే అడ్డుపడి రభస సృష్టించారు. వైఎస్సార్‌సీపీ సభ్యురాలు వరదు కళ్యాణి బడ్జెట్‌పై చర్చను ప్రారంభించగానే మంత్రులు, కూటమి సభ్యులు చర్చను పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారు. చర్చ పక్కదారి పడుతోందని, బడ్జెట్‌పైనే మాట్లాడాలంటూ చైర్మన్ సహనంతో పలుమార్లు కోరినా మంత్రులు లోకేశ్, పయ్యావుల కేశవ్, డోలా బాలవీరాంజనేయస్వామి, అనిత, సవిత పదేపదే అడ్డు తగులుతూ చర్చ కొనసాగనివ్వకుండా చేశారు. విధిలేని పరిస్థితుల్లో చైర్మన్ పది నిమిషాలు సభను వాయిదా వేశారు. అనంతరం తిరిగి ప్రారంభమైన తర్వాత కూడా అధికార పార్టీ సభ్యులు అదే ధోరణి కొనసాగించారు. చర్చ పూర్తిగా తప్పుదోవ పట్టి గందరగోళ పరిస్థితులు నెలకొనడంతో చైర్మన్ సభను వాయిదా వేశారు.

సర్వనాశనం చేసింది బాబే: బొత్స

రాష్ట్రాన్ని సర్వనాశనం చేసింది చంద్రబాబేనని, మళ్లీ అబద్ధాలతో అధికారంలోకి వచ్చారని మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ధ్వజమెత్తారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా రాష్ట్రాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాశనం చేశారని యనమల రామకృష్ణుడు వ్యాఖ్యానించడంపై తీవ్ర అభ్యంతరం తెలిపారు. ప్రజలకు మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో అందుకు అనుగుణంగా కేటాయింపులు జరపలేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ సభ్యులు కోరటాన్ని తప్పుబడితే ఎలా? అని ప్రశ్నించారు. హామీలు ఎలా అమలు చేస్తారు? ఎప్పుడు నెరవేరుస్తారు? అని అడిగితే అందులో తప్పు ఏముందన్నారు. తమ ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పలేక చర్చను తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు.

ఏం జరిగిందంటే..?

బడ్జెట్‌పై చర్చ సందర్భంగా వరుదు కళ్యాణి మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి పార్టీలు హామీ ఇచ్చినట్లుగా.. నీకు రూ.15 వేలు.. నీకు రూ.18 వేలు.. రైతులకు రూ.20,000, మహిళలకు నెలకు రూ.1,500 లాంటి పథకాల కోసం ప్రజలంతా ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. అయితే బడ్జెట్‌లో ఈ పథకాలకు ఒక్క పైసా కూడా కేటాయించలేదని చెబుతుండగా.. మంత్రి సవిత, అనిత, పయ్యావుల కేశవ్ ఆమెను పదేపదే అడ్డుకున్నారు. సభ్యులు ప్రసంగించకుండా మంత్రులు ఈ విధంగా పదేపదే అడ్డుపడటం సరికాదని ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ అభ్యంతరం తెలిపారు. సభ్యుల ప్రసంగంపై అభ్యంతరాలు ఉంటే వాటిని నోట్ చేసుకొని సమాధానం ఇచ్చే సమయంలో వివరణ ఇస్తే సరిపోతుందన్నారు. ఈ సందర్భంగా సభలో ఏ విధంగా నడుచుకోవాలి? ఎలా మాట్లాడాలి? అనే అంశంపై సుదీర్ఘంగా చర్చ జరగడంతో చైర్మన్ సభను వాయిదా వేశారు. అనంతరం వరుదు కళ్యాణి తిరిగి చర్చను ప్రారంభిస్తూ దీపం-2 పథకం కింద మూడు ఉచిత సిలెండర్లకు రూ.3,000 కోట్లు అవసరం కాగా బడ్జెట్‌లో కేవలం రూ.800 కోట్లే కేటాయించారని ప్రస్తావిస్తుండగా.. మంత్రి అనిత నిలబడి ఆమెను అడ్డుకున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఏమైందని కళ్యాణి మాట్లాడుతున్న సమయంలో మంత్రి డోలా వీరాంజనేయస్వామి లేచి నిలబడి అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. మీ నాయకుడు పారిపోయి ఇంట్లో పడుకున్నారు..! త్వరలో మీరూ పారిపోతారంటూ వైఎస్సార్‌సీపీ సభ్యులను రెచ్చగొట్టడంతో సభలో అలజడి చెలరేగింది. ఇంతలో హఠాత్తుగా నారా లోకేశ్ లేచి నిలబడి అసందర్భ చర్చను తెరపైకి తెచ్చారు. గౌరవ సభలో మా తల్లిని అవమానించారని, అందుకే ఆగ్రహంతో మాట్లాడుతున్నాం అంటూ ఊగిపోయారు. అయితే రికార్డుల్లో లేని విషయాలు, సభలో లేని వ్యక్తులను ప్రస్తావించి చర్చ చేయడం సరికాదంటూ బొత్స వారించారు. ఇరుపార్టీల సభ్యులు వాగ్యుద్ధానికి దిగడంతో చైర్మన్ సభను శుక్రవారానికి వాయిదా వేశారు.

అదంతా.. ఐ-టీడీపీ పైశాచికమే

సోషల్ మీడియాలో పచ్చ పిశాచ గణం విశృంఖలత్వం

ఫేక్ ఐడీలతో చెలరేగుతున్న పచ్చ మురాలు

మహిళలపై జుగుప్సాకర పోస్టులతో వేధింపులు.. వైఎస్సార్‌సీపీ కార్యకర్తల పేరుతో కూడా ఫేక్ ఐడీలు సృష్టి

ఆపై వైఎస్సార్ కుటుంబ సభ్యులను కించపరుస్తూ పోస్టులు

తన పేరుతో ఫేక్ ఐడీ సృష్టించారని ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఫిర్యాదు చేసిన 'వర్రా'

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

- అది ఐ-టీడీపీ నిర్వాకమేనని గతంలోనే ఆధారాలతో సహా తేల్చిన పోలీసులు... ఐ-టీడీపీ కార్యకర్త అప్పుడే అరెస్ట్..
- ఆ ఫేక్ ఐడీ పోస్టులపై ఇప్పుడు వర్రాను అరెస్ట్ చేయడంపై విస్మయం
- బాధితుడినే.. నిందితుడిగా మార్చే టీడీపీ పెద్దల కుట్రలకు ఖాకీల వత్తాసు
- ఎంపీ అవినాశ్ రెడ్డిని అక్రమ కేసులో ఇరికించే కుట్రలో భాగమే..

8,084 మంది గ్రూప్-4కు ఎంపిక

- 8,084 పోస్టులకు అర్హులను ఎంపిక చేసిన టీజీపీఎస్సీ
- మరో 59 ఉద్యోగాల ఫలితాలు పెండింగ్
- సరైన అభ్యర్థులు లభించక 37 ఉద్యోగాలు ఖాళీ
- 2022లో నోటిఫికేషన్.. రెండేళ్లు సాగిన భర్తీ ప్రక్రియ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో గ్రూప్–4 ఉద్యోగాల భర్తీ కోసం నిర్వహించిన పరీక్షల తుది ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. మొత్తం 8,180 పోస్టుల భర్తీ కోసం ప్రక్రియ చేపట్టిన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ).. 8,084 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసింది. మరో 59 ఉద్యోగాలకు సంబంధించిన వివరాలు విత్‌హెల్డ్‌లో పెట్టింది. ఇంకో 37 ఉద్యోగాలకు సరైన అభ్యర్థులు లభించకపోవడంతో ఖాళీగా ఉంచారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

2022లోనే నోటిఫికేషన్ వెలువడినా..

గ్రూప్–4 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ సుమారు రెండేళ్ల పాటు కొనసాగింది. 2022 డిసెంబర్ 1న నోటిఫికేషన్ వెలువడగా.. 2023 జనవరి మూడో వారంలో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభించారు. మొత్తంగా 9,51,321 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. గత ఏడాది జూలై 1వ తేదీన ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించారు. 7.6 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. కమిషన్ ఈ పరీక్షలకు సంబంధించి 'కీ'లను గత ఏడాదే విడుదల చేసి అభ్యంతరాలను స్వీకరించింది. పరీక్ష నుంచి పది ప్రశ్నలను తొలగించి మార్కుల గణన చేపట్టింది. అయితే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ ప్రక్రియలో జాప్యం జరిగింది. న్యాయ వివాదాలు, సాంకేతిక సమస్యలతోనూ ఆలస్యమైంది. కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలో ర్యాంకుల జాబితాను విడుదల చేసింది. జూన్‌లో 1:3 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసి, ధ్రువపత్రాల పరిశీలన చేపట్టింది. తాజాగా తుది ఫలితాలు విడుదల చేసింది.

ఆయుష్ కటాఫ్ స్కోర్ తగ్గింపు

యూజీ, పీజీ కన్వీనర్, యాజమాన్య కోటా అడ్మిషన్లు షురూ

సాక్షి, హైదరాబాద్: ఆయుష్ యూజీ, పీజీ సీట్ల ఖాళీల భర్తీకి కేంద్ర ఆయుష్ మంత్రిత్వశాఖ తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. ఏఐఏపీజీఈటీ (ఆల్ ఇండియా ఆయుష్‌పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ టెస్టు)–2024, యూజీ 'నీట్'2024 ఆయుష్ కటాఫ్ స్కోర్‌ను 15 శాతం తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు ఆయుష్ యూజీ, పీజీ అర్హత కటాఫ్ జనరల్ కేటగిరీ 35 పర్సెంటైల్, దివ్యాంగులు (జనరల్)కు 30, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వుడ్ కేటగిరీలకు 25 పర్సెంటైల్‌గా నిర్ణయించారు. కటాఫ్ మార్కులు తగ్గడంతో ఈ మేరకు అర్హత సాధించిన అభ్యర్థులు పీజీ ఆయుర్వేదం, హోమియో, యునానీ కోర్సుల్లో కన్వీనర్, ఆలిండియా కోటాలకు, అదే విధంగా బీహెచ్ఎంఎస్, బీఏఎంఎస్, బీఎన్‌వైఎస్, బీయూఎంఎస్ కన్వీనర్ కోటా, బీహెచ్ఎంఎస్ యాజమాన్య కోటాలలో దరఖాస్తు చేసుకోవడానికి వెసులుబాటు కల్పిస్తూ కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం మరోసారి ప్రవేశ ప్రకటనలను జారీ చేసింది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు కన్వీనర్, యాజమాన్య కోటాలకు విడివిడిగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. తగ్గిన కటాఫ్ స్కోర్ ఆధారంగా అర్హత సాధించిన అభ్యర్థులు పీజీ ఆయుష్ సీట్ల కోసం ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు, యూజీ ఆయుష్ సీట్లకు ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తుతో పాటు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దరఖాస్తుల పరిశీలన అనంతరం తుది మెరిట్ జాబితాను విడుదల చేస్తారు. మరిన్ని వివరాలకు www.knruhs.telangana.gov.in వెబ్‌సైట్‌ను చూడాలని యూనివర్సిటీ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి.

క్లుప్తంగా...

రవాణా కమిషనర్‌గా సురేంద్రమోహన్ బాధ్యతలు



సాక్షి, హైదరాబాద్: రవాణా శాఖ కమిషనర్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి సురేంద్ర మోహన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జేటీసీ రమేశ్, తెలంగాణ ట్రాన్స్‌పోర్ట్ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు కమిషనర్‌ను కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం సురేంద్రమోహన్ శాఖ ఉన్నతాధికారులతో సమావేశమై రోడ్డు భద్రతతో పాటు పలు అంశాలపైన చర్చించారు.

ఎంఈడీ, ఎంపీఈడీ చివరి విడత కౌన్సెలింగ్ షెడ్యూల్

ఉస్మానియా యూనివర్సిటీ: ఎంఈడీ, ఎంపీఈడీ చివరి విడత కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను గురువారం ప్రకటించారు. పీజీ కోర్సుల ప్రవేశ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులు ఈ నెల 18 వరకు పేర్లను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. అదే రోజు కరెక్షన్స్ లేదా ఎడిటింగ్ చేసుకోవచ్చు. అలాగే 19, 20 తేదీల్లో వెబ్ ఆప్షన్స్ నమోదు చేసుకోవాలని కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న సీట్లు సాధించిన విద్యార్థుల జాబితాను ప్రకటించనున్నట్లు ఆయన వెల్లడించారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 26 వరకు ఆయా కాలేజీల్లో రిపోర్టు చేయాలన్నారు.

నారాయణ విద్యార్థులకు అందుబాటులోకి 'ఆస్ట్రా'

డిజిటల్ లెర్నింగ్‌ను మరింత సులభతరం చేసే ప్రక్రియలో భాగంగా అధునాతన ఏఐ టూల్ 'ఆస్ట్రా'ను నారాయణ విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చామని ఆ విద్యాసంస్థల ప్రెసిడెంట్ పునీత్ కొత్తప తెలిపారు. ఏఐ ఆధారిత చాట్‌బాట్ ఆస్ట్రా ... ప్రశ్నలు అడిగిన 30 సెకన్లలోపే సమాధానాలను అందిస్తుంది. పాఠ్యాంశాలకు సంబంధించిన సందేహాలతో పాటు ఇతర వివరాలను నివృత్తి చేసుకోవడానికి ఆస్ట్రా ఎంతో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. నారాయణ పాఠ్యాంశాలతో పాటు స్టడీ మెటీరియల్స్‌ను ఆస్ట్రా టూల్‌కి అనుసంధానించడం ద్వారా విద్యార్థుల సందేహాలకు వెంటనే స్పందించేలా దీనిని అప్‌డేట్ చేస్తామని సంస్థ వెల్లడించింది. ఈ టూల్ నారాయణ విద్యార్థులకు ఉచితంగానే అందిస్తున్నామని పునీత్ తెలిపారు.

డిసెంబర్ 9 వరకు ప్రజాపాలన విజయోత్సవాలు

- కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన సందర్భంగా నిర్వహించాలని నిర్ణయం
- వరంగల్, మహబూబ్‌నగర్, కరీంనగర్ జిల్లాల్లో సీఎం బహిరంగ సభలు
- ప్రజల్లోకి విస్తృతంగా ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు
- ఈ నెల 19న 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాలకు శంకుస్థాపన
- డిసెంబర్ 9న మహిళల సమక్షంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ



సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో భట్టి, పొన్నం, సీఎస్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి డిసెంబర్ 7వ తేదీతో ఏడాది పూర్తి అవుతున్న సందర్భంగా వచ్చే నెల 9 వరకు ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సందర్భంగా వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో జరిగే బహిరంగ సభల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. ప్రజాపాలన విజయోత్సవాలపై గురువారం రాత్రి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి సీఎం సమీక్ష నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించనున్న కార్యక్రమాలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ఈ నెల 19న వరంగల్ వేదికగా 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాలకు శంకుస్థాపన చేయాలని నిర్ణయించారు.

ట్యాంక్‌బండ్ పరిసరాల్లో వేడుకలు

డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్ ట్యాంక్‌బండ్, సచివాలయం, నెక్లెస్ రోడ్డు పరిసరాల్లో విజయోత్సవ వేడుకలు నిర్వహించాలని సీఎం ఆదేశించారు. ఏడాది కాలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. మహిళల సాధికారత, రైతుల సంక్షేమం, యువజన వికాసానికి సంబంధించి ప్రభుత్వం తీసుకున్న చర్యలు ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. శాఖలు, విభాగాల వారీగా ప్రభుత్వం తొలి ఏడాదిలో సాధించిన ప్రగతి, అమలు చేసిన కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సీఎం కోరారు. నియోజకవర్గాల వారీగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. ఇలావుండగా డిసెంబర్ 9న సచివాలయ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా మహిళలను ఆహ్వానించాలని నిర్ణయించారు. సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, వేం నరేందర్ రెడ్డి, శ్రీనివాసరాజు, మధుయాష్కీ గౌడ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పాల్గొన్నారు.

సర్కారు ఆసుపత్రి.. ప్రైవేటు మందు!

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పెద్దాసుపత్రుల్లో ప్రైవేట్ మందుల మాఫియా రాజ్యమేలుతోంది. పేద రోగులను పీల్చిపిప్పి చేస్తోంది. ఆసుపత్రిలోని ఉచిత ఫార్మసీలో లేని మందును, ఈ ప్రైవేట్ మెడికల్ షాపుల యజమానులు తెప్పిస్తారు. ఏ మందులు తెప్పించాలో డాక్టర్లు వీరికి చెప్తారు. అదే మందును స్టాక్ పెట్టి రోగులకు అమ్ముతారు. అందులో డాక్టర్ కమీషన్ కనీసం 10 నుంచి 20 శాతం ఉంటుందని అంటున్నారు. హైదరాబాద్‌లోని ప్రముఖ ఆసుపత్రులైన గాంధీ, ఉస్మానియా, పేట్ల బురుజు, అలాగే వరంగల్‌లోని ఎంజీఎం, కరీంనగర్‌లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో ప్రైవేట్ మందుల షాపులు ఏటా రూ.కోట్లలో వ్యాపారం చేస్తున్నాయి. ఉచిత మందులు ఇవ్వాల్సిన పెద్దాసుపత్రుల్లో బహిరంగంగా ప్రైవేట్ మందుల మాఫియా దోపిడీ కొనసాగుతున్నా, దాన్ని అడ్డుకునే నాథుడే లేకుండా పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాటికి అడ్డుకట్ట వేయడంలో యంత్రాంగం విఫలమవుతోంది.



నిలోఫర్ వద్ద ప్రైవేటు మందుల షాపు

రోజుకు జరిగే వ్యాపారం

- గాంధీ ఆసుపత్రిలోని ప్రైవేట్ మందుల దుకాణాల్లో రూ. 10 లక్షలు
- ఉస్మానియాలో రూ. 12 లక్షలు
- ఎంఎన్‌జేపై ఆధారపడిన మూడు ప్రైవేట్ దుకాణాల్లో రూ.15 లక్షలు
- ఎంజీఎంలో రూ. 5 లక్షలు

ఆ మందుల దుకాణాలెందుకు?

రాష్ట్రంలో కీలకమైన ఈ ఆసుపత్రుల్లో సాధారణ జ్వరం మొదలు... అత్యంత కీలకమైన అవయవ మార్పిడి చికిత్సల వరకు జరుగుతుంటాయి. వీటిల్లో పేదలకు ఉచిత వైద్యం, ఉచిత మందులు ఇవ్వాలనేది లక్ష్యం. అయినా అక్కడ ఉచిత మందుల దుకాణాలున్నా, ప్రైవేట్ మందుల దుకాణాలు ఎందుకు పెట్టారన్నది అంతుబట్టని ప్రశ్న. గాంధీ ఆసుపత్రిలో ఓపీ బ్లాక్‌కు సరిగ్గా ఎదురుగా వరుసగా నాలుగు ప్రైవేట్ మెడికల్ షాపులున్నాయి. ఉస్మానియా ఆసుపత్రిలో ఐదు, నిలోఫర్‌లో రెండు, పేట్లబుర్జు మెటర్నిటీ ఆసుపత్రిలో ఒకటి, కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రెండు ప్రైవేట్ మందుల దుకాణాలు ఉన్నాయి. హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి ప్రాంగణంలో ప్రైవేట్ మందుల దుకాణాలు ఉండవు.. కానీ దానికి అత్యంత సమీపంలోని మూడు మెడికల్ షాపులు కేన్సర్ మందులను అందుబాటులో ఉంచుతాయి. కొందరు ఆంకాలజిస్టులకైతే నెలకు ఐదారు లక్షల రూపాయల వరకు ఆ దుకాణాల నుంచి కమీషన్ తీసుకుంటున్నారన్న ప్రచారం ఉంది.

కొన్ని ఫ్రీగా... కొన్ని కొనుగోలు చేసేలా

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రైవేట్ మెడికల్ దుకాణాలకు డాక్టర్లు, సూపరింటెండెంట్లు, రాష్ట్రస్థాయిలో కీలకమైన అధికారుల అండదండలు పుష్కలంగా ఉంటాయి. వారి అండతోనే ప్రైవేట్ మందుల దుకాణాదారులు రెచ్చిపోతుంటారు. రోగికి వైద్యుడు నాలుగు రకాల మందులు రాస్తే, అందులో ప్రభుత్వ దుకాణంలో రెండే ఉంటాయి. మిగిలిన రెండింటిని ప్రైవేట్ దుకాణంలో కొనాల్సిందే. ఒక్కోసారి మందులున్నా కూడా లేవని ప్రభుత్వ ఫార్మసీ వారు చెబుతారు. అప్పుడు ప్రైవేట్లో కొనాల్సిందే. ఇక ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రిలో రోగులకు ఇచ్చే మందులన్నీ దాదాపు బేసిక్‌వే. అడ్వాన్స్ ట్రీట్‌మెంట్‌కు అవసరమైన మందులు ఇవ్వాలంటే ఎంఎన్‌జే ఆసుపత్రిలో దొరకవు. పైగా అవి అత్యంత ఖరీదైనవిగా ఉంటాయి. కొన్ని డోసులైతే రూ.లక్షల్లో ఉంటాయి. సీఎంఆర్ఎఫ్ కింద బిల్లులు పెట్టి ప్రైవేట్ దుకాణాల్లో కొని వాడుతుంటారు. ఎంఎన్‌జే మినహా మిగిలిన ప్రభుత్వ ఆసుపత్రులకు ఇచ్చే మందులను తెలంగాణ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీజీఎంఎస్ఐడీసీ) సరఫరా చేస్తుంది. అయితే చాలామందులు అత్యాధునికమైనవి కాకుండా బేసిక్ మందులనే సరఫరా చేస్తుందన్న ఆరోపణలున్నాయి. ఆయా ప్రైవేట్ దుకాణాలను ఎత్తి వేయడానికి ఎలాంటి ప్రయత్నం జరగకపోవడంతో రోగులు నష్టపోతున్నారు. కాగా, ప్రైవేట్ దుకాణాలు కోర్టుల్లో స్టేలు తెచ్చుకొని చలామణిలో ఉంటున్నాయని చెబుతున్నారు.

రైళ్ల రాకపోకలు పునరుద్ధరణ

- పెద్దపల్లి జిల్లాలో అందుబాటులోకి వచ్చిన రెండు ట్రాక్‌లు
- ముమ్మరంగా మూడో ట్రాక్ మరమ్మతులు



ట్రాక్‌ల పునరుద్ధరణతో ప్రారంభమైన రైళ్ల ప్రయాణాలు

సాక్షి, పెద్దపల్లి: గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో నిలిచిపోయిన రైళ్ల రాకపోకలను గురువారం పునరుద్ధరించారు. పెద్దపల్లి జిల్లా రాఘవాపూర్- రామగుండం రైల్వేస్టేషన్ల మధ్య కన్నాల గ్రామ గేట్ సమీపంలో మంగళవారం రాత్రి గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో మూడు ట్రాక్‌లు ధ్వంసమైన విషయం విదితమే. అదేరోజు రాత్రి సిబ్బంది యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. ప్రస్తుతం మరమ్మతులు పూర్తికావడంతో ఇరువైపులా రాకపోకలను పునరుద్ధరించారు. బుధవారం ఉదయం 7.35 గంటలకు గూడ్స్ రైలుతో ట్రయల్ రన్ చేసిన అధికారులు.. అది విజయవంతం కావడంతో అప్‌ట్రాక్‌పై రాత్రి 11.30 గంటలకు ప్యాసింజర్ రైళ్లకు అనుమతించారు. గురువారం ఉదయం 8 గంటలకు డౌన్‌లో మరో ట్రాక్‌ను పునరుద్ధరించి ట్రయల్ రన్ చేశారు. ఇది సక్సెస్ కావడంతో అప్‌లైన్, డౌన్ ట్రాక్‌లపై రైళ్లు పరుగులు పెడుతున్నాయి. మధ్యలోని మూడో ట్రాక్‌ను శుక్రవారం ఉదయం 9.15 గంటలకు ట్రయల్ రన్ చేసి రైళ్ల రాకపోకలకు అనుమతిస్తారు. ప్రమాదం జరిగిన చోట రైళ్ల వేగం తగ్గించనున్నట్లు సమాచారం. సుమారు 1,200 మంది కూలీలు, భారీ యంత్రాలు రాత్రింబవళ్లు పనిచేయడంతో ట్రాక్‌లు రికార్డు స్థాయిలో 36 గంటల్లోనే అందుబాటులోకి వచ్చాయి. కాజీపేట–బల్లార్షా సెక్షన్ల మధ్య రోజూ సుమారు 80 రైళ్లు నడుస్తాయి. అయితే, రామగిరి ప్యాసింజర్, సిరిపూర్ టౌన్- కరీంనగర్ మెము, కరీంనగర్–బోధన్, సింగరేణి తదితర 8 రైళ్లను గురువారం రద్దు కూడా చేశారు.

త్వరలో సింగరేణికి కొత్త సీఎండీ!

సాక్షి, హైదరాబాద్: సింగరేణి బొగ్గు గనుల సంస్థ ఇన్‌చార్జ్ సీఎండీ ఎన్.బలరామ్ డిప్యుటేషన్ వచ్చే డిసెంబర్ 8వ తేదీతో ముగియనుంది. బలరామ్ డిప్యుటేషన్‌ను మరో ఏడాది పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి పట్ల కేంద్ర శిక్షణ, సిబ్బంది శాఖ(డీఓపీటీ) విముఖత వ్యక్తం చేసినట్టు తెలిసింది. డిసెంబర్ 8న బలరామ్ రిలీవ్ అయ్యి మళ్లీ కేంద్ర సర్వీసులకు రిపోర్టు చేయాల్సి ఉంటుందని చర్చ జరుగుతోంది. దీంతో కొత్త సీఎండీ నియామకం అనివార్యం కానుంది.

Word Bank

పోల్‌ట్రూన్
పిరికి వ్యక్తుల విషయంలో ఉపయోగించే మాట...పోల్‌ట్రూన్.
ఉదా: కమాన్, యూ పోల్‌ట్రూన్స్

అలెక్సితైమియా
భావోద్వేగాలను మాటల్లో వర్ణించలేని స్థితి.
ఉదా: వెన్ ఐ సా హిజ్ హ్యాండ్‌సమ్ ఫేస్ ఐ వాజ్ హిట్ విత్ ఏ వేవ్ ఆఫ్ అలెక్సితైమియా

కాలో
అనుభవరాహిత్యం, అపరిపక్వతకు సంబంధించి వాడే మాట...కాలో.
ఉదా: మార్క్ వాజ్ జస్ట్ ఏ కాలో యూత్ ఆఫ్ 16 వెన్ హీ అరైవ్‌డ్ ఇన్ ప్యారిస్.

ఫల్మినేట్
గట్టిగా ఖండించడం, దాడి చేయడం.
ఉదా: హీ ఫల్మినేటెడ్ అగేనెస్ట్ ది ఈవిల్స్ ఆఫ్ హీజ్ టైమ్

స్టార్ యూట్యూబర్ కావాలంటే చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉండగానే సరిపోదు. స్మార్ట్‌గా ఆలోచించాలి. మహేష్ కేశ్‌వాలా 'డిజిటల్ స్టార్' స్టేటస్ రాత్రికి రాత్రి రాలేదు. మోడలింగ్ ఎక్స్‌పీరియన్స్‌తో సోషల్ మీడియాలోకి అడుగుపెట్టిన మహేష్ ఒక్కో మెట్టు ఎక్కుతూ 'డిజిటల్ స్టార్' అయ్యాడు. 'ఫోర్బ్స్' జాబితాలో చోటు సంపాదించాడు...

● డిజిటల్ స్టార్


తుగేష్

నవ్వుల ఖజానా

తుగేష్‌గా ప్రసిద్ధుడైన సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్, కంటెంట్ క్రియేటర్ మహేష్ కేశ్‌వాలాకు ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లలో ఏడు మిలియన్‌ల మంది ఫాలోవర్‌లు ఉన్నారు. ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించడమే తన బలం. 'దైనందిన జీవితంలోని సంఘటనల నుంచి కంటెంట్ క్రియేట్ చేస్తాను. అలా అని తొందరపడకుండా ఏది ట్రెండింగ్‌లో ఉందో, ఏది ప్రేక్షకులకు నచ్చుతుందో ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తాను. ఎంతో పరిశోధించాకగానీ ఒక వీడియో చేయడం జరగదు' అంటున్నాడు ముంబైకి చెందిన తుగేష్.

'ది తుగేష్ షో' బాగా పాపులర్ అయింది. ఈ షో కోసం తాను సాధారణంగా క్రియేట్ చేసే రీల్స్, కామెంటరీ వీడియోలతో పోలిస్తే పదిరెట్లు ఎక్కువగా కష్టపడ్డాడు.

'మందులకే కాదు కంటెంట్‌కు కూడా ఎక్స్‌పైరీ డేట్ ఉంటుంది. అయిదు సంవత్సరాల క్రితం సూపర్ హిట్ అయిన కంటెంట్‌ను ఇప్పుడు ఎవరూ పట్టించుకోకపోవచ్చు. అందుకే కంటెంట్ క్రియేటర్‌లు కాలంతో పాటు ప్రయాణించాలి' అంటాడు తుగేష్.

'సక్సెస్ మంత్రా ఏమిటి?' అనే ప్రశ్నకు మహేష్ చెప్పిన జవాబు...

'సక్సెస్‌కు షార్ట్ కట్‌లు ఉండవు. కఠోర శ్రమ, అంకితభావం ఉంటే ఎవరికైనా విజయం సాధ్యమే. నా ప్రపంచంలో క్రియేటివ్ బ్లాక్స్‌కు తావు లేదు'

హాస్యమే కాకుండా ఇండియన్ మీడియా, సోషల్ మీడియా ప్రముఖులపై తుగేష్ కంటెంట్ క్రియేట్ చేస్తున్నాడు.

'తుగేష్ లైవ్' అనే వ్లాగింగ్ చానల్ ద్వారా తన ట్రావెల్ వ్లాగ్‌లు, వ్యక్తిగత అనుభవాలను షేర్ చేస్తుంటాడు. 'ఒక ప్రాజెక్ట్‌కు మంచి పేరు వచ్చిన తరువాత 'నెక్స్ ప్రాజెక్ట్ దీనికంటే భిన్నంగా ఉండాలి అని ఆలోచిస్తాను' అంటున్న మహేష్ ఇటీవల 'ఫోర్బ్స్ ఇండియా టాప్ డిజిటల్ స్టార్స్' జాబితాలో చోటు సంపాదించాడు.

> ఏ పని చేసినా యాంత్రికంగా కాకుండా శ్రద్ధగా చేయాలి. కంటెంట్ విషయంలో 'నాకు నచ్చితే చాలు' అనుకోకుండా 360 డిగ్రీ కోణంలో విశ్లేషించాలి. ఎప్పుడూ కొత్తగా ఆలోచించాలి.
> – తుగేష్

యువర్స్

● యంగ్ టాలెంట్

అవధాన సుధ

పద్యాలు చదివే పిల్లలు ఈరోజుల్లో అరుదైపోయారు. అయితే హైదరాబాద్‌కు చెందిన సంకీర్త్ అలా కాదు. పద్యాలు చదవడమే కాదు అలవోకగా పద్యాలు అల్లుతూ 'బాలావధాని' అనిపించుకుంటున్నాడు...


సంకీర్త్

పదమూడు సంవత్సరాల వింజమూరి సంకీర్త్ తటవర్తి గురుకులంలో పద్యరచనలో శిక్షణ పొందుతూ ఎన్నో పద్యాలు రాశాడు. 'క్షాత్రసరణి' అనే శతక కార్యక్రమంలో మొదటిసారిగా తన పద్యాలు చదివి 'భేష్' అనిపించుకున్నాడు. '**భీముడు జంపె రావణుని భీకర లీల మహోగ్ర తేజుడై**' అని ఇచ్చిన సమస్యకు బాలావధాని '**క్షేమము గూర్చగా ధరకి శ్రీయుత రూపము నెత్తె భూతలిన్ / ధామముగాను వెల్గ వరదాయకుడై రణధీర యోగియై/ స్వామిగ లోక రక్షణకు సంతస మొంద రణాన రాముడే / భీముడు జంపె రావణుని భీకర లీల మహోగ్ర తేజుడై**' అని చక్కగా పూరించాడు. దత్తపది అంశంలో 'కరి వరి మరి తరి' పదాలు ఇచ్చి అమ్మవారిని వర్ణించమని అడగగా...

'**దేవి శ్రీకరి శాంకరి దివ్య వాణి నీదు సేవను తరియించి విత్యముగను లోకమును గావ రిపులను రూపుమాపి కావుమమ్మ ధరన్ మరి కరుణ జూపి**' అంటూ పూరించాడు. వర్ణన అంశంలో ఉయ్యాల సేవ వర్ణన అడుగగా '**వెంకటాచలమని వేంకటేశుని గొల్చి, ఊయలూపుచుండ హాయిగాను, భక్తులకు వరముగ భవ్య స్వరూపమై, వెలసినట్టి దేవ వినయ నుతులు**' అంటూ చక్కగా వర్ణించాడు. ఒకటవ పాదంలో మొదటి అక్షరం శ, 2వ పాదంలో 2వ అక్షరం మ, 3వ పాదంలో 11వ అక్షరం సా, 4వ పాదంలో 19వ అక్షరం పా వచ్చే విధంగా దుర్గాపూజను వర్ణించమని అడిగితే...

'**శమియగు నీ స్వరూపము సుశక్తినొసంగగ దివ్య మాతవై / గమనము దెల్పుచున్ సుమతి కామితదాయిని సింహవాహిని/ సమత వహించుదేవతగ సారమునిచ్చుచు మమ్ముగావవే / మమతయె పొంగగా ధరణు మానిత మూర్తి ముదంబు పాడెనే**' అంటూ పూరించి ధారతో కూడిన ధారణ చేసి అందరి మనసులను ఆకట్టుకున్నాడు.





తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్

కూచిపూడి నృత్య సంప్రదాయంలో తలపై మూడు కుండలు, హిప్ హోల రింగ్ వేసుకుని, కుండపై నిలబడి నృత్యం చేయడం ద్వారా ఉత్తమ ప్రతిభను ప్రదర్శించి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది నిడదవోలుకు చెందిన ఆరు సంవత్సరాల చిన్నారి మద్దిరాల కేతనరెడ్డి.


వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్

పదిహేను సంవత్సరాల వయసులోనే బహుముఖ ప్రజ్ఞతో వివిధ రంగాలలో ఎన్నో విజయాలను సాధిస్తోంది అన్నమయ్య జిల్లా దేవరవాండ్లపల్లికి చెందిన కైవల్య రెడ్డి 'వివిధ రంగాలలో బహుముఖప్రజ్ఞ చూపిన విద్యార్థిని'గా వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకుంది. కూచిపూడి నుంచి కరాటే వరకు ఎన్నో విద్యల్లో ప్రతిభ చాటుతోంది.

● ఏఐ ఏరియా

ఓపెన్ ఏఐ చాట్‌జీపీటీలో...

టెస్టింగ్ పీరియడ్ తర్వాత ఓపెన్ ఏఐ తన చాట్ జీపీటీ వెబ్ సెర్చ్ టూల్‌ను యూజర్‌లు అందరికీ ఓపెన్ చేస్తోంది. చాట్ జీపీటీ ప్లస్ కోసం నెలకు నిర్ణీత మొత్తాన్ని చెల్లించే వారితో ఈ రోల్ అవుట్ ప్రారంభం అవుతుంది. అయితే రాబోయే నెలల్లో సబ్‌స్క్రైబర్‌లు అయినా కాకపోయినా ప్రతి ఒక్కరికీ ఓపెన్ అవుతుందని ఓపెన్‌ఏఐ తెలిపింది. దీని వెబ్ సెర్చ్ భిన్నంగా ఉంటుంది. సమాధానాల కోసం ట్రెనింగ్ డేటాపై ఆధారపడడానికి బదులుగా సంబంధిత సమాచారం కోసం వెబ్‌ను సెర్చ్ చేసి, జల్లెడ పడుతుంది.



సమాధానాలు సంభాషణ శైలిలో ఉంటాయి. సోర్స్ లింక్‌లు కనిపిస్తాయి. అవసరమైన వెబ్‌సైట్‌లోకి వెళ్లవచ్చు. చాట్‌జీపీటి నకిలీ లేదా తప్పుడు సమాచారాన్ని గుర్తిస్తుంది.

వాతావరణం, ఆటలు, స్టాక్స్, పటాలు.... మొదలైన వాటి కోసం ఇన్‌ఫర్‌మేషన్ ప్రొవైడర్‌లతో ఓపెన్‌ఏఐ భాగస్వామ్యం కుదుర్చుకుంది. నిర్దిష్ట ప్రదేశంలో వాతావరణం గురించి కూడా తెలుసుకోవచ్చు. మ్యాప్‌లు చూడవచ్చు. ప్రపంచంలో ఏ ప్రాంతానికి సంబంధించి అయినా ముఖ్య వార్తలు అడగవచ్చు.

సెర్చ్ చాట్స్ ఆర్కైవ్ చేయబడతాయి. కాబట్టి వాటిని తిరిగి రెఫర్ చేసే అవకాశం ఉంటుంది.

● టెక్.. టాక్

నూబియ రెడ్ మ్యాజిక్ నోవ



డిస్‌ప్లే: 10.90 రిఫ్రెష్‌రేట్: 144 హెచ్‌జడ్
మెమోరీ: 256జీబి 12జీబి ర్యామ్/512జీబి 16జీబి ర్యామ్ రిజల్యూషన్: 1800×2880 పిక్సెల్స్
వోఎస్: ఆండ్రాయిడ్ 14 ఫ్రంట్ కెమెరా: 20 ఎంపీ

గూగుల్ ఫొటోస్‌లో...

Google Photos

షేర్డ్ ఆల్బమ్స్‌లో కొత్త యాక్టివిటీస్‌ను యూజర్‌లు సులభంగా తెలుసుకోవడానికి వీలుగా 'ఫొటోస్ యాప్'లో అప్‌డేట్స్ పేజీని గూగుల్ ప్రవేశపెట్టింది. గూగుల్ ఫొటోస్‌లో షేర్‌డ్ ఆల్బమ్స్ అప్‌డేట్‌ల గురించి తెలుసుకోవచ్చు. గ్రూప్ సంభాషణలు, పార్ట్‌నర్ షేరింగ్ అప్‌డేట్స్, మెమోరీ అప్‌డేట్స్, స్టోరేజ్ అప్‌డేట్స్ కొత్త సెక్షన్‌లో ఉంటాయి.

'ప్రతి యాక్టివిటీకి షార్ట్‌కట్‌లను జోడించాం. తద్వారా ఆల్బమ్‌లు, సంభాషణలను ఒకే దగ్గర యాక్సెస్ చేయవచ్చు' అని గూగుల్ ఫొటోస్ టీమ్ ప్రకటించింది.

యూజర్‌లు షేర్డ్ ఆల్బమ్‌లను యాక్సెస్ చేయాలనుకుంటే కలెక్షన్స్ విభాగం నుంచి పొందవచ్చని గూగుల్ తెలిపింది.

అడల్ట్ క్లాసిఫైయర్




మైనర్ యూజర్‌లు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఖాతాను సృష్టించకుండా నిరోధించడానికి కొన్ని దేశాలు నడుం బిగించాయి. ఆస్ట్రేలియా ప్రభుత్వం ఇటీవల 16 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు సోషల్ మీడియాపై నిషేధాన్ని విధించింది. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లాంటి ప్లాట్‌ఫామ్‌లలో యూజర్‌లు సైన్ అప్ చేసేటప్పుడు వారి వయస్సును నమోదు చేయాలి. అయితే చాలామంది యూజర్‌లు వారి వయస్సు గురించి తప్పుడు సమాచారం ఇస్తున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని తమ వయస్సు గురించి అబద్ధాలు చెప్పే టీనేజర్‌లను గుర్తించడంలో సహాయపడే కొత్త ఏఐ ఆధారిత టూల్‌పై పనిచేస్తున్నట్లు మెటా ప్రకటించింది. 'అడల్ట్ క్లాసిఫైయర్' అని పిలవబడే ఈ ఏఐ మోడల్ ఎవరైనా అడల్ట్, టీనేజర్‌లను గుర్తించడంలో సహాయపడుతుంది.

యూజర్ పద్దెనిమిది సంవత్సరాల కంటే తక్కువ వయస్సు కలిగి ఉన్నాడని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనుమానిస్తే అది వారి ఎకౌంట్‌ను మార్క్ చేస్తుంది.

● గేమింగ్

జైత్రయాత్ర



ప్రసిద్ధ రాజు అయిన రాజేంద్ర చోళుడి గురించి తెలుసుకోవడానికే కాదు ఆయన సాహసాల్లో భాగం కావడానికి ఉపకరించే గేమ్ ఇది. '**అన్సంగ్ ఎంపైర్స్: ది చోళస్2: లెగసీ ఆఫ్ రాజేంద్ర చోళ**'ను చెన్నైకి చెందిన ఆయోలెట్ స్టూడియో డెవలప్ చేసింది. ఇది చరిత్రతో ముడిపడి ఉన్నప్పటికీ గేమ్‌ప్లే స్టోరీలైన్ ఫిక్షనల్. **ప్లాట్‌ఫామ్స్:** ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్, ప్లేస్టేషన్ 5 అండ్ పీజీ

సినిమా

ఎజెండాలేవీ లేవు!


● నితిన్

క్రిస్మస్‌కు థియేటర్స్‌కి రానున్నాడు రాబిన్ హుడ్. 'భీష్మ' (2020) వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో నితిన్, దర్శకుడు వెంకీ కుడుముల దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'రాబిన్ హుడ్'. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్ కాగా రాజేంద్రప్రసాద్, 'వెన్నెల' కిశోర్ ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. కాగా 'రాబిన్ హుడ్' టీజర్‌ను గురువారం విడుదల చేసి, సినిమాను డిసెంబరు 25న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. 'ఆగని హైఫై ఇళ్లల్లో చోరీలు... ఇంతమంది దాచుకున్న హనీని దోచుకుపోతున్న హనీ సింగ్ ఎవరు?', 'రాబిన్ హుడ్... వాడికి పర్టిక్యులర్ జెండా... ఎజెండాలేవీ లేవు', 'ఆల్ ఇండియన్స్ ఆర్ మై బ్రదర్స్ అండ్ సిస్టర్స్... నా కంట్రీకి వచ్చి నా ఫ్యామిలీ మెంబర్స్‌నే ఇబ్బంది పెడతావ్రా...' వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, కెమెరా: సాయి శ్రీరామ్.


● మహేశ్‌బాబు

రాముడిగా..?

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. కేఎల్ నారాయణ ఈ సినిమాను నిర్మించనున్నారు. ప్రస్తుతం ఈ సినిమా కోసం ప్రత్యేకంగా మేకోవర్ అవుతున్నారు మహేశ్‌బాబు. మరోవైపు ఈ సినిమా చిత్రీకరణను వీలైనంత త్వరగా మొదలుపెట్టాలని దర్శకుడు రాజమౌళి లొకేషన్స్ వేట ప్రారంభించారు. త్వరలోనే కొన్ని లొకేషన్స్‌ను ఫైనలైజ్ చేయనున్నారాయన. ఫారెస్ట్ అడ్వెంచరస్ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం రూపొందనుందని చిత్రసంగీత దర్శకుడు ఎమ్ఎమ్ కీరవాణి, కథా రచయిత విజయేంద్రప్రసాద్ ఇప్పటికే పేర్కొన్నారు. అయితే ఈ సినిమా నేపథ్యం గురించి మాత్రం ఎప్పటికప్పుడు కొత్త ఊహాగానాలు తెరపైకి వస్తూనే ఉన్నాయి. ఈ సినిమా కథనం ఓ నిధి అన్వేషణ బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుందన్న వార్తలు వినిపించాయి. తాజాగా ఈ చిత్రకథలో రామాయణం ఇతిహాసం ప్రస్తావన ఉంటుందని ఫిల్మ్‌నగర్ భోగట్టా. అంతేకాదు... కొన్ని సీన్స్‌లో రాముడిగా మహేశ్‌బాబు కనిపిస్తారని, వారణాసి బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే సన్నివేశాలు సినిమాలో కీలకంగా ఉంటాయని, ఈ సీన్స్ కోసం హైదరాబాద్‌లోనే వారణాసిని తలపించే సెట్‌ను రెడీ చేస్తున్నారనే వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే ఈ అంశాలపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది. ఇక ఈ సినిమా చిత్రీకరణ వచ్చే ఏడాది ప్రారంభంలో ఆరంభం అవుతుందని సమాచారం.

తెలీదు!


● పృథ్వీ, రఘుబాబు

నివాస్, అమిత శ్రీ జంటగా వినోద్ కుమార్, రఘుబాబు, పృథ్వీ, భరద్వాజ్, ఖయ్యూం కీలక పాత్రల్లో 'తెలియదు.. గుర్తులేదు.. మర్చిపోయా' సినిమా గురువారం ఆరంభమైంది. వెంకటేశ్ వీరవరపు దర్శకత్వంలో శరత్ చెన్నా నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి సంగీత దర్శకుడు ఆర్‌పీ పట్నాయక్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నటుడు రఘుబాబు క్లాప్ ఇచ్చారు. వెంకటేశ్ వీరవరపు మాట్లాడుతూ– ''పూర్తి వినోదాత్మకంగా రూపొందుతున్న చిత్రం ఇది. ఈ నెల 18న రెగ్యులర్ షూట్ ఆరంభిస్తాం'' అని చెప్పారు. ''మా సినిమా పేరులో గుర్తులేదు అని ఉంది కానీ సినిమా మాత్రం ఎప్పటికీ గుర్తుండేలా ఉంటుంది'' అని శరత్‌బాబు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: అభిలాష్ .ఎం, సంగీతం: అజయ్ పట్నాయక్.


● సత్యా రెడ్డి, గద్దర్

నెలాఖర్లో ఉక్కు సత్యాగ్రహం

సత్యా రెడ్డి స్వీయ దర్శకత్వంలో నిర్మించి, నటించిన చిత్రం 'ఉక్కు సత్యాగ్రహం'. గద్దర్, 'పల్సర్ బైక్' ఝాన్సీ, ఎమ్మెల్యే ధర్మశ్రీ, ఎంవీవీ సత్యనారాయణ, ప్రసన్నకుమార్, వెన్నెల ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సినిమా ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా సత్యా రెడ్డి మాట్లాడుతూ– ''మద్రాస్ నుంచి ఆంధ్ర రాష్ట్రం విడిపోయాక కర్నూలు రాజధానిగా వచ్చినప్పుడు ఏం జరిగింది? విశాఖ స్టీల్ ప్లాంట్‌ను మద్రాస్‌లో పెట్టాలని ఇందిరా గాంధీగారు అనుకున్నప్పుడు ఏం జరిగింది? అనే అంశాలతో గద్దర్‌గారు ఈ సినిమా కథను రాశారు. అలాగే నాలుగు పాటలు రాసి, కొన్ని కీలక సన్నివేశాల్లోనూ నటించారు. ఆయన చివరి చిత్రం ఇదే. ఈ సినిమా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉందన్న కారణంగా సెన్సార్ ఇబ్బందులు రావడం, గద్దర్‌గారి మరణం వంటి కారణాల వల్ల రిలీజ్ వాయిదా పడింది. ఇప్పుడు సెన్సార్ పూర్తయింది. 300కు పైగా థియేటర్లలో ఈ నెల 29న సినిమాను రిలీజ్ చేయనున్నాం'' అని అన్నారు. ఈ సినిమాకు సంగీతం: శ్రీ కోటి.


● మీనాక్షి, సాయి శ్రీనివాస్, సురేష్, కుహన్, విజయ్ కనకమేడల

టర్నింగ్ పాయింట్‌లా...

త్రిగుణ్ హీరోగా నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ 'టర్నింగ్ పాయింట్'. ఈ చిత్రంలో హెబ్బా పటేల్, ఇషా చావ్లా, వర్షిణి హీరోయిన్లుగా నటించారు. కుహన్ నాయుడు దర్శకత్వంలో స్వాతి సినిమాస్ పతాకంపై సురేష్ దత్తి నిర్మించిన చిత్రం ఇది. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, దర్శకుడు విజయ్ కనకమేడల కలిసి విడుదల చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దర్శకుడు కుహన్ నాయుడు మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో ఓ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో త్రిగుణ్ నటించారు. మర్డర్ మిస్టరీ నేపథ్యంలో మంచి సస్పెన్స్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమా ఆడియన్స్‌ను ఎంగేజ్ చేసేలా ఉంటుంది. యాక్షన్ సన్నివేశాలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. త్వరలోనే టీజర్‌ను విడుదల చేస్తాం'' అన్నారు. ''కొత్తదనం ఆశించే ప్రేక్షకులను అలరించే అన్ని అంశాలు మా చిత్రంలో ఉన్నాయి. యూనిట్‌లోని అందరి కెరీర్స్‌కి ఓ టర్నింగ్ పాయింట్‌లా ఈ 'టర్నింగ్ పాయింట్' నిలుస్తుందన్న నమ్మకం ఉంది'' అని తెలిపారు సురేష్ దత్తి. ఈ సినిమాకు సంగీతం: ఆర్.ఆర్. ధ్రువన్, కెమెరా: గరుడవేగ అంజి, సహ–నిర్మాతలు: నందిపాటి ఉదయభాను, జీఆర్ మీనాక్షి, ఎం. ఫణిభూషణ్ కుమార్.

ధర్మం పాటించకపోతే...


● జగదీష్

జగదీష్ ఆమంచి హీరోగా నటించి, స్వీయ దర్శకత్వం వహించిన చిత్రం 'యముడు'. 'ధర్మో రక్షతి రక్షితః' అనేది ఉపశీర్షిక. ఈ చిత్రంలో శ్రావణి శెట్టి హీరోయిన్‌గా నటించగా, ఆకాష్ చల్లా మరో లీడ్ రోల్‌లో నటించారు. డిసెంబరులో ఈ సినిమాను రిలీజ్ చేయాలనుకుంటున్నారు. తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను నిర్మాత రాజ్ కందుకూరి విడుదల చేసి, మాట్లాడుతూ– ''యముడు' కథ చాలా ఆసక్తికరంగా అనిపించింది. కథ బాగున్న సినిమాలను ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. ఈ కోవలోనే 'యముడు' కూడా హిట్ కావాలి'' అన్నారు. ''సామాన్య ధర్మం పాటించకుండా సమాజానికి చెడు చేసే వాళ్లకి యముడు ప్రత్యక్షమై గరుడపురాణం ప్రకారం శిక్షలు వేస్తుంటాడు అనేది ఈ చిత్రం ప్రధానాంశం. శంకర్‌గారి దర్శకత్వంలో వచ్చిన 'అపరిచితుడు'లోని కాన్సెప్ట్ మా సినిమాలోనూ ఉంది'' అని తెలిపారు జగదీష్ ఆమంచి.

అల్లరి పిల్ల వెన్నెల


● అదితీ శంకర్

వెన్నెల అల్లరి మామూలుగా ఉండదు. ఏ లెవల్లో ఉంటుందనేది 'భైరవం' సినిమాలో చూడాలి. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, నారా రోహిత్, మంచు మనోజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'భైరవం'. పెన్ స్టూడియోస్ డా. జయంతిలాల్ గడ సమర్పణలో శ్రీ సత్య సాయి ఆర్ట్స్ పతాకంపై కేకే రాధామోహన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాలోని వెన్నెల పాత్రలో ప్రముఖ దర్శకుడు శంకర్ కుమార్తె అదితీ శంకర్ నటిస్తున్నట్లుగా వెల్లడించి, 'అల్లరి పిల్ల' వెన్నెల అంటూ ఆమె ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌కు జోడీగా అదితీ శంకర్ కనిపిస్తారు. 'భైరవం' అదితీ శంకర్‌కు తెలుగులో తొలి సినిమా. ఈ చిత్రానికి సంగీతం: శ్రీ చరణ్ పాకాల, కెమెరా: హరి కె. వేదాంతం.

ఓటీటీ ఇది చూడొచ్చు

వాస్తవ ఘటనతో ఆఫ్టర్ మాత్

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం 'ఆఫ్టర్ మాత్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఈ ప్రపంచంలో తరచూ అనేక సంఘటనలు జరుగుతూనే ఉంటాయి. ఆ సంఘటనల్లో కొన్ని మాత్రం మనల్ని అనునిత్యం వెంటాడుతుంటాయి. ఆ సంఘటనకు, మనకు సంబంధం లేకపోయినా వాటి బాధితుల బాధను మనమూ అనుభవిస్తాం. కొంతమంది ఆ బాధను అలా భరిస్తూనే ఉంటారు, మరికొంతమంది ఇంకోలా వ్యక్తపరుస్తూ ఉంటారు. అలా 2004లో జరిగిన ఓ వాస్తవ ఘటనకు సినిమా రూపమిచ్చారు హాలీవుడ్ దర్శకుడు ఎలియట్ లెస్టర్. 2004లో ఓ రష్యా ఆర్కిటెక్ తన కుటుంబాన్ని ఘోర విమాన ప్రమాదంలో పోగొట్టుకున్నాడు. దానికి ప్రతిగా ఎయిర్ లైన్ ట్రాఫిక్ సిబ్బందిని హత్య చేశాడు. ఈ ఘటన ఆధారంగా 'ఆఫ్టర్ మాత్' సినిమా తీశారు. ఈ సినిమా కథపరంగా రోమన్ ఓ కన్‌స్ట్రక్షన్ వర్కర్. ఫ్లైట్‌లో వస్తున్న తన కుటుంబాన్ని రిసీవ్ చేసుకోవడానికి ఎయిర్ పోర్టుకి బయలుదేరడంతో ప్రారంభం అవుతుంది సినిమా. ఎయిర్ పోర్టులో అడుగుపెట్టగానే తన భార్య, కూతురు విమాన ప్రమాదంలో మరణించారని రోమన్‌కి తెలుస్తుంది. దాంతో అతను కుంగిపోతాడు. అసలు ఈ విమాన ప్రమాదం ఎలా జరిగింది? అనే విషయం తెలుసుకునే క్రమంలో ఆ ప్రమాదం వెనక ఉన్నది ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ జేక్ బనోస్ అనే విషయం రోమన్‌కి తెలుస్తుంది. ఎలాగైనా సరే రోమన్ జేక్ బనోస్‌ని కలవాలని ప్రయత్నిస్తాడు. జేక్‌ని కలిశాక రోమన్ ఏం చేశాడన్నదే 'ఆఫ్టర్ మాత్' సినిమా. ఈ సినిమా ఓ ఎమోషనల్ రోలర్ కోస్టర్. తన కుటుంబం మొత్తాన్ని పోగొట్టుకుని దానికి కారణమైన వారి మీద పోరాటమన్నది అంత చిన్న విషయం కాదు. ఎన్నో భావావేశాలతో కూడుకున్న చిత్రం ఇది. ముఖ్యంగా రోమన్ పాత్రలో ఓ విశిష్ట నటుడు మనకు కనిపిస్తాడు. దాదాపు రెండు తరాల నుండి హాలీవుడ్ యాక్షన్ రారాజుగా పిలవబడే ఆర్నాల్డ్ స్క్వాజినెగ్గర్ రోమన్ పాత్రను చేశారు. ఆర్నాల్డ్ ఆ పాత్రను చేశారనే కన్నా జీవించారని చెప్పవచ్చు. సినిమా మొత్తం కాస్త స్లోగా ఉన్నా సినిమా అయిపోయాక కొన్ని గంటలు మనం రోమన్ పాత్రతోనే ప్రయాణం చేస్తాం. 'లయన్స్ గేట్' ఓటీటీలో స్ట్రీమ్ అవుతున్న ఈ ఎమోషనల్ రోలర్ కోస్టర్‌ని చూసేయండి.

– ఇంటూరు హరికృష్ణ

ఈ మూవీ రివ్యూ వీడియో రూపంలో చూడాలంటే ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

సాక్షి బిజినెస్
శుక్రవారం
15-11-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
111	26
77,580	23,533

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	19,168	▽	59
డోజోన్స్	43,858	▽	100
ఎఫ్‌టీఎస్ఈ 100	8,071	△	41
డాక్స్	19,264	△	261
షాంఘై	3,380	▽	59
నికాయ్	38,536	△	186

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	73,739 ▽ 1,427
బంగారం (99.5 స్వచ్ఛత)	73,444 ▽ 1,421
వెండి (కిలో)	87,103 ▽ 2,252

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	84.00	85.02
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	106.33	109.16
€	యూరో	ఎస్‌బీఐ	88.48	91.08
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	53.93	55.30
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.15	56.34
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	60.74	66.12
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.61	23.15
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.09	23.85
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.80	12.63

ఎస్‌బీఐ రుణ రేట్ల పెంపు

ఎంసీఎల్ఆర్ 5 బేసిస్ పాయింట్లు అప్

ముంబై: ఎస్‌బీఐ ఎంసీఎల్ఆర్ ఆధారిత రుణాల రేట్లను సవరించింది. ఏడాది ఎంసీఎల్ ఆర్ 0.05 శాతాన్ని (5 బేసిస్ పాయింట్లు) పెంచడంతో 9 శాతానికి చేరింది. గృహ రుణం వంటి దీర్ఘకాల రుణాలకు ఏడాది ఎంసీఎల్ఆర్ రేటే ప్రామాణికంగా ఉంటుంది. మూడు



నెలలు, ఆరు నెలల ఎంసీఎల్ఆర్ రేట్లను సైతం ఇంతే మేర పెంచింది. ఓవర్ నైట్, ఒక నెల, రెండేళ్లు, మూడేళ్ల ఎంసీఎల్ఆర్ రేట్లను మాత్రం సవరించలేదు. పెరిగిన రేట్లు శుక్రవారం నుంచి అమల్లోకి వస్తుందని ఎస్‌బీఐ ప్రకటించింది. ఇటీవలి కాలంలో ఎంసీఎల్ఆర్ రేట్లను ఎస్‌బీఐ రెండుసార్లు పెంచడం గమనార్హం. డిపాజిట్లపై వ్యయాల పెరుగుదలతో బ్యాంక్‌లు రుణ రేట్లను సవరించాల్సి వస్తోంది.

బంగారు కొండ దిగుతోంది!

- జీవితకాల గరిష్ట స్థాయి నుంచి రూ.4,650 డౌన్
- అంతర్జాతీయంగానూ వెనకడుగు



న్యూఢిల్లీ: అంతర్జాతీయ మార్కెట్లలో డిమాండ్ తగ్గుముఖం పట్టడంతో పసిడి ధరలు క్రమంగా దిగివస్తున్నాయి. రాజధాని న్యూఢిల్లీలో గురువారం 99.9 స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారం ధర రూ.700 తగ్గి రూ.77,050కి చేరింది. కాగా, 99.5 స్వచ్ఛత బంగారం ధర రూ.700 తగ్గి రూ.76,650కి దిగివచ్చింది. కిలో వెండి సైతం రూ.2,310 క్షీణించి రూ.90,190కి చేరింది. అంతర్జాతీయంగా పటిష్ట డిమాండ్‌కు తోడు పండుగ సీజన్ కారణంగా ఈ అక్టోబర్ 31న 99.9 స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల పసిడి ధర రూ.82,400 వద్ద ఆల్‌టైమ్ గరిష్ట స్థాయికి చేరుకుంది. నాటి నుంచి రూ.4,650 తగ్గింది.

రెండు వారాల్లో 260 డాలర్లు డౌన్...

అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ (31.1గ్రాములు) ధర 45 డాలర్లు తగ్గి 2,541.70 డాలర్లకు పడింది. ఈ వార్త రాస్తున్న 9 గంటల సమయానికి 13 డాలర్ల తగ్గుదలతో రూ.2,574 వద్ద ట్రేడవుతోంది. జీవితకాల గరిష్టం 2,802 డాలర్ల నుంచి 260 డాలర్లు తగ్గింది. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నిక తర్వాత ఏకంగా 4% తగ్గింది.

''ట్రంప్ గెలుపుతో ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు కొనసాగకపోవచ్చు. ఉక్రెయిన్, పశ్చిమాసియాల్లో యుద్ధ ఉద్రిక్తతలు సద్దుమణగొచ్చు. అమెరికా ఆర్థిక వ్యవస్థ పుంజుకోవచ్చనే ఆశలతో డాలర్ ఇండెక్స్(107.06) అనూహ్యంగా బలపడుతోంది. దీంతో సురక్షిత సాధనమైన బంగారానికి డిమాండ్ తగ్గుతోంది. అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు, ట్రంప్ వాణిజ్య విధాన నిర్ణయాలు రానున్న రోజుల్లో పసిడి ధరలకు దిశానిర్దేశం చేస్తాయి'' అని బులియన్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

కొత్త కనిష్టానికి రూపాయి

7 పైసలు పతనమై 84.46 వద్ద ముగింపు

ముంబై: డాలర్ మారకంలో రూపాయి విలువ గురువారం ఏడు పైసలు బలహీనపడి కొత్త జీవితకాల కనిష్టం 84.46 వద్ద ముగిసింది. డాలర్‌కు డిమాండ్ పెరగడం, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల ఉపసంహరణ ఒత్తిడి పెంచాయి. ద్రవ్యోల్బణం పెరగడం కూడా ప్రతికూల ప్రభావం చూపినట్లు ట్రేడర్లు తెలిపారు. ఫారెక్స్ మార్కెట్లో ఉదయం 84.40 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 84.39 వద్ద గరిష్టాన్ని, 84.47 వద్ద కనిష్టాన్ని తాకింది. 'డాలర్ ఇండెక్స్ జీవితకాల గరిష్టం (107.06) వద్ద ట్రేడవుతుండటం రూపాయి కోతకు కారణమవుతుంది. డిసెంబర్‌లో 85.00 స్థాయికి దిగివచ్చే వీలుంది' అని బీఎన్ పారీబా అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్ సింగ్ తెలిపారు.



హీరో మోటో లాభం ప్లస్

క్యూ2లో రూ. 1,066 కోట్లు

న్యూఢిల్లీ: ద్విచక్ర వాహన రంగ దిగ్గజం హీరో మోటోకార్ప్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 6 శాతం వృద్ధితో రూ. 1,066 కోట్లను తాకింది. అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు తోడ్పడింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 1,007 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 9,533 కోట్ల నుంచి రూ. 10,483 కోట్లకు బలపడింది. ఈ కాలంలో 15.2 లక్షల మోటార్‌సైకిళ్లు, స్కూటర్లను విక్రయించింది. గత క్యూ2లో 14.16 లక్షల వాహనాలు అమ్ముడయ్యాయి.

మూడు మోడళ్లు రెడీ...

క్యాష్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టడం ద్వారా పటిష్ట క్యాష్‌ఫ్లోను సాధిస్తున్నామని, దీంతో ఆర్థికంగా మరింత బలపడుతున్నట్లు కంపెనీ



సీఈవో నిరంజన్ గుప్తా పేర్కొన్నారు. ఎంట్రీ, డీలక్స్ విభాగాల్లో మరిన్ని బ్రాండ్లను ప్రవేశపెట్టనున్నట్లు తెలియజేశారు. తద్వారా ప్రీమియం విభాగంలో పటిష్ట పోర్ట్‌ఫోలియోను ఏర్పాటు చేసుకుంటున్నట్లు వివరించారు. రానున్న ఆరు నెలల్లో ఎక్స్‌పల్స్ 210, ఎక్స్‌ట్రీమ్ 250ఆర్, కరిజ్మా ఎక్స్‌ఎంఆర్ 250 బైకులను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా ఈ ఏడాది చివరికల్లా ప్రీమియా విభాగంలో 100 స్టోర్లను అధిగమించనున్నట్లు తెలియజేశారు.

హీరో మోటో షేరు బీఎస్‌ఈలో 2% బలపడి రూ. 4,604 వద్ద ముగిసింది.

నాలుగు నెలల గరిష్టానికి టోకు ద్రవ్యోల్బణం

- అక్టోబర్ నెలలో 2.36 శాతం
- కూరగాయలు, వస్తువుల ధరల ప్రియం

న్యూఢిల్లీ: కూరగాయలు, ఆహారోత్పత్తులు, తయారీ వస్తువుల ధరల పెరుగుదల టోకు ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపించింది. దీంతో అక్టోబర్ నెలకు టోకు ద్రవ్యోల్బణం 2.36 శాతానికి చేరింది. ఇది నాలుగు నెలల గరిష్ట స్థాయి. వరుసగా రెండో నెలలోనూ పెరుగుదల నమోదైంది. టోకు ధరల సూచీ ఆధారిత (డబ్ల్యూపీఐ) ద్రవ్యోల్బణం అంతకుముందు నెల సెప్టెంబర్‌లో 1.84 శాతంగా ఉంది. క్రితం ఏడాది అక్టోబర్ నెలలో మాత్రం



మైనస్ 0.26% కావడం గమనార్హం. ఆహారోత్పత్తుల విభాగంలో ద్రవ్యోల్బణం అక్టోబర్ నెలకు 13.54 శాతంగా నమోదైంది. సెప్టెంబర్‌లో ఉన్న 11.52 శాతంతో పోల్చితే 18 శాతం పెరిగింది. ఈ విభాగంలో కూరగాయలకు సంబంధించి ధరల పెరుగుదల (ద్రవ్యోల్బణం) ఏకంగా 63%కి చేరింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
సాఫీగానే ఆర్థిక వ్యవస్థ: శక్తికాంతదాస్
జీడీపీ ఏటా 7 శాతం వృద్ధి: ఎస్అండ్‌పీ

ఆరో రోజూ ఆగని అమ్మకాలు

- సెన్సెక్స్ 111 పాయింట్లు, నిఫ్టీ 26 పాయింట్లు డౌన్
- గురునానక్ జయంతి సందర్భంగా నేడు మార్కెట్లకు సెలవు



ముంబై: పరిమిత శ్రేణిలో బలహీనంగా ట్రేడైన స్టాక్ సూచీలు గురువారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 111 పాయింట్లు తగ్గి 77,580 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 26 పాయింట్లు కోల్పోయి 23,533 వద్ద నిలిచింది. ఈ సూచీకిది వరుసగా ఆరోరోజూ నష్టాల ముగింపు. ద్రవ్యోల్బణ పెరుగుదల, విదేశీ అమ్మకాలు, బలహీన కార్పొరేట్ క్యూ2 ఆర్థిక ఫలితాలు ప్రతికూల ప్రభావం చూపాయి. ఉదయం స్వల్ప నష్టాలతో మొదలైన సూచీలు ప్రారంభంలో కాసేపు లాభాల్లో ట్రేడయ్యాయి. అయితే మెటల్, సర్వీసెస్, ఆయిల్‌అండ్‌గ్యాస్, యుటిలిటీ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో మళ్లీ నష్టాల్లోకి జారుకున్నాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 266 పాయింట్లు క్షీణించి 77,425 వద్ద కనిష్టాన్ని, 75 పాయింట్లు కోల్పోయి 23,484 వద్ద కనిష్టాన్ని తాకాయి. రియల్టీ, కన్జూమర్, ఆటో, బ్యాంకులు, టెలికం షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.

- లిస్టింగ్ రోజు 'నివా బుపా హెల్త్ ఇన్సూరెన్స్' షేరు ఇష్యూ ధర(రూ.74) వద్ద ముగిసింది. బీఎస్ఈలో 6% ప్రీమియంతో రూ.78.50 వద్ద లిస్టయ్యింది. ఒక దశలో 9% ఎగసి రూ.81 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి ఫ్లాట్‌గా రూ.74 వద్ద స్థిరపడింది.
- గురునానక్ జయంతి సందర్భంగా శుక్రవారం బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు సెలవు.


మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ 'స్వర్ణకృతి' కలెక్షన్



హైదరాబాద్: మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ 'స్వర్ణకృతి' పేరుతో కొత్త కలెక్షన్‌ను తీసుకొచ్చింది. నైపుణ్యం కలిగిన హస్తకళా స్వర్ణకారులతో తీర్చిదిద్దిన ఈ కలెక్షన్‌లోని ప్రతి ఆభరణమూ దేశ వారసత్వాన్ని ప్రతిబింబిస్తుంది. 'సంప్రదాయాన్ని, ఆధునికతను మేళవిస్తూ కాలనుగుణంగా ముందుకెళ్లే భారతీయ స్త్రీలందరికీ స్వర్ణకృతి ఆభరణాల ద్వారా గౌరవాన్ని చాటుతున్నాం' అని మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహ్మద్ తెలిపారు. బంగారు, వజ్రాభరణాల కొనుగోలుపై జీవితకాల మెయింటెన్స్ హామీ, ఎక్స్ఛేంజ్‌పై 100% విలువ, కచ్చితమైన బైబ్యాక్ ఆఫర్లను మలబార్ గ్రూప్ అందిస్తోంది.

ఎగుమతులు జూమ్

- అక్టోబర్‌లో 17 శాతం పెరుగుదల
- 39.2 బిలియన్ డాలర్లు
- రెండేళ్ల గరిష్ట స్థాయికి చేరువ
- విస్తరించిన వాణిజ్య లోటు



న్యూఢిల్లీ: ఆర్థిక వృద్ధి మందగిస్తుందన్న ఆందోళనల నడుమ దేశ ఎగుమతులు ప్రోత్సాహకర స్థాయిలో పెరిగాయి. అక్టోబర్ నెలలో ఎగుమతులు క్రితం ఏడాది ఇదే నెలతో పోల్చి చూస్తే 39.2 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇది రెండేళ్ల గరిష్ట స్థాయి. చివరిగా 2022 జూన్ నెలలో ఎగుమతుల్లో 30 శాతం వృద్ధి నమోదైంది. కేంద్ర వాణిజ్య శాఖ విడుదల చేసిన గణాంకాలను పరిశీలించగా.. అక్టోబర్‌లో దిగుమతులు 3.9 శాతం పెరిగి 66.34 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. క్రితం ఏడాది ఇదే నెలలో దిగుమతులు 63.86 బిలియన్ డాలర్లుగా ఉండడం గమనార్హం. ముఖ్యంగా ముడి చమురు దిగుమతులు 13.34 శాతం పెరిగాయి. దీంతో వాణిజ్య లోటు (ఎగుమతులు, దిగుమతుల మధ్య అంతరం) 27.14 బిలియన్ డాలర్లకు చేరింది. సెప్టెంబర్ చివరికి ఇది 20.8 బిలియన్ డాలర్లుగా ఉంది. క్రితం ఏడాది అక్టోబర్ నెలతో పోల్చి చూస్తే వాణిజ్య లోటు 3.29 బిలియన్ డాలర్ల మేర తక్కువగా ఉంది.

చమురు, నూనెల దిగుమతులు అధికం..

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబర్ మధ్య ఎగుమతులు 3.18 శాతం పెరిగి 252.28 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇదే కాలంలో దిగుమతులు 5.77 శాతం ఎగసి 416.93 బిలియన్ డాలర్లకు చేరాయి. ఏడు నెలల కాలంలో వాణిజ్య లోటు 164.65 మిలియన్ డాలర్లకు ఎగిసింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో 149.67 బిలియన్ డాలర్లుగా ఉంది.
- ఏప్రిల్–అక్టోబర్ మధ్య సేవల ఎగుమతులు 216 బిలియన్ డాలర్లకు పెరిగాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో 192 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి.
- అక్టోబర్‌లో ఇంజనీరింగ్ ఉత్పత్తుల ఎగుమతులు క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చితే 40 శాతం పెరిగి 11.25 బిలియన్ డాలర్లకు చేరగా.. ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల ఎగుమతులు 46 శాతం వృద్ధితో 3.43 బిలియన్ డాలర్లకు ఎగిశాయి.
- వెజిటబుల్ ఆయిల్ దిగుమతులు 36 శాతం మేర పెరిగాయి.
- బంగారం దిగుమతులు సైతం సెప్టెంబర్‌లో ఉన్న 4.39 బిలియన్ డాలర్ల నుంచి అక్టోబర్‌లో 7.13 బిలియన్ డాలర్లకు ఎగిశాయి. క్రితం ఏడాది అక్టోబర్‌లో 7.23 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.
- ముడి చమురు దిగుమతులు 12.5 బిలియన్ డాలర్ల నుంచి 18.2 బిలియన్ డాలర్లకు దూసుకెళ్లాయి.

సిరీస్ సొంతం చేసుకోవాలని...

నేడు దక్షిణాఫ్రికాతో చివరి టి20 మ్యాచ్ ఆడనున్న భారత్

- సమరోత్సాహంలో సూర్యకుమార్ బృందం
- సిరీస్‌ను సమం చేయాలనే లక్ష్యంతో దక్షిణాఫ్రికా
- రాత్రి గం. 8:30 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా గడ్డపై చక్కటి ప్రదర్శనతో ఆకట్టుకుంటున్న భారత క్రికెట్ జట్టు శుక్రవారం చివరిదైన నాలుగో టి20లో ఆతిథ్య జట్టుతో తలపడనుంది. నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో 2–1తో ఆధిక్యంలో ఉన్న సూర్యకుమార్ సారథ్యంలోని టీమిండియా... అదే జోరులో సిరీస్‌ను సొంతం చేసుకోవాలని పట్టుదలతో ఉంది. మరోవైపు సొంతగడ్డపై సిరీస్ సమం చేయాలని సఫారీలు భావిస్తున్నారు. మూడు మ్యాచ్‌ల్లో రెండుసార్లు 200 పైచిలుకు స్కోర్లు చేసిన భారత జట్టు... ఓడిన మ్యాచ్‌లోనూ మెరుగైన పోరాటం కనబర్చింది. ఈ ఏడాది ఇప్పటి వరకు 25 టి20 మ్యాచ్‌లు ఆడిన టీమిండియా... అందులో 23 విజయాలు సాధించి భళా అనిపించుకుంది. ఈ ఏడాదిలో భారత జట్టుకు ఇదే చివరి టి20 మ్యాచ్ కాగా... ఇందులోనూ విజయం సాధించాలని సూర్యకుమార్ బృందం తహతహలాడుతోంది. 2007 టి20 ప్రపంచకప్ ఫైనల్లో పాకిస్తాన్‌పై గెలిచి విశ్వవిజేత కిరీటం నెగ్గిన వాండరర్స్ మైదానంలోనే ఈ మ్యాచ్ జరగనుంది. ఇక్కడ సూర్యకుమార్ యాదవ్‌కు మంచి రికార్డు ఉంది. చివరిసారి వాండరర్స్‌లో ఆడిన మ్యాచ్‌లో సూర్య సెంచరీతో విజృంభించాడు. తాజా సిరీస్‌లో ఇప్పటికే భారత్ తరఫున సంజూ సామ్సన్, తిలక్ వర్మ శతకాలు బాదగా... ఆఖరి మ్యాచ్‌లో ఎవరు రాణిస్తారో చూడాలి.

కలిసికట్టుగా కదంతొక్కితేనే..

తొలి మ్యాచ్‌లో సూపర్ సెంచరీతో చెలరేగిన ఓపెనర్ సామ్సన్ తర్వాత వరుసగా రెండు మ్యాచ్‌ల్లో విఫలం కాగా... తొలి రెండు మ్యాచ్‌ల్లో విఫలమైన మరో ఓపెనర్ అభిషేక్ శర్మ మూడో టి20లో అర్ధశతకంతో మెరిశాడు. మొత్తంగా చూసుకుంటే టీమిండియా బ్యాటింగ్ ఆర్డర్‌లో పెద్దగా లోపాలు కనిపించకపోయినా... ప్లేయర్లంతా కలిసికట్టుగా కదం తొక్కాల్సిన అవసరముంది. సెంచూరియన్ సెంచరీ హీరో తిలక్ వర్మ మూడో స్థానంలో బ్యాటింగ్‌కు రావడం ఖాయమే కాగా... కెప్టెన్ సూర్యకుమార్, హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్‌తో మిడిలార్డర్ పటిష్టంగా కనిపిస్తోంది. అయితే రింకూ సింగ్ బ్యాట్ నుంచి గత మెరుపులు కరువయ్యాయి. ఈ సిరీస్‌లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో కలిపి రింకూ కేవలం 28 పరుగులే చేశాడు. అతడి స్థాయికి ఇది చాలా తక్కువే. తగినన్ని బంతులు ఆడే అవకాశం రాలేదన్నది నిజమే అయినా... క్రీజులో ఉన్న కాసేపట్లోనే మ్యాచ్ స్వరూపాన్ని మార్చేయగల సత్తా ఉన్న రింకూ... చివరి పోరులో భారీ షాట్‌లతో విరుచుకుపడాల్సిన అవసరముంది. మూడో టి20 ద్వారా అంతర్జాతీయ అరంగేట్రం చేసిన హిట్టర్ రమణ్‌దీప్ సింగ్‌కు మరోసారి అవకాశం దక్కవచ్చు. అర్ష్‌దీప్ సింగ్ పేస్ బాధ్యతలు మోయనున్నాడు. అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి స్పిన్ బాధ్యతలు చూసుకోనున్నారు.

మిల్లర్, క్లాసెన్ మెరిస్తేనే!

టి20 వరల్డ్‌కప్ ఫైనల్లో భారత్ చేతిలో ఓడిన దక్షిణాఫ్రికా... ఈ సిరీస్‌లోనూ పెద్దగా ఆకట్టుకోలేకపోతోంది. గత మ్యాచ్‌లో ప్రధాన ఆటగాళ్లంతా చేతులెత్తేసిన సమయంలో పేస్ ఆల్‌రౌండర్ మార్కో జాన్సన్ భారీ షాట్లతో విరుచుకుపడి టీమిండియాను భయపెట్టాడు. టాపార్డర్‌లో ఇలాంటి దూకుడు లోపించడంతోనే సఫారీ జట్టు ఇబ్బంది పడుతోంది. హెన్రిచ్ క్లాసెన్, డేవిడ్ మిల్లర్‌లపై ఆ జట్టు అతిగా ఆధారపడుతోంది. ఈ ఇద్దరు ఒకటీ అరా మెరుపులు తప్ప... చివరి వరకు నిలకడగా రాణించలేకపోవడం జట్టును దెబ్బతీస్తోంది. గత ఏడాది టీమిండియాతో తమ దేశంలో జరిగిన సిరీస్‌ను 1–1తో సమం చేసుకున్న దక్షిణాఫ్రికా... ఇప్పుడదే ఫలితం రాబట్టాలంటే శక్తికి మించి పోరాడాల్సిన అవసరముంది. బౌలింగ్‌లో కేశవ్ మహరాజ్, సిమ్లెన్, కోట్జీ, మార్కో జాన్సన్ కీలకం కానున్నారు.



దీపిక (జెర్సీ నంబర్ 55)ను అభినందిస్తున్న సహచరులు

దీపిక ఐదు గోల్స్... సెమీస్‌లో భారత్

- థాయ్‌లాండ్‌పై 13–0 గోల్స్ తేడాతో నెగ్గిన టీమిండియా
- మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నమెంట్

రాజ్‌గిర్ (బిహార్): ఆద్యంతం ఆధిపత్యం చలాయిస్తూ భారత మహిళల హాకీ జట్టు ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో వరుసగా మూడో విజయం నమోదు చేసింది. థాయ్‌లాండ్ జట్టుతో గురువారం జరిగిన మూడో రౌండ్ లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 13–0 గోల్స్ తేడాతో ఘనవిజయాన్ని అందుకుంది. భారత్ తరఫున దీపిక అత్యధికంగా ఐదు గోల్స్ (3వ, 19వ, 43వ, 45వ, 45వ నిమిషంలో) చేయగా... ప్రీతి దూబే (9వ, 40వ నిమిషంలో), లాల్‌రెమ్‌సియామి (12వ, 56వ నిమిషంలో), మనీషా చౌహాన్ (55వ, 58వ నిమిషంలో) రెండు గోల్స్ చొప్పున సాధించారు. బ్యూటీ డుంగ్‌డుంగ్ (30వ నిమిషంలో), నవ్‌నీత్ (53వ నిమిషంలో) ఒక్కో గోల్ నమోదు చేశారు. ఈ గెలుపుతో భారత జట్టు అధికారికంగా సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. ఆరు జట్ల మధ్య లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో ఈ టోర్నీ జరుగుతోంది. ఆరు జట్లు మూడేసి మ్యాచ్‌లు పూర్తి చేసుకున్నాయి. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో నెగ్గిన పారిస్ ఒలింపిక్స్ రజత పతక విజేత చైనా, భారత్ 9 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాయి. అయితే గోల్స్ అంతరం కారణంగా చైనా (చేసిన గోల్స్ 22; ఇచ్చిన గోల్స్ 1) టాప్ ర్యాంక్‌లో, భారత్ (చేసిన గోల్స్ 20; ఇచ్చిన గోల్స్ 2) రెండో ర్యాంక్‌లో ఉన్నాయి. 3 పాయింట్లతో మలేసియా మూడో స్థానంలో, 2 పాయింట్లతో జపాన్ నాలుగో స్థానంలో, 1 పాయింట్‌తో కొరియా ఐదో స్థానంలో, 1 పాయింట్‌తో థాయ్‌లాండ్ ఆరో స్థానంలో ఉన్నాయి. నిర్ణీత ఐదు మ్యాచ్‌లు పూర్తయ్యాక టాప్–4లో నిలిచిన జట్లు సెమీఫైనల్లోకి దూసుకెళ్తాయి. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో ఎలాంటి ఫలితాలు వచ్చినా చైనా, భారత జట్ల తొమ్మిది పాయింట్లను మిగతా జట్లు దాటే పరిస్థితి లేదు. దాంతో ఈ రెండు జట్లకు సెమీస్ బెర్త్‌లు ఖరారయ్యాయి.

మూడో నిమిషంలో మొదలై...

గత పదేళ్లలో ఏడోసారి థాయ్‌లాండ్‌తో తలపడిన భారత జట్టుకు ఈసారీ ఎలాంటి పోటీ ఎదురు కాలేదు. గతంలో ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో థాయ్‌లాండ్‌కు ఒక్క గోల్ మాత్రమే సమర్పించుకొని 39 గోల్స్ సాధించిన భారత జట్టు ఏడోసారీ అదే దూకుడును కొనసాగించింది. మూడో నిమిషంలో దీపిక చేసిన గోల్‌తో భారత్ ఖాతా తెరిచింది. అటునుంచి టీమిండియా వెనుదిరిగి చూడలేదు. మ్యాచ్ మొత్తంలో భారత జట్టుకు 11 పెనాల్టీ కార్నర్‌లు లభించాయి. ఇందులో ఐదింటిని మాత్రమే భారత్ గోల్స్‌గా మలిచింది. లేదంటే విజయాధిక్యం మరింతగా ఉండేది. గురువారమే జరిగిన ఇతర లీగ్ మ్యాచ్‌ల్లో చైనా 2–1 గోల్స్‌తో జపాన్‌పై, మలేసియా 2–1 గోల్స్‌తో కొరియాపై గెలిచాయి. శనివారం జరిగే నాలుగో రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో మలేసియాతో జపాన్; కొరియాతో థాయ్‌లాండ్; చైనాతో భారత్ తలపడతాయి.



సింధు ఐదో 'సారీ'

కెనడా ప్లేయర్ మిచెల్లి లీ చేతిలో మళ్లీ ఓడిన భారత స్టార్



కుమమోటో: పారిస్ ఒలింపిక్స్ తర్వాత పాల్గొన్న మూడో టోర్నమెంట్‌లోనూ భారత స్టార్ షట్లర్ పీవీ సింధుకు నిరాశ ఎదురైంది. జపాన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నీలో ప్రపంచ 20వ ర్యాంకర్ సింధు ప్రిక్వార్టర్ ఫైనల్లోనే వెనుదిరిగింది. ప్రపంచ 23వ ర్యాంకర్, చైనా సంతతికి చెందిన కెనడా ప్లేయర్ మిచెల్లి లీతో జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సింధు 21–17, 16–21, 17–21తో పోరాడి ఓడిపోయింది. మిచెల్లి లీ చేతిలో సింధుకిది ఐదో పరాజయం కావడం గమనార్హం. మిచెల్లిపై 10 సార్లు నెగ్గిన సింధుకు ఈసారి మాత్రం నిరాశ తప్పలేదు. 75 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సింధు తొలి గేమ్‌ను సొంతం చేసుకున్నా... ఆ తర్వాతి రెండు గేముల్లో కీలకదశలో తడబడి మూల్యం చెల్లించుకుంది. 2014 గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్‌లో రెండుసార్లు (మిక్స్‌డ్ టీమ్ మ్యాచ్, సింగిల్స్ సెమీఫైనల్) సింధును ఓడించిన మిచెల్లి ఆ తర్వాత 2023లో థాయ్‌లాండ్ ఓపెన్‌లో మూడోసారి సింధుపై నెగ్గింది. ఈ ఏడాది ఆర్కిటిక్ ఓపెన్‌లో నాలుగోసారి సింధును ఓడించిన మిచెల్లి నెల తిరిగేలోపు జపాన్ ఓపెన్‌లో మరోసారి గెలుపు రుచి చూసింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



ఓ ప్రియా.. ప్రియా..
ఇదో జానీ.. వాకర్.. ప్రేమ కథ

నిర్మల్

ప్రేమ కథ అన్నారు..
పులి బొమ్మ
వేశారేంటనేగా
మీ డౌటు.. ఏం..
మనుమలకేనా
ప్రేమ కథలు..
పులులకుండవా..
ఇది జానీగాడి ప్రేమ కథ..
లవర్ కోసం వందల
కిలోమీటర్లు వాకింగ్
చేసొచ్చిన
ఓ పెద్ద పులి కథ..

కట్ చేస్తే..

మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అభయారణ్యం.. జానీ ఉండేది ఇక్కడే. గత నెల్లో ఒకానొక శుభముహూర్తాన మనోడికి 'ప్రేమ'లో పడాలనిపించింది. తీరా చూస్తే.. తనకు ఈడైన జోడు అక్కడ ఎవరూ కనిపించలేదు. దాంతో తోడు కోసం తన ప్రేమ ప్రయాణం మొదలుపెట్టాడు. వెతుక్కుంటూ.. వెతుక్కుంటూ.. ఏకంగా 200 కిలోమీటర్లు నడిచి మన రాష్ట్రంలోని నిర్మల్ జిల్లా అడవుల్లోకి వచ్చేశాడు. అక్టోబర్ 25న నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలం అడెల్లి ప్రాంతంలోకి వచ్చిన జానీ.. ఎక్కడా కుదురుగా ఉండటం లేదు. ఓసారి వెనక్కి మహారాష్ట్ర సరిహద్దు దాకా వెళ్లాడు.. మళ్లా తిరిగొచ్చాడు. రోజుకో మండలమన్నట్లు తిరుగుతూనే ఉన్నాడు. ఈ నెల 10వ తేదీనైతే.. రాత్రిపూట మహబూబ్ ఘాట్ రోడ్డుపై కనిపించి అందరికీ కంగారు పెట్టించేశాడు. పెద్ద పులంటే మాటలా మరి.. మంగళవారం మామడ-పెంబి అటవీ ప్రాంతంలో ఎద్దుపై దాడిచేసి చంపేశాడు. ప్రస్తుతం జానీ అదే ప్రాంతంలో తిరుగుతున్నాడు. తన తోడు కోసం.. గూడు కోసం..


జానీగాడి ప్రేమ కథ సరే.. మరి జనం కష్టాలు.. **అమ్మో.. పులి** రేపటి ఎడిషన్‌లో..

ఇంతకీ అటవీ అధికారులేమంటున్నారు?

మిగతా క్రూర జంతువులతో పోలిస్తే పులులు కొంచెం డిఫరెంటుగానే ఉంటాయట. మేటింగ్ సీజన్‌లో తగిన తోడు, గూడు దొరికేదాకా ఎంత దూరమైనా వెళ్తాయట. ఇప్పటివరకూ జానీ.. 500 కిలోమీటర్ల దూరం నడిచాడట. నిర్మల్-ఆదిలాబాద్ మధ్య దట్టమైన అడవులు, నీటి వనరులు, వన్యప్రాణులు ఉండటంతో ఈ ప్రాంతంలోనే తిరుగుతున్నాడట. ఇలా వచ్చిన పులులను సంరక్షించేందుకు చర్యలు చేపడుతున్నామని.. 'జానీ' అనే ఈ పులి ఎటువైపు వెళ్తుందో గమనిస్తూ ఆయా ప్రాంతాల వారిని అప్రమత్తం చేస్తున్నామని, పులి సంరక్షణకు సంబంధించిన సూచనలు చేస్తున్నామని నిర్మల్ డీఎఫ్‌వో నాగిని భాను తెలిపారు.



ఈ నెల 10న రోడ్డుపై తిరుగుతూ..



అంతర్జాతీయ డయాబెటీస్ ఫెడరేషన్ ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా 2021లో 20 ఏళ్ల నుంచి 79 ఏళ్ల మధ్య 53.7 కోట్ల మంది డయాబెటీస్ వ్యాధికి గురయ్యారు. ఇది ప్రపంచ జనాభాలో 10 శాతం కావడం గమనార్హం. ఈ లెక్కన 2045 నాటికి షుగర్‌తో బాధపడే పెద్దల సంఖ్య 78.7 కోట్లకు (ప్రపంచ జనాభాలో 12.2 శాతం) పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ప్రాంతాలవారీగా చూస్తే పశ్చిమ పసిఫిక్, ఆగ్నేయాసియాలలో అత్యధికంగా షుగర్ బాధితుల సంఖ్య పెరగొచ్చని భావిస్తున్నారు. అలాగే ఆఫ్రికా ఖండంలో అత్యధిక సంఖ్యలో షుగర్ వ్యాధిగ్రస్తులు పెరిగే అవకాశం ఉందని.. అక్కడ 130 శాతానికిపైగా డయాబెటీస్ రోగుల సంఖ్యలో పెరుగుదల నమోదు కావొచ్చని డయాబెటీస్ ఫెడరేషన్ భావిస్తోంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న మరణాలకు టాప్-10 కారణాల్లో డయాబెటీస్ కూడా ఒకటని.. ఈ వ్యాధి ప్రజారోగ్యానికి పెను సవాల్ విసురుతోందని ఫెడరేషన్ పేర్కొంది.

- సాక్షి సెంట్రల్ డెస్క్

చెదరనీకు ఆ చిరునవ్వు..!

రాష్ట్రవ్యాప్తంగా 'సాక్షి' ఆధ్వర్యంలో బాలల దినోత్సవం

ఉత్సాహంగా పాల్గొన్న బాలసదన్, రిహాబిలిటేషన్ సెంటర్ల బాలలు

ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పులకింత

చిన్నారులకు బహుమతులు అందించిన ఉన్నతాధికారులు

సంగారెడ్డి/నారాయణపేట రూరల్/నిజామాబాద్ నాగారం/కామారెడ్డి: వసంతకాలంలో పువ్వులను.. పసి మోముల్లోని నవ్వులను ఎంత చూసినా తనివి తీరదు. పసి బిడ్డల ముఖాల్లోని నవ్వులు స్వచ్ఛతకే కాదు.. కొన్నిసార్లు సహజ స్థితిగతులకూ అద్దంపడతాయి. తల్లిదండ్రుల సంరక్షణ ఉంటేనే పిల్లలు తమ బాల్యాన్ని సంపూర్ణంగా ఆస్వాదించగలరు. కానీ, ఎంతో మంది బాలలు తమకు తెలియకుండానే అనాథాశ్రమాల్లో, రిహాబిలిటేషన్ సెంటర్లలో మగ్గిపోతున్నారు. అలాంటి బాలల ముఖాల్లో చిరునవ్వులు పూయించాలని 'సాక్షి' మీడియా సంకల్పించింది. బాలల దినోత్సవం సందర్భంగా వివిధ జిల్లాల్లో పలు స్వచ్ఛంద సంస్థలతో కలిసి గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. పలువురు ప్రముఖులు కార్యక్రమాల్లో పాల్గొని బహుమతులు అందించి బాలలను ఉత్సాహపరిచారు.



'సాక్షి లిటిల్ స్టార్స్' కార్యక్రమంలో చిన్నారిని ఎత్తుకుని ఆడిస్తున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

నిజామాబాద్‌లో 'సాక్షి లిటిల్ స్టార్స్'..



నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మారుతీనగర్‌లో ఉన్న స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్స్‌లో 'సాక్షి లిటిల్‌స్టార్స్'కార్యక్రమం ఘనంగా జరిగింది. సాక్షి మీడియా, అగ్గు భోజన్న నారాయణ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల ముఖ్య అతిథిగా హాజరై సాక్షి మీడియా ప్రత్యేకంగా బాలల దినోత్సవం నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. వేడుకల్లో చిన్నారుల దేశభక్తి గేయాలు, నృత్యాలు ప్రత్యేక ఆకర్షనగా నిలిచాయి. వేడుకల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పద్మావతి, జిల్లా సంక్షేమాధికారి షేక్ రసూల్‌బీ, అగ్గు భోజన్న నారాయణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అగ్గు భోజన్న, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య, సొసైటీ ప్రిన్సిపాల్ జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిలో..

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బాలసదనంలో సాక్షి మీడియా, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సింధుశర్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులను తమ జీవిత లక్ష్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. చిన్నారులతో కేక్ కట్ చేయించారు. బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటలు, పాటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వి విక్టర్, జిల్లా పరిషత్ సీఈవో, ఇన్‌చార్జ్ డీడబ్ల్యూవో చందర్‌నాయక్, మహిళా శిశు సంక్షేమ శాఖ, బాలసదనం అధికారులు, ఉద్యోగులు, సాక్షి విలేకరులు పాల్గొన్నారు.



చిన్నారులతో కేక్ కట్ చేయిస్తున్న కామారెడ్డి ఎస్పీ సింధుశర్మ



నారాయణపేట బాలసదనం చిన్నారులతో కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేటలోని బాలసదన్‌లో సాక్షి మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ సిక్తా పట్నాయక్ పాల్గొన్నారు. చిన్నారులు గులాబీ పువ్వులతో ఆమెకు ఘన స్వాగతం పలికారు. బాలసదన్‌లోని పిల్లలతో ఆమె సరదాగా గడిపారు. క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందించడంతో పాటు, నృత్యాలు చేసి అలరించిన చిన్నారులను అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, మైనారిటీ శాఖ అధికారి రషీద్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు యాదయ్య, కమలమ్మ, డీసీపీఓ తిరుపతయ్య, చిల్డ్రన్ హోం ఇన్‌చార్జ్ నిహారిక, సాక్షి సిబ్బంది ఆనంద్, రాజేష్ పాల్గొన్నారు.



చిన్నారులతో మమేకమవుతున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

'సాక్షి'మీడియా గ్రూపు, సహారా సొసైటీ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని సహారా ప్రైమరీ రిహాబిలిటేషన్ సెంటర్‌లో గురువారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి హాజరై చిన్నారులతో ఉల్లాసంగా గడిపారు. వివిధ రకాల ఆటల పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్న సహారా సెంటర్‌ను అభినందించారు.

ఓన్లీ దిల్.. నో బిల్

కొండపాక హార్ట్‌కేర్ సెంటర్లో సర్జరీలు ఉచితం

మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్



చిన్నారికి చాక్లెట్ ఇస్తున్న సునీల్ గవాస్కర్

సాక్షి, సిద్దిపేట: 'చిన్నారులకు హార్ట్ సర్జరీ సక్సెస్ అయ్యాక.. వారి పేరెంట్స్‌లో కలిగే ఆనందాన్ని మాటల్లో చెప్పలేం. వారి చిరునవ్వును చూస్తుంటే డబుల్ సెంచరీ చేసినదానికంటే ఎక్కువ ఆనందంగా ఉంటుంది'అని భారత మాజీ క్రికెటర్, శ్రీ సత్యసాయి సంజీవని ట్రస్ట్ సభ్యుడు సునీల్ గవాస్కర్ అన్నారు. సిద్దిపేట జిల్లా కొండపాకలోని సత్యసాయి సంజీవని సెంటర్ ఫర్ చైల్డ్ హార్ట్ కేర్ రిసెర్చ్‌ను గురువారం ట్రస్ట్ సభ్యులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి సంజీవని సెంటర్‌లో ఒక్క రూపాయి కూడా ఫీజు తీసుకోకుండా గుండె శస్త్ర చికిత్సలు చేస్తారని తెలిపారు. 'ఇక్కడ దిల్ మాత్రమే ఉంటుంది.. బిల్ ఉండదు'అని వ్యాఖ్యానించారు. ఛత్తీస్‌గఢ్, హరియాణా, మహారాష్ట్ర, తెలంగాణలోని సిద్దిపేటలో ట్రస్ట్ ద్వారా ఆస్పత్రులను ఏర్పాటు చేశామని తెలిపారు. తనకు మొదటి ఇన్నింగ్స్ క్రికెట్ అయితే, రెండో ఇన్నింగ్స్ క్రికెట్ వ్యాఖ్యాతగా మారటమని.. ఇప్పుడు మూడో ఇన్నింగ్స్ సత్యసాయి సంజీవని ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాల్లో పాల్గొనటమని సునీల్ గవాస్కర్ తెలిపారు.

చిన్నారులను ఆత్మీయంగా పలకరిస్తూ..: గుండె శస్త్రచికిత్సల కోసం వచ్చిన చిన్నారులను, వారి తల్లితండ్రులను సునీల్ గవాస్కర్ ఆత్మీయంగా పలకరించారు. వారి వివరాలు తెలుసుకుంటూ పిల్లలకు చాక్లెట్లు పంచిపెట్టారు. భగవాన్ సత్యసాయి ఆశీస్సులతో సేవా కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నామని సత్యసాయి సంజీవని సెంటర్ ఫర్ చైల్డ్ హార్ట్ కేర్ ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాస్ తెలిపారు.

దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్‌లో



డయాబెటిస్ వాట్సాప్ చానల్

రోగుల సౌలభ్యం కోసం కాంటినెంటల్ ఆస్పత్రి ప్రయోగం.. 24 గంటల పాటు వైద్యులు అందుబాటులో..

సాక్షి, హైదరాబాద్: దేశంలో రోజురోజుకూ మధుమేహం సమస్య పెరుగుతోందని, అదే విధంగా ఈ వ్యాధిపై అపోహలు కూడా పెరుగుతున్నాయని కాంటినెంటల్ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ అపోహలను దూరం చేసేందుకు, డయాబెటిస్‌పై అవగాహన కల్పించేందుకు.. కాంటినెంటల్ ఆస్పత్రి దేశంలోనే తొలిసారిగా వాట్సాప్ ప్రత్యేక చానల్ రూపొందించినట్టు తెలిపారు. గురువారం ప్రపంచ డయాబెటిస్ డే సందర్భంగా ఈ చానల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చానల్ ద్వారా వ్యక్తిగతంగా పౌష్టికాహార చిట్కాలు, నిపుణుల సూచనలు, డయాబెటిస్ కేర్‌కు సంబంధించిన తాజా సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందజేస్తామని గురు ఎన్ రెడ్డి చెప్పారు. 30 ఏళ్ల క్రితం మహిళల్లో 12 శాతం ఉన్న డయాబెటిస్ ఇప్పుడు 24 శాతానికి పెరిగిందని, పురుషుల్లో 11 శాతం ఉండగా 23 శాతానికి పెరిగిందని వివరించారు. చాలామందికి కనీసం డయాబెటిస్ వచ్చినట్టు (సైలెంట్ డయాబెటిస్) తెలియట్లేదని వెల్లడించారు. దీన్ని సరిగ్గా అంచనా వేయకపోతే శరీరంలోని అన్ని అవయవాలపై ప్రభావం చూపిస్తుందన్నారు. అయితే ఆరోగ్యకరమైన జీవన విధానంతో దీనిని అధిగమించవచ్చని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా జీవించవచ్చని గురు ఎన్ రెడ్డి చెప్పారు. వాట్సాప్ చానల్‌లో డయాబెటాలజిస్టుతో పాటు న్యూట్రిషనిస్టులు, కార్డియాలజిస్టులు, నెఫ్రాలజిస్టులు, న్యూరాలజిస్టులు సహ అనేక మంది వైద్య నిపుణులు 24 గంటలూ అందుబాటులో ఉంటారని చెప్పారు.




Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
శుక్రవారం। 15-11-2024

ప్రస్తుతం ఆధునిక జీవన శైలిలో అత్యంత వేగంగా విస్తరిస్తున్న వ్యాధుల్లో ఒకటి మధుమేహం. ప్రపంచవ్యాప్తంగా ప్రతి పది సెకన్లకు ఇద్దరు దయాబెటిక్ బారిన పడుతున్నారని ఒక అంచనా. ఇంటర్నేషనల్ దయాబెటిస్ ఫెడరేషన్ (ఐడీఎఫ్) ప్రకారం, 2023 నాటికి, ప్రపంచవ్యాప్తంగా సుమారు 53.7 కోట్ల మంది దయాబెటిస్ బాధితులు ఉన్నారు. ఆధునిక జీవనశైలి, ప్రస్తుత ఆహారపు అలవాట్లు, పెరుగుతున్న వృద్ధుల జనాభా ఆధారంగా 2045 నాటికి ఈ సంఖ్య 70 కోట్లకు పెరుగుతుందని ఓ అంచనా. 2023 గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా దయాబెటిక్ బాధితులు అత్యధికంగా ఉన్నా దేశాల్లో భారతదేశం ఒకటి. సుమారు 7 కోట్ల మంది మధుమేహంతో బాధపడుతున్నారు. ఈ సంఖ్య 2030 నాటికి 10 కోట్లకు, 2045 నాటికి 13.4 కోట్లకు పెరుగుతుందని అంచనా. ఈ గణాంకాలతో భారతదేశం ప్రపంచంలోనే అత్యంత మధుమేహం ప్రభావిత దేశంగా మారే అవకాశాలు లేకపోలేదు. – సాక్షి, హైదరాబాద్

పాదాలకే కాదు

ప్రాణాలకూ ప్రమాదమే



దయాబెటిస్ బాధితుల్లో పెరుగుతున్న ఫుట్అల్సర్స్

పాదాల పట్ల నిర్లక్ష్యమే ప్రధాన కారణం

సాధారణంగా దయాబెటిస్ బాధితులకు దృష్టిలోపానికి సంబంధించి రెటినోపతి, నరాల బలహీనతకు న్యూరోపతి, కిడ్నీ సమస్యలకు నెఫ్రోపతి సమస్యలపైనే అవగాహన ఉంది. కానీ షుగర్ వ్యాధిగ్రస్తులను వేధిస్తున్న మరో ప్రధాన సమస్య ఫుట్అల్సర్స్ కూడా. అంటే మధుమేహ వ్యాధి రోగులకు కాలి అడుగుభాగంలో ఏర్పడే పుండు. దయాబెటిక్ వ్యాధి ఉన్న వారిలో ప్రతి నలుగురిలో ఇద్దరికి పాదాలకు సంబంధించిన ఈ సమస్య ఉంది. ప్రపంచవ్యాప్తంగా దయాబెటిస్ ఉన్న వారిలో సగటున 15 శాతం నుంచి 25 శాతం మంది తమ జీవితకాలంలో ఏదో ఒక సమయంలో దయాబెటిక్ ఫుట్అల్సర్స్ అంటే పాదాలపై పుండ్ల బారిన పడుతున్నారు.

ప్రతి నలుగురిలో ఇద్దరికీ ఈ సమస్య

అంప్యుటేషన్స్ లేకుండా నయం చేయవచ్చు..

దయాబెటిస్ బాధితుల్లో ఇటీవల కాలంలో దయాబెటిక్ ఫుట్అల్సర్స్ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. దయాబెటిస్ రోగుల్లో పాదాల సంరక్షణపై అవగాహన లేదు. అందుకే దయాబెటిస్ బాధితులు షుగర్ నియంత్రణతోపాటు పాదాల్ని సంరక్షించుకోవాలి. చిన్న గాయమైనా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి. దయాబెటిక్ ఫుట్ అల్సర్స్‌కు అంప్యుటేషన్ చేయకుండానే పూర్తిగా నయం చేసే అత్యాధునిక చికిత్స అందిస్తున్నాం. ఫుట్అల్సర్స్‌తోపాటు, గ్యాంగ్రీన్, సెల్యూలైటిస్, కాలిన గాయాలకు కూడా స్కిన్ గ్రాఫ్టింగ్ చేయాల్సిన అవసరం లేకుండా పూర్తిగా నయం చేస్తున్నాం.



– డాక్టర్. భరత్‌కుమార్, చైర్మన్ కేటీకే మల్టీస్పెషాలిటీ హాస్పిటల్స్

చక్కర శాతం పెరగడంతో..

దయాబెటిక్ ఫుట్అల్సర్‌కు ప్రధాన కారణం రక్తంలో చక్కర (గ్లూకోజ్) శాతం పెరిగిపోవడం. సాధారణంగా షుగర్ నియంత్రణ లేనివారికి రక్తం చిక్కబడుతుంది. రక్తనాళాల్లో షుగర్ పేరుకుపోయి కాలు చివరి భాగాల్లోకి బ్లడ్ సర్క్యులేషన్ తగ్గిపోతుంది. తద్వారా పాదం స్పర్శ కోల్పోతుంది. కొంత కాలానికి ఫుట్అల్సర్స్‌గా మారుతాయి. చివరికి అదే గ్యాంగ్రీన్‌కి కూడా దారి తీస్తుంది. ఇతర దయాబెటిక్ సమస్యల కంటే ఎక్కువగా ఆస్పత్రిలో చేరడానికి ఈ దయాబెటిస్ ఫుట్అల్సర్స్ కారణమవుతున్నాయి. మనదేశంలోని మధుమేహ బాధితుల్లో సుమారు 10 శాతం మందికి దయాబెటిక్ ఫుట్అల్సర్ (డీఎఫ్‌యు) వచ్చే అవకాశం ఉంది. అంటే దేశంలో ఏటా 70 లక్షల మంది ప్రజలు ఈ ఫుట్అల్సర్స్ బారిన పడుతున్నారు.

ప్రాణాంతకం కూడా..

షుగర్ వ్యాధిగ్రస్తులు ఫుట్అల్సర్స్ పట్ల చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటారు. కొన్ని సందర్భాల్లో ఇవి చాలా ప్రమాదకరంగా మారుతున్నాయి. అల్సర్స్ వల్ల కలిగే ఇన్ఫెక్షన్ ఇతర భాగాలకు విస్తరించి గ్యాంగ్రీన్‌గా మారితే మెజారిటీ కేసుల్లో ఆయా భాగాలను తొలగించడం (అంపుటేషన్) తప్ప వేరే ప్రత్యామ్నాయం కూడా లేదు. ఫుట్అల్సర్స్ వల్ల చాలామందిలో కాలు తీసేయాల్సి వస్తోంది. అయినప్పటికీ ఇన్ఫెక్షన్ కారణంగా 3 ఏళ్లలోనే రెండో కాలు కూడా తొలగించాల్సిన ముప్పు 30 నుంచి 40 శాతానికి పెరుగుతోంది. కొన్నిసార్లు ప్రాణాంతకంగా కూడా మారుతోంది. దయాబెటిక్ ఫుట్అల్సర్ల నుంచి వచ్చే సమస్యల ఫలితంగా మన దేశంలో ఏటా లక్ష అంప్యుటేషన్స్ నమోదవుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

అప్రమత్తతే శ్రీరామరక్ష..

అంప్యుటేషన్స్‌తో పాటు ప్రాణాలు తీస్తున్న దయాబెటిక్ ఫుట్అల్సర్స్‌కు అప్రమత్తతే శ్రీరామరక్ష. దయాబెటిస్ ఉన్నవారు తమ పాదాలను సంరక్షించుకోవడం చాలా అవసరం. సరైన పాదరక్షలు ధరించడం, తరచూ పాదాలను పరీక్షించుకోవడం, ఏదైనా గాయం అయితే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించడం వల్ల అల్సర్ల ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడం కూడా కీలకం. ఆరోగ్య సంరక్షణ నిపుణులు దయాబెటిస్ బాధితుల్లో పాదాల సంరక్షణకు సంబంధించి అవగాహన పెంచాల్సిన ఆవశ్యకత ఉంది.

బంగారు తాపడం పనుల్లో వేగం

రెండో విడత బంగారం ఇచ్చేందుకు చెన్నై వెళ్లిన అధికారులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ విమాన గోపురానికి బంగారు తాపడం పనులు వేగం పుంజుకున్నాయి. రెండవ విడత బంగారాన్ని స్మార్ట్ క్రియేషన్స్ సంస్థకు అప్పగించేందుకు గురువారం ఆలయ ఈవో భాస్కర్‌రావు ఆధ్వర్యంలో అధికారులు చెన్నై వెళ్లారు. ఇప్పటికే మొదటి విడతగా 12 కిలోల బంగారాన్ని స్మార్ట్ క్రియేషన్ సంస్థకు అప్పగించి, బంగారు తాపడం పనులను చేయిస్తున్నారు. విమాన గోపురానికి బంగారు తాపడం చేసిన రేకులను అమర్చేందుకు చేపట్టే పనుల్లో భాగంగా గోపురం చుట్టూ కర్రలతో పరంజా ఏర్పాటు చేశారు.



కార్తీక పౌర్ణమి సకల శుభాలు చేకూర్చాలి

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

సాక్షి, హైదరాబాద్: శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. శివకేశవులకు ప్రీతిపాత్రమైన కార్తీక పౌర్ణమి ఎంతో ప్రశస్త్యమైనదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో చేపట్టిన సామూహిక కార్తీక దీపోత్సవం ఆధ్యాత్మిక సౌరభాలను పంచుతుందన్నారు. పవిత్రమైన కార్తీక పౌర్ణమి రోజున చేసే దీపారాధన మనకు సకల శుభాలను చేకూర్చాలని మంత్రి ఆకాంక్షించారు. అలాగే సిక్కు మత స్థాపకుడు గురునానక్ జయంతిని పురస్కరించుకుని మంత్రి సురేఖ సిక్కు సమాజానికి శుభాకాంక్షలు తెలిపారు. సమానత్వం, సహనం, ప్రేమ, ఆధ్యాత్మికచింతన, సేవాతత్పరతకు ప్రతీక అయిన గురునానక్ జయంతి సిక్కులకు పవిత్రమైన రోజన్నారు. బాహ్య ప్రపంచాన్ని గెలిచే ముందు, మనలోని దుర్గుణాలను తొలగించుకోవాలనే గురునానక్ మాటలు ఎంతో స్ఫూర్తిదాయకమైనవని పేర్కొన్నారు.

రేపు గణపతి సచ్చిదానంద స్వామికి గురువందనం

సాక్షి, హైదరాబాద్: మైసూరు అవధూత దత్త పీఠాధీశ్వరులు గణపతి సచ్చిదానంద స్వామికి ఈనెల 16న పబ్లిక్ గార్డెన్స్‌లో గురువందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఆధ్యాత్మిక మాసపత్రిక దర్శనమ్ ద్విదశాబ్ది మహోత్సవం సందర్భంగా గణపతి సచ్చిదానంద స్వామి(అప్పాజీ) భక్తులకు ధార్మిక దిశా నిర్దేశం చేస్తూ.. యువతకు ధార్మికత, మానవీయ విలువలు, అర్షధర్మ సంస్కృతి, సంప్రదాయాల గురించి వివరిస్తారని నిర్వాహకులు తెలిపారు. గణపతి సచ్చిదానంద స్వామి 84 ఏళ్ల వయసులోనూ విశ్వవ్యాప్తంగా సనాతనధర్మ పరిరక్షణకు విశేషంగా కృషి చేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో అనేకమంది ధార్మిక, ఆధ్యాత్మికవేత్తలు, వివిధ రంగాల ప్రముఖులు, కేంద్రమంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మాజీ మంత్రి హరీశ్‌రావు పాల్గొంటారని తెలిపారు.

25 తర్వాత సంస్థాగత ఎన్నికల ప్రక్రియ షురూ

మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 25 తర్వాత పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ మొదలవుతుందని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 35 లక్షల మేరకు బీజేపీ సభ్యత్వాలు నమోదయ్యాయని చెప్పారు. 25వ తేదీ నాటికి నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు పోలైన ఓట్లలో 70 శాతం మందిని సభ్యులుగా చేర్చుకునేలా లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలియజేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలు అమలు చేయకపోగా ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా, మూసీ, భూసేకరణ, రైతుల ధాన్యం కొనుగోలు వంటి విషయాల్లో వైఫల్యం చెందిందని ఆరోపించారు. రైతుబంధు ఇవ్వలేదని, వడ్లకు రూ. 500 బోనస్ ఇవ్వడం లేదని, ధాన్యం కొనుగోలు కేంద్రాలు అస్తవ్యస్తంగా మారాయని, దీంతో రైతులు అష్టకష్టాలు పడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో రైస్ మిల్లర్లకు లాభం చేకూర్చేందుకు రైతులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బీజేపీ ఆధ్వర్యంలో పోరాటం ఉధృతం చేస్తామని ఆయన వెల్లడించారు.

లంబాడీలకు మేలు జరగకూడదనే..

ఎమ్మెల్యే బాలునాయక్



సాక్షి, హైదరాబాద్: కొడంగల్‌లో గిరిజనులు, లంబాడీలకు మేలు జరగకూడదనే బీఆర్ఎస్ కుట్ర పన్నిందని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ విమర్శించారు. సీఎల్పీ కార్యాలయంలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ స్వయంగా బీఆర్ఎస్ నేతలకు భరోసా ఇవ్వడం వల్లనే దాడి జరిగిందన్నారు. లంబాడీలు ఎప్పటికీ కేటీఆర్‌ను క్షమించరన్నారు. ఉగ్రవాదుల కంటే అధ్వానంగా లంబాడీలపై గతంలో దమనకాండ కొనసాగిందని గుర్తు చేశారు.

ఉత్తర మహారాష్ట్రలోని నందుర్బర్ జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభకి హాజరైన రాహుల్ గాంధీకి జ్ఞాపికను అందజేస్తున్న తెలంగాణ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క





జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిసిన బ్రిటిష్ హైకమిషనర్ లిండీ కామెరాన్



మోదీ రిజర్వేషన్లకు అనుకూలమా? వ్యతిరేకమా చెప్పాలి

మాజీ ఎంపీ వీహెచ్

సాక్షి, హైదరాబాద్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఓబీసీ నాయకుడిగా రిజర్వేషన్లకు అనుకూలమా? వ్యతిరేకమో చెప్పాలని మాజీ ఎంపీ వి.హన్మంతరావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ రిజర్వేషన్లను వ్యతిరేకించారంటూ మోదీ విమర్శిస్తున్నారని, చనిపోయిన రాజీవ్ గాంధీపై ఇప్పుడు బీజేపీ రాజకీయం ఏమిటని ధ్వజమెత్తారు. దీనిపై రాష్ట్ర బీజేపీ నాయకులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు సమాధానం చెప్పాలని నిలదీశారు. అసలు బీజేపీ కులగణన, రిజర్వేషన్లకు అనుకూలమా? వ్యతిరేకమో చెప్పాలని అన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై హరీశ్‌రావు మాట్లాడటం విడ్డూరం

టీపీసీసీ కిసాన్‌సెల్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి

సాక్షి,హైదరాబాద్: బీఆర్ఎస్ హయాంలో మిల్లర్ల అవినీతిని పెంచి పోషించి.. ఇప్పుడు ధాన్యం కొనుగోళ్లు జరగడంలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడటం విడ్డూరమని టీపీసీసీ కిసాన్‌సెల్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, తాలు పేరు మీద దోపిడీ జరుగుతున్నప్పుడు ఎప్పుడైనా మాట్లాడారా? అని ప్రశ్నించారు. అంత సక్కగా ఉంటే ప్రజలు మిమ్మల్ని ఎందుకు ఓడించారో చెప్పాలని నిలదీశారు. గత ఏడాదితో పోలిస్తే ధాన్యం కొనుగోళ్లను తమ ప్రభుత్వం వేగంగా చేస్తోందని, గత ఏడాదితో పోలిస్తే అదనంగా 773 కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు చేస్తున్నామని వివరించారు.

తమకు దక్కనిది ఎవరికీ దక్కొద్దన్న చందంగా బీఆర్ఎస్

టీపీసీసీ కమ్యూనికేషన్ హెడ్ రామ్మోహన్‌రెడ్డి


సాక్షి, హైదరాబాద్: తమకు దక్కనిది ఎవరికీ దక్కొద్దన్న చందంగా బీఆర్ఎస్ వ్యవహరిస్తుందని టీపీసీసీ కమ్యూనికేషన్ హెడ్ సామ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారానికి దూరం కాగానే రాష్ట్రాన్ని రావణ కాష్టంగా మార్చాలని చూస్తోందని, అమాయకులను రెచ్చగొట్టి అలజడులు రేపేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అందులో భాగంగానే వికారాబాద్ కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులపై హత్య యత్నానికి తెగబడిందన్నారు.

కటిక నేలే.. పూల పాన్పు



'నిద్ర సుఖమెరుగదు'అన్నట్లు కూలీల పిల్లలు మండుటెండలో కటికనేలపైనే నిద్రిస్తున్నారు. పిల్లలతో ముచ్చటిస్తూనే రైల్వే ట్రాక్‌పైకి పిల్లలు వెళ్లకుండా రక్షణగా చూస్తోంది ఆ తల్లి. మరోవైపు..'చిట్టితల్లీ.. రైలొచ్చింది చూడు'అంటూ ఒళ్లో చిన్నారిని లాలిస్తూ పాలిస్తూ జోలపాడుతోంది. రెండురోజులుగా రాత్రీపగలు ఆకలి, నిద్ర లేకుండా నిర్విరామంగా పెద్దపల్లి జిల్లా రాఘవాపూర్ వద్ద రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనుల్లో కూలీలు, రైల్వే సిబ్బంది, అధికారులు శ్రమిస్తున్నారు. పిల్లలపై ఓ కన్నేస్తూనే.. మరోవైపు కూలి పనుల్లో నిమగ్నమయ్యారు కార్మికులు. ఈ దృశ్యాలు 'సాక్షి'కెమెరాకు చిక్కాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

చంద్ర కాంతుల్లో వేయిస్తంభాల ఆలయం



వరంగల్ నగరంలోని శ్రీరుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయంలో శుక్రవారం జరగనున్న కార్తీకపౌర్ణమి వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశారు. గురువారం రాత్రి ఆకాశంలో ఒకవైపు చంద్రుడి కాంతులు.. మరో వైపు ఆలయ శిల్పాలు జిగేల్‌మనిపించేలా అలంకరించిన విద్యుత్ దీపాలతో ఆలయం వెలుగులమయమైంది. – ఫొటో : సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, హనుమకొండ

హరోం.. హర



కార్తీక పౌర్ణమి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా శివాలయాలన్నీ భక్తజన సందోహంతో కళకళలాడాయి. కార్తీక దీపాల వెలుగుల మధ్య ఆలయాలు కొత్తశోభను సంతరించుకున్నాయి. నదీతీరాలు, సముద్రతీరాల చెంత తెల్లవారు జామునే భక్తులు పుణ్యస్నానాలాచరించి దీపాలు వెలిగించారు.



కోటిదీపోత్సవ కాంతుల్లో విజయవాడ ఇంద్రకీలాద్రి



విజయవాడ దుర్గాఘాట్ వద్ద కృష్ణానదిలో దీపం విడిచిపెడుతున్న చిన్నారి

క్లుప్తంగా...

గ్రంథాలయ ఉద్యోగులకు జీతాలివ్వండి: డీవైఎఫ్ఐ

సాక్షి, అమరావతి: గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించిన ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రంథాలయ ఉద్యోగులకు జీతాలు, పెన్షనర్లకు పెన్షన్ జమ చేయడం మరిచిందని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై.రాము, జి.రామన్నలు శుక్రవారం మండిపడ్డారు. ప్రతి నెల 1వ తేదీనే వేతనాలు జమ చేస్తామని ఎన్నికల్లో ప్రకటించిన చంద్రబాబు..తీరా అధికారంలోకి వచ్చాక నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. గ్రంథాలయాల్లో పని చేసే ఉద్యోగులకు వేతనాలు, పెన్షనర్లకు పెన్షన్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

వర్సిటీలకు వీసీలను నియమించండి

సీఎం చంద్రబాబుకు సీపీఐ రామకృష్ణ లేఖ

సాక్షి, అమరావతి: అత్యున్నత ప్రాధాన్యతారంగమైన విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేయడం సరికాదని, రాష్ట్రంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్, 17 వర్సిటీలకు ఉపకులపతి (వీసీ)లను తక్షణమే నియమించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సీఎం చంద్రబాబును కోరారు. ఈ విషయమై సీఎంకు రాసిన లేఖను ఆయన శుక్రవారం మీడియాకు విడుదల చేశారు. గత ప్రభుత్వం 4,439 యూనివర్సిటీ అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి 5నెలలు గడుస్తున్నా ఉన్నత విద్యా మండలి చైర్మన్, వర్సిటీలకు రెగ్యులర్ వీసీలు లేకపోవడంతో ఆ పోస్టుల నియామక ప్రక్రియ ఆగిపోయిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 3 సెంట్లు చొప్పున కేటాయించి, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు చొప్పున మంజూరు చేయాలని రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను శుక్రవారం కలిసి రామకృష్ణ వినతిపత్రం అందించారు.

మునిసిపల్ టీచర్లకు 70 శాతం పదోన్నతులు ఇవ్వాలి

నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ డిమాండ్


సాక్షి, అమరావతి: మునిసిపల్ పాఠశాలల్లో పనిచేస్తోన్న ఉపాధ్యాయులకు 70 శాతం పదోన్నతి అవకాశాన్ని అమలు చేయాలని నవ్యాంధ్ర టీచర్స్ ఫెడరేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పాఠశాల విద్య కమిషనర్ సూచనలతో 100 శాతం పోస్టులను డీఎస్సీకి కేటాయించడంతో మున్సిపల్ టీచర్లు నష్టపోతున్నారని అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు శుక్రవారం పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించి పదోన్నతులకు రీ షెడ్యూల్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పదోన్నతులు, డీఎస్సీ నిష్పత్తి 70: 30గా ఉండాలని సూచించారు. ప్రస్తుతం నిర్వహిస్తోన్న పదోన్నతుల ప్రక్రియలో కొన్ని మునిసిపాలిటీల్లో పదోన్నతులకు అసలు ఒక పోస్ట్ కూడా చూపించకుండా మొత్తం పోస్టులను డీఎస్సీకి కేటాయించటం సరికాదన్నారు. అన్ని ప్రభుత్వ విభాగాల్లో చేపట్టినట్టే ఉపాధ్యాయ పదోన్నతులు కూడా 70: 30 నిష్పత్తిని అమలు చేయాలని కోరారు. జీవో 117 రద్దు ద్వారా చాలా పోస్టులు కొత్తగా ఏర్పడతాయని, ప్రస్తుతం ఉన్న పోస్టుల్లో అర్హత గల మునిసిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలని అభ్యర్థించారు.

ప్రకృతి చోద్యం!

ఎలాంటి రసాయనాలు వాడకుండా పంటలు పండించడమే ప్రకృతి వ్యవసాయం. దీనివల్ల భూసారం పెరగడంతో పాటు రైతులకు పెట్టుబడి తగ్గుతుంది. అంతేకాకుండా ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందుబాటులోకి వస్తాయి. అందువల్లే గత ప్రభుత్వాలు కూడా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాయి. ఇందుకోసం వ్యవసాయశాఖలోనే ఒక విభాగాన్ని ఏర్పాటు చేశాయి. కానీ జిల్లాలో ప్రకృతి వ్యవసాయం లెక్కలు ఘనంగా కనిపిస్తున్నా... క్షేత్రాలు మాత్రం ఎక్కడా కనిపించడం లేదు.



ప్రకృతి వ్యవసాయం పేరుతో సాగు చేసిన పంటలు



34,024 ఎకరాలు
అధికారుల లెక్కల ప్రకారం ప్రకృతి సాగు విస్తీర్ణం

367
ప్రకృతి సాగు విభాగంలోని సిబ్బంది

75,534 ఎకరాలు
ఈ ఏడాది ప్రకృతి వ్యవసాయం లక్ష్యం

?
ప్రస్తుతం జిల్లాలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు

లక్ష్యం ఘనం.. క్షేత్రంలో అంతా శూన్యం

- ప్రకృతి వ్యవసాయంపై అంతులేని నిర్లక్ష్యం
- కాకిలెక్కలతో ప్రభుత్వాన్నే బురిడీ కొట్టిస్తున్న అధికారులు
- సేంద్రియసాగు పేరుతో జిల్లాలో జోరుగా కెమికల్స్ వినియోగం

ప్రకృతి వ్యవసాయం అంటే...

ప్రకృతి వ్యవసాయం అంటే ఎలాంటి పురుగు మందులు, రసాయన ఎరువులు వాడకుండా పంటలు పండించడం. పంటల సాగులో ద్రవ, ఘన జీవామృతాన్ని మాత్రమే వినియోగించడం. చీడపీడల నివారణకు కషాయాలు, బ్రహ్మాస్త్రం, అగ్ని అస్త్రం, దశపర్ణి కషాయం తదితర వాటిని వినియోగించడం. ఏ రకంగానూ ఇటు పురుగుమందులు, అటు రసాయన ఎరువులు వినియోగించకపోవడం. అలా..వరుసగా మూడేళ్లు సాగు చేస్తే ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్లుగా పరిగణిస్తారు. కానీ అధిక దిగుబడుల కోసం చాలా మంది విచ్చల విడిగా రసాయన మందులు వాడుతున్నారు.

➤ కల్లూరు మండలం లక్ష్మీపురం పంచాయతీలో 631 మంది మహిళలు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి ఆ పంచాయతీలో ముగ్గురు మాత్రమే 100 శాతం ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. అందుకే సర్టిఫికేషన్ కూడా ఎవరూ వెళ్లడం లేదు. అధికారులు చెబుతున్న లెక్కలన్నీ ఇలాగే ఉంటున్నాయి.

కర్నూలు(అగ్రికల్చర్): ప్రకృతి వ్యవసాయం జిల్లాలో రికార్డుల్లోనే సాగుతోంది. అధికారులు వేలాది ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగుతోందని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం నామమాత్రానికే పరిమితమైంది. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక విభాగం ఉన్నా... ఉత్తుత్తి హడవుడే తప్ప ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. ప్రకృతి వ్యవసాయం కింద జిల్లాలో సాగుచేసిన ఆహార పంటల్లో కెమికల్స్ అవశేషాలు ఉన్నట్లుగా శాస్త్రీయంగా నిర్ధారణ కావడంతో ప్రకృతి సేద్యం... అంతా చోద్యంగా మారింది.

లెక్కల్లో మాత్రం 34,024 ఎకరాల్లో...

2024–25 సంవత్సరంలో జిల్లాలోని 141 గ్రామ పంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయం జరుగుతున్నట్లుగా అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది 53,834 మంది రైతులతో 75,534 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేపట్టాలన్నది వ్యవసాయ శాఖ లక్ష్యం. ప్రకృతి వ్యవసాయ విభాగం లెక్కల ప్రకారం ఇప్పటికే 32,607 మంది రైతులు 34,024 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్లుగా చెబుతున్నారు. కానీ 32,707 మంది రైతుల్లో 5 శాతం మంది కూడా ప్రకృతి వ్యవసాయం చేయడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అందువల్లే జిల్లాలో వేలాది మంది ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్లు చెబుతున్నప్పటికి.. సర్టిఫికేషన్ మాత్రం అతి కొద్ది మందికే వస్తోంది. అది కూడా స్వచ్ఛందంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకే దక్కుతోంది.

సాగుకు సిబ్బంది వెనుకంజ

ప్రకృతి వ్యవసాయ విభాగంలో 367 మంది పనిచేస్తున్నారు. వాస్తవానికి వీరంతా వారికున్న భూమిలో ఎకరా, అర ఎకరా విస్తీర్ణంలో తప్పనిసరిగా ప్రకృతి వ్యవసాయం చేయాలి. ప్రధానంగా ఎల్–1, ఎల్–2, ఎల్–3 కేటగిరీ వరకు ప్రకృతి వ్యవసాయం చేస్తూ రైతులకు ఆదర్శంగా నిలవాలి. కానీ వీరిలోనే 60 శాతం మంది ప్రకృతి వ్యవసాయాన్ని పట్టించుకున్న దాఖలాల్లేవు. రైతులకు ఆదర్శంగా ఉండాల్సిన సిబ్బందే కాడికిందపడేస్తే ఇక రైతులు ఎందుకు పట్టించుకుంటారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మరోవైపు కొందరు మాస్టర్ ట్రైనర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. విచ్చలవిడిగా కెమికల్స్ వాడుతున్నా.. ప్రకృతి వ్యవసాయం అంటూ నమ్మిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పాలేకర్ స్ఫూర్తితో 150 మంది రైతులు..

ఎవరి ప్రమేయం లేకుండా స్వచ్ఛందగా జిల్లాలోని 150 మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. వీరు దాదాపు పదేళ్లుగా ప్రకృతి వ్యవసాయంలో రాణిస్తున్నారు. వీరు సుబాష్‌పాలేకర్ స్ఫూర్తితో ప్రకృతి వ్యవసాయం చేస్తుండటం విశేషం. ప్రకృతి వ్యవసాయ విభాగం చెబుతున్న వారిలో 5 శాతం కూడ ప్రకృతి వ్యవసాయం చేసే వారు లేరు. ఈ 150 మంది రైతుల ఉత్పత్తులతోనే ప్రకృతి వ్యవసాయ సిబ్బంది హడావుడి చేస్తున్నారు.

విచ్చల విడిగా కెమికల్స్ వాడకం

జిల్లాలో చాలా మంది పేరుకే ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ఆచరణలో మాత్రం అంతా కెమికల్స్ వ్యవసాయమే. ప్రకృతి వ్యవసాయం పెద్ద ఎత్తున జరుగుతుంటే రసాయన ఎరువుల వినియోగం గణనీయంగా తగ్గాలి. కానీ వివిధ మండలాల్లో లెక్కకు మించి రసాయన ఎరువులు వినియోగిస్తుండటం గమనార్హం. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2.50 లక్షల టన్నుల వరకు రసాయన ఎరువుల వినియోగం ఉంది. జిల్లాల పునర్విభజన తర్వాత కర్నూలు జిల్లాలో 1.50 లక్షల టన్నుల వరకు వినియోగమవుతోంది. 2024–25 ఖరీఫ్‌లో 1,27,567.657 టన్నుల రసాయన ఎరువులను వినియోగించినట్లు తెలుస్తోంది. దీన్నిబట్టి చూస్తే జిల్లాలో ప్రకృతి వ్యవసాయం ఎలా సాగుతోందో అర్థం చేసుకోవచ్చు.

సాగు విస్తీర్ణం పెంచుతాం

జిల్లా రైతులు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపుతున్నారు. ఆసక్తి ఉన్న వారిని గుర్తించి శిక్షణ ఇస్తున్నాం. జీవామృతం, కషాయాల తయారీపై కూడా అవగాహన కల్పిస్తున్నాం. ప్రకృతి వ్యవసాయ విభాగంలో పనిచేసే సిబ్బంది కూడ ఎకరా, అర ఎకరా విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ఈ ఏడాది 54,834 మంది రైతులతో ప్రకృతి వ్యవసాయం చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రానున్న రోజుల్లో ప్రకృతి వ్యవసాయ సాగు విస్తీర్ణం మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటాం.

– పీఎల్ వరలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి

ఏపీ మోడల్ విద్యపై కసరత్తు

ముసాయిదాపై ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం

సాక్షి, అమరావతి: ఏపీ మోడల్ విద్యా విధానంపై ముసాయిదా రూపకల్పనకు పాఠశాల విద్యాశాఖ ప్రణాళిక సిద్ధం చేస్తోంది. పాఠశాల విద్య డైరెక్టర్ విజయ్ రామరాజు శుక్రవారం ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపారు. జీవో 117 ద్వారా 4,731 ప్రాథమిక పాఠశాలల్లో 3 – 5 తరగతులను యూపీ, హైస్కూళ్లలో విలీనం చేయగా వీటిని తిరిగి పాత విధానంలోకి తెచ్చేందుకు మార్గదర్శకాలను రూపొందించనున్నారు. ఇకపై అన్ని జిల్లాల్లో సీనియారిటీ జాబితాలతో మెరిట్ కమ్ రోస్టర్ విధానంలో షెడ్యూల్ ప్రకారం మే నెలలో పదోన్నతులు, బదిలీలు చేపట్టనున్నారు. బేసిక్ ప్రైమరీ స్కూళ్లలో 20 మంది లోపు పిల్లలు ఉంటే ఒక ఎస్‌జీటీని, 60 మంది పిల్లలుంటే ఇద్దరు ఎస్‌జీటీలను, ఆపై ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక ఎస్‌జీటీని నియమిస్తారు. మోడల్ ప్రైమరీ స్కూళ్లలో ప్రతి తరగతికి ఒక టీచర్‌ను కేటాయిస్తూ 120 మంది పిల్లలు కంటే ఎక్కువ ఉన్న పాఠశాలకు ప్రైమరీ స్కూల్ హెచ్ఎం పోస్టు కేటాయించే యోచనలో ప్రభుత్వం ఉంది. ప్రాథమిక పాఠశాలలకు 1 : 30, ఉన్నత పాఠశాలలకు 1 : 35 చొప్పున విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తిని నిర్ణయించనున్నారు. యూపీ స్కూళ్లలో 6, 7, 8 తరగతుల విద్యార్థులు 30 మంది కంటే తక్కువ ఉంటే దాన్ని ప్రాథమిక పాఠశాలలుగా డీగ్రేడ్ చేస్తారు. 60 మంది కంటే ఎక్కువ మంది ఉంటే ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేస్తారు. ఉన్నత పాఠశాలలో 6 – 10 తరగతుల వరకు 75 మంది విద్యార్థులకు మించి ఉంటే హెచ్ఎం, పీడీ పోస్టులను కేటాయిస్తారు. ఏటా మే 31 నాటికి ఖాళీలను పరిగణనలోకి తీసుకొని బదిలీలు నిర్వహించి జూన్ ఒకటో తేదీన పాఠశాలలో చేరేలా ఉత్తర్వులిస్తారు. ప్రధానోపాధ్యాయులకు కనీసం రెండు సంవత్సరాల సర్వీసు, గరిష్ఠంగా ఐదు సంవత్సరాల సర్వీసును... ఉపాధ్యాయులకు కనీసం రెండు సంవత్సరాల సర్వీసు, గరిష్ఠంగా 8 ఏళ్ల సర్వీసును పరిగణలోకి తీసుకుంటారు.

ఎన్‌టీఏ నిబంధనలతో విద్యార్థులకు ఇబ్బందులు

న్యాయం చేయాలని విద్యాశాఖ మంత్రికి పేరెంట్స్ అసోసియేషన్ లేఖ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అత్యధిక మంది విద్యార్థులు హాజరయ్యే జేఈఈ పరీక్షలకు ఎన్‌టీఏ విధించిన కొత్త నిబంధనలతో విద్యార్థులు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారని, గతేడాది ఇదే సమయానికి 12.2 లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే ఈ ఏడాది 5.01 లక్షలు మంది మాత్రమే దరఖాస్తు చేసుకోగలిగారని ఆంధ్రప్రదేశ్ పేరెంట్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈ మేరకు యూనియన్ గౌరవాధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి, అధ్యక్షుడు నరహరి, కార్యదర్శి ఈశ్వరయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థి దరఖాస్తులో భాగంగా కేటగిరీ వారీగా అదనపు పత్రాలు అడగడంతో పాటు, ఆయా సర్టిఫికెట్ల ఐడీ, జారీ చేసిన తేదీ, అధికారి పేరును కూడా తప్పనిసరిగా అందించాలనే నిబంధన విధించారని తెలిపారు. ఇంత సంక్లిష్టమైన నిబంధనలతో విద్యార్థులు గందరగోళానికి గురవుతున్నారని వివరించారు. సమయానికి ధ్రువపత్రాలు అందక, ఓబీసీ, ఈబీసీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. ఈనెల 22 వరకు జేఈఈ మెయిన్స్‌కు దరఖాస్తు గడువు ముగుస్తున్నందున విద్యాశాఖ మంత్రి కల్పించుకుని డాక్యుమెంటేషన్ సరళీకరించేలా ఎన్‌టీఏకు సూచించాలని వారు కోరారు.

మోటార్లు, ఇంజన్ల మరమ్మతులకు పరిహారం ఇవ్వాలి

ఏపీ కౌలు రైతుల సంఘం డిమాండ్

సాక్షి, అమరావతి: కృష్ణా, బుడమేరు వరదల ప్రభావానికి దెబ్బతిన్న మోటార్లు, ఆయిల్ ఇంజన్లు, ఇతర వ్యవసాయ పరికరాలకు నష్టపరిహారం ఇవ్వాలని ఏపీ కౌలు రైతుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు పీడీఎఫ్ ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరావుతో కలిసి సంఘ ప్రతినిధులు శుక్రవారం సచివాలయంలో మంత్రి అచ్చెన్నాయుడుకు వినతిపత్రమిచ్చారు. సంఘ కార్యదర్శి హరిబాబు మీడియాతో మాట్లాడుతూ..వరదల వల్ల దెబ్బతిన్న ఇంజన్లు, మోటార్ల రిపేర్ కోసం రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చవుతుందన్నారు. లంక భూముల్లో మేట వేసిన ఇసుకను తొలగించి, సాగుకు అనుకూలంగా మార్చుకునేందుకు వేలాది రూపాయలు ఖర్చవుతుందన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఈ భారాన్ని కౌలురైతులు, రైతులు భరించే పరిస్థితుల్లో లేరని ప్రభుత్వమే ఈ ఇసుక మేటలను ఉచితంగా తొలగించాలని కోరారు. పంటలు కోల్పోయిన రైతులకు ఇచ్చిన నష్టపరిహారాన్ని పెంచాలని కోరారు. కౌలు రైతులు, సాగుదారుల రుణాలను రీ షెడ్యూల్ చేసి కొత్తగా పంట రుణాలను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

వచ్చి మాట్లాడేదాకా నో బిల్

- తుంగభద్ర ఎగుద, దిగువ కాలువ పనులను నిలిపేసిన టీడీపీ నేతలు
- బిల్లులు ఆపాలని ఆర్థికశాఖకు రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు లేఖ
- టీబీ బోర్డుకు ఆర్థికశాఖ లేఖ, అకౌంట్లు బ్లాక్ చేసిన కర్ణాటక ట్రెజరీ
- కాంట్రాక్టర్లు వచ్చి కలవలేదనే కారణంతో టీడీపీ ఎమ్మెల్యే నిర్ణయం
- వేతనాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్లూ ఇవ్వని వైనం



టీబీ బోర్డుకు ఏపీ ఫైనాన్స్ డిప్యూటీ సెక్రటరీ రాసిన లేఖ

కర్నూలు సిటీ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ ప్రతినిధులు అభివృద్ధి పనుల్లో వాటాల కోసం వెంపర్లాడుతున్నారు. ఈ క్రమంలో తొలుత కాంట్రాక్టర్లను టార్గెట్ చేశారు. తమను కలవకుండా...తమతో మాట్లాడకుండా... బిల్లులు ఎలా తీసుకుంటారో చూద్దాం... అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలోనే ఎల్ఎల్‌సీ, హెచ్ఎల్‌సీ ఆధునికీరణల పనులు సరిగా జరగలేదని, వెంటనే ఆ పనులు నిలిపివేయాలని ఆర్థిక శాఖకు అనంతపురం జిల్లా రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాస్ సెప్టెంబరు 5వ తేదీన లేఖ రాశారు. ఆ లేఖ ఆధారంగా సెప్టెంబరు 13న ఏపీ ఫైనాన్స్ డిప్యూటీ సెక్రటరీ తుంగభద్ర బోర్డుకు లేఖ రాశారు. దీంతో కర్ణాటక ప్రభుత్వం బోర్డు అకౌంట్లను బ్లాక్ చేసింది. రెండు నెలలు అవుతున్నా.. ఇంత వరకు అకౌంట్లు తెరవకపోవడంతో బోర్డు పరిధిలో పని చేసే ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు.

బాబు హయాంలో అరకొర పనులు

అనంతపురం, కర్నూలు జిల్లాలకు సాగు, తాగు నీటిని అందిస్తున్న హెచ్ఎల్‌సీ, ఎల్ఎల్‌సీ కాల్వల ఆధునికీకరణకు నోచుకోక ఆయకట్టుకు నీరందని పరిస్థితులు నెలకొంది. దీంతో 2014 ఎన్నికలకు ముందు కర్నూలు జిల్లాకు హక్కుగా రావాల్సిన తుంగభద్ర జలాలను తెచ్చేందుకు తుంగభద్ర దిగువ కాలువను ఆధునికీకరణ చేయించి వాటా నీటిని తీసుకొచ్చే బాధ్యత తనదని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చినా అరకొర పనులు చేపట్టారు. టీబీ డ్యాం నుంచి ఎల్ఎల్‌సీ కాల్వ 0 కి.మీ నుంచి 70 కి.మీ వరకు 70 శాతం పనులు మాత్రమే చేసి మిగిలిపోయిన పనులు చేయకుండా చేతులెత్తేశారు. 2019 ఎన్నికల్లో ఏపీలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 70 కి.మీలోపు మిగిలిపోయిన 30 శాతం పనులతో పాటు, మొదటి విడతలోని 80 కి.మీ నుంచి 115 కి.మీ వరకు చేపట్టిన రూ.520 కోట్ల పది ప్యాకేజీ పనులను పూర్తి చేశారు. ఆ తరువాత రెండో విడత కింద రూ.410 కోట్లతో 11 నుంచి 20 ప్యాకేజీల కింద 115 కి.మీ నుంచి 205 కి.మీ వరకు ఆధునికీకరణ పనులను చేశారు. అయితే ఎన్నికల కోడ్ కారణంగా కాంట్రాక్టర్లకు బిల్లులు కాలేదు.

తమను కలవలేదనీ...

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరగా...ఆ పార్టీ ప్రజాప్రతినిధులు అధునికీకరణ బిల్లుల్లో కమీషన్ల కోసం ప్లాన్ చేశారు. ఈ క్రమంలోనే అనంతపురం జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు ఓ మంత్రి సహకారంతో ఆర్థిక శాఖకు మాజీ మంత్రి కాల్వ శ్రీనివాస్ లేఖ రాశారు. అక్కడి నుంచి కర్ణాటక ఆర్థిక శాఖకు, అక్కడి నుంచి కర్ణాటక ట్రెజరీకి లేఖ వెళ్లడంతో టీబీ బోర్డు ఖాతాలను బ్లాక్ చేశారు. దీంతో కాంట్రాక్టర్లు అనంతపురం జిల్లాకు చెందిన టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రిని కలిసేందుకు గత వారం రోజులుగా ప్రయత్నిస్తున్నా... అసెంబ్లీ సమావేశాలను సాకు చూపి వారిని కలవకుండా కాలయాపన చేస్తున్నట్లు తెలుస్తోంది. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా నిలిపివేసేందుకు బోర్డు ఖాతాలు బ్లాక్ చేయడంతో బోర్డు పరిధిలోని ఉద్యోగులు, ఎల్ఎల్‌సీ, హెచ్ఎల్‌సీ కాల్వల పరిధిలోని చిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు నెలలుగా వేతనాలు, పింఛన్లు రాకపోవడంతో ఈ నెల 12న టీబీ డ్యాం పరిధిలోని ఉద్యోగులు టీబీ బోర్డు కార్యదర్శి ఆఫీస్ ఎదుట ఆందోళన చేశారు.

రాధాకృష్ణా.. చీకటి సంపాదనపై విచారణకు సిద్ధమా!

సీబీఐ, ఈడీ విచారణకు ఇద్దరం లేఖ రాద్దామా

ఆంధ్రజ్యోతి రాధాకృష్ణకు ఎంపీ విజయసాయిరెడ్డి సవాల్

సాక్షి, అమరావతి: 'రాధాకృష్ణా.. నీ చీకటి సంపాదనపై విచారణకు సిద్ధమా. సీబీఐ, ఈడీ విచారణకు ఇద్దరం లేఖ రాద్దామా' అని రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణుంబాక విజయసాయిరెడ్డి సవాల్ విసిరారు. ఆంధ్రజ్యోతి బ్రేక్‌ఫాస్ట్ న్యూస్‌లో వేమూరి రాధాకృష్ణ ఉవాచ అంటూ వ్యాఖ్యానాలు చేయటంపై విజయసాయిరెడ్డి ఘాటుగా స్పందించారు. ఈ విషయమై రాధాకృష్ణను ఉద్దేశించి శుక్రవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో విజయసాయిరెడ్డి పోస్టు చేశారు. 'ఆంధ్రజ్యోతికి ఉత్తమ జర్నలిస్ట్ సంప్రదాయాలు పాటించమని, మా స్పందన కూడా ప్రసారం చేయాలని చెప్పా.. నువ్వు అసలు చిత్తశుద్ధి కలిగిన వృత్తిపరమైన పాత్రికేయుడివేనా?' అంటూ ఏబీఎన్ రాధాకృష్ణను ప్రశ్నించారు. 'కాంగ్రెస్, టీడీపీ కుట్రలో భాగంగా 12 నెలలు జైల్లో గడిపాను. నాపై ఆదాయానికి మించిన ఆస్తుల అభియోగాలు లేవు. నీలాగ మోసగాడినో, దోపిడీదారునో, బ్లాక్‌మెయిలర్‌నో, పీలర్ డీలర్‌నో కాదు. గుర్తుంచుకో!' అంటూ విజయసాయిరెడ్డి మండిపడ్డారు.

బ్రోకర్ల దగ్గర దండుకోలేదు

'నీలాగ మద్యం సిండికేట్ బ్రోకర్ల దగ్గర, ఖనిజాల సిండికేట్ బ్రోకర్ల దగ్గర ప్రముఖ రాజకీయ నాయకుల పేర్లు చెప్పి వారికి ఇవ్వాలంటూ నెలనెలా కోట్లకు కోట్లు నేను తీసుకోలేదు. ఇప్పుడు 2024లో విజయసాయిడ్డి అనే నేను నువ్వు చెప్పే భూదందాలు, భూముల ఆక్రమణలపై సీబీఐ, ఈడీ విచారణకు సిద్ధం. నువ్వు సిద్ధమేనా వేమూరి రాధాకృష్ణా. ఇద్దరం కలసి జాయింట్‌గా కేంద్ర విచారణ సంస్థలతో విచారణకు పిటిషన్ పెట్టుకుందాం. సిద్ధమా!. సాధారణ విలేకరిగా ఇంత సంపద పోగేసుకున్నావ్. సీఏ చదివి.. ఆడిటర్‌గా ప్రాక్టీసుతో ఈ స్థాయికి నేను వచ్చాను. ఎవరెలా సంపాదించారో తెలుగు ప్రాంతాల బయట నాతో చర్చకు సిద్ధమా? రాధాకృష్ణా' అని విజయసాయిరెడ్డి సవాల్ విసిరారు. '22 ఏళ్ల క్రితం ఆంధ్రజ్యోతి దినపత్రికలో సాధారణ విలేకరివి. ఆంధ్రజ్యోతి స్థాపకుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు కేఎల్ఎన్ ప్రసాద్ వారసుల నుంచి ఆ పత్రికను సొంతం చేసుకుని 2002 అక్టోబర్‌లో మొదలెట్టి కొద్ది సంవత్సరాల్లోనే దాదాపు 20 ఎడిషన్లు పెట్టే స్థాయికి ఎదిగావు. నూజివీడు సీడ్స్ యజమాని మండవ ప్రభాకరరావు, విజయ ఎలక్ట్రికల్స్ నాటి యజమాని దాసరి జైరమేష్ వంటి పారిశ్రామికవేత్తలకు వాటాలు ఉన్నట్టు చెప్పి మరెందరో రహస్య పెట్టుబడిదారులను మోసం చేసి నువ్వు ఈ పత్రికను రూ.వేలాది కోట్ల సంపదగా మార్చుకున్న తీరు తెలుగు నేలలోనే అపూర్వం. అనితర సాధ్యం' అని ఎద్దేవా చేశారు.


సమంత

'వాట్ నెక్ట్స్' అంటూ కొందరు స్టార్ హీరోయిన్ల అభిమానులు ప్రశ్నించుకుంటున్నారు. కారణం ఆ కథానాయికలు తెలుగులో కొత్త సినిమా ఏదీ సైన్ చేయకపోవడమే. అభిమాన నాయికలు వేరే భాషల్లో సినిమాలు చేసినా తెలుగు తెరపై కనిపించకపోతే టాలీవుడ్ ఫ్యాన్స్‌కి నిరుత్సాహంగానే ఉంటుంది. మరి... టాలీవుడ్‌లో కొత్త సినిమా అంగీకరించని ఆ తారల గురించి తెలుసుకుందాం.

టాలీవుడ్‌లో వాట్ నెక్ట్స్


పూజా హెగ్డే

మా ఇంటి బంగారం ఏమైంది?

తెలుగు చిత్ర పరిశ్రమలో స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగారు సమంత. టాలీవుడ్‌లో మహేశ్‌బాబు, పవన్ కల్యాణ్, రామ్‌చరణ్, ఎన్టీఆర్, అల్లు అర్జున్, నాగచైతన్య, నాని, నితిన్, విజయ్ దేవరకొండ, శర్వానంద్ వంటి హీరోలకి జోడీగా నటించి సందడి చేశారామె. అలాగే 'యశోద, శాకుంతలం' వంటి లేడీ ఓరియంటెడ్ చిత్రాలతోనూ అలరించారీ బ్యూటీ. విజయ్ దేవరకొండతో చేసిన 'ఖుషి' సినిమా తర్వాత సమంత నటిస్తున్న తెలుగు చిత్రంపై ఎలాంటి స్పష్టత లేదు. 'ఖుషి' 2023 సెప్టెంబరు 1న విడుదలైంది. ఈ మూవీ రిలీజై ఏడాది దాటిపోయినా ఇప్పటికీ తెలుగులో మరో సినిమాకి పచ్చజెండా ఊపలేదు సమంత. అయితే 'మా ఇంటి బంగారం' అనే ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్‌లో నటించనున్నట్లు ప్రకటించారు సమంత. ఈ సినిమాని తన సొంత ప్రొడక్షన్ బ్యానర్ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మించనున్నట్లు ఆమె ప్రకటించారు కూడా. తన బర్త్ డే సందర్భంగా ఏప్రిల్ 28న విడుదల చేసిన 'మా ఇంటి బంగారం' చిత్రం పోస్టర్ చూస్తే ఆమె గృహిణి పాత్రలో కనిపిస్తారని తెలిసింది. అయితే ఈ సినిమాకి దర్శకుడు ఎవరు? అనే విషయాన్ని ప్రకటించలేదు. అలాగే సమంత బర్త్ డే తర్వాత ఈ చిత్రం గురించి ఎలాంటి అప్‌డేట్ ఇవ్వలేదు. దీంతో ఈ సినిమా సెట్స్‌పై ఉందా? లేదా అనే సందేహం సినీ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఒక్క మాటలో చెప్పాలంటే.. 'ఖుషి' సినిమా తర్వాత సమంత నటిస్తున్న తెలుగు చిత్రం ఏది? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. అయితే హిందీలో సమంత నటించిన 'సిటాడెల్: హనీ–బన్నీ' వెబ్ సిరీస్ ఈ నెల 6 నుంచి అమేజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ప్రస్తుతం 'రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్' అనే హిందీ వెబ్ సిరీస్‌లో నటిస్తున్నారు సమంత.


కృతీ శెట్టి

అక్కడ ఫుల్... ఇక్కడ నిల్

టాలీవుడ్‌లో పదేళ్ల ప్రయాణం పూజా హెగ్డేది. నాగచైతన్య హీరోగా నటించిన 'ఒక లైలా కోసం'(2014) సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇచ్చారామె. ఆ తర్వాత ప్రభాస్, మహేశ్ బాబు, అల్లు అర్జున్, ఎన్టీఆర్, రామ్‌చరణ్, వరుణ్ తేజ్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అఖిల్ వంటి హీరోల సరసన సినిమాలు చేశారు పూజా హెగ్డే. కాగా చిరంజీవి, రామ్‌చరణ్ హీరోలుగా నటించిన 'ఆచార్య' (2022) సినిమా తర్వాత ఒక్క తెలుగు సినిమా కూడా చేయలేదు పూజ. ఈ మూవీలో రామ్‌చరణ్‌కి జోడీగా నటించిన ఈ బ్యూటీ ఆ తర్వాత 'ఎఫ్ 3' సినిమాలో ఓ ప్రత్యేక పాటలో మెరిశారు. అయితే 'ఆచార్య' విడుదలై రెండున్నరేళ్లు అవుతున్నా హీరోయిన్‌గా మరో తెలుగు చిత్రం కమిట్ కాలేదు పూజా హెగ్డే. ఈ గ్యాప్‌లో హిందీ సినిమాలు చేశారామె. షాహిద్ కపూర్, పూజా హెగ్డే జోడీగా రోషన్ ఆండ్రూస్ తెరకెక్కించిన 'దేవ' సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. వచ్చే ఏడాది ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 14న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం తమిళంలో విజయ్ 69వ చిత్రం, సూర్య 44వ సినిమాలో నటిస్తూ బిజీగా ఉన్నారు పూజ. అయితే తెలుగులో ఒక్క సినిమా కూడా కమిట్ కాకపోవడంతో ఆమె అభిమానులు నిరాశగా ఉన్నారు.

బేబమ్మకి గ్యాప్

తెలుగు ప్రేక్షకుల మనసుల్లో బేబమ్మగా అభిమానం సొంతం చేసుకున్నారు కృతీ శెట్టి. బుచ్చిబాబు సన దర్శకత్వం వహించిన 'ఉప్పెన' సినిమాతో టాలీవుడ్‌కి ఎంట్రీ ఇచ్చారామె. వైష్ణవ్ తేజ్ హీరోగా నటించిన ఈ సినిమా 2021 ఫిబ్రవరి 12న విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఆ సినిమా తర్వాత నాని (శ్యామ్ సింగరాయ్), నాగచైతన్య(బంగార్రాజు, కస్టడీ), రామ్ (ది వారియర్), నితిన్ (మాచర్ల నియోజక వర్గం), సుధీర్ బాబు (ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి), శర్వానంద్(మనమే) వంటి యువ హీరోలకి జోడీగా నటించారు కృతీ శెట్టి. 'మనమే' సినిమా ఈ ఏడాది జూన్ 7న రిలీజైంది. ఈ చిత్రం విడుదలై దాదాపు అర్నెల్లు కావస్తున్నా తెలుగులో ఇప్పటికీ మరో సినిమా కమిట్ కాలేదామె. టొవినో థామస్ హీరోగా నటించిన 'ఏఆర్ఎమ్' సినిమా ద్వారా మలయాళ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన కృతీ శెట్టి తమిళ చిత్ర పరిశ్రమలోనూ అడుగుపెడుతున్నారు. వరుసగా మూడు సినిమాలు (వా వాతియార్, లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ, జీనీ) వంటి చిత్రాల్లో నటిస్తూ దూసుకెళుతున్నారీ బ్యూటీ. కోలీవుడ్‌లో బిజీగా ఉండటంతో తెలుగులో ఆమె కొత్త సినిమాలేవీ ఒప్పుకోలేదా? అనేది వేచి చూడాలి.

నాలుగో సినిమా ఏంటి?

తెలుగులో చేసింది మూడు సినిమాలే అయినా ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సొంతం చేసుకున్నారు మృణాళ్ ఠాకూర్. 'సీతా రామం' (2022) సినిమాతో తెలుగు పరిశ్రమలో ఎంట్రీ ఇచ్చారామె. అందం, అభినయంతో తొలి చిత్రంతోనే సూపర్ హిట్ అందుకున్నారు మృణాళ్. ఆ తర్వాత నానితో 'హాయ్ నాన్న', విజయ్ దేవరకొండతో 'ది ఫ్యామిలీ స్టార్' సినిమాల్లో హీరోయిన్‌గా నటించారు. ప్రభాస్ హీరోగా వచ్చిన 'కల్కి 2898 ఏడీ' సినిమాలో అతిథి పాత్రతో ఆకట్టుకున్నారు. 'ది ఫ్యామిలీ స్టార్' చిత్రం ఈ ఏడాది ఏప్రిల్ 5న రిలీజైంది. ఆ సినిమా విడుదలై ఏడు నెలలు దాటినా ఆమె నటించనున్న మరో తెలుగు చిత్రంపై స్పష్టత లేదు. ఈ బ్యూటీ తెలుగులో ఏ సినిమాకి కమిట్ కాకపోయినా బాలీవుడ్‌లో మాత్రం దూసుకెళుతున్నారు. ప్రస్తుతం నాలుగు హిందీ సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా ఉన్నారు మృణాళ్. అయితే రాఘవా లారెన్స్ హీరోగా రమేష్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కనున్న 'ఆర్ఎల్ 25' (వర్కింగ్ టైటిల్) సినిమాలో మృణాళ్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించనున్నారనే వార్తలు వచ్చాయి. కానీ, దీనిపై చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. మరి.. మృణాళ్ ఠాకూర్ తర్వాతి తెలుగు సినిమా ఏంటి? అంటే వేచి చూడాలి.


మృణాళ్ ఠాకూర్

మహానటి అక్కడ బిజీ

'నేను శైలజ' సినిమాతో తెలుగుకి పరిచయమయ్యారు కీర్తీ సురేష్. రామ్ హీరోగా నటించిన ఈ సినిమా 2016 జనవరి 1న విడుదలై, సూపర్ హిట్‌గా నిలిచింది. ఆ తర్వాత 'నేను లోకల్ (నాని), అజ్ఞాతవాసి(పవన్ కల్యాణ్), మహానటి, మిస్ ఇండియా, రంగ్ దే (నితిన్), గుడ్ లక్ సఖి, సర్కారువారి పాట (మహేశ్ బాబు), దసరా (నాని), భోళా శంకర్ వంటి సినిమాలతో ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారామె. మహానటి సావిత్రి బయోపిక్‌గా రూపొందిన 'మహానటి' (2018) చిత్రంలో తన అద్భుత నటనతో ప్రేక్షకులను కట్టిపడేశారు కీర్తీ సురేష్. ఈ చిత్రానికి గాను ఉత్తమ నటిగా జాతీయ అవార్డును కూడా అందుకున్నారామె. 'భోళా శంకర్' సినిమాలో హీరో చిరంజీవికి చెల్లెలుగా నటించారు కీర్తి. ఆ సినిమా 2023 ఆగస్టు 11న విడుదలైంది. ఆ మూవీ తర్వాత మరో తెలుగు చిత్రానికి కీర్తీ సురేష్ పచ్చజెండా ఊపలేదు. అయితే ఈ గ్యాప్‌లో తమిళ చిత్రాలతో బిజీగా ఉన్నారామె. అంతేకాదు.. 'బేబీ జాన్' సినిమాతో బాలీవుడ్‌లోనూ ఎంట్రీ ఇస్తున్నారు కీర్తి. ఈ చిత్రంలో హీరో వరుణ్ ధావన్‌కి జోడీగా నటిస్తున్నారు. ఈ సినిమా ఈ డిసెంబరు 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. మరి తెలుగులో కీర్తీ సురేష్ నటించనున్న సినిమా ఏంటి? అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.


కీర్తీ సురేష్

ఈ కథానాయికలే కాదు... మెహరీన్, డింపుల్ హయతి వంటి మరికొందరు హీరోయిన్లు నటించనున్న కొత్త తెలుగు సినిమాలపైనా స్పష్టత లేదు.

✿ దేరంగుల జగన్

'బిగ్ బాస్ వ్యూహం'... పార్టిసిపెంట్స్‌కి ఇదో పద్మవ్యూహం



కళ అనేది ప్రేక్షకుడికి ఆనందం, కళాకారుడికి జీవితం ఇస్తుంది. ఏ కళాకారుడైనా తన కళను నమ్ముకునే జీవిస్తాడు. ముఖ్యంగా నేటి కళాకారులు తమకు అంది వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. తమ కష్టాన్ని, నష్టాన్ని బేరీజు వేసుకోకుండా ఆఖరికి తమ జీవితాన్ని కూడా పణంగా పెట్టి కళకు అంకితమవుతున్నారు. కానీ దురదృష్టం ఏంటంటే ఎంతటి కళాకారులనైనా కనుమరుగు చేస్తూ క్యాష్ చేసుకుంటుంది 'బిగ్ బాస్' లాంటి కార్యక్రమం. అదెలాగంటారా... చూడండి. బిగ్ బాస్ కార్యక్రమం దాదాపు 8 సంవత్సరాల నుండి తెలుగు ప్రేక్షకులకు పరిచయం. 8 సిరీస్‌లలో వచ్చిన పార్టిసిపెంట్స్ మళ్లీ ఎక్కడా కనబడట్లేదు. కనీసం విన్నర్స్ ఎవరైనా ఎక్కడైనా కనబడతారనుకున్నా పొరపాటే. బిగ్ బాస్ కార్యక్రమ రూపేణా ప్రేక్షకాదరణ విపరీతంగా ఉంటుంది. షో చూసే ప్రతి కళాకారుడు బిగ్ బాస్‌కి వెళ్లి తన ఇమేజ్ పెంచుకోవాలనుకుంటాడు. కట్ చేస్తే... తాను బిగ్ బాస్ బ్యాలెన్స్ పెంచుతాడే కానీ తన ఇమేజ్ డ్యామేజ్ కాకుండా చూసుకోలేడు. అదెలాగంటారా ఇంకాస్త వివరంగా చెప్పుకుందాం. బిగ్ బాస్ హౌస్ అంటే ఏంటి? ఏ సంబంధం లేని నలుగురు పబ్లిక్ ఇమేజ్ ఉన్నవాళ్లని ఓ ఇంట్లో పెట్టి, వారి మధ్య టాస్కుల పేరుతో గిల్లికజ్జాలు పెట్టి, వారు కొట్టుకుంటే చూసే ప్రేక్షకుడితో తన గల్లా పెట్టి నింపుకునేదే ఈ బిగ్ బాస్ వ్యాపార సూత్రం. సాధారణంగా రోడ్డు మీద ఎవరైనా అనామకుడితో మనకు చిన్న పాటి ప్రమాదం జరిగినా చెలరేగిపోతాం. అటువంటి సమయంలో చుట్టూ వచ్చి పోయే వాళ్లు ఆగి మరీ మన కొట్లాట వేడుకలా చూసి ఆనందిస్తారు. ఇప్పుడు బిగ్ బాస్‌లో కూడా జరిగేది అదే. తెలియని అనామకుడితో జరిగే గొడవ మనకు కాస్తంత అసహనం ఇచ్చినా గొడవపడతాం, అలాంటిది కోట్లాది మంది చూస్తున్నారన్న విషయం తెలిసి కూడా అదుపు తప్పి తోటి పార్టిసిపెంట్స్‌తో గొడవ పడినపుడు ఏమవుతుంది? మహా అయితే బిగ్ బాస్ చిల్లర రెమ్యునరేషన్ రూపంలో విదిలిస్తాడు, కానీ తన ఇమేజ్‌ని ఈ కాస్త చిల్లర కోసం పాడు చేసుకుంటున్నామన్న విషయం గ్రహించలేక పోతున్నారు ఇప్పటి పార్టిసిపెంట్స్. ఈ వారం విశ్లేషణ అంతా పైన విషయంలోనే ఉంది. ఇక చెప్పుకోవాల్సిన అంశాలేమైనా ఉన్నాయంటే వైల్డ్ ఎంట్రీగా వచ్చిన గంగవ్వ సైలెంట్‌గా అనారోగ్య కారణాలతో ఎగ్జిట్ అయింది. బిగ్ బాస్ కార్యక్రమాన్ని మొత్తంగా హరికథ రూపేణా పొగిడించుకుని వారాంతంలో హరితేజకు హ్యాండిచ్చి ఎలిమినేట్ చేశాడు బిగ్ బాస్. వారాంతంలో జంబలకిడి పంబ పేరుతో పార్టిసిపెంట్స్‌ను లింగ వేషధారణతో జుగుప్సాకరమైన డ్యాన్సులు, హావభావాలతో రసాభాస చేసి ఈ వారానికి 'మమ' అనిపించారు. ఏదేమైనప్పటికీ బిగ్ బాస్ అన్నది బిగ్ డ్యామేజ్ అన్న విషయం చూసే ప్రేక్షకులు ఎప్పటికీ తెలుసుకోలేరు కానీ పార్టిసిపెంట్స్ అయినా ఎప్పటికి గ్రహిస్తారో ఏమో.

– ఇంటూరు హరికృష్ణ

మరో తమిళ సినిమాలో...


శివ రాజ్‌కుమార్

తమిళ సినిమాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లున్నారు కన్నడ స్టార్ హీరో శివ రాజ్‌కుమార్. రజనీకాంత్ హీరోగా నటించిన 'జైలర్' సినిమాలో ఓ పవర్ ఫుల్ గెస్ట్ రోల్‌లో శివరాజ్ కుమార్ నటించారు. ఈ పాత్రకు ఆడియన్స్ నుంచి సూపర్ రెస్పాన్స్ లభించింది. ఆ తర్వాత ధనుష్ హీరోగా నటించిన 'కెప్టెన్ మిల్లర్' చిత్రంలోనూ శివ రాజ్‌కుమార్ ఓ లీడ్ రోల్ చేశారు. తాజాగా తమిళ హీరో విజయ్ చిత్రంలో కూడా శివ రాజ్‌కుమార్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. ''విజయ్ హీరోగా చేస్తున్న లేటెస్ట్ మూవీలో ఓ మంచి పాత్ర కోసం నన్ను మేకర్స్ సంప్రదించారు. కథ నచ్చడంతో ఒప్పుకున్నాను'' అని ఇటీవల ఓ సందర్భంగా వెల్లడించారు శివ రాజ్‌కుమార్. అలాగే రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సన దర్శకత్వంలో రూపొందుతున్న 'పెద్ది' (ప్రచారంలో ఉన్న టైటిల్) చిత్రంలో కూడా శివ రాజ్‌కుమార్ ఓ లీడ్ రోల్‌లో నటించనున్న సంగతి తెలిసిందే. మరోవైపు హీరోగా కన్నడంలో సినిమాలు చేస్తున్నారు శివ రాజ్‌కుమార్.

అదే పెద్ద సవాల్

- ప్రదీప్ మద్దాలి

''పీరియాడిక్ కాన్సెప్ట్‌తో సినిమా లేదా వెబ్ సిరీస్‌ని తెరకెక్కించటం అనేది ప్రతి టెక్నీషియన్‌కి ఎంతో సవాల్‌తో కూడుకున్నది. ప్రతి చిన్న విషయాన్ని చాలా జాగ్రత్తగా గమనించాలి. కంటెంట్‌ను ఎలా తెరకెక్కించాలనుకుంటున్నామో దాన్ని తెరపైకి తీసుకురావటం అనేది పెద్ద సవాల్. ఇందుకు దర్శకుడి ఆలోచనకు ప్రొడక్షన్ డిజైనర్, కాస్ట్యూమ్ డిజైనర్, కెమెరామేన్ ఆలోచనలు సరిగ్గా సరిపోవాలి. 'వికటకవి'కి నాకు మంచి టీమ్ కుదిరింది'' అని ప్రదీప్ మద్దాలి చెప్పారు. నరేష్ అగస్త్య, మేఘా ఆకాష్ ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'వికటకవి'. ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామ్ తాళ్లూరి నిర్మించారు. ఈ వెబ్ సిరీస్ ఈ నెల 28 నుంచి జీ5 ఓటీటీలో తెలుగు, తమిళ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు ప్రదీప్ మద్దాలి మాట్లాడుతూ– ''అ!, కల్కి 2898 ఏడీ' సినిమాలకు పని చేసిన రైటర్ తేజ దేశ్‌రాజ్ రాసుకున్న కథ 'వికటకవి'. తను నాకు మంచి స్నేహితుడు. ఆ కథ నాకు నచ్చింది. రామ్ తాళ్లూరిగారు, జీ5 టీమ్ ఓ బడ్జెట్ చెప్పి అందులోనే ఈ సిరీస్‌ని పూర్తి చేయగలవా? అన్నారు. నేను అంగీకరించాను. అక్కడి నుంచి మా ప్రయాణం ప్రారంభమైంది. ఈ కథంతా 1940, 1970 కాలాల్లో జరుగుతుంది. సిరీస్‌ను కంటెంట్ ప్రకారం ఓ రాయల్ లుక్‌తో చూపిస్తూనే కథానుగుణంగా మంచి థ్రిల్లర్ ఎలిమెంట్‌తో తెరకెక్కించాను. నరేష్ అగస్త్య పేరుని నేనే సూచించాను. ఇందులో తను డిటెక్టివ్. డబ్బు కోసం అమరగిరి ప్రాంతంలోని ఓ సమస్యను పరిష్కరించటానికి వచ్చినప్పుడు ఏం జరిగింది? అనేదే అసలు కథ. అమరగిరి మహా సంస్థానం యువరాణిగా మేఘా ఆకాష్ నటించింది. ఈ సిరీస్‌కి అజయ్ అరసాడ మంచి మ్యూజిక్ అందించారు. 'వికటకవి' సీజన్ 2 ఉంటుంది. రైటర్ తేజ ఇప్పటికే ఆ స్క్రిప్ట్‌పై వర్క్ చేస్తున్నారు'' అని తెలిపారు.



మహిళలందరూ సపోర్ట్ చేయాలి

- కిరణ్ రావ్

'లాపతా లేడీస్' పేరు ఇంగ్లిష్‌లో 'లాస్ట్ లేడీస్'గా మారిపోయింది. స్పర్శ్ శ్రీవాత్సవ, నితాన్షి గోయెల్, ప్రతిభ రంతా, ఛాయా కదం లీడ్ రోల్స్‌లో నటుడు ఆమిర్ ఖాన్ సతీమణి కిరణ్ రావ్ దర్శకత్వం వహించిన హిందీ చిత్రం 'లాపతా లేడీస్' (తప్పిపోయిన మహిళలు అని అర్థం). ఆమిర్ ఖాన్, కిరణ్ రావు, జ్యోతిదేశ్ పాండే నిర్మించిన ఈ చిత్రం ఈ ఏడాది మార్చి 1న విడుదలై, బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. అలాగే వచ్చే ఏడాది అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో జరగనున్న 97వ ఆస్కార్ అవార్డ్స్‌లోని ఉత్తమ విదేశీ చిత్రం నామినేషన్ కోసం ఇండియా అఫీషియల్ ఎంట్రీగా 'లాపతా లేడీస్' సినిమాను ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎంపిక చేసింది. కాగా 'లాపతా లేడీస్' అనే హిందీ టైటిల్ అంతగా రిజిస్టర్ కాదేమోనని, ఈ సినిమాకు ఇంగ్లిష్‌లో 'లాస్ట్ లేడీస్' అనే టైటిల్ పెట్టి, ఈ సినిమా కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. అలాగే అమెరికాలోని కొన్ని లొకేషన్స్‌లో 'లాస్ట్ లేడీస్' సినిమా ప్రత్యేక ప్రదర్శనలు వేస్తున్నారు మేకర్స్. ఈ సందర్భంగా కిరణ్ రావ్ అక్కడి మీడియాతో మాట్లాడుతూ– ''లాస్ట్ లేడీస్' మహిళా ప్రాధాన్యం ఉన్న చిత్రం కాబట్టి మహిళలందరూ మా సినిమాకు సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాం. మంచి సందేశాత్మక చిత్రం కాబట్టి ఈ సినిమాకు ఆస్కార్ అవార్డు వస్తుందన్న నమ్మకం ఉంది'' అని పేర్కొన్నారు. ''ఈ సినిమా కథ విన్న వెంటనే నాకు వినోదాత్మకంగా అనిపించింది. పైగా పలు ముఖ్యమైన అంశాలు ప్రస్తావించడం జరిగింది. మహిళా సాధికారిత, స్వేచ్ఛ, సమానత్వాల కోసం పోరాడుతున్న మహిళలకు పురుషులు సపోర్ట్ చేయడం అనే పాయింట్ కూడా బాగుంది. ఈ సినిమాకు ఓ నిర్మాతగా వ్యవహరించినందుకు చాలా సంతోషంగా ఉంది'' అన్నారు ఆమీర్‌ఖాన్.





పొలం బాట పట్టి!

ఈ మధ్య కాలంలో అంతగా సినిమాలు చేయడం లేదు శ్రియ. ఒకట్రెండు సినిమాలు, వెబ్ సిరీస్ మాత్రమే చేస్తున్నారు. షూటింగ్ లేని సమయాల్లో తన కుమార్తె రాధతో కలిసి సమయాన్ని గడుపుతున్నారు. కూతురికి ఆటపాటలు నేర్పడంతో పాటు ఇంకా బోలెడన్ని విషయాలు నేర్పుతున్నారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే రాధను ఆమె పొలానికి తీసుకెళ్లి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. పంట నూర్పిళ్ల విధానాన్ని తన కూతురుకి తెలియజేశారు. ఈ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. పొలాలంటే ఏంటో నేటితరానికి పెద్దగా తెలియడం లేదు. ఈ నేపథ్యంలో శ్రియ తన కుమార్తెను ఇలా పొలానికి తీసుకెళ్లడం, నూర్పిళ్లు ఎలా చేస్తారో తానే స్వయంగా చేసి చూపించడం హాట్‌టాపిక్‌గా మారింది. సెల్‌ఫోన్లతో పిల్లలు బిజీగా ఉంటున్న ఈ కాలంలో శ్రియ ఇలా చేయడం అభినందనీయమని పలువురు నెటిజన్లు ఆమెను అభినందిస్తున్నారు. ఇక శ్రియ సినిమాల విషయానికి వస్తే.. సూర్య హీరోగా కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సూర్య 44'(వర్కింగ్ టైటిల్) సినిమాలో కీలక పాత్ర చేస్తున్నారు.


కుమార్తె రాధతో శ్రియ



సాక్షి ప్లస్
శుక్రవారం । 15-11-2024

బిజినెస్ రీల్

నవ లిమిటెడ్ షేర్ల విభజన

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మెటల్స్, ఎనర్జీ, మైనింగ్ తదితర రంగాల్లో ఉన్న నవ లిమిటెడ్ బోర్డు షేర్ల విభజనకు ఆమోదం తెలిపింది. రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరును రూ.1 ముఖ విలువ కలిగిన రెండు షేర్లుగా విభజించనుంది. సెప్టెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో కంపెనీ నికరలాభం 72% ఎగసి రూ.332 కోట్లు నమోదైంది. పన్నుకు ముందు లాభం 60% అధికమై రూ.361 కోట్లుగా ఉంది. ఎబిటా 14.3% వృద్ధి చెంది రూ.456 కోట్లకు చేరింది. ఎబిటా మార్జిన్ 687 బేసిస్ పాయింట్లు దూసుకెళ్లి 48.3 శాతంగా ఉంది. టర్నోవర్ రూ.962 కోట్ల నుంచి రూ.943 కోట్లకు పడిపోయింది. ఫలితాల నేపథ్యంలో నవ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్ఈలో గురువారం 0.69 శాతం ఎగసి రూ.899.05 వద్ద స్థిరపడింది.

వైష్ణోయి గ్రూప్ సౌత్‌వుడ్స్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రియల్టీ రంగంలో ఉన్న వైష్ణోయి గ్రూప్ సౌత్‌వుడ్స్ పేరుతో ప్రీమియం విల్లా ప్రాజెక్టును చేపట్టింది. శంషాబాద్ సమీపంలోని మామిడిపల్లి వద్ద 43.29 ఎకరాల విస్తీర్ణంలో అల్ట్రా లగ్జరీ సౌకర్యాలతో 260 విల్లాలు నిర్మిస్తారు. ప్రతి విల్లాలో ప్రైవేట్ మినీ థియేటర్ ఏర్పాటు చేస్తారు. పండ్లు, కూరగాయలు, పూల మొక్కలతో కూడిన ఎడిబుల్ గార్డెన్స్, రెండెకరాల గోల్ఫ్ టర్ఫ్, పెట్ పార్క్స్, స్కై బ్రిడ్జ్ వంటి 50కిపైగా విలాసవంతమైన హంగులు జోడిస్తామని వైష్ణోయి గ్రూప్ ఫౌండర్ యెలిశాల రవి ప్రసాద్ గురువారం మీడియాకు తెలిపారు. వైష్ణోయి గ్రూప్ 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో మొత్తం 25కుపైగా ప్రాజెక్టులను పూర్తి చేసింది.

ఏంజెల్ ఫండ్ పెట్టుబడి పరిమితి రూ. 25 కోట్లకు పెంపు

సెబీ చర్చాపత్రంలో ప్రతిపాదనలు

న్యూఢిల్లీ: అంకుర సంస్థలకి మరింతగా పెట్టుబడులు లభించేలా, ఇన్వెస్టర్లకు కూడా వెసులుబాట్లు కల్పించేలా మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా స్టార్టప్‌లలో ఏంజెల్ ఫండ్స్ చేసే పెట్టుబడులపై గరిష్ట పరిమితిని ప్రస్తుతమున్న రూ. 10 కోట్ల నుంచి రూ. 25 కోట్లకు పెంచాలని యోచిస్తోంది. అలాగే కనిష్ట పరిమితిని రూ. 25 లక్షల నుంచి రూ. 10 లక్షలకు తగ్గించే యోచనలో ఉంది. ఇందుకు సంబంధించిన చర్చా పత్రంలో ఈ మేరకు ప్రతిపాదనలు చేసింది. నిర్దిష్ట అర్హతలు, రిస్కు సామర్థ్యాలు ఉండే 'అక్రెడిటెడ్ ఇన్వెస్టర్ల'ను మాత్రమే ఏంజెల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసేందుకు అనుమతించాలని ప్రతిపాదించింది. ఏంజెల్ ఫండ్స్ తమ దగ్గరున్న మొత్తం నిధుల నుంచి, ఏదైనా ఒక స్టార్టప్‌లో 25 శాతానికి మించి ఇన్వెస్ట్ చేయరాదనే నిబంధనను తొలగించనుంది. తద్వారా పెట్టుబడులపరంగా మరింత వెసులుబాటు కల్పించనుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)



15-11-2024

విశాఖ	530-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	545-00
విజయవాడ	540-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	530-00
వరంగల్	532-00
రిటైల్ ధర	5.90

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
EICHERMOT	4,890.95	6.59
HEROMOTOCO	4,612.65	2.06
GRASIM	2,534.10	1.25
KOTAKBANK	1,708.55	1.23
HDFCLIFE	693.3	1.2

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HINDUNILVR	2,392.95	-2.92
BPCL	298.2	-2.5
BRITANNIA	4,922.10	-2.47
TATACONSUM	930.4	-2.35
NESTLEIND	2,188.00	-2.11

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,993
ఎన్ఎస్ఈ	85,953
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,68,174
ఎఫ్ఐఐ	- 850
డీఐఐ	+ 2,482

ముడిచమురు... (బ్యారెల్)



నైమెక్స్ లైట్ స్వీట్	68.17	$ 68.43
బ్రెంట్	72.06	$ 72.28

సాఫీగానే ఆర్థిక వ్యవస్థ

బలంగా ఆర్థిక మూలాలు
- ద్రవ్యోల్బణం దిగొస్తుంది
- వచ్చే సమావేశంలో రేట్లపై నిర్ణయం
- ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్



ముంబై: అంతర్జాతీయంగా ఎన్నో సమస్యలు, సవాళ్లు నెలకొన్న పరిస్థితుల్లో భారత ఆర్థిక వ్యవస్థ స్థిరంగా సాగిపోతున్నట్టు ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ వ్యాఖ్యానించారు. బలమైన స్థూల ఆర్థిక మూలాలు, స్థిరమైన ఆర్థిక వ్యవస్థ, విదేశీ మారకం నిల్వలు పటిష్టంగా ఉండడం, నియంత్రణలో కరెంటు ఖాతా లోటు, వస్తు, సేవల ఎగుమతుల వృద్ధిని ప్రస్తావించారు. 682 బిలియన్ డాలర్ల విదేశీ మారకంతో (అక్టోబర్ 31 నాటికి) ప్రపంచంలో నాలుగో స్థానంలో ఉన్నట్టు గుర్తు చేశారు. ముంబైలో నిర్వహించిన ఓ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇదే సమావేశంలో భాగంగా కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ రేట్ల కోతకు ఇచ్చిన పిలుపుపై స్పందించలేదు. డిసెంబర్‌లో జరిగే ఆర్‌బీఐ ఎంపీసీ సమావేశం కోసం తన వ్యాఖ్యలను రిజర్వ్ చేస్తున్నట్టు దాస్ చెప్పారు. ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా స్పందించేందుకు వీలుగా అక్టోబర్ పాలసీ సమీక్షలో తటస్థ విధానానికి మారినట్టు దాస్ చెప్పారు. ద్రవ్యోల్బణం మధ్యమధ్యలో పెరిగినప్పటికీ మోస్తరు స్థాయికి దిగొస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అక్టోబర్ నెలకు రిటైల్ ధరల ఆధారిత ద్రవ్యోల్బణం 6 శాతం మించిపోయిన నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. 4 శాతానికి ప్లస్ 2 లేదా మైనస్ 2 శాతం మించకుండా ద్రవ్యోల్బణాన్ని నియంత్రించాలన్నది ఆర్‌బీఐ దీర్ఘకాలిక లక్ష్యం కావడం గమనార్హం. దీర్ఘకాలం పాటు అంతర్జాతీయంగా ఎన్నో సంక్షోభ పరిస్థితుల్లోనూ మన ఆర్థిక వ్యవస్థ మెరుగైన పనితీరు చూపించినట్టు దాస్ చెప్పారు. కాకపోతే అంతర్జాతీయంగా ప్రస్తుతం కొన్ని ప్రతికూల పవనాలు వీస్తున్నాయంటూ.. బాండ్ ఈల్డ్స్, కమోడిటీ ధరల పెరుగుదలను ప్రస్తావించారు. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల్లోనూ ఫైనాన్షియల్ మార్కెట్లు బలంగా నిలబడినట్టు చెప్పారు. ఆర్‌బీఐ వడ్డీ రేట్లను తగ్గించాలని.. ఇందుకు ఆహార ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకోవడం సరికాదన్న స్వీయ అభిప్రాయాన్ని వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ ఇదే సభలో వ్యక్తం చేశారు.

రూపాయికి లక్ష్యం లేదు..

రూపాయి మారకం విషయంలో ఆర్‌బీఐకి ఎలాంటి లక్ష్యం లేదని, అస్థిరతలను నియంత్రించేందుకు అవసరమైనప్పుడే జోక్యం చేసుకుంటుందని శక్తికాంత దాస్ స్పష్టం చేశారు. యూఎస్ ఫెడ్ 2022, 2023లో ద్రవ్య కఠిన విధానాలను చేపట్టిన తరుణంలోనూ రూపాయి స్థిరంగా ఉండడాన్ని ప్రస్తావించారు. ఎక్స్‌పెక్టెడ్ క్రెడిట్ లాస్ (ఈసీఎల్) కార్యాచరణకు సంబంధించి ముసాయిదాను త్వరలో విడుదల చేస్తామని చెప్పారు.

చాలా స్టార్టప్‌లది ఆరంభ శూరత్వమే!

బజాజ్ ఆటో ఎండీ రాజీవ్ బజాజ్



ముంబై: చాలా వరకు స్టార్టప్‌లది ఆరంభ శూరత్వమేనని బజాజ్ ఆటో ఎండీ రాజీవ్ బజాజ్ వ్యాఖ్యానించారు. అవి వ్యూహాలను, బ్రాండ్‌ను, టెక్నాలజీని నిరుపయోగంగా మార్చేస్తుండగా.. విజయవంతమైన కంపెనీలు మాత్రం వాటిని దన్నుగా చేసుకొని బ్రాండ్‌ను వృద్ధి బాటలో పయనించేలా చేస్తున్నాయని చెప్పారు. ఈ రెండింటి మధ్య అతిపెద్ద వ్యత్యాసం ఇదేనన్నారు. ఓ టీవీ చానెల్ నిర్వహించిన గ్లోబల్ లీడర్‌షిప్ సదస్సులో మాట్లాడుతూ.. 'ఎలాంటి వ్యూహం లేకుండా మార్కెట్లోకి అడుగుపెట్టేవి 'అప్‌స్టార్ట్‌లు'. అవి తమ వ్యూహాలు, టెక్నాలజీలు, ఉత్పత్తులను చేజార్చుకుంటాయి. ప్రతి నెలా ధరలను తగ్గిస్తూ బ్రాండ్‌కు తూట్లు పొడుస్తాయి. ఫ్యాక్టరీల్లో, ట్రక్కుల్లో, డీలర్‌షిప్‌ల వద్ద, రోడ్లపై ఉత్పత్తులు తగలబడిపోతుంటాయి. దీనికి పూర్తి భిన్నంగా స్టార్టప్‌లు వ్యూహాన్ని రూపొందించుకుంటాయి. టెక్నాలజీని, బ్రాండ్‌ను, ఉత్పత్తులను అభివృద్ధి చేయడంతో పాటు వినియోగదారులకు మెరుగైన అనుభవాన్ని కల్పించేందుకు ప్రయత్నిస్తాయి. ఉద్యోగులకు సంతృప్తి అందిస్తాయి. పటిష్టమైన ఆదాయాలే కాకుండా, లాభాలను కూడా కళ్లజూస్తాయి. ఇక మూడో కోవలోకి వచ్చేవి విజయవంతమైన కంపెనీలు. అవి సరైన వ్యూహాలు, టెక్నాలజీ వినియోగంతో అద్భుతమైన బ్రాండ్‌లుగా అవతరిస్తాయి' అని పేర్కొన్నారు. టెక్నాలజీని అందిపుచ్చుకునే పోటీలో స్టార్టప్‌లు, పేరొందిన సంస్థల్లో ఏవి విజయం సాధిస్తాయనే ప్రశ్నకు రాజీవ్ బజాజ్ ఈ విధంగా బదులిచ్చారు. బైక్‌లయినా, ఇంకా ఏ ఇతర వ్యాపారమైనా సరే 90–95 శాతం కొత్త వ్యాపారాలు, కొత్త ఉత్పత్తులు, సర్వీసులన్నీ విఫలమవుతున్నాయని, ప్రపంచవ్యాప్తంగా ఏ పరిశ్రమలో చూసినా ఇది వాస్తవమన్నారు.

క్విక్ కామర్స్‌తో రిటైలర్లకు సవాళ్లు

రాజకీయాంశంగా మారొచ్చు • వెటరన్ బ్యాంకర్ ఉదయ్‌కోటక్

న్యూఢిల్లీ: క్విక్ కామర్స్ నమూనా స్థానిక రిటైలర్లకు సవాళ్లు విసురుతోందని, రాజకీయ అంశంగానూ మారొచ్చని వెటరన్ బ్యాంకర్, కోటక్ మహీంద్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు ఉదయ్ కోటక్ అభిప్రాయపడ్డారు. భారత్‌ను ప్రపంచంలోనే వినూత్నమైన దేశంగా పేర్కొంటూ.. మరెక్కడా క్విక్ కామర్స్ నమూనా అంత సత్ఫలితాలు సాధించలేదని, ఇక్కడ మాత్రం విజయవంతంగా కొనసాగుతున్నట్టు చెప్పారు. ''ఇది సానుకూల సంకేతమే. క్షేత్రస్థాయిలో ఆవిష్కరణలకు ఫలితాలు కనిపిస్తున్నాయి.'' అని ఉదయ్ కోటక్ పేర్కొన్నారు.



అదే సమయంలో యాపిల్, మెటా, యూనిలీవర్ వంటి బ్రాండ్లను భారత్ సృష్టించాల్సి ఉందన్నారు. అభివృద్ధి చెందిన ఏ దేశాన్ని పరిశీలించినా ఈ విధమైన ఆవిష్కరణల బలం కనిపిస్తుందంటూ.. భారత వ్యాపార సంస్థలు ఉత్పాదకత, సృజనాత్మకతపై దృష్టి సారించాలని సూచించారు. దేశీయ సంస్థలకు, దేశీయ మార్కెట్ నుంచే రక్షణ కల్పించడం అన్నది దీర్ఘకాల పోటీతత్వం కోణంలో ప్రమాదకరమన్నారు. దేశీయ వ్యాపారాలను కాపాడుకోవడం కంటే అవి స్వేచ్ఛగా పోటీపడేలా చూడాలన్నారు. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) భారత మార్కెట్లలో 900 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టారని, ట్రంప్ పాలనలో వచ్చే మార్పులతో లేదా ఏదైనా అంతర్జాతీయ పరిణామంతో ఇందులో 5–10 శాతం మేర వెనక్కి మళ్లినా అందుకు సన్నద్ధమై ఉండాలని సూచించారు.

130 బిలియన్ డాలర్లకు క్రీడా పరిశ్రమ

- 2030 నాటికి భారత్‌లో సాధ్యం
- గూగుల్, డెలాయిట్ నివేదిక



న్యూఢిల్లీ: క్రీడా పరిశ్రమ 2030 నాటికి భారత్‌లో 14 శాతం వార్షిక వృద్ధి రేటుతో 130 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని గూగుల్, డెలాయిట్ నివేదిక వెల్లడించింది. కాంటార్ సహకారంతో రూపొందిన ఈ నివేదిక ప్రకారం.. పెరిగిన ప్రభుత్వ పెట్టుబడులు, నాణ్యమైన స్పోర్ట్స్ కంటెంట్‌లో పెరుగుదల, అలాగే దేశంలోని 65.5 కోట్ల మంది క్రీడాభిమానుల మధ్య విస్తృతమైన డిజిటల్ స్వీకరణ ఈ వృద్ధిని నడిపిస్తున్నాయి. పరిశ్రమ 2023లో 150 శాతం దూసుకెళ్లి 52 బిలియన్ డాలర్లు నమోదు చేసింది. రానున్న రోజుల్లో క్రీడల ప్రయోజనాలు కూడా పెరుగుతాయి. 2030 నాటికి దేశానికి పన్ను, ఉపాధి సహకారం రెట్టింపు అవుతుంది. ఆ సమయానికి 1.05 కోట్ల ఉద్యోగాల సృష్టితోపాటు పరోక్ష పన్నుల రూపంలో 21 బిలియన్ డాలర్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూరుతుంది. స్పోర్ట్స్ ద్వారా గతేడాది 9 బిలియన్ డాలర్లు సమకూరింది. ప్రస్తుతం ఈ రంగంలో 47 లక్షల మంది ఉపాధి పొందుతున్నారు. 2034–36 నాటికి అంతర్జాతీయంగా భారత క్రీడాకారులు అందుకునే మెడల్స్ మూడురెట్లు అవుతాయి. క్రీడాభిమానుల్లో 36 శాతం మంది మహిళలు ఉన్నారు.

కేటీఎం... ఇండియా రైడ్

- కొత్తగా 10 బైక్‌ల విడుదల
- వాటా పెంపునకు కసరత్తు



న్యూఢిల్లీ: ప్రీమియం బైక్స్ తయారీలో ఉన్న ఆస్ట్రియన్ కంపెనీ కేటీఎం పూర్తి స్థాయిలో ఉత్పత్తులను అందించడం ద్వారా భారత్‌లో తన మార్కెట్ ఉనికిని పెంచుకోవాలని చూస్తోంది. నాలుగు విభాగాల్లో అంతర్జాతీయంగా లభించే 10 కొత్త బైక్స్‌ను గురువారం భారత మార్కెట్లో కంపెనీ ప్రవేశపెట్టింది. వీటి ధరలు రూ.4.75 లక్షలతో మొదలై రూ.22.96 లక్షల వరకు ఉంది. 'అంతర్జాతీయంగా కొన్నేళ్లుగా కేటీఎం అమ్మకాలను పెంచుకోగలిగింది. ప్రత్యేకించి బజాజ్ ఆటోతో భాగస్వామ్యం తర్వాత ఎగుమతులు అధికం అయ్యాయి. మహారాష్ట్ర చకన్‌లోని బజాజ్ ప్లాంటులో తయారైన బైక్స్‌ను 120కిపైగా దేశాలకు ఎగుమతి చేస్తోంది. గత ఏడాది కంపెనీ ప్రపంచవ్యాప్తంగా 3.7 లక్షల మోటార్‌సైకిళ్లను విక్రయించింది' అని కేటీఎం-స్పోర్ట్‌మోటార్‌సైకిల్ జీఎంబీహెచ్ ఆసియా, పసిఫిక్, మిడిల్-ఈస్ట్, ఆఫ్రికా సేల్స్ వైస్ ప్రెసిడెంట్ పీటర్ పెర్నెర్‌స్టార్ఫర్ తెలిపారు. అమ్మకాలలో భారత్ వాటా 40 శాతమని, ఇక్కడి మార్కెట్లో అపార అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఇప్పటి వరకు కంపెనీ పూర్తి ఉత్పత్తి శ్రేణిని దేశీయంగా అందించలేదని వివరించారు. చకన్ ప్లాంటు నుంచి 500 సీసీలోపు సామర్థ్యంగల 12 లక్షల యూనిట్ల కేటీఎం బైక్‌లు ఎగుమతి అయ్యాయి.

సెమీకండక్టర్ రంగంలో 10 లక్షల ఉద్యోగాల కల్పన

- 2026 నాటికి అంచనా
- ఇంజినీర్లు, టెక్నీషియన్లకు డిమాండ్
- ఎన్‌ఎల్‌బీ సర్వీసెస్ నివేదిక



ముంబై: సెమీకండక్టర్ హబ్‌గా ఎదిగే దిశగా భారత్ ముందుకు సాగుతున్న నేపథ్యంలో 2026 నాటికి సంబంధిత విభాగాల్లో 10 లక్షల ఉద్యోగాల కల్పన జరగనుంది. సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్‌లో 3,00,000 ఉద్యోగాలు, ఏటీఎంపీలో (అసెంబ్లీ, టెస్టింగ్, మార్కింగ్, ప్యాకేజింగ్) 2,00,000 కొలువులు రానున్నాయి. ఇక చిప్ డిజైన్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, సిస్టమ్ సర్క్యూట్స్, సరఫరా వ్యవస్థ మొదలైన విభాగాల్లో మిగతావి ఉంటాయనే అంచనాలున్నాయి. టాలెంట్ సొల్యూషన్స్ సంస్థ ఎన్‌ఎల్‌బీ సర్వీసెస్ ఒక నివేదికలో ఈ విషయాలు వెల్లడించింది. దేశీయంగా చిప్‌ల తయారీని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం దన్నుగా నిలవడంతో పాటు పలు ప్రైవేట్ కంపెనీలు భారత్‌లో కొత్తగా అసెంబ్లీ, టెస్టింగ్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించింది. దీంతో నిర్మాణ రంగంలోనూ కొలువులు రాగలవని నివేదిక పేర్కొంది.


శిక్షణ కీలకం ..

మెటీరియల్స్ ఇంజినీరింగ్, క్వాలిటీ కంట్రోల్ తదితర విభాగాల్లో సుశిక్షితులైన ఇంజినీర్లు, ఆపరేటర్లు, టెక్నీషియన్లు మొదలైన వారికి డిమాండ్ ఉంటుందని నివేదిక వివరించింది. సెమీకండక్టర్ల వ్యవస్థలో ప్రాసెస్ ఇంటిగ్రేషన్ ఇంజినీర్లు, సెమీకండక్టర్ వేఫర్ ఇన్‌స్పెక్టర్, టెక్నికల్ స్పెషలిస్ట్, డిజైన్ ఇంజినీర్, ప్రాసెస్ ఇంజినీర్, క్వాలిటీ కంట్రోల్ స్పెషలిస్ట్ మొదలైన ఉద్యోగాలు కీలకంగా ఉంటాయి. చిప్‌ల పరిశ్రమ గణనీయంగా విస్తరించే ప్రణాళికల్లో ఉన్నప్పటికీ నిపుణుల కొరత నెలకొందని తెలిపింది.

రిలయన్స్ డిస్నీ జేవీ షురూ

మీడియా దిగ్గజం విలువ రూ. 70,352 కోట్లు

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్‌ఐఎల్), గ్లోబల్ దిగ్గజం వాల్ట్ డిస్నీ మధ్య మీడియా ఆస్తుల విలీనం పూర్తయ్యింది. దీంతో రూ. 70,352 కోట్ల(8.5 బిలియన్ డాలర్లు) విలువైన భాగస్వామ్య(జేవీ) మీడియా దిగ్గజానికి తెరలేచింది. నీతా అంబానీ చైర్‌పర్సన్‌గా వ్యవహరించనున్న జేవీలో రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.4 బిలియన్ డాలర్లు(రూ. 11,500 కోట్లు) ఇన్వెస్ట్ చేసింది. ఆర్‌ఐఎల్ నిర్వహణలో జేవీ కార్యకలాపాలు కొనసాగనున్నాయి. జేవీలో ఆర్‌ఐఎల్ అనుబంధ సంస్థ వయాకామ్18 వాటా 46.82 శాతంకాగా.. ఆర్‌ఐఎల్‌కు 16.34 శాతం, డిస్నీకు 36.84 శాతం చొప్పున వాటాలు లభించాయి. ఉదయ్ శంకర్ వైస్‌చైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వహించనున్నారు.



2024 మార్చితో ముగిసిన గతేడాది సుమారు 3.1 బిలియన్ డాలర్ల(రూ. 26,000 కోట్లు) ఆదాయంతో దేశీ మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ దిగ్గజాలలో ఒకటిగా జేవీ ఆవిర్భవించింది. కాగా.. వయాకామ్18లో యూఎస్ సంస్థ పారామౌంట్ గ్లోబల్‌కుగల 13.01 శాతం వాటాను ఆర్‌ఐఎల్ కొనుగోలు చేసింది. ఇందుకు రూ. 4,286 కోట్లు వెచ్చించింది. దీంతో వయాకామ్18లో ఆర్‌ఐఎల్ వాటా 70.49 శాతానికి ఎగసింది. ఈ సంస్థలో నెట్‌వర్క్18 మీడియా 13.54 శాతం, బోధి ట్రీ సిస్టమ్స్ 15.97 శాతం చొప్పున వాటా కలిగి ఉన్నాయి. బోధి ట్రీ సిస్టమ్స్.. జేమ్స్ మర్డోక్, ఉదయ్ శంకర్ భాగస్వామ్యంలో ఏర్పాటైన ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ.

జీడీపీ ఏటా 7 శాతం వృద్ధి

- 2027 మార్చి వరకు సాధ్యమే
- భారత్ ఆర్థిక వృద్ధిపై ఎస్‌అండ్‌పీ అంచనా



న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ 2027 మార్చి వరకు ప్రతి ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతం నుంచి 7 శాతం వరకు వృద్ధి సాధిస్తుందని ఎస్‌అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ అంచనా వేసింది. మౌలిక సదుపాయాలపై చేస్తున్న వ్యయాలు, ప్రైవేటు మూలధన వ్యయాలు వృద్ధికి మద్దతుగా నిలుస్తాయని పేర్కొంది. ఫలితంగా బ్యాంకుల ఆస్తుల నాణ్యత కూడా మెరుగ్గానే కొనసాగొచ్చని అంచనా వేసింది. కంపెనీల బ్యాలన్స్ షీట్లు బలంగా ఉండడం, అండర్‌రైటింగ్ ప్రమాణాలు కఠినంగా మారడం, మెరుగైన రిస్క్ నిర్వహణ విధానాలు ఇవన్నీ రుణ ఆస్తుల నాణ్యత స్థిరత్వానికి సాయపడతాయని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024–25) జీడీపీ 7.2 శాతం వృద్ధి సాధిస్తుందని ఆర్‌బీఐ అంచనా వేస్తుండడం గమనార్హం. 2023–24లో ఇది 8.2 శాతంగా ఉంది. అధిక డిమాండ్‌కు తోడు బ్యాంకుల వద్ద నిధులు బలంగా ఉండడం రుణాల్లో వృద్ధికి మద్దతునిస్తాయని.. అదే సమయంలో డిపాజిట్లలో బలహీనత కొనసాగొచ్చని పేర్కొంది. ''బ్యాంకింగ్ రంగంలో మొండి రుణాలు 2025 మార్చి నాటికి స్థూల రుణాల్లో 3 శాతానికి తగ్గొచ్చు. 2024 మార్చి నాటికి ఇవి 3.5 శాతంగా ఉంటాయి'' అని ఎస్‌అండ్‌పీ తెలిపింది.

సెప్టెంబర్ త్రైమాసిక ఫలితాలు — Q2 RESULTS

ష్నైడర్ ఎలక్ట్రిక్ లాభం ఓకే

క్యూ2లో రూ. 54 కోట్లు



న్యూఢిల్లీ: ట్రాన్స్‌ఫార్మర్స్, స్విచ్‌గేర్స్ తయారీ దిగ్గజం ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 27 శాతం ఎగసి రూ. 54 కోట్లను అధిగమించింది. ఆదాయం మెరుగుపడటం ఇందుకు దోహదపడింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 43 కోట్లు మాత్రమే ఆర్జించింది. కాగా.. మొత్తం ఆదాయం రూ. 498 కోట్ల నుంచి రూ. 609 కోట్లకు ఎగసింది. మూడేళ్ల కాలానికి చిన్మయ్ దాస్‌ను అదనపు, హోల్‌టైమ్ డైరెక్టర్‌గా బోర్డు ఎంపిక చేసినట్లు కంపెనీ పేర్కొంది. నియామకం వెనువెంటనే అమల్లోకి వచ్చినట్లు వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో ష్నైడర్ ఎలక్ట్రిక్ షేరు బీఎస్ఈలో 1 శాతం లాభంతో రూ. 724 వద్ద ముగిసింది.

అవంతి ఫీడ్స్ లాభం 54% జంప్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రొయ్యల దాణా తయారీలో ఉన్న అవంతి ఫీడ్స్ సెప్టెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 54 శాతం దూసుకెళ్లి రూ.114 కోట్లు సాధించింది. ఎబిటా 44.3 శాతం అధికమై రూ.135.6 కోట్లకు చేరింది. ఎబిటా మార్జిన్ 7.4 నుంచి 10 శాతంగా ఉంది. టర్నోవర్ రూ.1,312 కోట్ల నుంచి రూ.1,397 కోట్లకు ఎగసింది. ఫలితాల నేపథ్యంలో అవంతి ఫీడ్స్ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్ఈలో గురువారం 2.74 శాతం దూసుకెళ్లి రూ.581.30 వద్ద స్థిరపడింది.

క్రాంప్టన్ గ్రీవ్స్ లాభం జూమ్

క్యూ2లో రూ. 128 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం క్రాంప్టన్ గ్రీవ్స్ కన్జూమర్ ఎలక్ట్రికల్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 27 శాతం జంప్‌చేసి రూ. 128 కోట్లను అధిగమించింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 101 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం 6 శాతం పుంజుకుని రూ. 1,896 కోట్లను తాకింది. అయితే మొత్తం వ్యయాలు సైతం 5 శాతం పెరిగి రూ. 1,743 కోట్లకు చేరాయి. ఆదాయంలో ఎలక్ట్రిక్ కన్జూమర్ ప్రొడక్టుల విభాగం నుంచి 12 శాతం అధికంగా రూ. 1,393 కోట్లు లభించింది. లైటింగ్ ప్రొడక్టుల బిజినెస్ 6 శాతం మెరుగుపడి రూ. 253 కోట్లను దాటింది.

ఫలితాల నేపథ్యంలో క్రాంప్టన్ గ్రీవ్స్ షేరు బీఎస్ఈలో 4% పతనమై రూ. 371 వద్ద ముగిసింది.

ముత్తూట్ ఫైనాన్స్ లాభం అప్

క్యూ2లో రూ. 1,251 కోట్లు



న్యూఢిల్లీ: బంగారు ఆభరణాలపై రుణాలందించే ముతూట్ ఫైనాన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 26 శాతం జంప్‌చేసి రూ. 1,251 కోట్లను అధిగమించింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 991 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 3,060 కోట్ల నుంచి రూ. 4,117 కోట్లకు ఎగసింది. పూర్తి అనుబంధ సంస్థ ముత్తూట్ మనీ లిమిటెడ్‌లో రూ. 500 కోట్ల ఈక్విటీ నిధులను ఇన్వెస్ట్ చేసేందుకు బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు కంపెనీ వెల్లడించింది.

ముత్తూట్ ఫైనాన్స్ షేరు బీఎస్ఈలో 1.5% లాభంతో రూ. 1,800 వద్ద ముగిసింది.

భారత్ ఫోర్జ్ లాభం ప్లస్

క్యూ2లో రూ. 243 కోట్లు



న్యూఢిల్లీ: ఆటో విడిభాగాల దిగ్గజం భారత్ ఫోర్జ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 13 శాతం ఎగసి రూ. 243 కోట్లను తాకింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 215 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం స్వల్పంగా 2 శాతం నీరసించి రూ. 3,688 కోట్లకు చేరింది. గత క్యూ2లో రూ. 3,774 కోట్ల టర్నోవర్ అందుకుంది. నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు 2.2 శాతం బలపడి 18.7 శాతాన్ని తాకాయి. ఈ కాలంలో డిఫెన్స్, క్యాస్టింగ్ తదితర విభాగాల నుంచి రూ. 1,207 కోట్ల విలువైన ఆర్డర్లు పొందింది.

ఫలితాల నేపథ్యంలో భారత్ ఫోర్జ్ షేరు బీఎస్ఈలో 0.5 శాతం లాభంతో రూ. 1,328 వద్ద ముగిసింది.

అపోలో టైర్స్ లాభం రూ.297 కోట్లు

రూ.1,000 కోట్ల సమీకరణకు నిర్ణయం



న్యూఢిల్లీ: అపోలో టైర్స్ సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికానికి రూ.297 కోట్ల లాభాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.474 కోట్లతో పోల్చితే 37 శాతం తగ్గిపోయింది. ఆదాయం మాత్రం ఇదే కాలంలో రూ.6,280 కోట్ల నుంచి రూ.6,437 కోట్లకు పెరిగింది. ''భారత్‌లో ఓఈఎం (ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ తయారీదారు) విభాగంలో బలహీన డిమాండ్ నెలకొంది. దీంతో టైర్ల మార్పిడి విభాగంలో బలమైన వృద్ధి సాధ్యం కాలేదు. తయారీ ముడి సరుకుల ధరలు అసాధారణ రీతిలో పెరిగిపోవడం మా లాభాలపై ప్రభావం చూపించింది'' అని అపోలో టైర్స్ చైర్మన్ ఓంకార్ కన్వార్ తెలిపారు. యూరప్‌లో ప్యాసింజర్ వాహన విభాగం నుంచి సానుకూల వృద్ధి నమోదైంది. నాన్ కన్వర్టబుల్ డిబెంచర్ల (ఎన్‌సీడీ) జారీ ద్వారా రూ.1,000 కోట్లు సమీకరించేందుకు కంపెనీ బోర్డు నిర్ణయించింది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో కంపెనీ షేరు 3 శాతం నష్టపోయి రూ.456 వద్ద స్థిరపడింది.

సన్ టీవీ బలహీన పనితీరు



న్యూఢిల్లీ: సన్ టీవీ నెట్‌వర్క్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికంలో (జూలై–సెప్టెంబర్) బలహీన పనితీరు ప్రదర్శించింది. క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు నికర లాభం 12 శాతం తగ్గి రూ.409 కోట్లుగా నమోదైంది. ఆదాయం సైతం 11 శాతం మేర క్షీణించి రూ.934 కోట్లకు పరిమితమైంది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో లాభం రూ.465 కోట్లు, ఆదాయం రూ.1,048 కోట్ల చొప్పున ఉన్నాయి. వ్యయాలు 10 శాతం అధికమై రూ.593 కోట్లకు చేరాయి. ఒక్కో షేరుకు రూ.5 చొప్పున మధ్యంతర డివిడెండ్ ఇవ్వాలని కంపెనీ బోర్డు నిర్ణయించింది. ''సెప్టెంబర్ త్రైమాసికంతోపాటు, ఏప్రిల్–సెప్టెంబర్ ఆరు నెలల కాలానికి సంబంధించిన ఫలితాల్లో హోల్డింగ్ కంపెనీ క్రికెట్ ఫ్రాంచైజీలు సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ.0.09 కోట్లు, సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ రూ.238 కోట్ల ఆదాయం కలసి ఉంది. వీటికి సంబంధించి వ్యయాలు వరుసగా రూ.1.34 కోట్లు, రూ.238 కోట్ల చొప్పున ఉన్నాయి'' అని సన్‌రైజర్స్ తెలిపింది. ఐపీఎల్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్, సౌతాఫ్రికా టీ20 లీగ్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ సన్‌టీవీ ఫ్రాంచైజీలు కావడం గమనార్హం. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం సహా ఏడు భారతీయ భాషల్లో శాటిలైట్ ఛానళ్లు, ఎఫ్‌ఎం రేడియో స్టేషన్లను సన్ టీవీ నిర్వహిస్తోంది.

బీఎస్ఈలో సన్‌టీవీ షేరు ఒక శాతం నష్టంతో రూ.725 వద్ద ముగిసింది.



పవన్ సెహ్రావత్

పోరాడి ఓడిన తెలుగు టైటాన్స్

నోయిడా: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో వరుసగా నాలుగు విజయాల తర్వాత తెలుగు టైటాన్స్ జట్టుకు పరాజయం ఎదురైంది. గురువారం జరిగిన పోరులో తెలుగు టైటాన్స్ 34-40 పాయింట్ల తేడాతో యూపీ యోధాస్ జట్టు చేతిలో ఓటమి పాలైంది. టైటాన్స్ తరఫున విజయ్ మలిక్ 15 పాయింట్లతో ఒంటరి పోరాటం చేయగా... కెప్టెన్ పవన్ సెహ్రావత్ 4 పాయింట్లు మాత్రమే సాధించాడు. యూపీ యోధాస్ తరఫున భవాని రాజ్‌పుత్ 12, భరత్ 11 పాయింట్లు సాధించారు. తాజా సీజన్‌లో 9 మ్యాచ్‌లు ఆడిన తెలుగు టైటాన్స్ 5 విజయాలు, 4 పరాజయాలతో 25 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో ఆరో స్థానంలో కొనసాగుతోంది. మరోవైపు యూపీ యోధాస్ లీగ్‌లో నాలుగో మ్యాచ్ నెగ్గి 25 పాయింట్లతో 8వ స్థానంలో ఉంది. మరో మ్యాచ్‌లో యు ముంబా 35-32 పాయింట్ల తేడాతో తమిళ్ తలైవాస్‌పై గెలుపొందింది. యు ముంబా తరఫున మన్‌జీత్ 10 పాయింట్లు, అజిత్ చవాన్ 8 పాయింట్లు సాధించగా... తలైవాస్ తరఫున మోయిన్ 10 పాయింట్లతో పోరాడాడు. 10 మ్యాచ్‌లాడి 6వ విజయం నమోదు చేసుకున్న యు ముంబా జట్టు 34 పాయింట్లతో పట్టికలో రెండో స్థానానికి చేరగా... వరుసగా నాలుగో మ్యాచ్‌లో ఓటమి పాలైన తమిళ్ తలైవాస్ 22 పాయింట్లతో పట్టికలో 10వ స్థానంలో ఉంది. లీగ్‌లో భాగంగా నేడు జరగనున్న మ్యాచ్‌ల్లో పట్నా పైరేట్స్‌తో బెంగాల్ వారియర్స్ (రాత్రి 8 గంటలకు), జైపూర్ పింక్ పాంథర్స్‌తో గుజరాత్ జెయింట్స్ (రాత్రి 9 గంటలకు) తలపడతాయి.

రాణించిన రషీద్, కరణ్

ఆంధ్ర 168/2 • హైదరాబాద్ 301 ఆలౌట్


రషీద్

సాక్షి, హైదరాబాద్: ప్రతిష్టాత్మక రంజీ ట్రోఫీలో హైదరాబాద్, ఆంధ్ర జట్ల మధ్య ఉప్పల్ వేదికగా జరుగుతున్న పోరు రసవత్తరంగా సాగుతోంది. ఓవర్‌నైట్ స్కోరు 244/5తో గురువారం రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ జట్టు చివరకు 105.4 ఓవర్లలో 301 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (287 బంతుల్లో 159; 12 ఫోర్లు, 3 సిక్స్‌లు) భారీ సెంచరీతో రాణించాడు. వికెట్ కీపర్ రాహుల్ రాదేశ్ (22) క్రితం రోజు స్కోరు వద్దే అవుట్ కాగా.. చామా మిలింద్ (5), తనయ్ త్యాగరాజన్ (10), అనికేత్ రెడ్డి (10) పెవిలియన్‌కు వరుస కట్టారు. ఆంధ్ర బౌలర్లలో త్రిపురాణ విజయ్ 5, మొహమ్మద్ రఫీ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 58 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. కెప్టెన్ షేక్ రషీద్ (161 బంతుల్లో 79 బ్యాటింగ్; 11 ఫోర్లు) అర్ధశతకంతో ఆకట్టుకోగా... కరణ్ షిండే (41 బ్యాటింగ్; 4 ఫోర్లు), అభిషేక్ రెడ్డి (38; 4 ఫోర్లు, ఒక సిక్సర్) బాధ్యతాయుతంగా ఆడారు. హైదరాబాద్ బౌలర్లలో రక్షణ్ రెడ్డి, అనికేత్ రెడ్డి చెరో వికెట్ పడగొట్టారు. చేతిలో 8 వికెట్లు ఉన్న ఆంధ్ర జట్టు... హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 133 పరుగులు వెనుకబడి ఉంది. రషీద్‌తో పాటు కరణ్ షిండే క్రీజులో ఉన్నాడు.

స్కోరు వివరాలు

హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్: తన్మయ్ అగర్వాల్ (సి) సందీప్ (బి) రఫీ 124; అభిరత్ రెడ్డి (సి) మోహన్ (బి) విజయ్ 35; రోహిత్ రాయుడు (సి) (సబ్) జ్ఞానేశ్వర్ (బి) విజయ్ 0; హిమతేజ (సి) భరత్ (బి) సందీప్ 36; రాహుల్ సింగ్ (సి అండ్ బి) విజయ్ 1; నితీశ్ రెడ్డి (స్టంప్డ్) భరత్ (బి) మోహన్ 22; రాహుల్ రాదేశ్ (ఎల్బీ) (బి) శశికాంత్ 22; మిలింద్ (బి) విజయ్ 5; తనయ్ (సి) రషీద్ (బి) విజయ్ 10; అనికేత్ రెడ్డి (సి) భరత్ (బి) రఫీ 7; రక్షణ్ (నాటౌట్) 0, ఎక్స్‌ట్రాలు 4, **మొత్తం (105.4 ఓవర్లలో ఆలౌట్) 301. వికెట్ల పతనం:** 1-91, 2-95, 3-151, 4-152, 5-200, 6-245, 7-253, 8-265, 9-288, 10-301. **బౌలింగ్:** శశికాంత్ 19-4-38-1; రఫీ 24.4-4-5-59-2; విజయ్ 31-5-118-5; లలిత్ మోహన్ 23-4-64-1; సందీప్ 8-0-18-1.

ఆంధ్ర తొలి ఇన్నింగ్స్: హేమంత్ (సి) నితీశ్ (బి) రక్షణ్ 9; అభిషేక్ రెడ్డి (బి) అనికేత్ రెడ్డి 38; షేక్ రషీద్ (బ్యాటింగ్) 79; కరణ్ షిండే (బ్యాటింగ్) 41; ఎక్స్‌ట్రాలు 1, **మొత్తం (58 ఓవర్లలో 2 వికెట్లకు) 168. వికెట్ల పతనం:** 1-17, 2-84, **బౌలింగ్:** మిలింద్ 8-2-21-0; రక్షణ్ రెడ్డి 10-0-35-1; అనికేత్ రెడ్డి 22-5-56-1; తనయ్ త్యాగరాజన్ 9-0-39-0; రోహిత్ రాయుడు 9-2-16-0.


కశ్యప్


స్నేహల్

606 పరుగులు...

రంజీ ట్రోఫీలో అత్యధిక భాగస్వామ్యం రికార్డు నమోదు
'ట్రిపుల్' సెంచరీలతో గోవా బ్యాటర్లు కశ్యప్, స్నేహల్ ఘనత

పనాజీ: సుదీర్ఘ చరిత్ర ఉన్న రంజీ ట్రోఫీలో గోవా బ్యాటర్లు కొత్త రికార్డు నెలకొల్పారు. ప్లేట్ గ్రూప్‌లో భాగంగా అరుణాచల్ ప్రదేశ్‌తో జరిగిన పోరులో గోవా క్రికెటర్లు కశ్యప్ బాక్లే (269 బంతుల్లో 300 నాటౌట్; 39 ఫోర్లు, 2 సిక్సర్లు), స్నేహల్ కౌథాంకర్ (215 బంతుల్లో 314 నాటౌట్; 45 ఫోర్లు, 4 సిక్సర్లు) అజేయ ట్రిపుల్ సెంచరీలతో చెలరేగారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు అజేయంగా 606 పరుగులు జోడించి రంజీ ట్రోఫీలో ఏ వికెట్‌కైనా అత్యధిక భాగస్వామ్యం నమోదు చేశారు. 2016లో మహారాష్ట్ర ఆటగాళ్లు స్వప్నిల్, అంకిత్ ఢిల్లీతో మ్యాచ్‌లో మూడో వికెట్‌కు అజేయంగా 594 పరుగులు జత చేసి రికార్డు నెలకొల్పగా... ఇప్పుడు గోవా ద్వయం దీన్ని బద్దలు కొట్టింది. రంజీల్లో ఒకే మ్యాచ్లో ఒకే జట్టుకు చెందిన ఇద్దరు ఆటగాళ్లు ట్రిపుల్ సెంచరీలు చేయడం ఇది రెండోసారి. 1989లో తమిళనాడు ప్లేయర్లు డబ్ల్యూవీ రామన్, అర్జున్ క్రిపాల్ ఈ ఘనత సాధించారు. కశ్యప్, స్నేహల్ వీరవిహారంతో గోవా 92 ఓవర్లలో 727/2 వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. అనంతరం అరుణాచల్ ప్రదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 22.3 ఓవర్లలో 92 పరుగులకే ఆలౌటైంది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లోనూ అరుణాచల్ ప్రదేశ్ 84 పరుగులకు పరిమితమైంది. దీంతో గోవా జట్టు ఇన్నింగ్స్ 551 పరుగుల తేడాతో గెలిచింది.

సూర్యకుమార్ వల్లే సాధ్యమైంది

మూడో స్థానంలో బ్యాటింగ్‌పై తిలక్ వర్మ







సెంచూరియన్: దక్షిణాఫ్రికాతో మూడో టి20లో అజేయ సెంచరీతో ఆకట్టుకున్న హైదరాబాద్ బ్యాటర్ ఠాకూర్ తిలక్ వర్మ... ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. సాధారణంగా నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దిగే తిలక్... ఈ మ్యాచ్‌కు ముందు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను అడిగి మరీ మూడో స్థానంలో బరిలోకి దిగి సత్తా చాటాడు. తొలి రెండు టి20ల్లో నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేసి వరుసగా 33, 20 పరుగులు చేసిన తిలక్ వర్మ... తనను తాను నిరూపించుకోవడానికి ఒక స్థానం ముందే బ్యాటింగ్‌కు దిగాలనుకుంటున్నట్లు కెప్టెన్‌కు వివరించాడు. దీనికి అంగీకరించిన సూర్యకుమార్ తాను బ్యాటింగ్ చేయాల్సిన మూడో ప్లేస్‌లో తిలక్‌ను దింపాడు. దీంతో ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే క్రీజులోకి అడుగుపెట్టిన తిలక్ చివరి వరకు అజేయంగా నిలిచి జట్టుకు భారీ స్కోరు అందించాడు. సెంచరీ అనంతరం అభివాదం చేస్తున్న సమయంలో తిలక్ తన హావభావాలతో సారథికి ధన్యవాదాలు తెలుపుకున్నాడు. 'సూర్యకుమార్ వల్లే అది సాధ్యమైంది. అతడు మూడో స్థానంలో ఆడే అవకాశం ఇవ్వడంతోనే స్వేచ్ఛగా ఆడాను. గత రెండు మ్యాచ్‌ల్లో నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేశా. నాకు స్వతహాగా వన్‌డౌన్‌లో బ్యాటింగ్ ఇష్టం. అదే సూర్యకు చెప్పా. మ్యాచ్‌కు ముందు రోజు రాత్రే అతడు దానికి అంగీకారం తెలిపాడు. ఈ అవకాశం ఇచ్చినందుకు మైదానంలో నేనేంటో నిరూపించుకుంటా అని ముందే చెప్పాను. విఫలమైన సమయంలోనూ టీమ్ మేనేజ్‌మెంట్ అండగా నిలిచింది. సహజసిద్ధమైన ఆట ఆడేవిధంగా ప్రోత్సహించింది. కెప్టెన్, తాత్కాలిక కోచ్ వీవీఎస్ లక్ష్మణ్ పూర్తి స్వేచ్ఛనిచ్చారు. వికెట్ పడ్డా వెనకడుగు వేయవద్దని సూచించారు' అని తిలక్ చెప్పుకొచ్చాడు. నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగిన మూడో టి20లో భారత్ 11 పరుగుల తేడాతో విజయం సాధించగా... తిలక్ వర్మ 56 బంతుల్లోనే అజేయంగా 107 పరుగులు చేసి అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి శతకం తన పేరిట లిఖించుకున్నాడు. అందులో 7 సిక్సర్లు, 8 ఫోర్లు ఉన్నాయి. గాయాల కారణంగా కొన్నాళ్ల పాటు జట్టుకు దూరమైన తిలక్ వచ్చిన అవకాశాన్ని ఒడిసి పట్టుకోవడమే తన పని అని వివరించాడు. ఆల్‌రౌండర్‌గా జట్టుకు సేవలందించేందుకు ఎప్పుడూ ముందుంటానని వెల్లడించాడు.

షమీకి 4 వికెట్లు

ఇండోర్: గాయం నుంచి కోలుకొని తిరిగి మైదానంలో అడుగుపెట్టిన టీమిండియా సీనియర్ పేసర్ మొహమ్మద్ షమీ నాలుగు వికెట్లతో సత్తా చాటాడు. రంజీ ట్రోఫీలో భాగంగా బెంగాల్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న షమీ... మధ్యప్రదేశ్‌తో మ్యాచ్‌లో తన పేస్‌తో విజృంభించాడు. ఓవర్‌నైట్ స్కోరు 103/1తో గురువారం రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన మధ్యప్రదేశ్ జట్టును షమీ హడలెత్తించాడు. దాదాపు ఏడాది విరామం అనంతరం పోటీ క్రికెట్ ఆడిన షమీ... తొలి రోజు 10 ఓవర్లు వేసి వికెట్ పడగొట్టలేకపోయినా... రెండో రోజు 9 ఓవర్లు వేసి 4 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. షమీ ధాటికి మధ్యప్రదేశ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 59 ఓవర్లలో 167 పరుగులకు ఆలౌటైంది. సుభ్రాన్షు సేనాపతి (47; 6 ఫోర్లు), రజత్ పాటిదార్ (41; 8 ఫోర్లు) మినహా మిగిలిన వాళ్లు విఫలమయ్యారు. షమీ సోదరుడు మొహమ్మద్ కైఫ్ 2 వికెట్లు పడగొట్టాడు. అనంతరం రెండోఇన్నింగ్స్ ప్రారంభించిన బెంగాల్... గురువారం ఆట ముగిసే సమయానికి 48 ఓవర్లలో 5 వికెట్లకు 170 పరుగులు చేసింది. సుదీప్ కుమార్ (40), సుదీప్ ఛటర్జీ (40), వృతిక్ ఛటర్జీ (33 బ్యాటింగ్) రాణించారు. మధ్యప్రదేశ్ బౌలర్లలో అనుభవ్ అగర్వాల్ 3 వికెట్లు పడగొట్టాడు. చేతిలో 5 వికెట్లు ఉన్న బెంగాల్ జట్టు ఓవరాల్‌గా 231 పరుగుల ఆధిక్యంలో ఉంది.



క్వార్టర్ ఫైనల్లో అనిరుధ్ జోడీ ఓటమి



సాక్షి, హైదరాబాద్: హైగో నోవా చాలెంజర్ ఏటీపీ-100 టెన్నిస్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ పోరాటం ముగిసింది. జపాన్‌లోని కూబె నగరంలో ఈ టోర్నీ జరుగుతోంది. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో అనిరుధ్-నిక్కీ కలియంద పునాచా (భారత్) ద్వయం 1-6, 6-3, 5-10తో 'సూపర్ టైబ్రేక్'లో షింజి హజావా-మసామిచి ఇమాముర (జపాన్) జోడీ చేతిలో పోరాడి ఓడిపోయింది. 67 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అనిరుధ్-నిక్కీ నాలుగు ఏస్‌లు సంధించి, ఏకంగా ఏడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తమ సర్వీస్‌ను రెండు సార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేసింది. క్వార్టర్ ఫైనల్లో ఓడిన అనిరుధ్-నిక్కీ జోడీకి 1570 డాలర్ల (రూ.1 లక్షా 32 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 20 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

మ్యాక్స్‌వెల్ మెరుపులు

- 19 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లతో 43
- 7 ఓవర్లకు కుదించిన తొలి టి20లో పాకిస్తాన్‌పై ఆస్ట్రేలియా విజయం


మ్యాక్స్‌వెల్

బ్రిస్బేన్: పాకిస్తాన్ చేతిలో వన్డే సిరీస్ కోల్పోయిన ఆస్ట్రేలియా జట్టు... టి20ల్లో మాత్రం శుభారంభం చేసింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం జరిగిన తొలి టి20లో ఆసీస్ 29 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది. వర్షం, వెలుతురు లేమి కారణంగా నిర్ణీత సమయం కంటే మూడు గంటలు ఆలస్యంగా ప్రారంభమైన తొలి టి20ని చివరకు 7 ఓవర్లకు కుదించారు. మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 7 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 93 పరుగులు చేసింది. ఆల్‌రౌండర్ మ్యాక్స్‌వెల్ (19 బంతుల్లో 43; 5 ఫోర్లు, 3 సిక్సర్లు), స్టొయినిస్ (7 బంతుల్లో 21 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) మెరిపించారు. పాకిస్తాన్ బౌలర్లలో అబ్బాస్ అఫ్రిది రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో పాకిస్తాన్ 7 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 64 పరుగులకు పరిమితమైంది. అబ్బాస్ అఫ్రిది (20 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్. కెప్టెన్ రిజ్వాన్ (0), ఫర్హాన్ (8), బాబర్ ఆజమ్ (3), ఉస్మాన్ (4), సల్మాన్ (4), ఇర్ఫాన్ (0) ఒకరి తర్వాత ఒకరు పెవిలియన్‌కు చేరారు. ఆసీస్ బౌలరలలో బార్ట్‌లెట్, ఎలీస్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. మ్యాక్స్‌వెల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య శనివారం రెండో టి20 జరగనుంది.



అభయ్ సంచలనం

కౌలాలంపూర్: ఏస్ మలేసియా స్క్వాష్ కప్ అంతర్జాతీయ టోర్నమెంట్‌లో భారత స్టార్ అభయ్ సింగ్ సంచలనం సృష్టించాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ప్రపంచ 58వ ర్యాంకర్ అభయ్ సింగ్ 11-8, 7-11, 11-5, 8-11, 11-5తో నాలుగో సీడ్, ప్రపంచ 27వ ర్యాంకర్ అబ్దుల్లా అల్ తమీమి (ఖతర్)ను బోల్తా కొట్టించి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. భారత్‌కే చెందిన రమిత్ టాండన్, వెలవన్ సెంథిల్ కుమార్ కూడా క్వార్టర్ ఫైనల్లోకి చేరుకున్నారు.


124

ఆస్ట్రేలియాతో తొలి టి20 మ్యాచ్ బాబర్ ఆజమ్‌కు 124వ టి20 మ్యాచ్. తద్వారా పాక్ తరఫున అత్యధిక అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్‌గా బాబర్ ఆజమ్ గుర్తింపు పొందాడు. 123 మ్యాచ్‌లతో షోయబ్ మాలిక్ పేరిట ఉన్న రికార్డును బాబర్ ఆజమ్ బద్దలు కొట్టాడు.

'శత'క్కొట్టిన కుశాల్, అవిష్క



అవిష్క



కుశాల్

న్యూజిలాండ్‌పై శ్రీలంక ఘనవిజయం

దంబుల్లా: సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో శ్రీలంక ఘనవిజయం సాధించింది. వర్షం అంతరాయం మధ్య సాగిన పోరులో శ్రీలంక 45 పరుగుల తేడాతో (డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో) న్యూజిలాండ్‌ను చిత్తు చేసింది. మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక 49.2 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 324 పరుగులు చేసింది. వికెట్ కీపర్ కుశాల్ మెండిస్ (128 బంతుల్లో 143; 17 ఫోర్లు, 2 సిక్సర్లు), అవిష్క ఫెర్నాండో (115 బంతుల్లో 100; 9 ఫోర్లు, 2 సిక్సర్లు) సెంచరీలతో కదం తొక్కారు. మెండిస్‌కు వన్డేల్లో ఇదే అత్యధిక వ్యక్తిగత స్కోరు కాగా... ఫెర్నాండోతో కలిసి అతడు రెండో వికెట్‌కు 206 పరుగులు జోడించాడు. వన్డేల్లో రెండో వికెట్‌కు శ్రీలంక తరఫునే ఇదే అత్యుత్తమ భాగస్వామ్యం. కెప్టెన్ అసలంక (28 బంతుల్లో 40; 3 ఫోర్లు, 2 సిక్సర్లు) వేగంగా ఆడటంతో లంక భారీ స్కోరు చేయగలిగింది. న్యూజిలాండ్ బౌలర్లలో జాకబ్ డఫీ 3 వికెట్లు పడగొట్టాడు. మరో నాలుగు బంతుల్లో శ్రీలంక ఇన్నింగ్స్ ముగుస్తుందనగా... భారీ వర్షం కారణంగా ఆటకు అంతరాయం ఏర్పడింది. అనంతరం డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం న్యూజిలాండ్ లక్ష్యాన్ని 27 ఓవర్లలో 221 పరుగులుగా నిర్ణయించారు. టి20 తరహా ఛేదనకు దిగిన న్యూజిలాండ్ చివరకు 27 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 175 పరుగులకే పరిమితమైంది. ఓపెనర్లు విల్ యంగ్ (48; 8 ఫోర్లు), టిమ్ రాబిన్‌సన్ (35; 4 ఫోర్లు) మెరిపించారు. ఒకదశలో 88/0తో పటిష్టంగా కనిపించిన న్యూజిలాండ్ ఆ తర్వాత 22 పరుగుల వ్యవధిలో 5 వికెట్లు కోల్పోయి 110/5తో ఓటమికి చేరువైంది. శ్రీలంక బౌలర్లలో మధుషంక 3, తీక్షణ రెండు వికెట్లు పడగొట్టారు. కుశాల్ మెండిస్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య పల్లెకెలెలో ఆదివారం రెండో వన్డే జరగనుంది.

● వైట్‌హౌస్‌పై

మెలానియా విముఖత



పూర్తిస్థాయిలో ఉండేందుకు అయిష్టత

- సంప్రదాయాన్ని బ్రేక్ చేయనున్న ఫస్ట్ లేడీ
- ప్రథమ మహిళ బాధ్యతలు నిర్వహిస్తూనే స్వతంత్రంగా ఉండాలని నిర్ణయం!

వాషింగ్టన్: ప్రథమ మహిళగా రెండోసారి బాధ్యతలు స్వీకరించనున్న మెలానియా ట్రంప్.. శ్వేతసౌధంపై మాత్రం విముఖత చూపుతున్నారు. ఈ దఫా ఆమె పూర్తిస్థాయిలో వాషింగ్టన్‌కు షిఫ్ట్ అయ్యే అవకాశం లేదని విశ్వసనీయ వర్గాల సమాచారం. వైట్‌హౌస్ సంప్రదాయాన్ని ఉల్లంఘించడానికే ఆమె సుముఖత వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆమె తన సమయాన్ని ఎక్కడ? ఎలా? గడుపుతారనే చర్చ నడుస్తోంది.

అధ్యక్షుడిగా ఎన్నికైన వారికి ఆతిథ్యం ఇచ్చే సంప్రదాయం వైట్‌హౌస్‌లో ఉంది. జనవరిలో అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించనున్న డోనాల్డ్ ట్రంప్‌ను జో బైడెన్ సైతం ఆహ్వానించారు. ఆ మేరకు ట్రంప్ హాజరయ్యారు. అయితే ప్రథమ మహిళ.. కాబోయే మహిళకు ఇచ్చే విందుకు మాత్రం మెలానియా ట్రంప్ వెళ్లలేదు. జిల్ బైడెన్ ఆహ్వానాన్ని ఆమె తిరస్కరించారు. ఆమె వెళ్ళడం అవసరమని ట్రంప్ బృందంలోని పలువురు సూచించినా మెలానియా నిరాకరించారు. మొదటి పర్యాయంలో పూర్తిస్థాయి వైట్‌హౌస్‌లోనే ఉన్న ఆమె.. ఈసారి మాత్రం స్వతంత్రంగా ఉండటానికే ఆసక్తి చూపుతున్నారనడానికి ఇదో ఉదాహరణ. 2016లో వైట్‌హౌస్ మెలానియాకు కొత్త... కానీ 'ఈసారి నాకు ఆందోళన అవసరం లేదు. అనుభవం, పరిజ్ఞానం ఉన్నాయి. లోపల ఏం జరుగుతుందనేది స్పష్టత ఉంది'అని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో సైతం ఆమె చెప్పారు.

కొడుకుకు దగ్గరగా...

మెలానియా ట్రంప్.. వచ్చే నాలుగేళ్లలో ఆమె న్యూయార్క్ సిటీ, ఫ్లోరిడాలోని పామ్‌బీచ్‌లలో గడపనున్నారని సమాచారం. అయినప్పటికీ ఆమె ప్రధాన కార్యక్రమాలకు హాజరవుతారని, ప్రథమ మహిళగా తనకంటూ సొంత వేదిక, ప్రాధాన్యతలు ఉంటాయని చెబుతున్నారు. 2020 తరువాత మెలానియా ట్రంప్ ఫ్లోరిడాలో ఎక్కువ సమయం గడిపారు. అక్కడే జీవితాన్ని, స్నేహితులను పెంచుకున్నారు. అందుకే ఆమె ఎక్కువ సమయం అక్కడే గడిపే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. 2016లో కూడా ఆమె వాషింగ్టన్‌కు వెంటనే వెళ్లలేదు. ప్రమాణ స్వీకారం జరిగిన కొన్ని నెలల తరువాత వైట్‌హౌస్‌కు మారారు. మరోవైపు తన కొడుకు 18 ఏళ్ల బారన్ ట్రంప్ న్యూయార్క్ యూనివర్సిటీలో చదువుతున్నారు. తన ఇంట్లోనే ఉంటూ చదువుకోవాలన్నది బారన్ కోరిక. టీనేజ్ కొడుకుకు దగ్గరగా ఉండేందుకు ప్రథమ మహిళ ఆసక్తి చూపుతున్నారని, న్యూయార్క్‌లోనూ ఎక్కువ సమయం గడుపుతారని సన్నిహితులు చెబుతున్నారు. ఒక ప్రథమ మహిళ శ్వేతసౌధంలో ఉండటానికి నిరాకరించడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. కానీ.. మెలానియా ట్రంప్‌ను చాలాకాలంగా గమనిస్తున్నవారికి ఇది ఆశ్చర్యం కలిగించడం లేదు. 2024 ఎన్నికల ప్రచారంలోనూ ఆమె చురుకుగా లేరు. ట్రంప్ తిరిగి పోటీ చేస్తానన్న ప్రకటనకు హాజరయ్యారు. అక్టోబర్ మాడిసన్ స్క్వేర్ గార్డెన్ ర్యాలీలోనూ పొడిపొడిగానే మాట్లాడారు. ఎన్నికల రాత్రి పార్టీలోనూ ఆమె పాల్గొనలేదు.

ప్రైవసీకే ప్రాధాన్యత..

పదవి నుంచి వైదొలిగిన తర్వాత డోనాల్డ్ ట్రంప్ పలు న్యాయపరమైన ఇబ్బందులను ఎదుర్కోవడంతో పామ్ బీచ్, న్యూయార్క్‌ల మధ్య తన సమయాన్ని గడిపారు. కుటుంబంలోని ఇతర సభ్యులు తరచూ కోర్టులో, ఎన్నికల ప్రచారంలో ట్రంప్‌తో కలిసి ఉన్నప్పటికీ, మెలానియా ట్రంప్ ప్రజా జీవితానికి దూరంగా ఉన్నారు. లారా బుష్, మిషెల్ ఒబామా వంటి ప్రథమ మహిళలు నాలుగేళ్లలో తమకో ప్లాట్‌ఫామ్ నిర్మించుకున్నట్టుగా మెలానియా ట్రంప్ చేయలేదు. ప్రైవసీని కోరుకున్నారు. రిపబ్లికన్ల రాజకీయ నిధుల సేకరణలో ఒక్కసారి పాల్గొని అందరినీ ఆశ్చర్యపరిచారు. జూలైలో డోనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నం జరిగిన కొన్ని గంటల్లోనే ట్రంప్ అమెరికా ప్రజలనుద్దేశించి ఓ లేఖ రాశారు. 'హింసను ప్రేరేపించే ద్వేషం, విద్వేషాలకు అతీతంగా ఉండండి. కుటుంబమే ప్రథమం. ప్రేమమయమైన ప్రపంచాన్ని మనమందరం కోరుకుందాం'అని ఆ లేఖలో పేర్కొన్నారు. ఇక అబార్షన్ హక్కుల విషయంలో భర్త ట్రంప్‌తో విభేదించారు. గత అక్టోబర్‌లో.. 'వ్యక్తిగత స్వేచ్ఛ అనేది నేను పరిరక్షించే ప్రాథమిక సూత్రం. నిస్సందేహంగా, మహిళలందరికీ పుట్టుకతోనే ఉన్న ఈ ముఖ్యమైన హక్కు విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు'అని ఎక్స్‌లో పోస్ట్ చేసిన వీడియోలో ఆమె పేర్కొన్నారు. ఈ అంశంపై తన వైఖరి భర్త డోనాల్డ్ ట్రంప్‌కు తెలుసని, ఆయన ఏమాత్రం ఆశ్చర్యపోలేదని ఆ తరువాత మీడియాతో చెప్పారు. మెలానియా ట్రంప్ తన భర్తతో రాజకీయంగా చాలా సన్నిహితంగా ఉంటున్నారని, సంప్రదాయ దృక్పథంతో సమస్యలపై మాట్లాడుతున్నారని సన్నిహిత వర్గాలు చెబుతున్నా.. ఆచరణ మాత్రం అందుకు భిన్నంగానే ఉంది.

దమ్ముంటే నిరూపించండి

కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు విజయేంద్ర సవాలు

సాక్షి బెంగళూరు: తమ ప్రభుత్వాన్ని **కూల్చడానికి బీజేపీ** ప్రయత్నించిందని, ఒక్కో కాంగ్రెస్ **ఎమ్మెల్యేకు రూ.50** కోట్ల చొప్పున ఇవ్వజూపిందని, 50 **మంది ఎమ్మెల్యే**లను కొనడానికి కుట్రలు చేసింద**ని కర్ణాటక** ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆరో**పించడం** సంచలనాత్మకంగా మారింది. సిద్ధరా**మయ్య** ఆరోపణలపై కర్ణాటక బీజేపీ అధ్యక్షుడు బి.వై.విజయేంద్ర తీవ్రంగా **స్పం**దించారు. దమ్ముంటే నిరూపించాలని గురువారం సిద్ధరామయ్య**కు** సవాలు విసిరారు. ముఖ్యమంత్రి సొంత పార్టీ ఎమ్మెల్యేల విశ్వాస**ం** కోల్పోయారని, అందుకే తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఒక్కో ఎమ్మెల్యేకు రూ.50 కోట్ల చొప్పున ఇవ్వడానికి తాము ప్రయత్నించినట్లు నిరూపించకపోతే ప్రజలు ఎప్పటికీ ఆయనను నమ్మరని తేల్చిచెప్పారు. ఉన్నత పదవిలో ఉన్న నాయకుడి ప్రవర్తన కూడా ఉన్నతంగా ఉండాలని హితవు పలికారు. దర్యాప్తు సంస్థలు ముఖ్యమంత్రి చేతిలోనే ఉన్నాయని, ఆరోపణలను ఎందుకు నిరూపించడం లేదని ప్రశ్నించారు. అయితే, విజయేంద్ర సవాలుపై స్పందించడానికి సిద్ధరామయ్య నిరాకరించారు. మరోవైపు బీజేపీపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేసిన ఆరోపణలను ఉప ముఖ్యమంత్రి, కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు డి.కె.శివకుమార్ సమర్థించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి బీజేపీ ప్రయత్నించిన సంగతి నిజమేనని గురువారం చెప్పారు. పలువురు మంత్రులు సైతం సిద్ధరామయ్యకు మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ఎమ్మెల్యేల కొనుగోలుకు బీజేపీ యత్నించిందని వారు పేర్కొన్నారు.

ఇజ్రాయెల్ దాడిలో 15 మంది సిరియన్లు మృతి

దమాస్కస్: సిరియాపై ఇజ్రాయెల్ జరిపిన రెండు వైమానిక దాడుల్లో **15 మంది** సిరియన్లు మరణించారని అధికారిక వార్త సంస్థ 'సనా'గురువారం **వెల్లడించింది.** రాజధాని డమాస్కస్ శివారు ప్రాంతం, డమాస్కస్‌కు పశ్చిమాన **ఉన్న ప్రాంతాలపై** ఇజ్రాయెల్ దాడులు చేసినట్లు తెలిపింది. ఈ దాడుల్లో మొత్తం 15 మం**ది మరణించగా.. 16** మంది క్షతగాత్రులయ్యారని తెలిపింది. పాలస్తీనా ఇస్లామిక్ జిహాదీ గ్ర**ూపు కార్యాలయం లక్ష్యం**గా తొలి దాడి జరిగినట్లు సనా వివరించింది. మజేహ్‌లో ఐదంస్తుతల **భవనం బేస్‌మెంట్‌పై దాడి జరి**గినట్లు అసోసియేటెడ్ ప్రెస్ జర్నలిస్టు తెలిపారు. దాడిలో ఈ భవనం **ధ్వంసమైనట్లు చెప్పారు. మజేహ్‌లో** తన కార్యాలయంపై దాడి జరిగినట్లు పాలస్తీనా ఇస్లామిక్ జిహాదీ గ్ర**ూపు కూడా ధ్రువీకరించింది. తమ సభ్యులు** పలువురు మరణించినట్లు తెలిపింది.

రొమ్ము క్యాన్సర్‌కు అరుదైన చికిత్స

తనపై తానే ప్రయోగం చేసుకున్న శాస్త్రవేత్త ● నాలుగేళ్లుగా కేన్సర్ రహితంగా 50 ఏళ్ల హలాస్సీ



కేన్సర్.. ఒకప్పుడు పేరు వినడానికే భయపడిన మహమ్మారి.. ఇప్పుడు ఎక్కువ మందికి వ్యాపిస్తోంది. అధైర్యపడకుండా చికిత్సతో దాన్ని జయిస్తున్నవారు కొందరైతే.. కారణాలేవైనా ఇంకొందరు ప్రాణాలు పోతున్నాయి. వ్యాధి భయం కంటే.. చికిత్సలో భాగంగా చేసే కీమోథెరపీ చూపించే నరకం అధికం. అలాంటివేవీ లేకుంటా కేన్సర్‌ను జయించారో శాస్త్రవేత్త. తనకు వచ్చిన రొమ్ము క్యాన్సర్‌కు తానే చికిత్స చేసుకుని చరిత్రలో నిలిచారు. అయితే దీనిపై కొందరు శాస్త్రవేత్తలు విభేదిస్తున్నారు. ఇది అన్ని దశల్లోనూ ఉపయోగించలేమంటున్నారు.

క్రొయేషియాకు చెందిన 50 ఏళ్ల బీటా హలాస్సీ శాస్త్రవేత్త. జాగ్రెబ్ విశ్వవిద్యాలయంలో వైరాలజిస్ట్‌గా పనిచేస్తున్నారు. గతంలోనే కేన్సర్ డిటెక్ట్ అవ్వడంతో మాస్టెక్టమీ చేయించుకున్నారు. 2020లో మళ్లీ పునరావృతమైంది. ఈసారి మూడో స్టేజీ. సాధారణంగా హడలెత్తిపోతాం. కానీ ఆమె అలా కాదు. ధైర్యంగా ఎదుర్కొంది. కాకపోతే.. మొదటి సారి కీమోథెరపీతోనే విసిగిపోయిన ఆమె.. ఈసారి అటువైపు మొగ్గు చూపలేదు. తనకు తానే చికిత్స చేసుకోవాలనుకున్నారు. వైరాలజిస్ట్ కూడా కావడంతో.. యాంటీవైరస్ వేక్సిన్స్‌తోనే ప్రయోగం చేశారు. మీజిల్స్ వైరస్, ఫ్లూ లాంటి వ్యాధులకు ఇచ్చే వేక్సిన్స్‌ను కలిపి.. తన ప్రయోగశాలలోనే కొత్త వైరస్‌ను సృష్టించారు. దాన్ని ఇంజెక్ట్ చేసి చికిత్స చేసుకోవడం ప్రారంభించారు. ఇది కణితిపై నేరుగా దాడి చేసిన రోగనిరోధక వ్యవస్థను పెంచే శక్తివంతమైనన వైరస్‌గా పని చేసింది. హలాస్సీ నాలుగు సంవత్సరాలుగా కేన్సర్ రహితంగా ఉంది.

స్టేజ్ 3లో చికిత్స..

ఆంకోలిటిక్ వైరోథెరపీ (ఓవీటీ)గా పిలిచే ఈ ప్రయోగాత్మక వేక్సిన్ ఆమె స్టేజ్ 3 కేన్సర్ చికిత్సకు సహాయపడింది. ఓవీటీ.. క్యాన్సర్ చికిత్స కోసం అభివృద్ధి చెందుతున్న విధానం. ఇది క్యాన్సర్ కణాలపై దాడి చేయడానికి, వాటితో పోరాడటానికి రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడానికి తోడ్పడుతుంది. ఓవీటీ క్లినికల్ ట్రయల్స్ లాస్ట్‌స్టేజ్‌లో ఉన్న మెటాస్టాటిక్ క్యాన్సర్‌పై ప్రయోగించారు. కొన్నేళ్లుగా శాస్త్రవేత్తలు ప్రారంభ దశ కేన్సర్లకు కూడా దీన్ని సూచిస్తున్నారు. కణితి కణానికి మీజిల్స్ వైరస్, వెసిక్యులర్ స్టోమాటిటిస్ వైరస్ ఉన్నట్టుగా గుర్తించిన హలాస్సీ.. రెండు వైరస్‌లను సరైన మోతాదులో మిళితం చేసి, తనకు తాను చికిత్స చేసుకోవడానికి ఉపయోగించుకున్నారు. ఇప్పటివరకు ఈ రెండు వ్యాధికారక క్రిములను ఓవీటీ క్లినికల్ ట్రయల్స్‌లో ఉపయోగించారు. మీజిల్స్ వైరస్ మెటాస్టాటిక్ రొమ్ము కేన్సర్స్ చికిత్సలో ఉపయోగిస్తారు.

భిన్న వాదనలు..

కేన్సర్ చికిత్సకు.. శస్త్రచికిత్స, కెమోథెరపీ, బయోలాజికల్ థెరపీ, రేడియేషన్ వంటి ప్రస్తుత విధానాలకు బదులుగా ఓవిటిని ఉపయోగించాలని హలాస్సీ సూచిస్తున్నారు. దీనిని కొందరు వైద్య పరిశోధకులు విభేదిస్తున్నారు. ఆంకోలిటిక్ వైరస్‌లతో స్వీయ వైద్యం రోగ నిర్ధారణ చేసిన కేన్సర్‌ను ఎదుర్కోవడానికి సరైన విధానం కాదంటున్నారు. కానీ ప్రారంభ దశలో ఓవీటీని నియోఅడ్జువెంట్ థెరపీగా క్లినికల్ ట్రయల్స్ జరపాలని సూచిస్తున్నారు.

జాతీయ విపత్తుగా ప్రకటించలేం

వయనాడ్ విలయంపై కేంద్రం స్పష్టీకరణ

న్యూఢిల్లీ: కేరళలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన విలయాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించలేమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ఏడాది జూలైలో వయనాడ్ కొండచరియలు విరిగిపడి 200 మంది పైచిలుకు దుర్మరణం పాలుకాగా, వందలాది ఇళ్లు నేలమట్టమైన విషయం తెలిసిందే. దీనిని జాతీయ విపత్తుగా ప్రకటించాలని, ఇక్కడి ప్రజల పునరావాసానికి నిధులు కేటాయించాలని కేరళ డిమాండ్ చేస్తోంది. రూ. 2,000 కోట్లను వయనాడ్ సహాయక చర్యలకు కేటాయించాలని కోరింది. రాష్ట్ర విపత్తు నిర్వహణ నిధి (ఎస్‌డీఆర్‌ఎఫ్), జాతీయ విపత్తు స్పందన నిధి (ఎన్‌డీఆర్‌ఎఫ్)ల కింద వయనాడ్ విలయాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించలేమని హోంశాఖ సహాయమంత్రి నిత్యానంద్ రాయ్ ఈనెల 10న కేరళకు రాసిన లేఖలో స్పష్టం చేశారు. వయనాడ్‌లో ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని కేరళ ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోదీని ఆగస్టులో రాతపూర్వకంగా కోరింది. దీనికి బదులిస్తూ.. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 388 కోట్లను ఎస్‌డీఆర్‌ఎఫ్ కింద కేటాయించారని, ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.291 కోట్లను ముందస్తుగా చెల్లించడం జరిగిందని రాయ్ గుర్తుచేశారు. ప్రస్తుతం ఎస్‌డీఆర్‌ఎఫ్ కింద రూ. 395 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయని కేరళ అకౌంటంట్ జనరల్ తెలిపారని, విపత్తు నిర్వహణకు ఈ నిధులు సరిపోతాయని మంత్రి నిత్యానంద రాయ్ లేఖలో పేర్కొన్నారు. వయనాడ్ బాధితులకు ఊరటను కలిగించాల్సింది పోయి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజకీయాలు చేస్తోందని వయనాడ్ కాంగ్రెస్ అభ్యర్థి ప్రియాంకా గాంధీ విమర్శించారు. మోదీ స్వయంగా వయనాడ్ ప్రభావిత ప్రాంతాలను సందర్శించినా.. కేంద్రం బాధితులకు మొండి చేయి చూపిందని ధ్వజమెత్తారు.

జార్ఖండ్‌ను విభజించడానికి బీజేపీ కుట్రలు

ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఆగ్రహం

రాంచీ: జార్ఖండ్‌ను విభజించడానికి బీజేపీ కుట్రలు పన్నుతోందని రాష్ట్ర ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ కుట్రలను సాగనివ్వబోమని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని తెలిపారు. ఈ మేరకు సోరెన్ గురువారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. తమ రాష్ట్రంలో మకాం వేసిన బీజేపీ పెద్దలు అభివృద్ధి గురించి, శాంతి గురించి ఒక్క మాట కూడా మాట్లాడడం లేదని ధ్వజమెత్తారు. మతం పేరిట ప్రజలను విభజించి, రాజకీయంగా లబ్ధి పొందాలన్నదే వారి ప్రయత్నమని విమర్శించారు. జార్ఖండ్ నుంచి సంథాల్ పరగణాలను విడదీయాలని బీజేపీ భావిస్తోందని చెప్పారు. జార్ఖండ్‌ను ముక్కలు చేయాలని చూస్తే ప్రజలు ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోరని హెచ్చరించారు. బీజేపీకి ఎలా గుణపాఠం నేర్పాలో వారికి బాగా తెలుసని పేర్కొన్నారు. రావణుడి అహంకారాన్ని శ్రీరాముడు అణచివేసినట్లుగా బీజేపీ అహంకారాన్ని జార్ఖండ్ ప్రజలు అణచివేస్తారని హేమంత్ సోరెన్ స్పష్టంచేశారు. సంథాల్ పరగణాలు ఎప్పటికీ జార్ఖండ్ రాష్ట్రంలో అంతర్భాగంగా కొనసాగుతాయని తేల్చిచెప్పారు.

మణిపూర్‌లోని ఆరు పోలీసుస్టేషన్ల పరిధిలో సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం

న్యూఢిల్లీ: వివాదాస్పద సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని (ఏఎఫ్‌ఎస్‌పీఏ)ను మణిపూర్‌లోని ఆరు పోలీసుస్టేషన్‌ల పరిధిలో కేంద్ర ప్రభుత్వం గురువారం పునరుద్ధరించింది. హింస చెలరేగిన జిరిబమ్ పోలీసుస్టేషన్ కూడా ఇందులో ఉంది. ఏఎఫ్‌ఎస్‌పీఏ చట్టం కింద కల్లోలిత ప్రాంతంగా ప్రకటిస్తే.. సాయుధ బలగాలను విశేష అధికారాలు దఖలు పడతాయి. శాంతిభద్రతలను కాపాడటానికి ఎలాంటి వారెంటు లేకుండా సోదాలు, అరెస్టులు చేయడం, అవసరమనుకుంటే కాల్పులు జరిపే అధికారం కూడా సాయుధ బలగాలకు దఖలు పడుతుంది. గిరిజన తెగల మధ్య నిరంతరం కొనసాగుతున్న హింస మూలంగా ప్రత్యేక అధికారాల చట్టాన్ని విధించాల్సి వచ్చిందని కేంద్ర హోంశాఖ గురువారం తెలిపింది. అక్టోబరు ఒకటిన 19 పోలీసుస్టేషన్లు మినహా మణిపూర్ మొత్తానికి ఎఎఫ్‌ఎస్‌పీఏ కిందకు తెచ్చారు. తాజాగా ఈ 19 పోలీసుస్టేషన్‌లలో ఆరింటిని సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం కిందకు తెచ్చారు.



ప్రపంచంలో అతిపెద్ద పగడం

పసిఫిక్ మహాసముద్రంలో గుర్తించిన సైంటిస్టులు

ఏకంగా 100 అడుగులకు పైగా పొడవైన పగడాన్ని(కోరల్)ను నైరుతి పసిఫిక్ మహాసముద్రంలో సైంటిస్టులు గుర్తించారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద పగడం అని చెబుతున్నారు. 300 ఏళ్ల క్రితం ఏర్పడిన ఈ పగడం అంతరిక్షం నుంచి కూడా కనిపిస్తుందని అంటున్నారు. నేషనల్ జియోగ్రాఫిక్ ప్రిస్టిన్ సీస్ ప్రోగ్రామ్‌లో భాగంగా గత నెలలో సోలోమాన్ దీవుల్లో సముద్ర స్థితిగతులను అధ్యయనం చేయడానికి బయలుదేరిన సైంటిస్టులకు ఈ పగడం కనిపించింది. గతంలో అమెరికాలో సమోవాలో గుర్తించిన భారీ పగడం కంటే ఇది మూడు రెట్లు పెద్దది కావడం విశేషం. అంతేకాదు భూమిపై అతిపెద్ద జంతువైన బ్లూవేల్ కంటే కూడా పొడవైనది. సాధారణంగా సముద్రాల అంతర్భాల్లో పగడపు దిబ్బలు ఏర్పడతాయి. ఈ దిబ్బల్లో చిన్నచిన్న పగడాలు కనిపిస్తాయి. కానీ, నైరుతి పసిఫిక్ మహాసముద్రంలో తాజాగా గుర్తించి పగడం సింగిల్ కోరల్ కావడం గమనార్హం. కొన్ని శతాబ్దాలుగా దీని పరిమాణం పెరుగుతున్నట్లు గుర్తించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

23న హేమంత్ అండ్ కంపెనీకి వీడ్కోలే

- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టీకరణ
- జార్ఖండ్ నుంచి చొరబాటుదార్లను తరిమేస్తామని హామీ


దుమ్రీ: జార్ఖండ్‌లో ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ అండ్ కంపెనీకి ఈ నెల 23న బీజేపీ వీడ్కోలు పలకడం ఖాయమని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చెప్పారు. జార్ఖండ్‌లోకి అక్రమ చొరబాట్లను హేమంత్ ప్రభుత్వం ప్రోత్సహించిందని ఆరోపించారు. చొరబాటుదార్లు ఇక్కడి గిరిజనుల బిడ్డలను వివాహాలు చేసుకున్నారని, వారి భూములను ఆక్రమించుకున్నారని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి చొరబాటుదార్లను బయటకు తరిమికొడతామని, భూములను వెనక్కి తీసుకొని గిరిజనులకు అందజేస్తామని ప్రకటించారు. ఇందుకోసం ఒక చట్టం తీసుకొస్తామని హామీ ఇచ్చారు. గురువారం జార్ఖండ్‌లోని దుమ్రీలో ఎన్నికల ప్రచారంలో అమిత్ షా పాల్గొన్నారు. హేమంత్ సోరెన్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, ప్రజల సంక్షేమం కోసం ఖర్చు చేయాల్సిన నిధులను దోచుకుందని మండిపడ్డారు. జనం సొమ్మును కొట్టగొట్టిన హేమంత్ అండ్ కంపెనీకి వీడ్కోలు తప్పదని స్పష్టంచేశారు. జార్ఖండ్ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించిన కాంగ్రెస్, ఆర్జేడీ కూటమితో హేమంత్ సోరెన్ జట్టుకట్టారని విమర్శించారు. పరిశ్రమలు, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కావాలంటే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని అమిత్ షా కోరారు. జమ్మూకశ్మీర్‌లో ఇండియాలో అంతర్భాగమని, ఆర్టికల్ 370ని మళ్లీ తీసుకొచ్చే సత్తా ఎవరికీ లేదని తేల్చిచెప్పారు. ఓబీసీ రిజర్వేషన్లను ముస్లింలకు అప్పగించడానికి ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించబోమని, రాహుల్ బాబా నాలుగో తరం కూడా ఆ పని చేయలేదని అన్నారు.

చట్టంలో సవరణ తీసుకొస్తాం

రాహుల్ గాంధీని రాజకీయాల్లో ప్రవేశపెట్టేందుకు ఆయన మాతృమూర్తి సోనియా గాంధీ ఇప్పటిదాకా 20 సార్లు ప్రయత్నించారని అమిత్ షా చెప్పారు. ఆ ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయని, రాహుల్ గాంధీ విమానం ల్యాండ్ కాలేదని అన్నారు. 21వ ప్రయత్నంలో జార్ఖండ్‌లో రాహుల్ గాంధీ విమానం కుప్పకూలడం తథ్యమని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలనలోని కర్ణాటకలో వక్ఫ్ బోర్డు హిందూ ప్రాచీన దేవాలయాల భూములను ఆక్రమించిందని ఆరోపించారు. వ్యవసాయ భూములను కూడా కబ్జా చేసిందని పేర్కొన్నారు. ఇలాంటి కబ్జాలను అడ్డుకోవడానికి చట్టంలో సవరణ చేస్తామని చెప్పారు. ఇదిలా ఉండగా, జార్ఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఈ నెల 23న జరుగనుంది.

దుష్ప్రభావాలు రాయడం కుదరదు

ప్రిస్క్రిప్షన్‌లో సైడ్‌ఎఫెక్ట్స్‌పై సుప్రీం స్పష్టీకరణ



న్యూఢిల్లీ: ఆయా ఔషధాల సైడ్‌ఎఫెక్ట్‌లనూ మందుల చీటీలో పేర్కొనేలా వైద్యులను ఆదేశించాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు తోసిపుచ్చింది. జాకబ్ వడక్కన్‌చెరీ అనే వ్యక్తి తరఫున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఈ పిటిషన్‌ను దాఖలుచేశారు. ''రోగులకు వైద్యులు సూచించిన ఔషధం గురించి, దాని సానుకూల ప్రభావంతోపాటు దుష్ప్రభావాలపైనా అవగాహన ఉండాలి. ఆ మేరకు వైద్యులు మందుల చీటీలో వాటిని తప్పకుండా ప్రస్తావించాలి'అంటూ జాకబ్ వేసిన పిటిషన్‌ను మే 15వ తేదీన ఢిల్లీ హైకోర్టు కొట్టేసింది. దీంతో తీర్పును సవాల్ చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును గురువారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల సుప్రీంకోర్టు ధర్మాసనం విచారించింది. ''ప్రతి చీటీపై ప్రతి ఒక్క మందు సైడ్‌ఎఫెక్ట్‌లను రాయడం ఆచరణలో సాధ్యంకాదు. ఒకవేళ రాస్తూపోతే వైద్యుడు ఒకరోజుకు పది, పదిహేను మందికి మించి చూడలేడు. చివరకు వినియోగదారుల పరిరక్షణ చట్టం కింద కేసులు నమోదయ్యే ఛాన్సుంది ''అని ధర్మాసనం అభిప్రాయపడింది. దీనిపై ప్రశాంత్ భూషణ్ వాదించారు. ''దుష్ప్రభావాలపై ముందే హెచ్చరిస్తే మంచిది. లేదంటే అవన్నీ వైద్యసేవల్లో నిర్లక్ష్యం లెక్కలోకి వెళ్తాయి. ముందుగా వైద్యులు తమ వద్ద ఉదాహరణలతో కూడిన నమూనా పత్రాన్ని ఉంచుకుంటే మంచిది'అని వాదించారు. ''అలా చేస్తే దాని విపరిణామాలు పెద్దవై చివరకు వైద్యులకు కన్స్యూమర్ ప్రొటెక్షన్ యాక్ట్ కష్టాలు పెరుగుతాయి. మేం అలా చేయలేం''అంటూ పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది.

యూపీ ప్రచారానికి అగ్రనేతలు అనుమానమే?

- యూపీలో 9 స్థానాల ఉప ఎన్నికల్లో ఎస్పీతో కలిసి కాంగ్రెస్ దిగ్గజాల ప్రచారంపై స్పష్టత కరువు
- వయనాడ్ ఎన్నికలు ముగిశాక రాహుల్, ప్రియాంక ప్రచారం ఉంటుందని భావించినా ఖరారు కాని షెడ్యూల్

సాక్షి, న్యూఢిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అగ్రనేతల ప్రచారంపై సందిగ్ధత నెలకొంది. వయనాడ్ ఉప ఎన్నికకు పోలింగ్ ఈ నెల 13న ముగిసిన నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలు యూపీలో ఈ నెల 20న 9 స్థానాలకు జరుగనున్న ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని భావించినా ఇంతవరకు పార్టీ తరఫున ఎలాంటి ప్రకటన వెలువడలేదు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా రాహుల్, ప్రియాంకలు మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉండటంతో వారు ప్రచారం చేయడం కష్టమేనని తెలుస్తోంది. నిజానికి యూపీలో జరగనున్న ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీ చేయాలని భావించింది. 9 స్థానాలకు గానూ కనీసంగా 4 స్థానాలకు తమకు వదిలేయాలని భాగస్వామ్య పార్టీ అయిన సమాజ్‌వాదీ పార్టీని కోరినప్పటికీ ఆ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ నుంచి సానుకూల స్పందన రాలేదు. చివరి 2 స్థానాలు ఇచ్చేందుకు ఎస్పీ అంగీకరించినా, గెలుపు అవకాశాలు లేకపోవడంతో వాటిల్లో పోటీకి కాంగ్రెస్ నిరాకరించింది. తొమ్మిది స్థానాల్లోనూ ఇండియా కూటమి తరఫున ఎస్పీ అభ్యర్థులే పోటీ చేస్తారని ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆయా స్థానాల్లో అఖిలేశ్ యాదవ్ దూకుడుగా ప్రచారం చేస్తున్నారు. అధికార బీజేపీని ఎండగట్టే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఆయనకు మద్దతుగా కాంగ్రెస్ అగ్రనేతలు మాత్రం ఇంతవరకు ప్రచారంలో పాల్గొనలేదు. రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు అజయ్‌రాయ్ సహా మాజీ ఎంపీ పీఎల్ పునియాలు ఎస్పీతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తున్నారు. ప్రచారం కోసం కాంగ్రెస్, ఎస్పీలు నియోజకవర్గాల వారీగా సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసి, సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర సీఎల్‌పీ నేత ఆరాధన మిశ్రా, కాంగ్రెస్ ఎంపీ తనూజ్ పునియాలు ఎస్పీతో కలిసి సంయుక్త ర్యాలీలు నిర్వహిస్తున్నా, అంతంతమాత్రం స్పందన వస్తోంది. ఈ నేపథ్యంలో అగ్రనేతలతో ఉమ్మడి ప్రచార ప్రణాళికను రూపొందించాలనే డిమాండ్‌లు వస్తున్నాయి. ఉమ్మడి ఎన్నికల ప్రచారాలు, బహిరంగ సభల కోసం సత్వరమే షెడ్యూల్ ఖరారు చేసి, అధికార బీజేపీ విభజన రాజకీయాలను బట్టబయలు చేసే కార్యాచరణ తీసుకోవాలని ఇరు పార్టీల నుంచి ఒత్తిళ్లు పెరుగుతున్నా.. అగ్రనేతల ప్రచారంపై ఇంతవరకు ఏఐసీసీ నుంచి ఎలాంటి అధికార ప్రకటన రాలేదు.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్‌కు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, గైడెన్స్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్ మొదలైన వాటి కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీకు కావాల్సిన సమాచారం తెలుసుకోండి.

సాక్షి ప్లస్
శుక్రవారం। 15-11-2024

కాకతీయుల సైనిక పాలన పేరేమిటి?

తెలుగు జాతి గౌరవాన్ని సుసంపన్నం చేసి, దాని కీర్తిని దశదిశలా వ్యాప్తి చేసిన కాకతీయ రాజుల సామ్రాజ్యం ముస్లిం రాజుల దాడివల్ల ధ్వంసమైంది. క్రీ.శ. 1323లో జరిగిన యుద్ధంలో కాకతీయుల చివరి రాజు రెండో ప్రతాపరుద్రుడు ఓటమి పాలై ఢిల్లీ సైన్యానికి పట్టుబడ్డాడు. ఇతడు అవమాన భారాన్ని తట్టుకోలేక ఆత్మ హత్య చేసుకోవడంతో ఓరుగల్లులో కాకతీయ సామ్రాజ్య సౌధం శాశ్వతంగా కుప్ప కూలిపోయింది. తెలుగునాట ముస్లిం సైనిక పాలనకు పునాది పడింది. వీరి పాలనలో విపత్కర పరిస్థితులను ఎదుర్కొన్న తెలుగు ప్రజలు స్వేచ్ఛ కోసం విముక్తి పోరాటానికి నడుం బిగించారు. 'ముసునూరి ప్రోలయ నాయకుడు' ఈ విమోచన ఉద్యమానికి నాయకత్వం వహించి ప్రజలను ముందుకు నడిపించాడు.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ చరిత్ర

కాకతీయుల అనంతర పరిస్థితులు

ఢిల్లీ సుల్తాన్ ఘియాజుద్దీన్ తుగ్లక్ (క్రీ.శ.1320–25) కుమారుడు జునాఖాన్ (మహ్మద్‌బిన్ తుగ్లక్). ఇతడినే ఉలుగ్‌ఖాన్ అని కూడా అంటారు. కాకతీయులపై విజయం (1323) సాధించిన జునాఖాన్ వారి రాజ్యాన్ని ఢిల్లీ సుల్తానత్‌లో కలిపాడు. ఇతడి నాయకత్వంలోని ఢిల్లీ సుల్తాన్ తురుష్క సైన్యం కాకతీయ రాజ్యానికి చెందిన ప్రజల సమస్త సంపదను దోచుకుంది. ఓరుగల్లు పేరును సుల్తాన్‌పూర్‌గా మార్చారు. కాకతీయులు నిర్మించిన అనేక కోటలు, దుర్గాలు, దేవాలయాలను నాశనం చేశారు. దోచుకున్న సంపదనంతా ఢిల్లీకి తరలించారు. తురుష్క సైన్యం తమ క్రూరమైన చర్యలతో తెలుగు ప్రజలను భయకంపితులను చేసింది. చాళుక్యులు, కాకతీయులు నిర్మించిన అనేక దేవాలయాలను కూలగొట్టి వాటి స్థానంలో మసీదులను నిర్మించారు. మత మార్పిడులకు పాల్పడ్డారు. ముసునూరి ప్రోలయ నాయకుడు కందరాడ గ్రామంలో (పిఠాపురం సమీపంలో) వేయించిన 'విలాసతామ్ర శాసనం', విజయనగర కంపరాయల భార్య గంగాదేవి రచించిన 'మధురా విజయం' (సంస్కృత కావ్యం), ప్రముఖ ముస్లిం చరిత్రకారుడు జియావుద్దీన్ బరౌనీ రచనల ద్వారా ఈ వివరాలు తెలుస్తున్నాయి. భారతదేశానికి వచ్చిన విదేశీ ముస్లింలు ఢిల్లీ సుల్తాన్ల కాలంలో ఉత్తర భారతం నుంచి తెలంగాణా ప్రాంతానికి వచ్చి స్థిర పడ్డారు.

కాకతీయుల పతనం దక్షిణ భారత దేశానికి చెందిన అనేక రాజ్యాలకు శాపంగా మారింది. వీటిలో చాలా రాజ్యాలు 1325 వరకు తుగ్లక్ ఆధీనంలోకి వచ్చాయి. వారిలో ఉన్న అనైక్యత కారణంగా ముస్లిం సైన్యాన్ని అడ్డుకోలేక చాలా మంది రాజులు ఢిల్లీ సుల్తాన్‌కు లొంగిపోయారు. దౌల్తాబాద్ (దేవగిరి) వజీరైన మాలిక్ బుర్హనుద్దీన్‌ను తెలుగు ప్రాంతానికి అధికారిగా నియమించారు. పాలనలో ఇతడికి సహాయం అందించడానికి సుల్తాన్‌పూర్ (ఓరుగల్లు) కోటకు అధిపతిగా 'మాలిక్ మక్బూల్'ను నియమించారు. ఢిల్లీ సింహాసనం కోసం వారసత్వ పోరు జరిగింది. మహ్మద్ బిన్ తుగ్లక్ తన తండ్రిని చంపి సుల్తానయ్యాడు. ఈ నేపథ్యంలో కాకతీయుల కాలంలో పనిచేసిన సైన్యాధికారులు, అనేక మంది బలమైన నాయంకరులు ఏకమై ఢిల్లీ సుల్తాన్‌పై తిరుగుబాటుకు సిద్ధమయ్యారు. తెలుగు ప్రాంతంపై ఇస్లాం పాలనను అంతం చేయడమే ప్రథమ కర్తవ్యంగా ఈ తిరుగుబాటులో అనేక వర్గాలకు చెందిన ప్రజలు, నాయకులు పాల్గొన్నారు. ఈ పోరాటం హిందూ మతోద్ధరణకు, సంస్కృతి రక్షణకు తోడ్పడిందని అనితల్లి (రాజమండ్రి రెడ్డి రాజు కాటయ వేమారెడ్డి కుమార్తె) వేయించిన కలువచేరు శాసనం (క్రీ.శ. 1423) ద్వారా తెలుస్తోంది.

కాకతీయుల నాయంకర విధానం

కాకతీయుల సైనిక పరిపాలనను 'నాయంకర విధానం' అని పిలుస్తారు. రుద్రమదేవి ప్రవేశపెట్టిన ఈ విధానాన్ని రెండో ప్రతాపరుద్రుడు పునర్‌వ్యవస్థీకరించి బలోపేతం చేశాడు. సైన్యాధికారులైన ఈ నాయంకరులు తమ ఆధీనంలో, వారి స్థాయిని బట్టి స్వతంత్రంగా కొంత సైన్యాన్ని పోషించేవారు. సైన్య పోషణకు అయ్యే ఖర్చు నిమిత్తం వీరికి కొన్ని గ్రామాలపై పూర్తి అధికారం ఇచ్చారు. వీరు ఈ గ్రామాల నుంచి శిస్తు వసూలు చేసుకునేవారు. కొంత సొమ్మును రాజుకు కప్పంగా చెల్లించేవారు. రాజుకు అవసరమైనప్పుడు సైనిక సహాయం చేయడం వీరి బాధ్యత. కాకతీయులకు నమ్మకంగా ఉన్న వంశస్థుల వారే వంశపారంపర్యంగా నాయంకరులుగా నియమితులయ్యారు. కాకతీయులు సాధించిన అనేక విజయాల్లో వీరు గణనీయ పాత్ర పోషించారు. రెండో ప్రతాపరుద్రుడి పాలన చివరి నాటికి ఈ నాయంకరులు చిన్న చిన్న రాజులుగా అవతరించారు. ఢిల్లీ సుల్తాన్ దాడుల వల్ల వీరి ప్రాబల్యం పతనమైంది. వీరు తమ ఉనికిని నిలుపుకోవడానికి ఢిల్లీ పాలనను ఎదురించాలని ఏకమయ్యారు. ఆ కాలంలో 75 మంది నాయంకరులున్నట్లుగా కలువచేరు శాసనం ద్వారా తెలుస్తోంది. వీరిలో ఎక్కువగా వెలమ కులానికి చెందిన నాయకులే ఉన్నారని 'ప్రతాపరుద్ర చరిత్ర' ద్వారా తెలుస్తోంది. వీరితో పాటు రెడ్డి, కమ్మ, కాపు, తెలగ, యాదవ నాయకులు కూడా ఉన్నట్లు ఆధారాలున్నాయి. రైతు కుటుంబాలకు చెందిన వీరు మొదట సైన్యాధికారులుగా నియమితులై ఆ తర్వాత క్రమంగా ప్రభువులయ్యారు.

తెలుగు నాయకుల విమోచనోద్యమం

ప్రతాపరుద్రుడి మరణం తర్వాత వయోవృద్ధులైన కాకతీయ సేనానుల్లో ముఖ్యమైనవారు – ఇందలూరి అన్నయ్య, కొలని రుద్రదేవుడు, రేచర్ల సింగమ నాయకుడు, రేచర్ల ఏచ నాయకుడు, యాదవసాంగపనిదేవుడు. వీరు నాయంకరుల వారసులను ఏకం చేసి ఢిల్లీ సుల్తాన్ అధికారాన్ని ధిక్కరించాలని నిశ్చయించారు. ముసునూరి ప్రోలయ నాయకుడిని వీరికి నాయకుడిగా ఎన్నుకున్నట్లు విలాసతామ్ర శాసనం, పోలవరం శాసనం, కలువ చేరు శాసనాల ద్వారా తెలుస్తోంది. ప్రోలయకు అండగా అతడి పిన తండ్రి కుమారుడైన ముసునూరి కాపయ నాయకుడు వ్యవహరించాడు. వీరి నాయకత్వాన్ని అద్దంకి వేమారెడ్డి, కొప్పుల ప్రోలయ నాయకుడు, రేచర్ల సింగమ నాయకుడు, మంచికొండ గణపతి నాయకుడు, ఉండీ వేంగభూపాలుడు, ఎరువ చోడభక్తిరాజు, ఆరవీటి సోమదేవ రాజు లాంటి ముఖ్యులు సమర్థించారు. 1325 చివర్లో మధ్యాంధ్ర ప్రాంతంలో ముసునూరి ప్రోలయ నాయకుడు తురుష్క సైన్యాలను ఓడించి రేఖపల్లిలో స్వతంత్ర్య రాజ్యాన్ని స్థాపించాడు. ఇతడికి అనుయాయిగా వేమారెడ్డి అద్దంకిలో రెడ్డి రాజ్యాన్ని స్థాపించాడు.

ముసునూరి నాయకులు

కమ్మ వ్యవసాయదారుల కుటుంబానికి చెందిన ముసునూరు నాయకులు దివిసీమను పాలించిన పిన్నచోడుని ఆశ్రయంలో ఉండేవారు. పిన్నచోడుని కుమార్తెలను (నారాంబ, పేరాంబ) వివాహమాడిన గణపతి దేవుడు వారి సోదరుడైన జాయపసేనానిని తన ఆస్థానంలో చేర్చుకోవడంతో ఈ ముసునూరు వారు కూడా కాకతీయుల కొలువులో చేరారు. కృష్ణాజిల్లా ఉయ్యూరు సమీపంలోని ముసునూరు గ్రామం వీరి తొలి నివాసం. వీరు సైనిక శిక్షణ పొందడం ద్వారా వీరులయ్యారు. ప్రతాపరుద్రుడి మంత్రి అయిన ఇందలూరి అన్నయ్య సహకారంతో ముసునూరి పోచినాయకుడు కాకతీయ నాయంకరుడయ్యాడు. ఇతని కుమారుడు ముసునూరి ప్రోలయ నాయకుడు.

ముసునూరి ప్రోలయ నాయకుడు (1325–33): గోదావరి తీరంలోని రేఖపల్లి దుర్గం రాజధానిగా (భద్రాచలం తాలుకా) చేసుకొని ఇతడు మహ్మదీయులను ఎదుర్కొన్నాడు. ఇతడి నాయకత్వంలో సామంత ప్రభువులు చాలా విజయాలు సాధించారు. ప్రతి విజయంలో సోదరుడైన కాపయ నాయకుడి పాత్ర ఉంది. ఇతడికి 'ఆంధ్ర భూమండలాధ్యక్ష సింహాసన సంప్రతిష్ఠాపనాచార్య' బిరుదు ఉంది.

ముసునూరి కాపయ నాయకుడు (1333–69): ముస్లిం చరిత్రకారులు ఇతడిని కన్యానాయక్, కృష్ణానాయక్‌గా వ్యవహరించారు. ప్రోలయ మరణం తర్వాత రేఖపల్లి కేంద్రంగా కాపయ పాలనను ప్రారంభించాడు. ఢిల్లీ పాలకులకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమానికి ప్రోలయ స్థానంలో ఇతడు నాయకత్వం వహించాడు. సుల్తాన్ కబంధ హస్తాల నుంచి ఓరుగల్లును విముక్తి చేయడానికి కంకణం కట్టుకున్నాడు. హోయసాల రాజ్యాన్ని పాలిస్తున్న మూడో భల్లాలుడు పంపించిన సైన్యం సహకారంతో 1336–37 కాలంలో ఓరుగల్లు కోటపై దాడి చేశాడు. దీంతో ఓరుగల్లు పాలకుడు మాలిక్ మక్బూల్ ఢిల్లీకి పారిపోయాడు. 1337లో ఓరుగల్లు కోటను వశపర్చుకున్న కాపయ నాయకుడు అంతకుముందు కాకతీయుల ఆధీనంలో ఉన్న అనేక ప్రాంతాలను తిరిగి తన అధికారంలోకి తెచ్చుకున్నాడు. కాపయ నాయకుడికి 'ఆంధ్రదేశాధీశ్వర', 'ఆంధ్ర సురత్రాణ' బిరుదులున్నాయి.

ఢిల్లీ సుల్తాన్ ముప్పు తొలగిన తర్వాత అప్పటి వరకూ కాపయకు సామంతులుగా ఉన్న సహచరులు కాపయను ధిక్కరించి స్వతంత్రులయ్యారు. కాలక్రమంలో రాచకొండ (నల్గొండ జిల్లా)లో వెలమ నాయకులు (రేచర్ల అనపోత నాయకుడు), అద్దంకి, కొండవీడుల్లో రెడ్డి రాజులు (ప్రోలయ వేమారెడ్డి), విజయనగరంలో యాదవులు, కోరుకొండలో మంచికొండ నాయకులు (ముమ్మడి నాయకుడు), పిఠాపురంలో కొప్పుల నాయకులు బలమైన స్వతంత్ర్య రాజులుగా అవతరించారు.

ఓరుగల్లు రాజ్యానికి పొరుగున ఉన్న గుల్బర్గా (కర్ణాటక)కు సేనాధిపతిగా అల్లావుద్దీన్ బహమన్ షా (హసన్ గంగూ/ జాఫర్ ఖాన్) వ్యవహరించేవాడు. 1347లో ఇతడు తమ రాజైన ఢిల్లీ సుల్తాన్‌ను ఎదిరించి, గుల్బర్గా రాజధానిగా బహమనీ రాజ్యాన్ని స్వతంత్రంగా స్థాపించాడు. ఢిల్లీ సేనల్ని ఓడించడంలో హసన్ గంగూకు కాపయ నాయకుడు సైన్య సహకారం అందించాడు. తన అవసరం తీరిన తర్వాత హసన్ గంగూ రాజ్య విస్తరణ కాంక్షతో 1350లో తెలంగాణపై దండయాత్ర చేశాడు. కాపయ నాయకుడు ఓడిపోయి కౌలాస్ కోట (నిజామాబాద్)ను బహమనీలకు ధారాదత్తం చేసి సంధి చేసుకున్నాడు. హసన్ గంగూ 1356–57లో తెలంగాణాపై మళ్లీ దాడి చేసి కాపయను ఓడించాడు. దీంతో కాపయ భువనగిరి కోట (నల్గొండ)ను వదులుకొని బహమనీలకు కప్పం కట్టడానికి అంగీకరించాడు.

హసన్ గంగూ మరణం తర్వాత 1359లో మొదటి మహ్మద్‌షా బహమనీ సుల్తాన్‌గా అవతరించాడు. కాపయ నాయకుడి కుమారుడు వినాయక దేవుడు, విజయనగర రాజైన మొదటి బుక్కరాయలు పంపిన సైన్యం సహకారంతో 1361లో భువనగిరి కోటను తిరిగి స్వాధీనం చేసుకున్నాడు. ఇతడు కౌలాస్ కోటను స్వాధీనం చేసుకునే ప్రయత్నంలో ఉండగా మొదటి మహ్మద్ షా ఓరుగల్లు కోటను ముట్టడించి కాపయ నాయకుడిని ఓడించి సంధి చేసుకున్నాడు. ఆ తర్వాత మొదటి మహ్మద్ షా వినాయక దేవుడిని అతిక్రూరంగా హత్య చేశాడు.

కాపయ నాయకుడు బహమనీ సుల్తాన్‌ను ఓడించడమే ధ్యేయంగా విజయనగరాధీశులతో కలిసి ఢిల్లీ సుల్తాన్ ఫిరోజ్ షా తుగ్లక్ సహాయమర్థించాడు. 'కాఫిర్ల' (హిందువుల)తో కలిసి స్వజాతీయులపై (ముస్లిం) యుద్ధం చేయడానికి ఫిరోజ్ షా నిరాకరించాడు. అది తెలిసిన మొదటి మహ్మద్ షా ఓరుగల్లుపై దండెత్తి సర్వనాశనం చేశాడు. కాపయ నాయకుడు చేసేదేమీ లేక బహమనీ రాజుతో సంధి చేసుకొని గోల్కొండ కోటను, అపార ధనరాశులను అప్పగించాడు. అప్పటికే కుంగిపోయిన ముసునూరి కాపయ నాయకుడు రేచర్ల వెలమ నాయకుడైన అనపోత నాయకుడి చేతిలో 1369లో భీమారం (వరంగల్) సమీపంలో జరిగిన యుద్ధంలో మరణించాడు. దీంతో ముసునూరి నాయకుల పాలన ముగిసింది.

తెలంగాణ రాజ్యం కమ్మ నాయకుల పాలన నుంచి వెలమ నాయకుల పాలనలోకి వెళ్లింది. ఓరుగల్లు రాచకొండ రాజ్యంలో భాగంగా మారింది. దీనికి రాజు అనపోత నాయకుడు. ఓరుగల్లు పట్టణం తన ప్రతిష్ఠను క్రమంగా కోల్పోయింది.

మాదిరి ప్రశ్నలు

1. ముసునూరి నాయకుల మొదటి రాజధాని?
   1) ఓరుగల్లు 2) ఉయ్యూరు
   3) రేఖపల్లి 4) రాచకొండ
2. ముసునూరి ప్రోలయ నాయకుడు వేయించిన శాసనం?
   1) విలాస తామ్ర శాసనం
   2) విప్పర్ల శాసనం 3) కలవచేరు శాసనం
   4) పైవన్నీ
3. బహమనీ రాజ్యస్థాపకుడు ఎవరు?
   1) మహ్మద్ షా 2) హసన్ గంగూ
   3) నిజాం షా 4) జునాఖాన్
4. కాకతీయుల చివరి రాజు?
   1) రుద్రదేవుడు 2) మహాదేవుడు
   3) గణపతి దేవుడు 4) ప్రతాపరుద్రుడు

సమాధానాలు

1) 3; 2) 1; 3) 2; 4) 4.

విద్య, ఉద్యోగ సమాచారం

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, కోల్‌కతాలో వివిధ ఉద్యోగాలు

కోల్‌కతాలోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ షిప్ రిపేర్ యూనిట్‌లో ఒప్పంద ప్రాతిపదికన సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్(మెకానికల్/ఎలక్ట్రికల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.



» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
» **అర్హత:** 60 శాతం మార్కులతో డిగ్రీలో మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ఉత్తీర్ణులవ్వాలి.
» **వేతనం:** మొదటి ఏడాది రూ.47,000, రెండో ఏడాది రూ.48,000, మూడో ఏడాది 50,000.
» **వయసు:** 30.11.2024 నాటికి 35 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**30.11.2024
» **వెబ్‌సైట్:** http://cochinshipyard.in

ఐఎస్ఎఫ్ఆర్ఈ-ఐఎఫ్‌జీటీబీ, కోయంబత్తూర్‌లో 16 ఉద్యోగాలు

కోయంబత్తూర్(తమిళనాడు)లోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్(ఐసీఎఫ్ఆర్ఈ)కి చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ జెనెటిక్స్ అండ్ ట్రీ బ్రీడింగ్(ఐఎఫ్‌జీటీబీ)లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 16.
» **పోస్టుల వివరాలు:** మల్టీ టాస్కింగ్ స్టాఫ్–08, లోయర్ డివిజన్ క్లర్క్–01, టెక్నీషియన్–03, టెక్నికల్ అసిస్టెంట్–04.
» **అర్హత:** పదో తరగతి, ఇంటర్మీడియట్, బ్యాచిలర్ డిగ్రీ (అగ్రికల్చర్ /బయోటెక్నాలజీ/బోటనీ/ఫారెస్ట్రీ/జువాలజీ) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 30 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/స్కిల్ టెస్ట్, విద్యార్హతల్లో సాధించిన మార్కులు, సర్టిఫికేట్ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**30.11.2024
» **వెబ్‌సైట్:** https://ifgtb.icfre.gov.in

రసాయనాల రాజు అని దేన్ని అంటారు?



భౌతిక రసాయన శాస్త్రం

ఫాస్ఫరస్, సల్ఫర్, దాని సమ్మేళనాలు: సాధారణ ఉప్పు, దాని ఉత్పన్నాలు

- **సల్ఫర్ ధాతువులు:** కాపర్ పైరటీస్– CuS, ఐరన్ పైరటీస్ - FeS, గెలీనా PbS, సిన్నబార్ - HgS, జింక్ బ్లెండ్ ZnS
- భూగర్భ ఉపరితలంలో లభించే ధాతువుల నుంచి సల్ఫర్‌ను సంగ్రహించే పద్ధతి సిసిలీ పద్ధతి.
- భూమి పొరల నుంచి సల్ఫర్‌ను సంగ్రహించే పద్ధతి ఫ్రాష్ పద్ధతి.
- సిసిలీ పద్ధతిలో ఉపయోగించే కొలిమి – కాల్కారోని
- సల్ఫర్ అణువు ఆకృతి – కిరీటం
- సల్ఫర్ పరివర్తన ఉష్ణోగ్రత 96°C
- ఫ్లవర్ ఆఫ్ సల్ఫర్ 444°C వద్ద ఏర్పడుతుంది.
- CaSను కాగిత పరిశ్రమలో విరంజనకారిగా ఉపయోగిస్తారు.
- **గన్‌పౌడర్ సంఘటనం:** సల్ఫర్ + బొగ్గుపొడి + KNO_3
- చర్మవ్యాధుల నివారణలో ఉపయోగించేది – HgS
- SO_2 వాయువు గాలి కంటే 2½ రెట్లు బరువైంది.
- ఫౌంటెన్ ప్రయోగం వల్ల SO_2 నీటిలో కరుగుతుందని, దానికి ఆమ్ల లక్షణం ఉంటుందని నిరూపించవచ్చు.
- SO_2 వాయువు విరంజన చర్యకు కారణం – నవజాత హైడ్రోజన్ ఏర్పడటం
- స్పర్శాపద్ధతిలో ఉపయోగించే ఉత్ప్రేరకం – V_2O_5
- నీలి కాపర్ సల్ఫేట్‌కు H_2SO_4ను కలిపినపుడు రంగును కోల్పోతుంది. ఈ ప్రక్రియను నిర్జలీకరణం అంటారు.
- సల్ఫ్యూరిక్ ఆమ్లాన్ని రసాయనాల రాజు అంటారు.
- సల్ఫ్యూరిక్ ఆమ్లాన్ని డిటర్జెంట్స్, పేలుడు పదార్థాల తయారీలో ఉపయోగిస్తారు. బ్యాటరీలను నిల్వచేయడానికి వాడుతారు.
- సల్ఫ్యూరిక్ ఆమ్లం Au, Pt వంటి లోహాలతో చర్య జరపదు.
- అగ్నిపర్వతాల నుంచి వెలువడే వాయువు H_2S
- H_2S తయారు చేయడానికి ఉపయోగించే పరికరం – కిప్పు పరికరం
- H_2S గాలి కంటే బరువైంది. ఆమ్ల లక్షణాన్ని కలిగి ఉంటుంది.
- లెడ్ ఎసిటేట్‌లో ముంచిన వడపోత కాగితాన్ని H_2S నల్లగా మారుస్తుంది.
- ఓలియంను నీటితో చర్య జరిపిస్తే H_2SO_4 ఏర్పడుతుంది.
- H_2S క్షయకరణ కారకంగా పనిచేస్తుంది.
- సల్ఫర్ రూపాంతరాల్లో అత్యంత స్థిరమైంది – రాంబిక్ సల్ఫర్
- $K_2Cr_2O_4$లో ముంచిన వడపోత కాగితాన్ని SO_2 వాయువు ఆకుపచ్చగా మారుస్తుంది.
- ఫాస్ఫొరైట్ ఫార్ములా $Ca_3(PO_4)_2$
- మెటా ఫాస్ఫారిక్ ఆమ్లం ఫార్ములా HPO_3
- ఫాస్ఫరస్ పరిశ్రమలో పనిచేసే శ్రామికులకు వచ్చే జబ్బు – ఫాసిజా
- భాస్వరాన్ని గాలిలో ఉంచితే నెమ్మదిగా మెరుస్తుంది. దీన్ని ఫాస్ఫారిజన్స్ అంటారు.
- ఎలుకలను చంపడానికి తెల్ల భాస్వరాన్ని ఉపయోగిస్తారు.
- ఫాస్ఫర్ బ్రాంజ్ మిశ్రమలోహం – Cu + Sn + P
- అగ్గిపుల్లలోని పదార్థాలు $KClO_3$, Sb_2S_3, బంక
- అగ్గిపెట్టె పక్కభాగంలోని పదార్థాలు – ఎర్రభాస్వరం, Sb_2, గాజుముక్కలు.
- ఫాస్ఫారిక్ ఆమ్లం ఒక త్రిక్షార ఆమ్లం.
- సూపర్ ఫాస్ఫేట్ ఆఫ్ లైమ్ ఒక ఫాస్ఫాటిక్ ఎరువు.
- గాఢ ఉప్పు ద్రావణంలోనికి HCl వాయు వును పంపి శుద్ధమైన ఉప్పును పొందుతారు.
- ఉప్పునీటి ద్రావణాన్ని బ్రైన్ ద్రావణం అంటారు.
- సోడియం లోహం మెర్క్యురీతో కలిసి సోడియం అమాల్గంను ఏర్పరుస్తుంది.
- క్లోరిన్.. ఆకుపచ్చ పసుపు రంగు ఉన్న వాయువు.
- తడిపిన పూలు క్లోరిన్ సమక్షంలో రంగును కోల్పోవడానికి కారణం నవజాత ఆక్సిజన్ ఏర్పడటం.
- బ్లీచింగ్ పౌడర్ ఫార్ములా $CaOCl_2$
- ఫాస్జీన్ ఫార్ములా – $COCl_2$; టియర్ గ్యాస్ – CCl_3NO_2; క్లోరోఫామ్ – $CHCl_3$;

మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో సల్ఫర్ ధాతువు కానిది?
   ఎ) కాపర్ పైరటీస్ బి) హెమటైట్
   సి) గెలీనా డి) సిన్నబార్
2. సల్ఫర్ పరివర్తన ఉష్ణోగ్రత?
   ఎ) 106°C బి) 86°C
   సి) 90°C డి) 96°C
3. అత్యంత స్థిరత్వం ఉన్న సల్ఫర్ రూపాంతరం?
   ఎ) ప్లాస్టిక్ సల్ఫర్
   బి) మోనోక్లినిక్ సల్ఫర్
   సి) రాంబిక్ సల్ఫర్
   డి) ఫ్లవర్ ఆఫ్ సల్ఫర్
4. సిసిలీ పద్ధతిలో సల్ఫర్ ధాతువును ఉంచే కొలిమి పేరు?
   ఎ) బ్లాస్ట్ కొలిమి బి) షాఫ్ట్‌కొలిమి
   సి) కాల్కరోని కొలిమి డి) రివర్బరేటరీ
5. గన్ పౌడర్ అంటే?
   ఎ) ఫాస్ఫరస్, చార్‌కోల్, మెగ్నీషియం పౌడర్
   బి) సల్ఫర్, బొగ్గుపొడి, KNO_3 మిశ్రమం
   సి) Se, దీపాంగారం
   డి) బొగ్గుపొడి, NCl_3 ల మిశ్రమం
6. $2SO_2 + O_2 \xrightarrow{400-500^\circ C} 2SO_3$ (స్పర్శాపద్ధతి) ఈ చర్యలో ఉత్ప్రేరకం?
   ఎ) Ni బి) Mo
   సి) Fe డి) V_2O_5
7. రసాయనాల రాజు అని దేన్ని అంటారు?
   ఎ) H_2SO_4 బి) H_2SO_3
   సి) $H_2S_2O_7$ డి) H_3PO_4
8. నీలి కాపర్ సల్ఫేట్‌కు సల్ఫ్యూరిక్ ఆమ్లాన్ని కలిపినపుడు రంగుని కోల్పోతుంది. ఈ ప్రక్రియను ఏమంటారు?
   ఎ) ఆక్సీకరణం బి) నిర్జలీకరణం
   సి) క్షయకరణం డి) ఫెర్మెంటేషన్
9. సల్ఫ్యూరిక్ ఆమ్లం ఏ లోహాలతో చర్య పొందదు?
   ఎ) Zn, Mg బి) Cu, Ca
   సి) Au, Pt డి) Ag, Sn
10. ఫెర్రస్ సల్ఫైడ్.. హైడ్రోక్లోరిక్ ఆమ్లంతో చర్య పొందినపుడు ఏర్పడే వాయువు?
    ఎ) SO_2 బి) SO_3
    సి) H_2S డి) NH_3
11. $K_2Cr_2O_7$ ద్రవంలో ముంచిన వడపోత కాగితాన్ని ఏ వాయువు దగ్గరకు తీసుకెళ్తే లేత ఆకుపచ్చ రంగుని పొందుతుంది?
    ఎ) H_2S బి) SO_2
    సి) N_2O డి) NO
12. చర్మవ్యాధుల నివారణకు ఉపయోగించేది?
    ఎ) ZnS బి) CaS
    సి) HgS డి) PbS
13. ఓలియంను నీటితో చర్య జరిపితే ఏర్పడే ఆమ్లం?
    ఎ) HNO_3 బి) H_2SO_4
    సి) H_2SO_3 డి) H_3PO_3
14. ఫాస్ఫరస్ మూలకం?
    ఎ) P_8 బి) P_4
    సి) P_6 డి) P_3
15. కిందివాటిలో నిర్జలీకరణి?
    ఎ) H_3PO_4 బి) $Ca_3(PO_4)_2$
    సి) P_2O_5 డి) Na_3PO_4
16. సూపర్ ఫాస్ఫేట్ ఆఫ్ లైమ్ ఒక?
    ఎ) నత్రజని ఎరువు
    బి) ఫాస్ఫాటిక్ ఎరువు
    సి) పొటాషియం ఎరువు
    డి) కాల్షియం ఎరువు
17. అగ్గిపుల్ల తలలో ఉండే రసాయనిక పదార్థాలు?
    ఎ) $KClO_3$, Sb_2S_3, బంక
    బి) KCl, $SbCl_3$, బంక
    సి) NaCl, Sb_2S_3, బంక
    డి) P_4, Sb_2S_3, గాజుముక్కలు
18. కాల్షియం ఫాస్ఫేట్ ———— ను కలిగి ఉంటుంది.
    ఎ) $CO_2(PO_2)_3$
    బి) $CaHPO_2$
    సి) $Ca_3(PO_4)_2$
    డి) $Ca(H_2PO_4)_2$
19. P_2O_5 ను చల్లని నీటిలో కరిగించినపుడు ఏర్పడేది?
    ఎ) H_3PO_4 బి) HPO_3
    సి) PH_3 డి) PH_3, H_3PO_4
20. ఫాస్ఫర్ బ్రాంజ్ అనే మిశ్రమలోహం సంఘటనం?
    ఎ) Cu + Sn + P
    బి) Cu + Zn + P
    సి) Cu + Sn
    డి) Cu + Mg + S
21. తెల్ల ఫాస్ఫరస్‌ను దేనిలో నిల్వ ఉంచుతారు?
    ఎ) Cs_2 బి) కిరోసిన్
    సి) నీరు డి) CCl_4
22. చీకటిలో భాస్వరాన్ని గాలిలో ఉంచితే నెమ్మదిగా మండి మెరుస్తుంది. దీన్ని ఏమంటారు?
    ఎ) ప్రతిదీప్తి బి) రసాయనశక్తి
    సి) ఫాస్ఫారిజన్స్ డి) జీవదీప్తి
23. కిందివాటిలో ఏది ఫాస్ఫారికామ్ల లవణం కాదు?
    ఎ) NaH_2PO_4 బి) Na_2HPO_4
    సి) Na_3PO_4 డి) H_3PO_4
24. కిందివాటిలో దేన్ని ఎలుకల మందుగా ఉపయోగిస్తారు?
    ఎ) కాల్షియం ఫాస్ఫైడ్
    బి) జింక్ ఫాస్ఫైడ్
    సి) మెగ్నీషియం ఫాస్ఫైడ్
    డి) ఫాస్ఫీన్
25. సముద్ర నీటిలో ఉప్పుశాతం?
    ఎ) 3.2% బి) 2.8%
    సి) 4.6% డి) 5.2%
26. క్లోరిన్ వాయువు రంగు
    ఎ) ఎరుపు బి) నీలం
    సి) ఆకుపచ్చ-పసుపు
    డి) నలుపు
27. నీటిలో హైడ్రోజన్ క్లోరైడ్ స్వభావం?
    ఎ) క్షారం బి) ఆమ్లం
    సి) తటస్థ డి) ద్వంద్వ
28. టియర్ గ్యాస్ ఫార్ములా
    ఎ) $COCl_2$ బి) $CaOCl_2$
    సి) CCl_3NO_2 డి) $CaSO_4$
29. $CHCl_3$ను ఏమంటారు?
    ఎ) బ్లీచింగ్ పౌడర్
    బి) ఫాస్జీన్ సి) క్లోరోఫాం
    డి) అమాల్గం
30. బ్రైన్ ద్రావణం అంటే?
    ఎ) ఉప్పు+ నీరు
    బి) చక్కెర+ నీరు
    సి) యూరియా+ నీరు
    డి) గ్లూకోజ్ + నీరు

సమాధానాలు

1) బి; 2) డి; 3) సి; 4) సి; 5) బి; 6) డి; 7) ఎ; 8) బి; 9) సి; 10) సి; 11) బి; 12) సి; 13) బి; 14) బి; 15) సి; 16) బి; 17) ఎ; 18) సి; 19) బి; 20) ఎ; 21) సి; 22) సి; 23) డి; 24) బి; 25) బి; 26) సి; 27) బి; 28) సి; 29) సి; 30) ఎ.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. సల్ఫ్యూరిక్ ఆమ్లంలోని మూలకాలు (DSC-1996)
   ఎ) నత్రజని, సల్ఫర్, ఆక్సిజన్
   బి) హైడ్రోజన్, సల్ఫర్, ఆక్సిజన్
   సి) సల్ఫర్, ఆక్సిజన్
   డి) ఫాస్ఫరస్, సల్ఫర్, హైడ్రోజన్
2. వాసనలేని ఆమ్లానికి ఉదాహరణ (DSC-2001)
   ఎ) HNO_3 బి) H_3PO_4
   సి) HCl డి) H_2SO_4
3. రంగులేని, చిక్కటి నూనె వంటి ఆమ్లం? (DSC-2002)
   ఎ) H_2SO_4 బి) H_3PO_4
   సి) HNO_3 డి) HCl
4. ఫాస్ఫారిక్ ఆమ్ల సంకేతం (DSC-2003)
   ఎ) H_3PO_4 బి) H_2SO_4
   సి) HNO_3
   డి) CH_3COOH
5. జడవాయువు కాని దానికి ఉదాహరణ (DSC-2000)
   ఎ) క్లోరిన్ బి) హీలియం
   సి) నియాన్ డి) ఆర్గాన్

సమాధానాలు

1) బి; 2) డి; 3) ఎ; 4) ఎ; 5) ఎ

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

పెట్రోలియం బావిని మొదటగా ఎక్కడ కనుగొన్నారు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

జాగ్రఫీ

భారతదేశం - ఖనిజ వనరులు

వజ్రాలు: ప్రపంచంలో ప్రస్తుతం వజ్రాల ఉత్పత్తిలో రష్యా,బోట్స్వానా,కాంగో,కెనడా దేశాలు మొదటి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. భారతదేశంలో నిల్వలు, ఉత్పత్తిపరంగా మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ మొదటి రెండు స్థానాలను ఆక్రమించాయి. కింబర్లైట్ శిలాస్థరాల్లో ఇవి లభ్యమవుతున్నాయి.

గనుల విస్తరణ:
- మధ్యప్రదేశ్ – కేన్ నది ఒడ్డున ఉన్న పన్నా.
- ఆంధ్రప్రదేశ్ – అనంతపురం జిల్లాలోని వజ్రకరూర్ కింబర్లైట్, కృష్ణా నదిలోయ.
- కేరళ – కోజికోడ్.

అభ్రకం (మైకా): మైకా ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉంది. ఎలక్ట్రికల్ ఇండస్ట్రీలో ఇన్సులేటర్‌గా, ఎలక్ట్రానిక్ ఇండస్ట్రీలో మైక్రో చిప్స్ రూపంలో, గ్లాస్ ఇండస్ట్రీలో గట్టితనం కోసం దీన్ని ఎక్కువగా వినియోగిస్తున్నారు.

ఇది హైడ్రోసిలికేట్ల రూపంలో భూపటలంలో మూడు రూపాల్లో లభ్యమవుతుంది. అవి:

1. **మస్కోవైట్ (పొటాష్ మైకా):** శ్వేత వర్ణంలో ఉంటుంది. దీన్నే 'రూబీ మైకా' అంటారు. ఇది అత్యంత నాణ్యమైంది.
2. **ఫ్లోగోపైట్:** పసుపు రంగులో ఉంటుంది. దీన్నే 'మెగ్నీషియా మైకా' అంటారు.
3. **బయొటైట్:** నలుపు వర్ణంలో ఉంటుంది.

గనుల విస్తరణ:
- బిహార్ – గయ.
- జార్ఖండ్ – కోడెర్మా, హజారీబాగ్, సింగ్భుమ్, పాలమావు.
- ఆంధ్రప్రదేశ్ – నెల్లూరు (గూడూరు).
- తెలంగాణ – ఖమ్మం.

బెరైటీస్ (ముగ్గురాయి): బెరైటీస్ నిల్వలు, ఉత్పత్తిపరంగా భారతదేశం ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉంది. దేశంలో ఆంధ్రప్రదేశ్‌లోని మంగంపేట, అనంతరాజుపేట (కడప జిల్లా) ప్రాంతాలు వీటికి ప్రసిద్ధి చెందాయి. ఈ ఖనిజం బేరియం ఆక్సైడ్‌ల రూపంలో లభ్యమవుతుంది. దీన్ని ముడి చమురును వెలికితీయడంలో కందెనగా, వైద్య అవసరాలకు ఉపయోగిస్తారు.

గనుల విస్తరణ:
- ఆంధ్రప్రదేశ్ – కడప.
- తెలంగాణ – ఖమ్మం.

ఆస్‌బెస్టాస్ (రాతి నార): సిమెంటు రేకులు, తాళ్లు, పెయింటింగులు, బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్ల తయారీలో ఆస్‌బెస్టాస్‌ను ఉపయోగిస్తారు. వీటి నిల్వలు, ఉత్పత్తిలో రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. ఈ గనుల్లో పనిచేసే కార్మికులు 'ఆస్‌బెస్టోసిస్' అనే ఊపిరితిత్తులకు సంబంధించిన కేన్సర్‌కు గురవుతున్నారు.

సున్నపురాయి: సున్నపురాయిని 75 శాతం సిమెంట్ పరిశ్రమల్లో, 16 శాతం స్టీల్ ఇండస్ట్రీల్లో ఉపయోగిస్తారు. భారతదేశంలో నిల్వలపరంగా కర్ణాటక, రాజస్థాన్; ఉత్పత్తిపరంగా మధ్యప్రదేశ్, రాజస్థాన్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి.

డోలమైట్: దీన్ని 90 శాతం స్టీల్ ఇండస్ట్రీల్లో, 4 శాతం ఎరువుల పరిశ్రమల్లో వాడుతున్నారు. దీని ఉత్పత్తిలో ఛత్తీస్‌గఢ్, ఒడిశా మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి.

గ్రాఫైట్: పెన్సిళ్లు, ఎలక్ట్రిక్ బ్యాటరీల తయారీలో దీన్ని వాడతారు. దీని నిల్వల విషయంలో చైనా, భారత్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. భారత్‌లో దీని ఉత్పత్తిలో ఒడిశా, జార్ఖండ్, తమిళనాడు మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి.

ఇతర లోహ, అలోహ ఖనిజాలు

జింక్: ఇది సల్ఫైడ్ల రూపంలో లభ్యమవుతుంది. గాల్వనైజేషన్ ప్రక్రియలో దీన్ని ఎక్కువగా ఉపయోగిస్తారు. నిల్వలు, ఉత్పత్తిలో రాజస్థాన్ ప్రథమ స్థానంలో ఉంది.

సీసం: ఇది 'గెలీనా' అనే సల్ఫైడ్‌ల రూపంలో లభ్యమవుతుంది. దీన్ని కేబుల్ కవర్లు,పెయింట్ల తయారీలో, రబ్బర్ తయారీకి చెందిన 'వల్కనైజేషన్' ప్రక్రియలో ఉపయోగిస్తారు. ప్రపంచంలో నిల్వలు, ఉత్పత్తి పరంగా ఆస్ట్రేలియా మొదటి స్థానంలో ఉంది. న్యూ సౌత్ వేల్స్, క్వీన్స్‌లాండ్‌లోని బ్రోకన్ హిల్స్ ప్రాంతాల్లో ఇది ఎక్కువగా లభ్యమవుతోంది.

భారతదేశంలో సీసం నిల్వలు రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్(కర్నూలు, గుంటూరు),తెలంగాణ(నల్గొండ, ఖమ్మం), బిహార్, ఒడిశా రాష్ట్రాల్లో ఉన్నాయి.

తగరం: మలేషియాలో దీని ఉత్పత్తి ఎక్కువగా ఉండగా స్మెల్టింగ్ ఇండస్ట్రీ ఎక్కువగా సింగపూర్‌లో ఉంది. భారత్‌లో దీని నిల్వలు జార్ఖండ్ (హజారీబాగ్), బిహార్ (గయ), ఛత్తీస్‌గఢ్‌లో ఉన్నాయి.

వెండి (సిల్వర్): అర్జంటైట్ రూపంలో క్వార్ట్‌జైట్ శిలాస్థరాల్లో బంగారంతో కలిసి లభ్యమవుతుంది. దీన్ని ఎలక్ట్రో ప్లేటింగ్, ఫొటోగ్రఫీ, పారిశ్రామిక రసాయనాల తయారీలో ఉపయోగిస్తారు. దీని నిల్వలు రాజస్థాన్ (జువార్)లో ఎక్కువగా ఉన్నాయి. కర్ణాటక (కోలార్), ఆంధ్రప్రదేశ్ (కడప, గుంటూరు, కర్నూలు), జార్ఖండ్ (రాంచీ, హజారీబాగ్) ప్రాంతాల్లోనూ వీటి నిల్వలు ఉన్నాయి.

టంగ్‌స్టన్: రాజస్థాన్‌లోని 'డేగనా' ప్రాంతంలో ఉన్నాయి.

నికెల్: ఒడిశాలో ఎక్కువగా లభిస్తోంది.

కోబాల్ట్: రాజస్థాన్, కేరళలో దీని నిల్వలు అధికంగా ఉన్నాయి.

ఉప్పు: గుజరాత్ దీని ఉత్పత్తికి ప్రసిద్ధి.

రాతి ఉప్పు: మండి (హిమాచల్ ప్రదేశ్)లో అధికంగా లభ్యమవుతోంది.

కియొనైట్: జార్ఖండ్‌లో అధికంగా లభిస్తుంది.

జిప్సం: రాజస్థాన్‌లో దీని నిల్వలు అధికం.



ఇంధన ఖనిజాలు

మండే స్వభావం ఉన్న ఖనిజాలు, పునరుత్పత్తి చెందని సాంప్రదాయ ఇంధన వనరులు (బొగ్గు, పెట్రోలియం, సహజవాయువు) ఇంధన ఖనిజాలకు ఉదాహరణ. ఇవి ప్రధానంగా హైడ్రోకార్బన్లు.

బొగ్గు: దీన్నే నల్ల బంగారం అంటారు. ఇది దేశంలో ప్రధానంగా రెండు భౌమ కాలాలకు చెందిన అవక్షేప శిలాస్థరాల్లో లభ్యమవుతోంది. అవి:

1) **గోండ్వానా బొగ్గు:** దేశంలో లభ్యమయ్యే బొగ్గులో 90 శాతం ఈ రకానికి చెందిందే. ఇది ఎక్కువగా దిగువ గోండ్వానా యుగానికి చెందిన అవక్షేప శిలాస్థరాల్లోని దామోదర్ లోయ(జార్ఖండ్-దామోదర్),సోన్ (మధ్యప్రదేశ్),మహానది (ఒడిశా), గోదావరి (ఆంధ్రప్రదేశ్), వార్ధా (మహారాష్ట్ర)లో నిక్షిప్తమై ఉంది. ఇది అత్యంత నాణ్యమైన బొగ్గు.

2) **టెర్షియరీ బొగ్గు:** ఇది ఎక్కువగా తమిళనాడు, గుజరాత్, రాజస్థాన్, అసోం, జమ్ము-కశ్మీర్‌లోని ద్వీపకల్ప, ద్వీపకల్పేతర ప్రాంతాల్లో లభ్యమవుతోంది.

బొగ్గులోని కర్బన శాతాన్ని అనుసరించి దీన్ని 4 రకాలుగా వర్గీకరించారు. అవి..

1. **ఆంథ్రసైట్:** అత్యంత నాణ్యమైన బొగ్గు. ఇందులో 90–95 శాతం కార్బన్ ఉంటుంది. జమ్ము-కశ్మీర్‌లో మాత్రమే కొద్ది పరిమాణంలో లభ్యమవుతోంది.
2. **బిట్యూమినస్:** ఇందులో 85–90 శాతం కార్బన్ ఉంటుంది. దేశంలో ఎక్కువగా లభ్యమయ్యే రకం ఇది. దీని వినియోగం కూడా ఎక్కువే.
3. **లిగ్నైట్ (బ్రౌన్‌కోల్):** 30–40 శాతం కార్బన్ ఉంటుంది. దీని నాణ్యత తక్కువ. తమిళనాడులోని నైవేలి ప్రాంతంలో 90 శాతం నిల్వలు ఉన్నాయి.
4. **పీట్:** కార్బన్ 10 శాతం మాత్రమే ఉంటుంది. ఇది కర్ర నుంచి బొగ్గు ఏర్పడటంలోని మొదటి దశ. దీన్నే కొయ్య బొగ్గు అని కూడా అంటారు.

భారత్‌లో 285 బిలియన్ టన్నుల బొగ్గు నిల్వలున్నాయి. వీటిలో 200 బిలియన్ టన్నులు బిట్యూమినస్, మిగిలినవి లిగ్నైట్ రకానికి చెందినవి. బొగ్గు నిల్వల్లో జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్, తెలంగాణ; ఉత్పత్తిలో ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు వరుసగా మొదటి స్థానాల్లో ఉన్నాయి.

దేశంలో ప్రధానమైన గోండ్వానా బొగ్గు గనులు

జార్ఖండ్ – జారియా, బొకారో, డాల్టన్‌గాజ్.
పశ్చిమ బెంగాల్ – రాణిగంజ్, గిరిధి, కరన్ పురా, డార్జిలింగ్.
ఛత్తీస్‌గఢ్ – కోర్బా, బీరమ్‌పూర్, చిరిమిరి, హస్‌డో– అరంద్, తాతాపాని– రామ్‌కోలా.
మధ్యప్రదేశ్ –సింగ్రౌలి,సొహాగ్‌పూర్, ఉమారియా.
మహారాష్ట్ర – చందా, వార్ధా, కంప్టీ, భాండర్.
తెలంగాణ – సింగరేణి, కొత్తగూడెం, తాండూరు, పాల్వంచ.

టెర్షియరీ బొగ్గు గనులు:

తమిళనాడు – నైవేలి జయమ్ కొండ చోళాపురం, మన్నార్ గుడి, హిమాచల్ ప్రదేశ్, చంద్రలోయ.
అసోం – మాకుమ్, జెంజి, నజీరా, జయపూర్.
రాజస్థాన్ – బికనీర్ .
ఉత్తర ప్రదేశ్ – నామ్‌చిక్, నాంరూద్.

బొగ్గు ఉత్పత్తిలో చైనా, యూఎస్ఏ, భారత్ వరుసగా మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి.

విస్తరణ:

యూఎస్ఏ: పెన్సిల్వేనియా నుంచి అలబామా వరకు ఉన్న అపలేచియన్ ప్రాంతం, కెంటకీ, పశ్చిమ వర్జీనియా.
ఉక్రెయిన్: డొనెట్స్క ప్రాంతం.
రష్యా: కుజ్‌నెట్స్క బేసిన్ .
కజకిస్థాన్: కరగండా.
జర్మనీ: రూర్ లోయ.
ఆస్ట్రేలియా: న్యూసౌత్‌వేల్స్.

పెట్రోలియం: దీన్నే ముడి చమురు, రాతి నూనె, క్రూడాయిల్, బంగారుద్రవం అని కూడా అంటారు. ఇది ప్రధానంగా అవక్షేప శిలల నుంచి లభ్యమవుతుంది. ప్రపంచంలో మొదటిసారిగా పెట్రోలియం బావిని 'పెన్సిల్వేనియా'లో కనుగొన్నారు. పెట్రోలియం నిల్వలు, ఉత్పత్తి, ఎగుమతుల్లో సౌదీ అరేబియా ప్రథమస్థానంలో ఉంది. దీని వినియోగంలో యూఎస్ఏ మొదటి స్థానంలో ఉంది. తర్వాత స్థానాల్లో చైనా,జపాన్,ఇండియా ఉన్నాయి.

భారతదేశంలో మొదటగా అసోంలోని 'మాకుమ్' ప్రాంతంలో ముడి చమురును గుర్తించారు. 'దిగ్బాయ్' ప్రాంతంలో దీన్ని ఉత్పత్తి చేశారు. దేశంలో చమురు నిక్షేపాల అన్వేషణ, వెలికితీత కోసం 1957లో 'డెహ్రాడూన్'లో ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కమిషన్ (ONGC)ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇది విదేశాల్లో చమురు నిక్షేపాలను వెలికితీయడానికి OVL (ONGC Videsh Ltd.) అనే సంస్థను ఏర్పాటు చేసుకుంది. ఇటీవల రష్యాలోని 'శకాలిన్'క్షేత్రంలో పెట్టుబడులు పెట్టారు. ప్రస్తుతం ముడి చమురు ఉత్పత్తిలో మహారాష్ట్ర ప్రథమ స్థానంలో ఉండగా, గుజరాత్ రెండో స్థానంలో ఉంది.

ముడి చమురు బావుల విస్తరణ:

మహారాష్ట్ర: ముంబై-హైలోని పొన్న, ముక్త, గాంధార, హీరా బావులు, శాలిశెట్టి, బస్సైన్.

గుజరాత్: అంకలేశ్వర్ (జవహర్‌లాల్ నెహ్రూ ముడి చమురు బావి), నవ్‌గావ్, థోర్కా కలోల్, కోసాంబ (వీటన్నింటినీ కలిపి గాంధార క్షేత్రం లేదా కాంబే బేసిన్ అంటారు), ఖంబట్ బేసిన్‌లోని అలియాబాట్, కచ్ ప్రాంతంలోని కలోల్, మేసిన్.

అసోం: దిగ్బాయ్, నహర్ కాటియా, మొరాన్, హుగ్రీజన్, సిబ్ సాగర్, రుద్రసాగర్.

తమిళనాడు: కావేరి బేసిన్‌లోని నారీమనం, కోవెల్‌పూల్.

త్రిపుర:మూమ్‌బాగ,బారాముర,దేవ్‌టమూరు.

ఏపీ: కేజీ బేసిన్‌లోని రవ్వ, లింగాల.

సహజవాయువు: భారతదేశంలో మొదటిసారిగా సహజవాయువును హిమాచల్ ప్రదేశ్‌లోని జ్వాలాముఖి వద్ద కనుగొన్నారు. సహజవాయువును ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి రవాణా చేయడానికి గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా (GAIL)ను ఏర్పాటు చేశారు. ఈ సంస్థ నిర్మించిన పైప్ లైన్లలో ప్రముఖమైంది – HBJ పైప్‌లైన్. ఇది గుజరాత్‌లోని హజీరా నుంచి మధ్య ప్రదేశ్‌లోని బీజాపూర్ మీదుగా ఉత్తర ప్రదేశ్‌లోని జగదీష్‌పూర్ వరకు ఉంది. ప్రస్తుతం దీన్ని ఉత్తర ప్రదేశ్‌లోని దుబ్రాల వరకు (1750 కి.మీ.) పొడిగించారు.

విస్తరణ:
1. అసోం, త్రిపుర
2. కాంబే బేసిన్ (గుజరాత్)
3. బాంబే హై
4. కేజీ బేసిన్ కైకలూరు, పాసర్లపూడి (ఆంధ్రప్రదేశ్)
5. కావేరి బేసిన్ (తమిళనాడు)
6. రాజస్థాన్‌లోని తానోట్

అణు ఇంధన ఖనిజాలు

ఇవి శక్తిని వికిరణ రూపంలో వెదజల్లే అస్థిర కేంద్రక పదార్థాలు. యురేనియం (పిచ్‌బ్లెండ్), థోరియం (మోనోజైట్), జిర్కోనియం, ఇల్మనైట్, టిటానియం వీటికి ఉదాహరణ.

యురేనియం: దేశంలో యురేనియం నిల్వలు ఎక్కువగా జార్ఖండ్ (జాదుగూడ), బిహార్ (గయ), ఆంధ్రప్రదేశ్ (కడప జిల్లాలోని తుమ్మలపల్లి), తెలంగాణ (నల్గొండ జిల్లాలోని పెద్ద అడిశర్లపల్లి), రాజస్థాన్‌లోని ఆరావళి పర్వత ప్రాంతాల్లో ఉన్నాయి.

థోరియం: ఇది ఎక్కువగా కేరళ, విశాఖ తీర ప్రాంత ఇసుక రేణువుల్లో లభ్యమవుతోంది.

ఇల్మనైట్, టిటానియం ఎక్కువగా విశాఖ తీరంలో లభిస్తోంది. జిర్కోనియం కేరళ తీరంలో; లిథియం జార్ఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతాల్లో లభ్యమవుతోంది.

మాదిరి ప్రశ్నలు

1. నాణ్యత ఆధారంగా ఇనుప ధాతువు రకాలను ఆరోహణ క్రమంలో అమర్చండి.
   ఎ. మాగ్నటైట్ బి. హెమటైట్
   సి. లియోనైట్ డి. సెడరైట్
   1) డి, సి, బి, ఎ 2) సి, డి, బి, ఎ
   3) ఎ, బి, సి, డి 4) ఎ, సి, బి, డి
2. అల్యూమినియం భూ పటలంలో ఏ రూపంలో లభ్యమవుతుంది?
   1) పెరైట్ 2) బాక్సైట్
   3) మాగ్నసైట్ 4) శుద్ధలోహం
3. కోర్బా బొగ్గు గనులు ఎక్కడ ఉన్నాయి?
   1) మధ్యప్రదేశ్ 2) జార్ఖండ్
   3) ఛత్తీస్‌గఢ్ 4) ఒడిశా
4. సఖాలియన్ చమురు క్షేత్రం ఉన్న దేశం?
   1) అమెరికా 2) ఉక్రెయిన్
   3) చైనా 4) రష్యా
5. కరగండా బొగ్గు క్షేత్రం ఏ దేశంలో ఉంది?
   1) కజకిస్థాన్ 2) జర్మనీ
   3) ఉక్రెయిన్ 4) జాంబియా
6. సింగరేణి బొగ్గుగనులు ఉన్న రాష్ట్రం?
   1) ఆంధ్రప్రదేశ్ 2) మధ్యప్రదేశ్
   3) తెలంగాణా 4) ఒడిశా
7. మార్ఘెరీటా బొగ్గు నిక్షేపాలు ఉన్న ప్రాంతం?
   1) మేఘాలయ 2) అసోం
   3) మణిపూర్ 4) త్రిపుర
8. ఒడిశాలోని సుకిండా దేనికి ప్రసిద్ధి?
   1) కాపర్ 2) క్రోమైట్
   3) బాక్సైట్ 4) బొగ్గు

సమాధానాలు

1) 1; 2) 2; 3) 3; 4) 4;
5) 1; 6) 3; 7) 2; 8) 2.

What is the code for "manage"?



BANK EXAMS
REASONING

MODEL QUESTIONS

Directions (Q. No. 1-7): Study the following information to answer the given questions.

Eight people, viz A, B, C, D, E, F, G and H are sitting in a straight line facing North. Each of them has passed a recruitment exam and must join the office in different months, viz January, February, March, April, May, June, July and August but not necessarily in the same order.

G sits third to the right of the person who joins in May. The person who joins in August sits second to the right of G. A and E are immediate neighbours of each other. Neither A nor E has joining dates in either May or August. Neither A nor E is an immediate neighbour of G.

H sits third to the right of the person whose joining date is in January. Neither A nor E has joining dates in January. H's joining date is not in August.

Only two people sit between E and the person whose joining date is in July. The person whose joining date is in February sits on the immediate left of D.

Only one person sits between C and B. C joins before July. E joins after April. G joins after A.

1. In which of the following months does H join the office?
   1) April 2) June 3) July
   4) February 5) March
2. Who among the following sits exactly between E and B?
   1) The person whose joining date is in May
   2) The person whose joining date is in January
   3) D 4) A
   5) The person whose joining date is in August
3. "H" is related to "July" in a certain way based on the above arrangement. "B" is related to "June" following the same pattern. "___" is related to "May" following the same pattern.
   1) F 2) G 3) A 4) D 5) C
4. Which of the following is true regarding D?
   1) Only two people sit to the left of D
   2) D is sitting second to the right of the person whose joining date is in July
   3) E and B are immediate neighbours of D
   4) D's joining date is in May
   5) None is true
5. Who among the following has joining date in June?
   1) F 2) E 3) G
   4) D 5) C
6. How many people sit between C and the person whose joining date is in April?
   1) None 2) One 3) Two
   4) Three 5) Four
7. Who among the following are sitting at extreme ends of the line?
   1) A and the person whose joining date is in August
   2) The person whose joining date is in May and E
   3) C and G
   4) The persons whose joining dates are in March and June
   5) None of these

Directions (Q. No. 8-12): Study the following information to answer the given questions.

Eight people are sitting in two parallel rows containing four people each in such a way that there is an equal distance between adjacent persons. In row 1, A, B, C and D are sitting (but not necessarily in the same order) and all of them are facing North. In row 2, P, Q, R and S are sitting (but not necessarily in the same order) and all of them are facing South. Therefore, in the given seating arrangement, each member sitting in a row faces another member of the other row. S sits second to left of Q. A faces the immediate neighbour of S. Only one person sits between A and C. P does not face A. B is not an immediate neighbour of A.

8. Which of the following is true regarding D?
   1) D sits at one of the extreme ends of the line
   2) A sits on the immediate left of D
   3) Q faces D
   4) C is an immediate neighbour of D
   5) No immediate neighbour of D faces R
9. Who among the following faces C?
   1) P 2) Q 3) R 4) S
   5) Cannot be determined
10. Who among the following sits on the immediate right of the person who faces C?
    1) P 2) Q 3) R 4) S
    5) Cannot be determined
11. Four of the following five are alike in a certain way based on the given seating arrangement and thus form a group. Which is the one that does not belong to that group?
    1) A 2) Q 3) R 4) B 5) S
12. Who among the following faces R?
    1) A 2) B 3) C 4) D
    5) Cannot be determined

Directions (Q. No. 13-18): Study the following information to answer the given questions:

In a certain code,
"time and money" is written as "ma jo ki",
"manage time well" is written as "pa ru jo",
"earn more money" is written as "zi ha ma" and
"earn well enough" is written as "si ru ha".

13. What is the code for "earn"?
    1) si 2) ru 3) ha 4) ma
    5) Cannot be determined
14. Which of the following represents "more time" ?
    1) pa jo 2) zi ki 3) ma ki
    4) si jo 5) jo zi
15. What is the code for "manage"?
    1) ru 2) pa 3) jo
    4) ha 5) Either "jo" or "ru"
16. Which of the following may represent "money matters"?
    1) ki to 2) ma pa 3) fi ma
    4) ha ma 5) ma jo
17. What does "ru" stand for?
    1) well 2) manage
    3) time 4) enough
    5) Either "time" or "enough"
18. Which of the following may represent "good enough"?
    1) ru si 2) da ha 3) si pa
    4) si da 5) ki ru

Directions (Q. No. 19-23): Study the following information carefully and answer the given questions.

A word and number arrangement machine, when given an input line of words and numbers, rearranges them following a particular rule in each step. The following is an illustration of input and rearrangement.

Input: gone over 35 69 test 72 park 27
Step I: 27 gone over 35 69 test 72 park
Step II: 27 test gone over 35 69 72 park
Step III: 27 test 35 gone over 69 72 park
Step IV: 27 test 35 park gone over 69 72
Step V: 27 test 35 park 69 gone over 72
Step VI: 27 test 35 park 69 over gone 72
Step VII: 27 test 35 park 69 over 72 gone

Step VII is the last step of the rearrangement.

As per the rules followed in the above steps, find out in each of the following questions the appropriate step for the given input.

19. **Input:** 86 open shut door 31 49 always 45
    How many steps will be required to complete the rearrangement?
    1) Five 2) Six 3) Seven
    4) Four 5) None of these
20. **Step III of an input:** 25 yes 37 enemy joy defeat 52 46
    Which of the following is definitely the input?
    1) enemy 25 joy defeat yes 52 37 46
    2) 37 enemy 25 joy yes defeat 52 46
    3) enemy joy defeat 25 52 yes 46 37
    4) Cannot be determined
    5) None of these
21. **Step II of an Input:** 18 win 71 34 now if victory 61.
    How many more steps will be required to complete the rearrangement?
    1) Three 2) Four 3) Five
    4) Six 5) More than six
22. **Input:** where 47 59 12 are they going 39
    Which of the following steps will be the last but one?
    1) VII 2) IV 3) V
    4) VIII 5) None of these
23. **Step II of an Input:** 33 store 81 75 full of goods 52
    Which of the following will be step VI?
    1) 33 store 52 of 75 81 full goods
    2) 33 store 52 of 75 full 81 goods
    3) 33 store 52 of 75 goods 81 full
    4) There will be no such step
    5) None of these

Explanations

(1-7):

March	June	May	Jan	July	April	Feb	Aug
A	E	C	B	F	G	H	D

1. 4 **2.** 1 **3.** 1 **4.** 5 **5.** 2
6. 3 **7.** 1

(8-12):

Row 2	Q	P	S	R
Row 1	B	C	D	A

8. 4 **9.** 1 **10.** 2 **11.** 5 **12.** 1

(13-18):

time and money → ma jo ki... (i)
manage time well → pa ru jo...(ii)
earn more money→ zi ha ma..(iii)
earn well enough → si ru ha ...(iv)
From (i) and (ii), time → jo
From (i) and (iii), money → ma
From (i), and → ki
From (ii) and (iv) well → ru
From (ii), manage → pa
From (iii) and (iv), earn → ha
From (iii), more → zi
From (iv), enough → si

13. 3 **14.** 5 **15.** 2

16. Since "matters" is a new word. So, new code is introduced for "matters" ie, "fi". Code for "money" is "ma". **Ans: 3**

17. 1

18. Code for "enough" is "si" and since "good" is a new word, so a new code for "good", ie "da" is introduced. **Ans: 4**

(19-23):

The machine rearranges numbers in ascending order and word in reverse alphabetical order alternately.

19. Input: 86 open shut door 31 49 always 45
Step I: 31 86 open shut door 49 always 45
Step II: 31 shut 86 open door 49 always 45
Step III: 31 shut 45 86 open door 49 always
Step IV: 31 shut 45 open 86 door 49 always
Step V: 31 shut 45 open 49 86 door always
Step VI: 31 shut 45 open 49 door 86 always **Ans: 2**

20. Can't proceed backward. **Ans: 4**

21. Step II: 18 win 71 34 now if victory 61
Step III: 18 win 34 71 now if victory 61
Step IV: 18 win 34 victory 71 now if 61
Step V: 18 win 34 victory 61 71 now if
Step VI: 18 win 34 victory 61 now 71 if
Four more steps are needed to complete the rearrangement. **Ans: 2**

22. Input: where 47 59 12 are they going 39
Step I: 12 where 47 59 are they going 39
Step II: 12 where 39 47 59 are they going
Step III: 12 where 39 they 47 59 are going
Step IV: 12 where 39 they 47 going 59 are **Ans: 5**

23. Step II: 33 store 81 75 full of goods 52
Step III: 33 store 52 81 75 full of goods
Step IV: 33 store 52 of 81 75 full goods
Step V: 33 store 52 of 75 81 full goods
Step VI: 33 store 52 of 75 goods 81 full **Ans: 3**